సత్యమేవ జయతే

సాక్షి

మంగళవారం 29-1-2019

WWW.SAKSHI.COM

పేజీలు: 16+20 వెల: ₹ 5.00

సంపుటి: 11 సంచిక: 308

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



నేలతల్లి ముద్దుబిడ్డల సిగలో పద్మశ్రీలు - సాగుబడిలో



మన ఖాతాలో మరొకటి

న్యూజిలాండ్‌పై మూడో వన్డేలోనూ నెగ్గి సిరీస్ గెలిచిన భారత్ –స్పోర్ట్స్‌లో

గజేంద్ర విలాపం!



నాగావళి నదిలో పడి మృతిచెందిన ఏనుగు

అడవులను కొల్లగొట్టేస్తున్నారు.. అడవి జంతువులకు నిలువ నీడలేకుండా చేస్తున్నారు.. ఫలితంగా మూగజీవాలు ఆవాసాలు కోల్పోయి జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. అక్కడ మనుగడ సాగించలేక మృత్యువాత పడుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో కొన్ని నెలలుగా తిరుగుతున్న ఎనిమిది ఏనుగుల్లో ఒక్కొక్కటిగా మృత్యువాత పడుతున్నాయి. కొద్దిరోజుల క్రితం విద్యుత్ షాక్‌తో ఓ గజరాజు చనిపోతే.. తాజాగా విషాహారం తిని, నదిలో మునిగి మరో ఏనుగు మరణించింది.

- వివరాలు 12లో

స్కూలు బస్సుకు తప్పిన పెను ప్రమాదం



ఘటనా స్థలంలో సహాయక చర్యలు

బై మమ్మీ, బై డాడీ.. అని చెప్పి పిల్లలు బస్సులో బయలు దేరిన కాసేపటికే గుండెలు పగిలే లాంటి వార్త తల్లిదండ్రుల చెవిన పడింది. బస్సు వాగులో పడిందని తెలియగానే వణుకుతున్న కాళ్లు, చేతులను అదుపులోకి తెచ్చుకుని హుటాహుటిన ఘటనా స్థలికి పరుగులు తీశారు. ప్రాణాపాయం నుంచి పిల్లలు బయటపడ్డారని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. గాయాలతో విలపిస్తున్న చిన్నారులను గుండెలకు హత్తుకుని ధైర్యం చెప్పారు. ఈ ఘటన గుంటూరు జిల్లా మాచర్ల మండలం మండాది వద్ద సోమవారం జరిగింది.

- వివరాలు 2లో


మహిళపై 'సిద్ధ' ఫైర్

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మహిళా కార్యకర్తతో అనుచితంగా ప్రవర్తించిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. ఆ కార్యకర్తపై సిద్ధూ గట్టిగా కేకలు వేయడం, ఆమె నుంచి మైకును లాగేసుకునే క్రమంలో దుపట్టా కూడా జారడం వివాదాస్పదం అయ్యాయి. మాజీ సీఎం తీరుపై ప్రతిపక్షాలు మండిపడుతుండగా ఈ ఘటనపై విచారణ జరపాలని కర్ణాటక పోలీసులను కోరనున్నట్లు జాతీయ మహిళా హక్కుల కమిషన్ తెలిపింది.

- వివరాలు 13లో



రాజీనామాకు నేను సిద్ధమే

- కాంగ్రెస్ వేధింపులు దారుణం
- కర్ణాటక సీఎం కుమారస్వామి

13 లో

కనీస ఆదాయ భద్రత

త్వరలో దేశవ్యాప్త పథకం: రాహుల్



లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి తమ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలోని పేదలందరికీ కనీస ఆదాయ భద్రత కల్పించి దేశంలో పేదరికాన్ని రూపుమాపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు.

13 లో


పేదలపై నిర్దయ!

- అసైన్డ్ ఇళ్ల స్థలాలపై వారికి 20 ఏళ్ల వరకు ఎలాంటి హక్కులుండవు
- అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ వచ్చాక రెండు ఆర్డినెన్స్‌ల కోసం గవర్నర్‌పై ఒత్తిడి

5 లో

● అసంతృప్తి పెరుగుతోంది..

సర్కారీ నివేదికల డేంజర్ బెల్స్!!



87 లక్షల దరఖాస్తుల పెండింగ్...

- ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం లక్షల మందికిపైగా పేదల పడిగాపులు
- కలెక్టర్ల సదస్సులో సర్కారు రియల్ టైమ్ గవర్నెన్స్ నివేదిక వెల్లడి
- అందిన దరఖాస్తుల్లో సగం తిరస్కరణ జాబితాలోకి
- అర్హులుగా తేలినా పెండింగ్‌లో 49 లక్షలకుపైగా దరఖాస్తులు
- ఆరు విడతల జన్మభూమి సర్కారు ప్రచారం కోసమే
- ఇళ్ల కోసం 28.44 లక్షల మంది, ఇళ్ల స్థలాల కోసం 21.10 లక్షల మంది నిరీక్షణ
- పింఛన్ల కోసం 10.98 లక్షల మందికిపైగా పడిగాపులు
- రేషన్ కార్డుల కోసం 7.35 లక్షల మంది తిప్పలు

2 లో



సోమవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైఎస్సార్‌సీపీ బీసీ అధ్యయన కమిటీ డ్రాఫ్ట్ నివేదికను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు అందజేస్తున్న బీసీ నేతలు

ఫిబ్రవరి 19న వైఎస్సార్‌సీపీ

బీసీ గర్జన

2 లో

బీసీ అధ్యయన కమిటీతో వైఎస్ జగన్ కీలక సమావేశం

- గంటన్నర పాటు పలు విషయాలపై సుదీర్ఘ చర్చ
- అనంతరం నేతల మీడియా సమావేశం
- బాబు తీరుపై పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి మండిపాటు
- న్యాయం కోసం వెళ్లిన బీసీలను తాట తీస్తానన్నారు..
- వైఎస్ జగన్ సీఎం అయితేనే కులాలకు అతీతంగా అభివృద్ధి

కల్లాల్లో తడిసిన పంటలు

రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు

- అకాల వర్షాలతో పంటలు తడిసిపోయిన వైనం
- వాటి నాణ్యత దెబ్బతింటుందని రైతుల ఆందోళన

2 లో

సీఎం చంద్రబాబుతో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి భేటీ

- విందుకు హాజరైన కోట్ల సతీమణి, కుమారుడు
- తెలుగుదేశంలో చేరికపై చర్చలు!

నాకు సమాచారం లేదు: కేఈ

- వివరాలు 4లో

సర్కారీ నివేదికల డేంజర్ బెల్స్!!

- ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం 87.37 లక్షల మందికిపైగా పేదల పడిగాపులు
- కలెక్టర్ల సదస్సులో సర్కారు రియల్ టైమ్ గవర్నెన్స్ నివేదిక వెల్లడి
- అందిన దరఖాస్తుల్లో సగం తిరస్కరణ జాబితాలోకి
- అర్హులుగా తేలినా పెండింగ్‌లో 49 లక్షలకుపైగా దరఖాస్తులు

రంగం	మొత్తం దరఖాస్తులు	తిరస్కరణ	ప్రాసెస్ చేయలేదు	పెండింగ్‌లో ఉన్నవి
గృహాలు	28,44,510	12,66,817	2283	15,75,410
ఇళ్ల స్థలాలు	21,10,626	13,50,727	8881	7,51,018
పింఛన్లు	10,98,022	4,85,740	10,057	6,02,225
పంచాయతీరాజ్	8,38,874	2,32,372	8,846	5,97,656
రేషన్ కార్డులు	7,35,626	1,07,429	31,224	5,96,973
పట్టణాల్లో ఇళ్లు	3,42,359	94,479	4363	2,43,517
రహదారులు	3,63,898	1,28,738	885	2,34,275
గ్రామీణ మంచినీటి సరఫరా	1,96,125	32,000	3811	1,60314
రుణమాఫీ	1,06,852	17,320	794	88,738
ఎస్సీ కార్పొరేషన్	1,00,440	33,421	722	66,297

సాక్షి, అమరావతి: ప్రజల్లో సంతృప్తి శాతం పెరుగుతున్నట్లు సీఎం చంద్రబాబు చెబుతున్నా నిజానికి పెరుగుతోంది అసంతృప్తేనని రాష్ట్ర ప్రభుత్వ నివేదికలే వెల్లడిస్తుండటం గమనార్హం. అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగున్నరేళ్లలో ఆరుసార్లు జన్మభూమి–మా ఊరు కార్యక్రమాలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని ఖర్చు చేసిన టీడీపీ సర్కారు ప్రజల సమస్యలను తీర్చడంలో దారుణంగా విఫలమైనట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ నివేదిక స్పష్టం చేసింది. ఇళ్లు, ఇళ్ల జాగాలు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ప్రజల నుంచి పదేపదే పెద్ద ఎత్తున విజ్ఞాపనలు అందినా దాదాపు సగం దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించినట్లు వెల్లడైంది. అర్హులందరికీ మంజూరు చేసినట్లు ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ బూటకమేనని ఈ నివేదికను పరిశీలిస్తే వెల్లడవుతోంది. పేదల ఇళ్ల నిర్మాణంపై నాలుగున్నరేళ్లు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కేవలం ప్రచారార్భాటంతో కాలక్షేపం చేసిన చంద్రబాబు సర్కారు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇళ్ల నిర్మాణంతోపాటు రెవెన్యూలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా లంచం ఇవ్వనిదే పని జరగడం లేదని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో వెల్లడైంది. పలు అంశాలపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతున్నట్లు తేలటం సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సదస్సులో చర్చనీయాంశమైంది.

అర్హులుగా తేలినా ఇవ్వకుండా పెండింగ్‌లో...

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, రుణమాఫీ కోసం 87.37 లక్షల మందికిపైగా పడిగాపులు కాస్తున్నట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ నివేదిక బహిర్గతం చేసింది. పది అంశాలకు సంబంధించి 87.37 లక్షలకుపైగా దరఖాస్తులు అందగా ఏకంగా 37,49,043 దరఖాస్తులను తిరస్కరించినట్లు నివేదిక తెలిపింది. అర్హులుగా తేల్చినప్పటికీ మంజూరు చేయకుండా 49,16,423 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం గమనార్హం. ఇళ్ల మంజూరు కోసం 28,44,510 మంది పేదలు దరఖాస్తు చేసుకోగా 12,66,817 అర్జీలను అర్హత లేదంటూ తిరస్కరించారు. మరో 2,283 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, అర్హులుగా తేల్చినా మంజూరు చేయకుండా 15,75,410 దరఖాస్తులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచారని ఆర్టీజీఎస్ నివేదిక పేర్కొంది. ఇక ఇంటి జాగాల కోసం దరఖాస్తు చేసుకున్న 21,10,626 మంది పేదలు ప్రభుత్వం ఎప్పుడు కనికరిస్తుందా? అని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తుండగా ఏకంగా 13,50,727 లక్షల దరఖాస్తులను అర్హత లేదంటూ తిరస్కరించడం గమనార్హం. రేషన్‌కార్డులు, మంచినీటి సరఫరా, రుణమాఫీ, రహదారులతోపాటు రుణాలు కావాలంటూ ఎస్సీ కార్పొరేషన్‌కు లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

టీడీపీ ప్రజాప్రతినిధుల వసూళ్లు...

పేదలకు ఇళ్ల మంజూరులో అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు భారీగా లంచాలు వసూలు చేస్తున్నారని సర్కారు ఆర్టీజీఎస్ సర్వేలో వెల్లడైంది. ఇంతవరకు బేస్‌మెంట్ బిల్లులు అందలేదని 63.98 శాతం మంది పేదలు తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో ఏకంగా 83.33 శాతం మంది బేస్‌మెంట్ బిల్లులు అందలేదని పేర్కొన్నారు. విశాఖపట్టణం జిల్లాలో 78.13 శాతం మంది, కృష్ణా జిల్లాలో 86.67 శాతం, గుంటూరు జిల్లాలో 80 శాతం, ప్రకాశం జిల్లాలో 66.67 శాతం మంది బేస్‌మెంట్ బిల్లులు అందలేదని చెప్పారు. అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని 32.90 శాతం మంది చెప్పగా ప్రజాప్రతినిధులు 19.08 శాతం మంది అవినీతికి పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో అధికారులు 20 శాతం నుంచి 43 శాతం వరకు అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు కొన్ని జిల్లాల్లో 19 శాతం నుంచి 50 శాతం వరకు అవినీతికి పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఇళ్ల మంజూరు పత్రాలు ఇవ్వడం లేదని 40 శాతం మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బేస్‌మెంట్ స్థాయితో పాటు రూఫ్ లెవల్ బిల్లులు, ఇటుకలకు సంబంధించి రూ.650 కోట్ల మేర బిల్లులు పేదలకు అందలేదని తేలింది.

లంచం ఇవ్వనిదే పని కావట్లేదు!

మీ–సేవ ద్వారా అన్నీ అందుబాటులోకి తెచ్చామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నట్లు రియల్‌టైమ్ గవర్నెన్స్ నివేదికలో వెల్లడైంది. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా రెవెన్యూ సిబ్బంది భూములను సర్వే చేయడం లేదని తెలిపారు. ధృవీకరణ పత్రం మంజూరుకు రెవెన్యూ సిబ్బంది తీవ్ర జాప్యం చేయడంతో పాటు లంచాలు తీసుకుంటున్నారని 54 శాతం మంది చెప్పారు. ఈబీసీ సర్టిఫికెట్ జారీకి తీవ్ర జాప్యం చేస్తున్నారని 67 శాతం మంది పేర్కొనగా, లంచాలు తీసుకుంటునా్నరని 34 శాతం మంది స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుని సర్టిఫికెట్ ఇచ్చేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారని 60 శాతం మంది పేర్కొనగా 40 శాతం మంది లంచాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆదాయ సర్టిఫికెట్ జారీకి తీవ్ర జాప్యం చేస్తున్నారని 70 శాతం మంది పేర్కొనగా 30 శాతం మంది లంచాలు తీసుకుంటున్నారని తెలిపారు. ల్యాండ్ మార్పిడి, ఓబీసీ సర్టిఫికెట్, పొజిషన్ సర్టిఫికెట్, ఎటువంటి ఆదాయం లేదని సరిఫికెట్ మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా లంచాలు ఇవ్వకుండా రావడం లేదని వెల్లడైంది. అడంగల్ 1బి మంజూరుకు కృష్ణా, గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, విశాఖపట్టణం, కర్నూలు, విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నూటికి నూరు శాతం మంది రెవెన్యూ అధికారులు, సిబ్బంది లంచాలు తీసుకుంటున్నారని నివేదిక వెల్లడించడం గమనార్హం.

‘బాబూ’ అసలు నీకు సిగ్గుందా?

వైఎస్సార్‌సీపీ నేతలు పార్థసారథి, బోస్ ధ్వజం

సాక్షి, అమరావతి/హైదరాబాద్: తెలంగాణాలో బీసీ కులాలను అక్కడి సీఎం కేసీఆర్ తొలగించారని చెబుతున్న చంద్రబాబు ఈ విషయమై ఏనాడైనా ఎవరికైనా ఒక లేఖ అయినా రాశారా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌తో తమ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి కుమ్మక్కయ్యారంటావా అని చంద్రబాబును నిలదీశారు. నిజంగా తెలంగాణాలో కేసీఆర్ బీసీ కులాలను తొలగించి ఉంటే ఆ విషయంపై కేసీఆర్‌కు కనీసం లేఖ రాశావా? వారిని తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని గవర్నర్‌ను అయినా కోరావా? అని ఆయన ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో అనేక పర్యాయాలు కేసీఆర్‌ను కలిసిన చంద్రబాబు ఆయనను ఏమాత్రం ప్రశ్నించకుండా, కేటీఆర్ కేవలం ఒకసారి జగన్‌మోహన్‌రెడ్డిని కలిస్తే అనవసరంగా నిందలేస్తావా అని మండిపడ్డారు. తమ పార్టీ అధినేత జగన్ ఇచ్చిన హామీలన్నింటినీ బాబు కాపీ కొడుతున్నారని ఆక్షేపించారు. ఇలాంటి కాపీమాస్టర్ మరెక్కడా కనబడరని విమర్శించారు. ప్రతీ బీసీ కులానికి కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని జగన్ ప్రకటించారన్నారు. టీటీడీలో సన్నిధి గొల్లలు పదవిని లేకుండా చేసి అవమానిస్తే దానిని జగన్ సరిదిద్దుతానని హామీ ఇచ్చారన్నారు. బీసీల పట్ల చంద్రబాబుకు ఏమాత్రం ప్రేమలేదని, బీసీలపై ఎన్నికలు దగ్గరపడుతున్న క్రమంలోనే మొసలికన్నీరు కారుస్తున్న విషయాన్ని బీసీలు గమనించాలన్నారు.

దగా చేసేందుకే జయహో బీసీ : పిల్లి సుభాష్ చంద్రబోస్

రాష్ట్రంలోని బీసీ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు సిద్ధం అయ్యారని ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయని చంద్రబాబు మరో 15 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని మరోమారు మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. రాజమండ్రిలో హడావుడిగా జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ కులాలకు కార్పొరేషన్లు పెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో బీసీలకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి.. ఐదేళ్లలో కేవలం రూ.14 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, అది కూడా పూర్తిగా ఖర్చు చేయలేదని చెప్పారు. చేనేత పరిశ్రమకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న చంద్రబాబు ఎక్కడా అమలు చేయలేదన్నారు. నూలు కొనుగోలుపై సబ్సిడీ, హ్యాండ్‌లూమ్ విక్రయాలపై 30 శాతం రాయితీలు ఇస్తామని పట్టించుకోలేదని విమర్శించారు. పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో..కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

19న వైఎస్సార్ కాంగ్రెస్ బీసీ గర్జన

బీసీ అధ్యయన కమిటీతో వైఎస్ జగన్ కీలక భేటీ



లోటస్‌పాండ్‌లో వైఎస్సార్‌సీపీ బీసీ నేతలతో సమావేశమైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెనుకబడిన వర్గాల ప్రజలందరినీ సమైక్య పరుస్తూ ఫిబ్రవరి 19న బీసీ గర్జన సభను భారీ ఎత్తున నిర్వహించనున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ అధ్యయన కమిటీ కన్వీనర్ జంగా కృష్ణమూర్తి తెలిపారు. బీసీలను అన్ని విధాలా ఆదుకొనేందుకు, వారి ఉన్నతి కోసం చేపట్టబోయే అనేక కార్యక్రమాలను చరిత్రాత్మకంగా జరిగే ఈ గర్జన సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటిస్తారన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు వైఎస్ జగన్ ఏడాది క్రితం బీసీ అధ్యయన కమిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే. ఈ కమిటీ రాష్ట్రంలోని 13 జిల్లాలు, 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించి బీసీ వర్గాల ప్రజల బాధలు, ఇబ్బందులను తెలుసుకొని.. వారి స్థితిగతులపై సమగ్ర నివేదికను తయారు చేసింది. ఈ నివేదికను సోమవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌కు అందజేసింది. ఇందులోని కీలక అంశాలపై వైఎస్ జగన్.. కమిటీతో క్షుణ్ణంగా చర్చించారు. బీసీ అధ్యయన కమిటీ గమనించిన పలు విషయాలు, సంచార జాతుల వారి బాధలు ఈ భేటీలో చర్చకు వచ్చాయి. బీసీ డిక్లరేషన్, బీసీ గర్జన సభ గురించి లోతుగా చర్చలు సాగాయి. ఎంపీ విజయసాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ కీలక నేతలు, బీసీ అధ్యన కమిటీ కన్వీనర్‌జంగా కృష్ణమూర్తి, సభ్యులు బొత్స సత్యనారాయణ, కొలుసు పార్థసారథి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేపిదేవి వెంకటరమణ, జోగి రమేష్, నర్సయ్య గౌడ్, వేణుగోపాల కృష్ణ, సి.మోహనరావు, చిమట సాంబూ, మారెక్కగారి క్రిష్టప్ప, కె.చంద్రమౌళి, పత్తి దివాకర్, మీసాల రంగన్న, అవ్వారు ముసలయ్య, రాజా పరుశురామ్, బొయ తిప్పేస్వామి, కోలా గురువు, రసూల్, వల్లెపు వరప్రసాద్, టి.పుల్లయ్య తదితరులు బీసీ కులాల వెనుక బాటుతనం, వారి స్థితిగతులు, జీవన ప్రమాణాలు, వారి అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జంగా కృష్ణమూర్తి మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరి 19వ తేదీన వైఎస్సార్‌సీపీ బీసీ గర్జన సభ ఎక్కడ జరిగేది త్వరలో ప్రకటిస్తామని, దీనిని విజయవంతం చేయడంలో బీసీలంతా భాగస్వాములు కావాలన్నారు. మీడియాతో జంగా కృష్ణమూర్తి ఇంకా ఏం చెప్పారంటే..

ఏ మొహం పెట్టుకొని జయహో బీసీ సభ పెట్టారు?

‘రాష్ట్రంలో తన అరాచక పాలనలో బీసీలను సర్వనాశనం చేసిన చంద్రబాబు ఏ మొహం పెట్టుకొని జయహో బీసీ సభ పెట్టారో చెప్పాలి. బీసీలంతా మావైపే ఉన్నారని చంద్రబాబు మాట్లాడుతున్నారు.. బీసీలకు ఏం ఒరగబెట్టారని బీసీలు మీ వైపు ఉంటారు? అవసరానికి తగినట్లు మాట్లాడే నీచమైన మనిషి చంద్రబాబు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన అంశాల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా? బీసీ కులాల ప్రజలు, సంచార జాతుల వారి జీవన స్థితిగతులు చాలా దుర్భరంగా ఉన్నాయి. సంచార జాతుల వారికి వారి కులం పేరు కూడా తెలియని పరిస్థితి రాష్ట్రంలో ఉంది.

నవరత్నాలు కాపీ కొడుతున్నారు..

రాష్ట్రంలో సంవత్సరం నాలుగు నెలల పాటు ప్రజా సంకల్ప యాత్ర పేరిట పాదయాత్ర చేసిన వైఎస్ జగన్ ప్రజలందరి బాధలు తెలుసుకున్నారు. వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో నవరత్నాలను ప్రకటించారు. నాలుగున్నరేళ్లుగా బీసీలకు, ఇతర పేద ప్రజలకు ఏ మేలూ చేయని చంద్రబాబు.. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలలోని ప్రతి అంశాన్నీ కాపీ కొడుతున్నారు. కొత్త సీసాలో పాత సారాయి అనే విధంగా చంద్రబాబు వైఖరి ఉంది. 2014 ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయని చంద్రబాబు మళ్లీ అదే తీరులో మోసం చేయడానికి ముందుకొస్తున్నారు.

బీసీలను కించపరిచేలా మాట్లాడారు..

బీసీలు న్యాయమూర్తులుగా పనికి రారని చెప్పిన దుర్మార్గపు ముఖ్యమంత్రి చంద్రబాబు. జస్టిస్ ఈశ్వరయ్య ఏం చెప్పారో ప్రజలంతా చూశారు. చంద్రబాబు ఎంత బీసీ వ్యతిరేకో అందరికీ తెలుసు. బీసీలకు వ్యక్తిత్వం, క్యారెక్టర్ ఉండదు అని కించపరిచేలా మాట్లాడిన వ్యక్తి. న్యాయం చేయాలని అడగడానికి వచ్చిన నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానని, మత్స్యకారులను తాట తీస్తానని దూషిస్తూ చంద్రబాబు మాట్లాడారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని నీచంగా మాట్లాడారు. మంత్రులు యనమల, అచ్చెన్నాయుడులతో కూడా బీసీలను అవమానించేలా మాట్లాడించారు. వైఎస్ జగన్ ప్రతి కులానికి కార్పొరేషన్ అని ప్రకటించగానే చంద్రబాబు దాన్నీ కాపీ కొట్టారు. ఇంతగా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో బీసీలంతా తగిన గుణపాఠం చెప్పాలి.

అన్ని వర్గాలకు జగన్‌తోనే న్యాయం

ప్రతి వ్యక్తికి న్యాయం జరిగే విధంగా కులాలు, మతాలు, రాజకీయాలకు తావు లేకుండా అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగే విధంగా వైఎస్ జగన్ కృషి చేస్తారు. బీసీల బాధలు జగన్‌కు బాగా తెలుసు. బీసీలను ఆర్థికంగా, సామాజికంగా ఎలా పైకి తీసుకురావాలి? రాజకీయంగా అవకాశాలు, కుల వృత్తులకు చేయూత తదితర అంశాలన్నింటిపై జగన్‌కు మంచి అవగాహన ఉంది. జగన్ సీఎం అయితేనే బడుగు, బలహీన వర్గాల వారందరికీ న్యాయం జరుగుతుంది’ అని జంగా కృష్ణమూర్తి అన్నారు.

కల్లాల్లో తడిసిన పంటలు

- రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు
- కల్లాల్లో ఆరబోసుకున్న పంటలు తడిసిపోయిన వైనం
- వాటి నాణ్యత దెబ్బతింటుందని రైతుల ఆందోళన



గుంటూరు జిల్లా మాచర్ల మండలం కొత్తూరు మిర్చి కల్లాల్లో నీళ్లు తోడుతున్న రైతులు

సాక్షి నెట్‌వర్క్ : అల్పపీడన ద్రోణితో పాటు అరేబియా సముద్రంలోని అండమాన్ ప్రాంతం నుంచి వస్తున్న తేమ గాలుల కారణంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సోమవారం కూడా ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడ్డాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పలుచోట్ల ఈ వర్షాలు కురిసాయి. అనంతపురం జిల్లాలో రెండ్రోజుల్లో 7–8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. చిత్తూరు జిల్లాలోనూ కొన్ని ప్రాంతాలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇక్కడ 48 మండలాల్లో వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లా కల్లూరులో అత్యధికంగా 50.8మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తమ్మీద 3.1మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మిరప, ఉల్లి, పత్తి రైతులు నష్టపోతున్నారు. పశుగ్రాసం తడిసిపోవడంతో కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల్లూరు నగరంతోపాటు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో వర్షాలు కురిసాయి. చలి గాలులతో జిల్లా వాసులు వణికిపోతున్నారు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, యర్రగొండపాలెం, అద్దంకి, పర్చూరు, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాల పరిధిలో చిరు జల్లులు కురిశాయి. వర్షాలకు జిల్లాలో పలుచోట్ల వరి ఓదెలు, కల్లాల్లో ఆరబోసుకున్న మిరప, పొగాకు రేకలు తడిసిపోయాయి. వీటి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, సోమవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి. కృష్ణా జిల్లా వ్యాప్తంగా కూడా సగటున 20.5మిమీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లాలో 30 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా.. 20 మండలాల్లో 20మి.మీ. కంటే అధికంగా నమోదైంది. అత్యధికంగా చాట్రాయి మండలంలో 85.6 మిల్లీ మీటర్లుగా నమోదైంది. రెండు రోజులుగా ముసురు పట్టడంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక విజయనగరం జిల్లా మక్కువ, మెంటాడ మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా చిరుజల్లులు కురిసాయి. కాగా గుంటూరు జిల్లా రెంటచింతల మండలంలో అకాల వర్షంవల్ల దెబ్బతిన్న మిర్చి పంటలను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. దెబ్బతిన్న మిర్చిని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు కోస్తా, సీమల్లో వర్షాలు

స్థిరంగా కొనసాగుతున్న ద్రోణి

సాక్షి, విశాఖపట్నం: అండమాన్ సముద్రానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు గానీ, ఓ మోస్తరు వర్షం గానీ కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. మరోవైపు రాష్ట్రంపైకి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. అటు ద్రోణి, ఇటు ఈశాన్య, తూర్పు గాలుల ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు క్షీణించి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2–4 డిగ్రీలు తక్కువగానూ, కనిష్ట ఉష్ణోగ్రతలు 2–5 డిగ్రీలు ఎక్కువగానూ నమోదవుతున్నాయి. అల్పపీడన ద్రోణుల ప్రభావంతో గడచిన 24 గంటల్లో కోస్తాంధ్ర, సీమల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సాంబేపల్లిలో 7, కొయ్యలగూడెం, నందిగామల్లో 5, అచ్చెంపేట, కర్నూలుల్లో 4, వల్లూరు, కల్యాణదుర్గంలో 3 సెంమీ వర్షపాతం నమోదైంది.

గడ్కరీ...గారడీ మాటలు!

అస్పష్ట వ్యాఖ్యలతో సొంత పార్టీనే ఇరకాటంలో పెడుతున్న కేంద్ర మంత్రి

‘**నా**యకులు తమకు పెద్ద పెద్ద కలలు చూపించాలని ప్రజలు కోరుకుంటారు. కానీ ఆ కలల్ని నిజం చేయకుంటే వారిని రాజకీయంగా కొడతారు. అందుకే నేతలు అమలుచేయగలిగే హామీలే ఇవ్వాలి’ అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదివారం పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో అన్న మాటలు అనేక అర్థాలకు తావిచ్చాయి. అనేక రకాలుగా అర్థంచేసుకునేలా ఆయన మాట్లాడడం కొత్తేమీ కాదు. ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాను ఉద్దేశించి గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ పరిశీలకులు, అనేక మంది ప్రతిపక్ష నేతలు భావిస్తున్నారు. 2014 ఎన్నికల్లో చేసిన అనేక వాగ్దానాలను బీజేపీ నెరవేర్చలేకపోయిందని విపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో గడ్కరీ మాటలను అధికార పార్టీ అగ్రనేతలకు పరోక్ష హెచ్చరికగా వ్యాఖ్యానిస్తున్నారు.



మావా! ఈయనెవరో కళ్లల్లోకి కళ్లుపెట్టి చూస్తుండు! ఒకసారి బయటకు రా!!

స్కూలు బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- అదుపుతప్పి వాగులోకి బోల్తా పడిన స్కూల్ బస్సు
- ఓ ఉపాధ్యాయురాలితో పాటు ఆరుగురు విద్యార్థులకు తీవ్ర, 26 మందికి స్వల్ప గాయాలు
- ప్రమాద సమయంలో బస్సులో 70 మందికి పైగా విద్యార్థులు
- వాగులో నీరు లేకపోవటంతో తప్పిన ప్రాణాపాయం
- ఒకరిపై ఒకరు పడటంతో ఊపిరాడక భయంతో చిన్నారుల హాహాకారాలు
- ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థులను కాపాడిన గ్రామస్తులు
- గాయపడిన విద్యార్థులు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు
- వెంటనే స్పందించని వైద్యులు.. ఆసుపత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన
- తన వాహనంలో విద్యార్థులను ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లిన మాచర్ల ఎమ్మెల్యే పీఆర్కే



బస్సు బోల్తా పడిన మండాది ప్రాంతంలో గుమికూడిన జనం. (ఇన్‌సెట్‌లో) ఘటనా స్థలంలో విద్యార్థుల స్కూల్ బ్యాగ్‌లు

వెల్దుర్తి (మాచర్ల): గుంటూరు జిల్లా మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వస్తూ మాచర్ల మండలం మండాది వద్ద సోమవారం ఉదయం 8 గంటలకు కానవాగులో బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ ఉపాధ్యాయురాలితో పాటు ఆరుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలవ్వగా, వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో 26 మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 70 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. మండలంలోని ఉప్పలపాడు, మండాది గ్రామాల నుంచి ప్రతిరోజూ విద్యార్థులను స్కూల్ బస్సులో తీసుకొచ్చి తిరిగి సాయంత్రం వదిలి వస్తుంటారు. సోమవారం యధావిధిగా విద్యార్థుల్ని ఎక్కించుకుని వస్తుండగా, కానవాగు వద్ద బస్సు స్టీరింగ్ రాడ్ ఊడిపోవడంతో అదుపు తప్పి వాగులోకి బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడే ఉన్న బోర్‌వెల్ వాహనం వారు వాగులోకి వెళ్లి బస్సు అద్దాలు పగులగొట్టి విద్యార్థులను రక్షించే ప్రయత్నం చేశారు. వీరు వెంటనే స్పందించడం వల్ల ప్రాణాపాయం తప్పింది. ఈలోపు మండాది గ్రామస్తులు సైతం అక్కడకు చేరుకుని బస్సులో ఇరుక్కున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తెచ్చారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను హుటాహుటిన మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన విద్యార్థులు దాసి రాజు, బలిగొడుగుల అజయ్, మారెబోయిన నవీన్, ఒంటేరు వాసు, తన్విజ్ రెడ్డి, భార్గవి, ఉపాధ్యాయురాలు కామిరెడ్డి మల్లీశ్వరిలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు, నరసరావుపేట వైద్యశాలలకు తరలించారు. స్వల్పంగా గాయపడిన 26 మంది విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలానికి గురజాల డీఎస్పీ శ్రీహరిబాబు, మాచర్ల ఎంవీఐ ఎ.మాధవరావు, ఇన్‌చార్జి తహసీల్దారు బుడేసాహెబ్, మాచర్ల రూరల్ సీఐ ఎ.వెంకటేశ్వర్లు, తదితరులు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాగులో నీరు లేకపోవడం వల్ల పెనుప్రమాదం తప్పిందని, లేకపోతే తమ పిల్లల పరిస్థితి ఏమిటంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ బస్సు రాడ్ ఊడిపోయే పరిస్థితి వచ్చే వరకు చూసుకోకుండా పాఠశాల యాజమాన్యం, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వహించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఆందోళన

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, గ్రామస్తులు గాయపడిన విద్యార్థులను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆ సమయంలో ఆసుపత్రిలో వైద్యులు ఎవరూ లేకపోవడం, సిబ్బంది సరిగా స్పందించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు అక్కడే ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆసుపత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని హెచ్చరించారు. 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ కూడా లేకపోవడంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థులను తన సొంత వాహనంలో మాచర్లలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. పిల్లలకు ఏదైనా జరిగితే అందుకు ప్రభుత్వం, వైద్య అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.





ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన విద్యార్థులు



మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

బస్సులో పరిమితికి మించి విద్యార్థులు

పరిమితికి మించి విద్యార్థులను తరలించడం వల్లే ఎక్కువ మంది విద్యార్థులు గాయపడినట్లు తెలుస్తోంది. ఉప్పలపాడు, మండాది గ్రామాల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు వచ్చే విద్యార్థులు 90 మంది ఉండగా, ఒకే ట్రిప్పులో వీరిని చేరవేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. 57 మంది పట్టే బస్సులో 70 నుంచి 90 మందిని తిప్పుతున్నా రవాణా శాఖ, పోలీసు, విద్యా శాఖ అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. సోమవారం వర్షం కారణంగా 20 మంది వరకు విద్యార్థులు పాఠశాలకు రాకపోవడంతో ప్రమాద సమయంలో బస్సులో 70 మంది విద్యార్థులే ఉన్నారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిధులున్నా వినియోగించరా?

- ఆరోగ్యశాఖలో వివిధ ప్రాజెక్టులకు నాలుగున్నరేళ్లలో వచ్చింది రూ.551 కోట్లు
- పూర్తిస్థాయిలో నిధులు వినియోగించని రాష్ట్రం
- ఇంకా వినియోగించాల్సిన నిధులు రూ.239 కోట్లు పైనే
- వినియోగ పత్రాలు సమర్పించింది కేవలం రూ.41 కోట్లకు
- మిగిలిన వాటికీ సమర్పిస్తేనే మిగతా నిధులు ఖర్చుచేసే అవకాశం
- సకాలంలో ప్రాజెక్టులు చేపట్టడంలో రాష్ట్రం విఫలం



సాక్షి, అమరావతి : కేంద్రం నుంచి వచ్చిన నిధులను సకాలంలో వినియోగించి పనులు పూర్తిచేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడంతో తీవ్రనష్టం వాటిల్లుతోంది. ఖజానాలో రూ.వందల కోట్ల నిధులున్నా వాటి వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దక్షిణాదిన తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు కేంద్రం నుంచి వచ్చిన నిధులను ఎప్పటికప్పుడు వినియోగించుకోవడం, ఖర్చు చేసిన నిధులకు వినియోగ పత్రాలు (యూసీలు) సమర్పించడంతో అదనపు నిధులను తెచ్చుకోగలిగాయి. కానీ, మన రాష్ట్రంలో అలా జరగకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. ఎంబీబీఎస్ సీట్ల పెంపు నుంచి పీజీ వైద్య సీట్ల పెంపు వరకూ, క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం నుంచి సూపర్ స్పెషాలిటీ బ్లాకుల వరకూ అంతటా సగం పనులు కూడా పూర్తికాలేదు. దీంతో రాష్ట్ర వ్యవహార శైలిపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ తీవ్ర అసంతృప్తితో ఉంది. ఇచ్చిన నిధులను వినియోగించుకోలేకపోయారని, వాటికి లెక్కలు కూడా చెప్పడంలేదని కేంద్రం ఆరోపిస్తోంది. యూసీలు ఇవ్వాలని పలుమార్లు కోరినా రాష్ట్రం స్పందించలేదని కేంద్ర అధికారులు చెప్పారు.

నాలుగున్నరేళ్లలో రాష్ట్రానికి రూ.551 కోట్లు

గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు రూ.867 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.551.80 కోట్లు ఇచ్చింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం వీటిలో కేవలం రూ.41.05 కోట్లకు మాత్రమే యూసీలు ఇచ్చింది. అంతేకాక, ఇంకా రూ.239కోట్లకు పైగా నిధులు వ్యయం చేయాల్సింది ఉంది. అలాగే, ఇచ్చిన నిధులను వినియోగించుకోలేకపోవడం, వినియోగించిన నిధులకు లెక్కలు చెప్పకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోలేకపోయారు. ఉదాహరణకు.. అనంతపురం, విజయవాడలో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద ఒక్కో ఆస్పత్రికి రూ.150 కోట్లు ఇస్తే వాటికి అస్సలు లెక్కలు చెప్పనేలేదు. పైగా రాష్ట్ర సర్కారు ఇవ్వాల్సిన వాటా కూడా ఇవ్వలేదు. దీంతో నిర్మాణాలు పూర్తికావచ్చినా అవి ప్రారంభానికి నోచుకోలేదు. ఇలా ఎన్నో పథకాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. పీజీ వైద్య సీట్లు, యూజీ వైద్య సీట్ల పెంపునకు సైతం సరైన మౌలిక వసతులు కల్పించలేకపోవడంతో సీట్లు పెరగలేదు.

నాలుగున్నరేళ్లలో పునాది కూడా వెయ్యలేదు

రాష్ట్రం విడిపోయాక ఉన్న ఒక్క క్యాన్సర్ ఆస్పత్రి తెలంగాణకు పోయింది. దీంతో రాష్ట్రంలో స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రి లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం కర్నూలులో స్టేట్ క్యాన్సర్ సెంటర్‌ను ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ ఆస్పత్రి ప్రాజెక్టు వ్యయం రూ.120 కోట్లు. ఇందులో 60% కేంద్రం వాటా కాగా, 40% రాష్ట్ర వాటా. కానీ, నాలుగున్నరేళ్లుగా దీనికి పునాది రాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం వెయ్యలేకపోయింది.

ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇటీవల వేశారు. అసలే రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో కూడా ఆ కేంద్రాన్ని సకాలంలో నిర్మించలేకపోయారని విమర్శలు తీవ్రంగా ఉన్నాయి.

వివిధ పథకాలకు కేంద్ర నిధులు ఇలా (కోట్లలో)

పథకం	ప్రాజెక్టు అంచనా	కేంద్రం ఇచ్చింది	రాష్ట్రం ఇచ్చిన యూసీలు
పీజీ వైద్యసీట్ల పెంపు	125	46.08	41.05
బర్న్ మేనేజ్‌మెంట్	39.47	13.90	-
ఎంబీబీఎస్ సీట్ల పెంపు	180	90	-
ట్రామాకేర్	96	66.74	-
స్టేట్ క్యాన్సర్ సెంటర్	120	54	-
పీఎంఎస్ఎస్‌వై, అనంతపురం	150	120	-
పీఎంఎస్ఎస్‌వై విజయవాడ	150	120	-
కాకినాడ ట్రామాకేర్	10.27	4.50	-

హజ్ యాత్రకు వలంటీర్ల ఎంపిక

సాక్షి, అమరావతి: హజ్ యాత్రకు వలంటీర్ల ఎంపిక కార్యక్రమం ఏపీ స్టేట్ హజ్ కమిటీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ.. హజ్ యాత్రికులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జీఎస్టీని రాష్ట్రమే భరించేలా అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుంచి 15 మంది మత పెద్దల్ని హజ్‌కు పంపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. శాసనమండలి విప్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ.. వలంటీర్ల డ్రాకు మొత్తం 103 దరఖాస్తులు రాగా 10 మందిని ఎంపికచేశామన్నారు. వీరంతా మైనార్టీ సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారి నుంచి ఎన్‌వోసీ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మొమిన్ అహ్మద్ హుస్సేన్ అధ్యక్షత వహించారు.

హజ్ కమిటీ సభ్యులు ముఫ్తీ మహమ్మద్ ఫరూక్, మౌలానా ఇలియాజ్, మహమ్మద్ రఫీ, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ హసన్‌బాషా, షేక్ అక్బర్‌సాహెబ్, అబ్దుల్ చిన్న రహ్మాన్, సయ్యద్ మఖ్దుం బుకారిలు పాల్గొన్నారు.

కాపునాడు నూతన కార్యవర్గం ఏర్పాటు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ కాపునాడు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం విజయవాడ కాపునాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పిళ్లా వెంకటేశ్వరరావు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఏపీ కాపునాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా పి.మంగారావు, కోటా శ్రీనివాసరావు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పిళ్లా శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శిగా తాడికొండ విజయలక్ష్మి నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆచంట బాబ్జీ, కృష్ణాజిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఆకుల జయప్రదను నియమించారు. ఈ సందర్భంగా పిళ్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాకు కన్నెగంటి హనుమంతు, పులిచింతల ప్రాజెక్టుకు అల్లంశెట్టి విశ్వేశ్వరరావు పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యర్రంశెట్టి అంజిబాబు, వేరుకొండ రమణ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 4 నుంచి బీజేపీ బస్సుయాత్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో అవినీతి, వైఫల్యాలతో పాటు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ఆర్థిక సహాయం గురించి ప్రజలకు వివరించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి బస్సు యాత్రను మొదలు పెట్టనున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి మొదలయ్యే ఈ బస్సుయాత్రను బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా జెండా ఊపి ప్రారంభిస్తారు. 13 జిల్లాలు, 90 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా ఈ యాత్ర సాగుతుందని.. ఫిబ్రవరి 18వ తేదీన కర్నూలు జిల్లా ఆదోనిలో యాత్ర ముగుస్తుందని పార్టీ నేతలు వివరించారు. యాత్ర దారిలో ప్రతిరోజు బహిరంగ సభ నిర్వహించేలా, 3 రోజులకు ఒకసారి ఒక కేంద్ర మంత్రి బహిరంగ సభలో పాల్గొనేలా ప్రణాళిక జరుగుతోందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సత్యమూర్తి తెలిపారు.

"ఉద్యోగ, ఉపాధ్యాయులను దగా చేస్తున్న ప్రభుత్వం"

సాక్షి, అమరావతి బ్యూరో: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా దగా చేస్తోందని వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రెడ్డిశేఖర్‌రెడ్డి, కె.వెంకటరెడ్డిలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెల్లించాల్సిన రెండు విడతల డీఏ, ఐఆర్‌లను ఇవ్వకపోవటం దారుణమన్నారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఉపాధ్యాయులకు పదోన్నతులు వంటి సమస్యలు ఉపాధ్యాయులను వేధిస్తున్నాయన్నారు.

"న్యాయవాదుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం"

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు కృష్ణ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నాచౌక్‌లో న్యాయవాదులు సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న వల్లెపు కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించిందని, మన రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వివక్ష చూపుతోందని మండిపడ్డారు. ధర్నాలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐ.శివప్రసాద్, గ్రేటర్ అమరావతి అధ్యక్షుడు ఎస్.కె.గౌస్‌బాషా, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీ చేసిందేమి లేదు

వైఎస్సార్‌సీపీ నేత బుద్దా నాగేశ్వరరావు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఆర్భాటపు ప్రకటనలే తప్ప.. టీడీపీ ప్రభుత్వం బీసీలకు చేసిందేమి లేదని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత బుద్దా నాగేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన జయహో బీసీ వేదికగా చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. సోమవారం విజయవాడలో బుద్దా నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. బీసీలకు ఏదైనా మేలు జరిగిందంటే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నేనని చెప్పారు.


బుద్దా నాగేశ్వరరావు, శేఖర్‌బాబు

వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా లక్షలాది మంది ఉన్నత విద్యను అభ్యసించారని గుర్తు చేశారు. చంద్రబాబు బీసీలకు అనేక హామీలు ఇచ్చి, ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. సమావేశంలో బీసీ నేత బాయన శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'శిష్టకరణాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): శిష్టకరణ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల గౌరవ సలహాదారు పీఎస్ పట్నాయక్ డిమాండ్ చేశారు. విజయవాడలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి ప్రభుత్వం శిష్టకరణాలను బీసీ– డిలో చేర్చారని, అయితే బీసీల రిజర్వేషన్ శాతాన్ని మాత్రం పెంచలేదని చెప్పారు. దీంతోతమకు అన్యాయం జరుగుతుందన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలివాడ శికుమార్ పట్నాయక్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు రాజమహేంద్రవరంలో జరిగిన సభలో అన్ని బీసీ ఉపకులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అందులో భాగంగా తమ కులానికి కూడా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మూడు నెలల్లో ఎయిమ్స్‌లో ఓపీ సేవలు

ఎయిమ్స్ మంగళగిరి డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): మూడు నెలల్లో మంగళగిరి ఎయిమ్స్‌లో అవుట్ పేషెంట్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి చెప్పారు. ఎయిమ్స్ మంగళగిరి ప్రెసిడెంట్ డాక్టర్ టీఎస్ రవికుమార్, అడ్మిన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రమ్ దీప్ సిన్హాలతో కలిసి ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 12 విభాగాల వైద్య సేవలతో పాటు, 10 క్లినికల్ విభాగాల సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఓపీ విభాగంలో 44 మంది ఫ్యాకల్టీ మెంబర్స్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. 2020 నాటికి ఓపీ విభాగం పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ముఖేష్ త్రిపాఠి, డాక్టర్ రవికుమార్

కాగా, ఎయిమ్స్ తాత్కాలిక క్యాంపస్‌లో సెమినార్ పోటీలను నిర్వహించనున్నట్లు త్రిపాఠి తెలిపారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1 వరకు జరిగే ఈ పోటీల్లో వివిధ కళాశాల నుంచి 300 మంది పాల్గొంటారన్నారు. సమావేశంలో ఎయిమ్స్ మంగళగిరి డీన్ డాక్టర్ జాయ్ ఏ గోషల్, మాస్టర్ ఆఫ్ సర్జన్ డాక్టర్ రాజేష్ కక్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిధానపరిషత్ ఉద్యోగుల విభజన

సాక్షి, అమరావతి: గత నాలుగున్నరేళ్లుగా విభజన అమల్లోకి రాకపోవడంతో వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 5 వేల మంది ఉద్యోగులున్న ఈ విభాగం ఉద్యోగులను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజిస్తూ సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల అధికారులు నిర్ణయించారు. ఈమేరకు నోటిఫికేషన్ జారీ అయింది. ఇందులో భాగంగా ఉద్యోగుల జాబితాను ఉత్తర్వుల్లో పొందుపరిచారు. విభజన నోటిఫికేషన్ జారీపై 2వారాల్లోగా ఉద్యోగులు వినతులు, అభ్యంతరాలు ఇవ్వాలని నోటిఫికేషన్‌లో సూచించారు.

హైకోర్టులో 9 పోస్టుల సృష్టికి అనుమతి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడిన నేపథ్యంలో పాలన సాఫీగా సాగిపోయేందుకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్ జీ)తో సహా 9 పోస్టులను సృష్టించేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రార్(జుడీషియల్), రిజిస్ట్రార్(అడ్మిన్), రిజిస్ట్రార్(విజిలెన్స్), రిజిస్ట్రార్(ప్రోటోకాల్), రిజిస్ట్రార్(మేనేజ్‌మెంట్), రిజిస్ట్రార్(రిక్రూట్‌మెంట్), రిజిస్ట్రార్(ఎంక్వయిరీస్), రిజిస్ట్రార్(ఐటీ కమ్ సీపీవో) పోస్టులను సృష్టించింది. ఈ ఏర్పాటు జనవరి 1 నుంచి అమల్లోకి వస్తున్నట్లు తెలిపింది.
ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి దుప్పల వెంకటరమణ ఉత్తర్వులు జారీ చేశారు.

అసలు విషయాలను కోర్టు ముందుంచండి

డొల్ల కంపెనీలకు భూకేటాయింపులపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

తదుపరి విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా



సాక్షి, అమరావతి: మనుగడలో లేని పలు డొల్ల కంపెనీలకు ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం పెద్ద సంఖ్యలో భూములు కట్టబెట్టిందని పిటిషనర్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో అందుకు సంబంధించిన అసలు విషయాలను తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మనుగడలో లేని పలు డొల్ల కంపెనీలకు ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం పెద్ద సంఖ్యలో భూములు కట్టబెట్టిందని, దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ మాజీ న్యాయాధికారి జె.శ్రవణ్‌కుమార్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ మనుగడలో లేని, ఏ మాత్రం అర్హతలు లేని కంపెనీలకు భూములు అప్పగించారనేందుకు మరిన్ని ఆధారాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేశానని కోర్టుకు నివేదించారు. విజయనగరం జిల్లాలో ఓ కంపెనీకి 40 ఎకరాలు ఇచ్చారని, ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా ఈ కంపెనీ ఒక్క ఇటుక కూడా వేయలేదని, సమాచార హక్కు చట్టం కింద ఏపీఐఐసీ నుంచి ఈ వివరాలు తెలుసుకున్నానని తెలిపారు. భూకేటాయింపులకు సంబంధించి 2015లో సవరణ నిబంధనలు వచ్చాయని, అయితే వీటిని తుంగలో తొక్కి 2012లోని నిబంధనల ప్రకారమే కేటాయింపులు చేశారని వివరించారు. మరికొన్ని కంపెనీలు ప్రభుత్వం నుంచి పొందిన భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని, వాటిని దారి మళ్లిస్తున్నాయన్నారు. వాదనలు విన్న ధర్మాసనం డొల్ల కంపెనీలకు భూముల కేటాయింపులపై అసలు విషయాలు ఏమిటో తమకు తెలియచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఏపీఐఐసీని ఆదేశించింది.

బాబుతో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి భేటీ

సాక్షి, అమరావతి/ సాక్షి ప్రతినిధి, కర్నూలు: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలసి సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి వచ్చారు. చంద్రబాబు ఆయన్ను విందుకు ఆహ్వానించినట్లు టీడీపీ వర్గాలు వెల్లడించాయి. కోట్లతో పాటు ఆయన భార్య, కుమారుడు ఉన్నారు. తెలుగుదేశం పార్టీలో కోట్ల చేరిక విషయమై వారి మధ్య చర్చలు జరిగాయని ఆ వర్గాలు తెలిపాయి.

నాకు సమాచారం లేదు: కేఈ

సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీలో చేరే విషయమై తనకు ఎలాంటి సమాచారమూ లేదని డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి చెప్పారు. ఈ విషయంలో తనపై వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజమూ లేదన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే తనకు కనీస సమాచారం ఇవ్వకుండా సూర్యప్రకాశ్‌తో ఎలా చర్చలు జరుపుతారని కేఈ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కోట్ల వర్గానికి ఏయే సీట్లు ఇవ్వనున్నారనే అంశంపై స్పష్టత వచ్చిన తర్వాత పూర్తిస్థాయి స్పందన తెలియజేయాలని కేఈ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో కేఈ, కోట్ల కుటుంబాల మధ్య దశాబ్దాలుగా రాజకీయ వైరం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇరువర్గాలకు చెందిన అనేక మంది ఫ్యాక్షన్‌కు బలైపోయారు. గ్రామాల వారీగా వర్గాలుగా విడిపోయారు. ఈ పరిస్థితుల్లో కోట్ల టీడీపీలో చేరనున్నారనే వార్తలతో కేఈ వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'చలో కత్తిపూడి'కి అనుమతి నిరాకరణ

- పోలీసుల వలయంలో ముద్రగడ నివాసం
- కాపు రిజర్వేషన్ ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం




తూర్పు గోదావరి జిల్లా కత్తిపూడిలో మోహరించిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/ పెద్దాపురం: కాపు రిజర్వేషన్ ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకు ఈ నెల 31న తూర్పుగోదావరి జిల్లాలో 'చలో కత్తిపూడి' కార్యక్రమానికి ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం పిలుపునివ్వగా ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఈ కార్యక్రమానికి అనుమతి లేదని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ పెద్దాపురంలో సోమవారం స్పష్టం చేశారు. సభ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ముద్రగడ నివాసంతోపాటు ఆయన స్వగ్రామం కిర్లంపూడిలో భారీగా పోలీసులను మోహరించి గ్రామాన్ని నలువైపులా నిర్బంధించారు. అంతేకాకుండా ప్రత్యేక పోలీసులను రంగంలోకి దించి సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. మరోవైపు ఈ నెల 31న చలో కత్తిపూడి పేరుతో నిర్వహించే సమావేశానికి ముద్రగడ పద్మనాభం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. 3 రోజుల ముందుగానే కాపు శ్రేణులు తరలివస్తుండటంతో ప్రభుత్వం పోలీసులను దింపి ఉద్యమాన్ని అణచివేస్తోంది. దీనిపై కాపులు మండిపడుతున్నారు. చంద్రబాబు కాపులపై కక్ష కట్టారని, రిజర్వేషన్ హామీని నెరవేర్చకపోగా ఈ ఆంక్షలేమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక పరిస్థితి బాగోలేకే అప్పులు

మంత్రి కాల్వ శ్రీనివాసులు



సాక్షి, విశాఖపట్నం: విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయం సరిపోక పోవడం వల్లే అప్పులు చేయాల్సి వస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. రూ.90 వేల కోట్లు ఉన్న అప్పులు నేడు రూ.2.50 లక్షల కోట్లకు చేరాయని, తమ ప్రభుత్వం అప్పులు చేసిన మాట వాస్తవమేనని అంగీకరించారు. సోమవారం విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలంటే అప్పులు చేయడం తప్ప వేరే మార్గం లేదన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా ప్రకటించబోతున్నామని తెలిపారు. అదనంగా మరో 11 కార్పొరేషన్లు ఏర్పాటుచేస్తామన్నారు.

షరతుల టైమ్ స్కేలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సవాలక్ష నిబంధనలతో టైమ్ స్కేలును అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జీవో కాంట్రాక్టు సిబ్బందికి మాత్రమే వర్తిస్తుంది. అందులోనూ కొద్ది మందికే ప్రయోజనం కలుగుతుందని సిబ్బంది చెబుతున్నారు. 2015 రివైజ్డ్ పే స్కేలు ప్రకారం ఈ టైమ్ స్కేలు వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు. అదీ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఇతర అలవెన్సులు ఏమీ ఉండవని, మినిమమ్ టైమ్ స్కేలు పరిమితి మేరకు తప్ప ఇంక్రిమెంట్లు, ఇతర పెంపుదల ఏమీ ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీ పోస్టుల్లో ప్రభుత్వ అనుమతితో తగిన ఉత్తర్వులతో నియమితులైన వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని, ఇతరులకు వర్తించదని స్పష్టంచేశారు. ఇక ముందు కాంట్రాక్టు పద్ధతిలో ఎలాంటి నియామకాలు చేయరాదని, అలా చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని పేర్కొన్నారు. కన్సల్టెంట్లు, సలహాదారులు, ఓఎస్డీలు, ప్రత్యేకంగా నియమితులైన వారికి ఈ టైమ్‌స్కేలు వర్తించదన్నారు. అధ్యాపకులు, వర్సిటీల బోధనా సిబ్బందికి ఈ జీవోతో ఎలాంటి ప్రయోజనమూ చేకూరడంలేదు. జూనియర్ కాలేజీల్లో దాదాపు 4 వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారు. వీరికి ఏటా మార్చి చివరి తేదీతో కాలపరిమితి ముగుస్తుంది. ప్రస్తుత జీవో ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొనడంతో అధ్యాపకులకు ఈ ప్రయోజనం అందదు. విద్యాసంస్థల్లో పనిచేసే వారికి 12 నెలల పాటు వేతనాలిస్తామని మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇచ్చినా.. దాన్ని జీవోలో పేర్కొనలేదు.

రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు మరో రూ.21.95 కోట్లు

- సీఎం రమేష్ సంస్థకు అదనపు చెల్లింపులకు సర్కారు ఆమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన జలవనరుల శాఖ
- కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మట్టి పనులకు అ'ధనం'

ఇప్పటికే కాంక్రీట్ పనుల్లో అదనంగా చెల్లించిన మొత్తం రూ.122.75 కోట్లు

సాక్షి, అమరావతి: రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థకు కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మట్టి పనులకు అదనంగా రూ.21.95 కోట్లు ఇవ్వడానికి ఆమోదం తెలుపుతూ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కాంక్రీట్ పనుల్లో రూ.122.75 కోట్లను సీఎం రమేష్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఇచ్చేయడం గమనార్హం. వాస్తవానికి కుప్పం బ్రాంచ్ కెనాల్ అలైన్‌మెంట్‌ను మార్చడం వల్ల కాలువ పొడవు 20 కి.మీలు తగ్గింది. ఆ మేరకు బిల్లుల్లో కోత పెట్టాల్సిన ప్రభుత్వం, ఆ పని చేయకపోగా అదనంగా రూ.144.7 కోట్లు కట్టబెట్టడంపై అధికారవర్గాలే నివ్వెరపోతున్నాయి. సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంకు హంద్రీ–నీవా రెండో దశలో పుంగనూరు బ్రాంచ్ కెనాల్ నుంచి కృష్ణా జలాలను తరలించడానికి రూ.403.65 కోట్లతో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు 2015లో టెండర్లు పిలిచారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో 207.8 కి.మీ నుంచి 143.9ల కి.మీ పొడవు ఈ కెనాల్ తవ్వాలి. రూ.207 కోట్లతో పూర్తయ్యే ఈ పనుల అంచనాను రూ.403.65 కోట్లకు పెంచేసి టెండర్ పిలిచిన ప్రభుత్వం.. 4 శాతం అదనపు (ఎక్సెస్) ధరలకు, అంటే రూ.430.26 కోట్లకు కోట్ చేస్తూ.. కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రా–కోయా–హెచ్‌ఈఎస్ (జేవీ) దాఖలు



చేసిన సింగిల్ బిడ్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించేసింది. అయితే ఉత్తినే రూ.223 కోట్లు మిగలనుండటంతో ఈ పనులపై సీఎం రమేష్ కన్ను పడింది. అంతే.. సీఎం చంద్రబాబు ఒత్తిడి మేరకు నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులను దొడ్డిదారిన జలవనరుల శాఖ అధికారులు ఆయనకు కట్టబెట్టేశారు.

తొలుత రూ.122.75 కోట్లు

కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం 90 శాతం తవ్వకం.. పది శాతం భూమిపై గట్టు (ఎంబాక్‌మెంట్) నిర్మాణం ద్వారా చేయాలి. కానీ రిత్విక్ సంస్థ ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండానే డిజైన్ మార్చేసింది. 60 శాతం తవ్వకం, 40 శాతం ఎంబాక్‌మెంట్ ద్వారా కాలువ పని చేసింది. డిజైన్ మార్చితే సీడీవో (సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్) చీఫ్ ఇంజనీర్ ఆమోదం పొందాలి. జలవనరులు, ఆర్థిక శాఖ అనుమతులూ తప్పనిసరి. ఇవేమీ పట్టించుకోకుండా పనులు చేసిన సంస్థ.. ఎంబాక్‌మెంట్ ద్వారా చేసిన పనులకు, కాంక్రీట్ పనులకు అదనంగా రూ.213.75 కోట్లు చెల్లించాలని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ(ఎస్‌ఎల్‌ఎస్‌సీ)కి ప్రతిపాదనలు పంపింది. అయితే గడువులోగా పనులు పూర్తి చేయలేదని, అనుమతి తీసుకోకుండానే డిజైన్ మార్చేశారని, అందువల్ల అదనపు బిల్లులు చెల్లించడం కుదరదనిఎస్‌ఎల్‌ఎస్‌సీ తేల్చిచెప్పింది. దాంతో ముఖ్యనేత జోక్యం చేసుకుని అదనపు బిల్లులు చెల్లించడానికి వీలుగా ఏప్రిల్ 16, 2018న మంత్రివర్గంలో తీర్మానం చేయించారు. దాన్ని అమలు చేస్తూ మే 3, 2018న జలవనరుల శాఖ ఉత్తర్వులు (జీవో 32)జారీ చేసింది. వాటి ఆధారంగా కాంక్రీట్ పనులకు రూ.122.75 కోట్లను సీఎం రమేష్ సంస్థకు చెల్లిస్తూ సెప్టెంబర్ 7, 2018న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తాజాగా మరో రూ.21.95 కోట్లు

ఈ నేపథ్యంలో ఎంబాక్‌మెంట్ పనులకు అదనంగా రూ.91 కోట్లు చెల్లించాలంటూ రిత్విక్ సంస్థ మళ్లీ ప్రతిపాదనలు పంపింది. గతంలోలాగే ఎస్‌ఎల్‌ఎస్‌సీ కుదరదని చెప్పింది. ముఖ్యనేత మరోసారి జోక్యం చేసుకోవడంతో ఆ ప్రతిపాదనను నవంబర్ 22, 2018న బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్ (బీవోసీఈ)కు పంపారు. తీవ్రస్థాయి ఒత్తిళ్లతో బీవోసీఈ రూ.21.95 అదనపు చెల్లింపులకు ఆమోదించింది. ఈ నేపథ్యంలోనే జలవనరుల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మట్టి పనుల్లో అదనంగా మరో రూ.69 కోట్లు ఇవ్వాల్సిందిగా రిత్విక్ సంస్థ పట్టుబడుతున్నట్లు జలవనరుల శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

ప్రైవేటుకు పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు

- 4 వేల మెగావాట్ల ఉత్పత్తికి అనుమతులివ్వాలని నిర్ణయం
- ట్రాన్స్‌కో లైన్లు వాడుకునే వెసులుబాటు
- వీలింగ్ చార్జీల్లో 75 శాతం రాయితీ
- విద్యుత్ అవసరం ఉన్నా, లేకున్నా కొనుగోలు ఒప్పందాలకు అవకాశం



సాక్షి, అమరావతి: గ్రీన్ కారిడార్ పేరుతో రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలు 4 వేల మెగావాట్ల పవన, సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అనుమతులివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తం విద్యుత్‌లో కొంత రాష్ట్ర అవసరాలకు వినియోగిస్తారు. మిగతా మొత్తం ఆయా ప్రైవేటు సంస్థలు ఇష్టానుసారం ఎక్కడైనా అమ్ముకోవచ్చు. ఇందు కోసం ట్రాన్స్‌కో లైన్లు వాడుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సౌర, పవన విద్యుత్‌తో కూడిన హైబ్రిడ్ పాలసీని తీసుకొచ్చింది. సాధారణంగా ట్రాన్స్‌కో లైన్లు వాడుకునే ప్రైవేటు ఉత్పత్తిదారులు ఎవరైనా విధిగా వీలింగ్ చార్జీలు చెల్లించాలి. కానీ ఈ కొత్త విధానంలో ప్రైవేటు సంస్థలకు వీలింగ్ చార్జీల్లో 75 శాతం వరకు రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. మరోవైపు కొన్ని ప్రైవేటు కంపెనీల నుంచి అవసరమున్నా లేకున్నా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకునే వెసులుబాటును సైతం కొత్త పాలసీలో పొందుపరిచారు. సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు ఒకేచోట ఏర్పాటు చేసి, ఏడాది పొడవునా నిర్ణీత యూనిట్లు ఉత్పత్తి చేసేలా ఒప్పందాలు చేసుకోవాలని కూడా నిర్ణయించారు.

రూ.700 కోట్ల వ్యయానికి ట్రాన్స్‌కో అభ్యంతరం

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రైవేటు విద్యుత్ సంస్థలు తమ ప్లాంట్లను ఏర్పాటు చేస్తాయి. అయితే అక్కడ్నుంచి ఏపీ ట్రాన్స్‌కో లైన్ల ద్వారా సమీపంలోని ప్రధాన విద్యుత్ లైన్లకు అనుసంధానించేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన సబ్‌స్టేషన్లు, విద్యుత్ కారిడార్లను ఏపీ ట్రాన్స్‌కోనే చూసుకోవాల్సి ఉంటుంది. తాజా అంచనాల ప్రకారం రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని గ్రిడ్‌కు అనుసంధానం చేసే అవకాశముందని ట్రాన్స్‌కో పేర్కొంది. దీనికి కొత్తగా వేసే లైన్లు, సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కనీసం రూ.700 కోట్లు ఖర్చవుతుందని నివేదించింది. ఈ మొత్తాన్ని ట్రాన్స్‌కో అప్పుగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ట్రాన్స్‌కో సిద్ధంగా లేదు. ఇదే అభిప్రాయాన్ని ట్రాన్స్‌కో ఉన్నతస్థాయి వర్గాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను విరమించుకోలేదని సమాచారం.

అసత్యవాదికి అసలు రూపం బాబే

- జయహో బీసీ సభ అంతా బూటకం
- మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులను బెదిరించడం మరచిపోయారా
- న్యాయమూర్తులు కాకుండా ఎలా అడ్డుకున్నారో.. జస్టిస్ ఈశ్వరయ్య వెల్లడించలేదా?
- బీసీల స్థితిగతులు, జీవనప్రమాణాలు పెంచేలా వైఎస్ జగన్ డిక్లరేషన్
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ధర్మాన



సాక్షి, అమరావతి: అసత్యవాది చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు ధ్వజమెత్తారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికలప్పుడు బీసీలకు ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలో అమలు చేయకుండా.. తిరిగి ఎన్నికలు వస్తున్నాయని జయహో బీసీ అంటూ మరోసారి బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2014 టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే జయహో బీసీ సభలో తిరిగి వల్లె వేశారంటేనే వారికి ఏమి చేయలేదనే విషయం అర్థమవుతుందన్నారు.

అధికారం పంచుకున్నప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా?

బీజేపీతో కలిసి కేంద్రంలో అధికారం పంచుకున్నప్పుడు జయహో బీసీ అని అనిపించలేదా అని ప్రశ్నించారు. కేంద్రంలో టీడీపీ తరఫున ఇద్దరికి మంత్రి పదవులకు అవకాశం వస్తే వారిలో ఒక్కరికైనా బీసీలకు అవకాశం ఇచ్చారా? అని ప్రశ్నించారు. నిజాయితీ పరుడైన జస్టిస్ ఈశ్వరయ్య ఆధారాలు బయటపెడుతూ బీసీ న్యాయవాదులను న్యాయమూర్తులుగా ఎంపిక కాకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని స్వయంగా వెల్లడించిన విషయాన్ని గుర్తుచేశారు. జస్టిస్ ఈశ్వరయ్య లేవనెత్తిన ప్రశ్నలకు బాబు నుంచి ఇప్పటికీ సమాధానం లేదన్నారు. మత్స్యకారుల పెద్దలను తాటతీస్తానంటూ అవమానించారని చెప్పారు. అదేవిధంగా నాయి బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానంటూ అవమానించిన విషయాన్ని వాళ్లు ఇంకా మరచిపోలేదని తెలిపారు.

వైఎస్‌పై అనవసర నిందలు వేస్తావా?

వైఎస్ రాజశేఖరరెడ్డి బీసీ రిజర్వేషన్లు తగ్గించారని, ఇతరత్రా అన్యాయం చేశారంటూ నిందలు వేయడం తగదని చంద్రబాబుకు హితవు పలికారు. వైఎస్ తన కేబినెట్‌లో తనలాంటి వారితో పాటు కొణతల రామకృష్ణ, రఘువీరా వంటి మంత్రులకు ఎంత ప్రాధాన్యమిచ్చేవారో, ఎంత స్వేచ్ఛ ఉండేదో అందరికీ తెలుసునన్నారు. పేదరికంతో వారి పిల్లల విద్యాభ్యాసానికి అడ్డుకాకూడదనే బీసీల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఈ పథకాన్ని నీరుగార్చిన ఘనత నీది కాదా అని చంద్రబాబును ప్రశ్నించారు.

త్వరలో జగన్ డిక్లరేషన్ ప్రకటిస్తారు..

బీసీలు ఉన్నత స్థానాలకు ఎదగడానికి, వారి స్థితిగతులు మెరుగుపరచడానికి అవసరమైన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ త్వరలో ప్రకటించనున్నారని ధర్మాన తెలిపారు. టీఆర్‌ఎస్‌తో కలిసి పోటీ చేద్దామని చంద్రబాబే ప్రతిపాదించాడు కదా? బీసీ కులాలను కేసీఆర్ తొలగించాడని తెలిసిన తర్వాతనే ఆ ప్రతిపాదన ఎందుకు చేశాడని ప్రశ్నించారు. తెలంగాణలో రాజ్యసభ ఖాళీ అయితే ఆ స్థానాన్ని బీసీకి అవకాశం ఇచ్చారు. మరి చంద్రబాబుకు ఆ జ్ఞానం లేదే అన్నారు. ఫెడరల్ సిస్టంను గౌరవించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ముందుకొచ్చి అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు చేస్తూ ఒక ఫ్లాట్ ఫామ్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

ప్రకృతి సేద్యంతో ఖర్చు ఎక్కువే!

- ఖర్చు తగ్గి ఆదాయం, ఉత్పాదకత పెరిగిందని సీఎం అంటే..
- ఖర్చు పెరిగి, ఆదాయం–ఉత్పత్తి తగ్గిందని రైతుల వాదన
- రియల్ టైమ్ గవర్నెన్స్‌లో సర్కారు నివేదిక
- లంచాలిస్తేనే ట్రాక్టర్లు, విత్తనాల పంపిణీ
- ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులపై రైతుల ఆరోపణలు

సాక్షి, అమరావతి: ప్రకృతి సేద్యం ద్వారా ఖర్చు తగ్గడమే కాకుండా ఆదాయంతో పాటు ఉత్పాదకత పెరుగుతుందని సీఎం చంద్రబాబు చెబుతుంటే.. ఆ విధానం ద్వారా నికర ఆదాయం తగ్గిపోతోందని.. అలాగే, సాగు ఖర్చు పెరిగిపోతోందని, పంటల దిగుబడి సైతం తగ్గిపోతోందని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయం సోమవారం సీఎం నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో రియల్ టైమ్ గవర్నెన్స్ నివేదిక వెల్లడించింది. మరోపక్క.. ట్రాక్టర్లతో పాటు విత్తనాల పంపిణీకి ప్రజాప్రతినిధులు, అధికారులు లంచాలు అడుగుతున్నారని పలువురు రైతులు ఆరోపించినట్లు నివేదికలో పేర్కొన్నారు. రాయతీపై సూక్ష్మపోషకాలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. అవి అందించడంలేదని 35శాతం మంది స్పష్టంచేశారు. అలాగే, 32శాతం మంది సకాలంలో సూక్ష్మ పోషకాలు ఇవ్వడంలేదన్నారు.

ట్రాక్టర్ల పంపిణీలోనూ చేతివాటం

ఇదిలా ఉంటే.. ట్రాక్టర్ల పంపిణీలో పలువురు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖాధికారులు లంచాలు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ నివేదిక వెల్లడించింది. ప్రకాశం జిల్లాలో 50 శాతం మంది రైతులు ఈ విషయం పేర్కొనగా.. పశ్చిమగోదావరి జిల్లాలో 42 శాతం, వైఎస్సార్ కడపలో 25శాతం మంది ట్రాక్టర్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు లంచాలు తీసుకుంటున్నారని వెల్లడించారు. అలాగే, చిత్తూరులో 40 శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 17 శాతం మంది, గుంటూరు జిల్లాలో 20 శాతం, కర్నూలు జిల్లాలో 15 శాతం మంది. పశ్చిమగోదావరి జిల్లాలో 25 శాతం మంది రైతులు వ్యవసాయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు లంచాలు తీసుకుంటున్నారని వెల్లడించారు. అంతేకాక, రైతులకు అవసరమైన పంట విత్తనాలను అందించడంలేదని అన్ని జిల్లాల్లో 12 శాతం నుంచి 20 శాతం మంది రైతులు పేర్కొన్నారు. రాయితీపై ఇచ్చే నాణ్యమైన విత్తనాలు అందడంలేదని రాష్ట్రవ్యాప్తంగా 37 శాతం మంది రైతులు చెప్పారు. విత్తనాల సరఫరాకు కూడా అన్ని జిల్లాల్లో లంచాలు అడుగుతున్నారన్నారు.

ప్రకృతి సేద్యంతో దిగుబడి తక్కువ

ఇదిలా ఉంటే.. ప్రకృతి వ్యవసాయంతో నికర ఆదాయం తగ్గిపోయిందని అన్ని జిల్లాల్లో 8 శాతం నుంచి 12 శాతం మంది రైతులు తెలిపారు. అలాగే, ఈ సాగు వ్యయం కూడా పెరిగిపోయిందని 46 శాతం మంది రైతులు తేల్చిచెప్పారు. పంటల దిగుబడి కూడా తగ్గిపోతోందని అన్ని జిల్లాల్లో 9 శాతం నుంచి 33 శాతం వరకు రైతులు చెప్పారు.

చిగురాశను చిదిమేస్తున్నారు

అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థుల నిరసన	ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ధర్నా	పోలీసుల రంగప్రవేశం	త్వరలో పరిష్కరిస్తామని ఉన్నత విద్యాశాఖ చైర్మన్ హామీ



ధర్నా చేస్తున్న బాధితులు

తాడేపల్లిరూరల్(మంగళగిరి): ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమ ఆశలపై ప్రభుత్వం నీళ్లు పొయ్యడంతో బతకాలో, చావాలో అర్థంకాక పోరుబాట పట్టామని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అభ్యర్థులు ముట్టడించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలను భర్తీ చేసేందుకు రాతపరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, కానీ 1,300 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడం లేదని తెలిపారు. ఎన్నోసార్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయరాజును కలిసి విన్నవించుకున్నామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట కార్యాలయం కింద ధర్నా నిర్వహించిన బాధితులు చైర్మన్ చాంబర్ ముందు బైఠాయించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ధర్నాను విరమించాలని సూచించారు. అభ్యర్థులు ఇందుకు అంగీకరించలేదు. అనంతరం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయరాజు తన చాంబర్‌నుంచి బయటకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగం వస్తుందని ఆఫ్రికా నుంచి వచ్చా..

ఆఫ్రికా ఖండం ఇథియోపియాలో ఉద్యోగం మానేసి మరీ ఇక్కడకు వచ్చి పరీక్ష రాసి ఉత్తీర్ణుడనయ్యాను. ప్రభుత్వం మరికొంతకాలం ఇలాగే చేస్తే ఏం చేయాలో అర్థం కావడం లేదు.
– సునీల్, ఫిజికల్ ఎడ్యుకేషన్

కోర్టు సాకు ముగిసింది

అలహాబాద్ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను సమర్థిస్తూ ఈనెల 22న సుప్రీంకోర్టు వెలువరించిన నిర్ణయం ద్వారా అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి.
– జి.ఈరన్న, ఎస్.కె.యూనివర్సిటీ, విశాఖ

నేను రాష్ట్రంలోనే టాపర్‌ను..

రాతపరీక్షల్లో రాష్ట్రంలోనే నేను టాపర్‌గా నిలిచాను. కానీ ఉద్యోగమివ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుంది.
– నంబోల శ్రీధర్, విశాఖ



అవినీతి సామ్రాట్టుకు 3 పోస్టులు

- ముడుపుల కోసం ఉద్యోగులకు వేధింపులు
- ఒక్కో పర్యటనకు రెండు విభాగాల నుంచి టీఏ, డీఏలు
- అటవీశాఖ అధికారిపై ఫిర్యాదుల వెల్లువ
- విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రికి బంధువయిన అధికారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి అండదండలతో ఏకంగా మూడు పోస్టుల్లో కొనసాగుతున్న సంబంధిత అధికారిపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఓ ఐఎఫ్ఎస్ అధికారికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడం సంబంధిత విభాగాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళితే..గుంటూరులోని రాష్ట్ర అటవీ దళాల అధిపతి (హెచ్‌వోఎఫ్ఎఫ్) కార్యాలయంలో ఫారెస్ట్ యుటిలైజేషన్ అధికారి (ఎఫ్‌యూవో)గా పనిచేస్తున్న బీవీఏ కృష్ణమూర్తి అదనంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) సభ్య కార్యదర్శిగానూ, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఏపీఎన్‌జీసీ) డైరెక్టర్ పోస్టుల్లో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ముడుపుల కోసం కిందిస్థాయి ఉద్యోగులను వేధిస్తున్నారని, ఒకే పర్యటనకు వేర్వేరు విభాగాల నుంచి టీఏ, డీఏ బిల్లులు పొందారని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ అధికారిపై తీవ్ర విమర్శలున్నాయి. సదరు అధికారిపై ఉన్నతాధికారులకు భారీగా ఫిర్యాదులు అందాయి. ఇలా ఆరోపణలున్న అధికారిని వాస్తవంగా అయితే ఫోకల్ పోస్టులో ఉంచరాదు. లూప్‌లైన్‌లో పెట్టాలి. కానీ ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏకంగా మూడు పోస్టుల్లో కొనసాగుతుండడం గమనార్హం.

లంచం తీసుకుని ఉద్యోగాలిచ్చారు..

ఆరుగురికి ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలు ఇచ్చి ఒక్కొక్కరి నుంచి రూ. 1.5 లక్షల నుంచి 2 లక్షల వరకూ వసూలు చేశారని ప్రభుత్వానికి ఆయనపై ఫిర్యాదులు వెళ్లాయి. అలాగే హైదరాబాద్ నుంచి అమరావతికి బదిలీ అయిన సందర్భంగా రెగ్యులర్ పోస్టు అయిన ఎఫ్‌యూవో నుంచి ట్రాన్స్‌ఫర్ ట్రావెలింగ్ అలవెన్సు (టీటీఏ) తీసుకోవాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా అప్‌కాస్ట్ నుంచి డ్రా చేశారు. ఇక్కడైతే ఆయనే హెచ్‌వోడీ అయినందున నచ్చినంత తీసుకోవచ్చనే భావంతోనే ఇలా చేశారని ఆరోపణలొస్తున్నాయి. టెండర్లు లేకుండానే అప్‌కాస్ట్‌లో కావాల్సిన వారికి పనులు అప్పగించి నిబంధనలకు విరుద్ధంగా చెక్కులు ఇస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో తాము ఇరుక్కుపోతామంటూ ఉద్యోగులు వాపోతున్నారు. ఆయనను ఇన్‌చార్జి పోస్టు నుంచి తప్పించకపోతే మూకుమ్మడిగా సెలవుపై వెళ్లాల్సి ఉంటుందని ఉన్నతాధికారులతోపాటు మంత్రికీ మొరపెట్టుకున్నారు.

ఇన్‌చార్జి పోస్టు నుంచి తప్పించాలి

కృష్ణమూర్తిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించినందున నిష్పక్షపాతంగా విచారణ జరగడానికి, వాస్తవాలు బయటకు రావడానికి వీలుగా ఆయనను అప్‌కాస్ట్ సభ్యకార్యదర్శి, ఏపీఎన్‌జీసీ డైరెక్టర్ అనే ఇన్‌చార్జి పోస్టుల నుంచి తక్షణమే తప్పించాలని ఆయా సంస్థల ఉద్యోగులు కోరుతున్నారు. ఆయన్ని పోస్టుల నుంచి తప్పించి విచారణ జరిపితే వాస్తవాలన్నీ బయటకు వస్తాయని చెబుతున్నారు.

రూ.6 కోట్ల నిధులు మురిగి పోవాల్సిందేనా?

రాజమండ్రిలో రీజనల్ సైన్స్ సెంటర్‌కు కేంద్రం ఏడాది క్రితం రూ.6 కోట్లు మంజూరు చేసింది. అయితే ఇప్పటి వరకూ ప్రహరీ కూడా నిర్మించలేదు. ఈ నిధులు మురిగిపోతాయని ఆ సంస్థ ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయం తెలియడంతో ఆ అధికారిని తక్షణమే అప్‌కాస్ట్ ఇన్‌చార్జి పోస్టు నుంచి తొలగించాలంటూ ఒక ఎంపీ అటవీశాఖ మంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. కాగా బీవీఏ కృష్ణమూర్తిపై వచ్చిన ఫిర్యాదుల అంశాన్ని ఉన్నతాధికారి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా భారీ అవినీతి ఆరోపణలు వచ్చిన విషయం వాస్తవమేనని..అందుకే విచారణకు ఆదేశించామన్నారు. ఈ అభియోగాలపై విచారణ జరిపించి నివేదిక సమర్పించాలని ఐఎఫ్ఎస్ అధికారి శాంతిప్రియ పాండేని ఆదేశించామని చెప్పారు.

పేదలపై నిర్దయ!



- అసైన్డ్ ఇళ్ల స్థలాలపై వారికి 20 ఏళ్ల వరకు ఎలాంటి హక్కులుండవు
- బ్యాంకుల్లో అప్పు తీసుకునే వెసులుబాటూ లేదు
- సర్కారు మాత్రం ఎప్పుడైనా వాటిని లాక్కోవచ్చు
- చుక్కల భూములపైనా సర్కారు పిల్లి మొగ్గలు
- అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ వచ్చాక రెండు ఆర్డినెన్స్‌ల కోసం గవర్నర్‌పై ఒత్తిడి

సాక్షి, అమరావతి: అసైన్డ్ ఇళ్ల స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల పేదలకు 20 ఏళ్ల పాటు ఎలాంటి హక్కులు దక్కటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలను అధికార యంత్రాంగం తీవ్రంగా తప్పుబడుతోంది. పేదలకు ఓ న్యాయం, ఇతరులకు మరో న్యాయం తరహాలో అసైన్డ్ లాండ్స్ (ఇళ్ల స్థలాల) చట్టంలో సవరణలు తేవటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ అసైన్డ్ ఇళ్ల స్థలాల విషయంలో రెండేళ్ల తరువాత ఎవరికైనా విక్రయించుకునే అధికారం కల్పిస్తూ గతంలో ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం గత ఏడాది అక్టోబర్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అసైన్డ్ ఇళ్ల స్థలాలను ఐదేళ్ల తరువాత విక్రయించుకునే అధికారం కల్పించారు. అయితే 20 ఏళ్ల వరకు వీటిని విక్రయాలు / కొనుగోళ్లు /బహుమతి/ లీజు / తనఖా / బదిలీ చేయడం చెల్లదని ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ చట్టానికి సవరణలు తెస్తూ ఇటీవల కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. స్వయంగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే ఈ సవరణలను ప్రతిపాదించినట్లు ముసాయిదా బిల్లులో అధికారులు స్పష్టం చేశారు. అంటే పేదలకు ఇళ్ల స్థలాలను అసైన్డ్ చేసిన తేదీ నుంచి 20 ఏళ్ల వరకు వాటిపై వారికి ఎలాంటి హక్కు ఉండదు. ఇంటి నిర్మాణానికి బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందే వీలు కూడా లేకుండా పేదల చేతులను కట్టేశారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సమావేశాల నోటిఫికేషన్ వచ్చాక ఆర్డినెన్సా?

రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తక్కువ ధరలకే వందల ఎకరాలను కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ భూములపై వారికి సర్వ హక్కులను కట్టబెడుతోంది. కేటాయించిన వెంటనే మూడో పార్టీకి విక్రయించేందుకు కూడా అనుమతి ఇచ్చింది. మరోవైపు క్రీడాకారులు, ఇతర రంగాలకు చెందిన వారికి కేటాయిస్తున్న ఇళ్ల స్థలాలపై ఐదేళ్ల తరువాత సర్వ హక్కులను కల్పిస్తోంది. పేదలపై మాత్రం 20 ఏళ్ల పాటు ఆంక్షలు విధించడం అంటే సమ న్యాయం పాటించడం లేదని స్పష్టమవుతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలాంటి అనాలోచిత చట్టసవరణను వ్యతిరేకించినా స్వయంగా సీఎం ప్రతిపాదించడంతో ఆమోదించాల్సి వచ్చిందని వెల్లడిస్తున్నాయి. ఇది పూర్తిగా పేదలపై కక్ష సాధింపు చర్యేనని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. పేదల అసైన్డ్ స్థలాలను తనఖా పెట్టకుండా నిబంధనలు విధించిన సర్కారు అవసరమైతే ఎప్పుడైనా వాటిని లాక్కునే హక్కు కలిగి ఉందని గుర్తు చేస్తున్నారు. ఈమేరకు చట్టసవరణ బిల్లుకు గవర్నర్ ద్వారా తక్షణం ఆర్డినెన్స్ జారీ చేయించాలని న్యాయ, రెవెన్యూ అధికారులపై సీఎంతో పాటు సీఎంవో తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అయితే ఈనెల 30వతేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించనున్నట్లు గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత ఆర్డినెన్స్‌ను ఆయన ఎలా ఆమోదిస్తారని అధికారులు అంటున్నారు. వెంటనే ఆర్డినెన్స్ జారీ కాకుంటే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ఆ తరువాత ఎన్నికల కోడ్ వెలువడుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వ పెద్దలు హడావుడి చేస్తున్నారని చెబుతున్నారు.

చట్టం, జీవో, మెమోలకు తేడా లేకుండా...

చుక్కల భూములపై కూడా తొలి నుంచి పిల్లిమొగ్గలు వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు చట్ట సవరణ ఆర్డినెన్స్ కోసం ఒత్తిడి చేస్తున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. చట్టం, జీవో, మెమోలకు తారతమ్యం లేకుండా వ్యవహరించడం పట్ల అధికార యంత్రాంగం విస్తుపోతోంది. ఏడు జిల్లాల్లో పేద, మధ్య తరగతికి చెందిన 15 లక్షల ఎకరాలు చుక్కల భూముల్లో చిక్కుకుపోయాయి. వీటిపై హక్కుల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. 2017లో ఆంధ్రప్రదేశ్ డాటెడ్ ల్యాండ్ (ఆపరేషన్ రీసెటిల్‌మెంట్ రిజిష్టర్) చట్టంలో ప్రభుత్వం సవరణలు తెచ్చింది. 12 ఏళ్ల పాటు ఆ భూమి తమ అనుభవంలో ఉన్నట్లు పత్రం చూపితే గ్రామసభ ద్వారా వారికి దానిపై హక్కులు కల్పించవచ్చని పేర్కొంటూ పలు నిబంధనలు విధించింది. ఈ కమిటీకి కలెక్టర్లను చైర్మన్‌గా నియమించారు. అయితే ఇందులో కొన్ని నిబంధనలు అడ్డంకిగా మారాయని కలెక్టర్లు పేర్కొడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మెమోలు జారీ చేసింది. అయితే చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలను మెమోలు, జీవోల ద్వారా ఎలా సవరించగలమనే కనీస ఆలోచన చేయకుండా ముఖ్యమంత్రి వ్యవహరించారని అధికారులు తప్పుబడుతున్నారు.

చిత్తశుద్ధి లేకుండా ఎన్నికల ముందు హడావుడి..


చుక్కల భూముల సమస్యను పరిష్కరించడం లేదంటూ కలెక్టర్లపై ఇటీవల ముఖ్యమంత్రి మండిపడ్డారు. అయితే చట్ట సవరణ చేయకుండా మెమోలతో వాటిని పరిష్కరించలేమని కలెక్టర్లు స్పష్టం చేశారు. చుక్కల భూముల సమస్య పరిష్కారంపై చిత్తశుద్ధి లేకుండా ఇప్పుడు ఎన్నికల ముందు ఆర్డినెన్స్ జారీ కోసం సీఎం ఒత్తిడి తెస్తున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత గవర్నర్ ఆర్డినెన్స్ ఎలా ఇస్తారని అధికారులు తల పట్టుకుంటున్నారు.

చుక్కల భూములంటే...

ఆంగ్లేయుల కాలంలో పన్నులు చెల్లించని రైతుల భూముల సర్వే నెంబర్లపై ఎర్ర సిరాతో గుర్తు పెట్టేవారు. తరువాత బ్రిటీష్ ప్రభుత్వానికి వారు పన్నులు చెల్లించాక రెగ్యులరైజ్ చేసినప్పటికీ రికార్డుల్లో మాత్రం ఎర్ర సిరా గుర్తు అలాగే ఉండిపోయింది. ఈ భూములను 2014లో టీడీపీ సర్కారు నిషేధిత భూములు 22 ఏ కింద చేర్చింది. చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలంటూ ఏకంగా 92,343 మంది రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో దాదాపు 15 లక్షల ఎకరాలు ఈ వివాదంలో చిక్కుకున్నాయి.

చుక్కల భూములపై నాకే చుక్కలు చూపిస్తున్నారు..

- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: చుక్కల భూముల విషయంలో అధికారులు బుక్ నాలెడ్జ్‌ను అనుసరించడం వల్లే ఇన్నాళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం సచివాలయం నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ చుక్కల భూముల విషయంలో గుంటూరు కలెక్టర్ అనుసరించిన విధానాన్నే మిగిలిన జిల్లాల కలెక్టర్లు అనుసరించాలని సూచించారు. కృష్ణా జిల్లాలో అనుసరించిన డిజిటలైజేషన్ విధానాన్ని అసోం సచివాలయంలో అమలు చేస్తున్నారని తెలిపారు. సాంకేతిక సమస్యలతో లేనిపోని ఇబ్బందుల్ని సృష్టించకుండా సరళమైన విధానాలతో సమస్యను పరిష్కరించాలన్నారు. చుక్కల భూముల విషయంలో నాకే చుక్కలు చూపిస్తున్నారంటూ సీఎం వ్యాఖ్యానించారు. దీనిపై అధికారులు, సీఎం మధ్య వాదోపవాదాలు సాగాయి. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం పథకాల్లో గుడ్లు సరఫరా చేయక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రవాణా వ్యయంతో పాటు కొన్ని నిబంధనలు విధించడంతో గుడ్ల సరఫరాకు ముందుకు రావడం లేదని కలెక్టర్లు సీఎంకు వివరించారు. దీనిపై సీఎస్‌తో సంప్రదించి ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఒకే రోజు 4 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రకృతి సేద్యంపై దావోస్‌లో చర్చ

ఏపీలో చేపట్టిన ప్రకృతి సేద్యంపై దావోస్‌లో చర్చ జరిగిందని చంద్రబాబు చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను వచ్చే నెల 2లోపు పరిష్కరించాలన్నారు. పెథాయ్ తుపాన్ నష్టం పరిశీలనకు ఈ నెల 31, వచ్చే నెల 1 వ తేదీల్లో కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటిస్తోందని, అందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ నిధులను కేంద్రం విడుదల చేయడంలేదని మంత్రి లోకేశ్ పేర్కొనడంపై సీఎం స్పందిస్తూ అవసరమైతే ఢిల్లీ వెళ్లి ధర్నా చేయాలని, పార్లమెంట్‌లో ప్రస్తావించాలని, అవసరమైతే న్యాయస్థానాకి వెళ్లాలన్నారు. అధికారులు ఢిల్లీకి వెళ్లి ఒత్తిడి తేవాలని ఆదేశించారు. వచ్చే నెల 1న హోదా సాధన సమితి చేపట్టిన రాష్ట్ర బంద్‌కు పరోక్ష మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు.

మళ్లీ పారిశుధ్య కార్మికుల పోరుబాట

నేడు మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా

సాక్షి, అమరావతి: లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి పోరాటం చేసేందుకు మున్సిపల్ కార్మికులు సిద్ధమవుతున్నారు. దశల వారీగా ఆందోళనను ఉధృతం చేసేందుకు నిర్ణయించారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే తమ సమస్యలు ఇప్పట్లో పరిష్కారమయ్యే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 29న రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఫిబ్రవరి నుంచి నిరవధిక సమ్మెను చేపట్టే ఆలోచనలో ఉన్నామని, ఒకటి రెండు రోజుల్లో కార్యాచరణ వెల్లడిస్తామన్నారు. ఎన్నికలు సమీపిస్తుడటంతో అన్ని వర్గాలకు వరాల జల్లు కురిపిస్తున్న సీఎం.. పబ్లిక్ హెల్త్ విభాగంలోని కార్మికులు, పాఠశాలల్లోని స్వీపర్లు, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులను నిర్లక్ష్యం చేస్తుండడంపై వారు మండిపడుతున్నారు.

ఆ పిటిషన్లను ఏపీకి బదిలీ చేయండి

తెలంగాణ సీజేకు ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం లేఖ

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు ఏర్పడే నాటికి దాఖలైన అప్పీళ్లు, కోర్టు ధిక్కార పిటిషన్లు, పునః సమీక్షా పిటిషన్లపై విచారణ జరిపే పరిధి ఉమ్మడి హైకోర్టుకు ఉందంటూ ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 40(3) చెబుతోందని, దీని వల్ల ఏపీ హైకోర్టు న్యాయవాదులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, కాబట్టి ఈ వ్యవహారంపై న్యాయపరంగా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసింది. ఈ లేఖను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి దానిని ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణించారు. ఈ వ్యాజ్యంపై సోమవారం సీజే జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఇందులో కొన్ని కీలక అంశాలు ముడిపడి ఉన్నందున దీనిపై విస్తృత ధర్మాసనం విచారించడం మేలన్న అభిప్రాయానికి వచ్చింది.

బయో వ్యర్థాలన్నీ మురుగు కాలువల్లోకి

- పెద్దాసుపత్రుల్లో సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు కరువు
- దీంతో హెపటైటిస్ జబ్బుల బారిన పడుతున్న ప్రజలు
- కాలుష్య నియంత్రణ మండలి చర్యలు శూన్యం
- కనీసం తనిఖీలు కూడా నిర్వహించని వైనం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి బయో వ్యర్థాలను (ద్రవ వ్యర్థాలు) నేరుగా మురుగు కాలువల్లోకి వదులుతున్నారు. దీంతో ప్రజలు హెపటైటిస్ బారిన పడుతున్నారు. పెద్దాసుపత్రుల్లోనే పరిస్థితి ఇలా ఉందంటే ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 11 బోధనాసుపత్రులు, 8 జిల్లా ఆస్పత్రులు, 31 ఏరియా ఆస్పత్రులు ఉండగా.. కేవలం మూడు ఆస్పత్రుల్లోనే సీవరేజీ ట్రీట్‌మెంటు ప్లాంట్లు ఉన్నాయి. మిగిలిన ఆస్పత్రుల్లో నీటిశుద్ధి ప్లాంట్లు లేవు. దశాబ్దాల చరిత్ర కలిగిన కింగ్‌జార్జి ఆస్పత్రి, గుంటూరు, కర్నూలు, కాకినాడ రంగరాయ వంటి పెద్ద ఆస్పత్రుల్లోనూ సీవరేజీ ట్రీట్‌మెంట్లు లేకపోవడంతో ఆపరేషన్ థియేటర్ల నుంచి వచ్చే ద్రవ వ్యర్థాలు, ప్రసూతి వార్డుల్లో వెలువడే వ్యర్థాలను నేరుగా మున్సిపాలిటీ మురుగు కాలవల్లోకి వదులుతున్నారు. దీని వల్ల ప్రజలకు భయంకరమైన వ్యాధులు వస్తున్నట్టు వైద్యులు తెలిపారు. గత కొంతకాలంగా కాలేయ వ్యాధులు, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి వంటి వ్యాధులు తీవ్రంగా పెరిగినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా హెపటైటిస్ జబ్బులతో చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. అయినా ఈ వ్యర్థాలను నియంత్రించే వారే కరువయ్యారు

కాలుష్య నియంత్రణ మండలి ఏదీ?

ఆస్పత్రుల నుంచి వెలువడే వ్యర్థాలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నియంత్రించాలి. అయితే ఈ మేరకు చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కాలుష్య నియంత్రణ మండలిలో కమిషన్లు తీసుకుంటూ తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నచ్చిన సంస్థ, ఆస్పత్రి అయితే వ్యర్థాలను శుద్ధి చేయకపోయినా ఎలాంటి చర్యలూ ఉండవు. అదే కమీషన్లు ఇవ్వకపోతే ఆయా ఆస్పత్రి యాజమాన్యాలకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు.

మాకు మినహాయింపు ఇవ్వండి..

కొన్ని అనుమతుల విషయంలో తమకు మినహాయింపు ఇవ్వాలని వైద్య విద్యా సంచాలకులు తాజాగా ప్రభుత్వానికి లేఖ రాశారు. వైద్య విద్యా శాఖ పరిధిలోని 15 ఆస్పత్రులకు భవన అనుమతులు, ఆస్పత్రి రిజిస్ట్రేషన్ విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ ఆస్పత్రులు ఎప్పుడో యాభై ఏళ్ల క్రితం నిర్మించినవని, వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు లేవని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ఏబీహెచ్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్) సమీక్ష జరుగుతోందని, ఈ నేపథ్యంలో అనుమతుల విషయంలో మినహాయింపు ఇవ్వాలని వైద్య విద్యా సంచాలకులు కోరారు.

దగ్గుబాటి, లక్ష్మీపార్వతి అవకాశవాదం వల్లే ఎన్టీఆర్‌కు అప్రతిష్ట

టీడీపీ నాయకులతో చంద్రబాబు

సాక్షి, అమరావతి: అధికారం కోసమే దగ్గుబాటి కుటుంబం వైఎస్సార్ సీపీలో చేరిందని, దగ్గుబాటి మారని పార్టీలు లేవని సీఎం చంద్రబాబునాయుడు విమర్శించారు. అధికారం కోసమే లక్ష్మీపార్వతి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కయిందన్నారు. వీరి అవకాశవాదం వల్లే నాడు ఎన్టీఆర్‌కు అప్రతిష్ట వచ్చిందని ఆరోపించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సోమవారం ఆయన టీడీపీ నాయకులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. దగ్గుబాటి ఆర్ఎస్ఎస్ మొదలు అన్ని పార్టీల చుట్టూ ప్రదక్షిణలు చేశారని, బీజేపీ, కాంగ్రెస్, బీజేపీ ఇప్పుడు వైఎస్సార్ సీపీ అని విమర్శించారు. బీసీలకిచ్చిన హామీలన్నింటినీ ఫ్లెక్సీలతో ప్రచారం చేయాలని, ఈ వారం రోజులు దీనిపైనే ఉధృతంగా పని చేయాలని సీఎం టీడీపీ శ్రేణులకు సూచించారు. కాపుల రిజర్వేషన్లు చరిత్రాత్మక నిర్ణయమని, కాపుల రిజర్వేషన్లను గతంలో వైఎస్ వ్యతిరేకించారని చెప్పారు.

30న అఖిలపక్ష సమావేశం

- అన్ని పార్టీలను అహ్వానించాలని టీడీపీ నిర్ణయం
- గతంలో నిర్వహించిన సమావేశాలకు స్పందన శూన్యం
- ఎన్నికల వేళ హడావుడి కోసమే తాజా సమావేశం

సాక్షి, అమరావతి: ఈ నెల 30న అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి టీడీపీ సిద్ధమైంది. 29న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో టీడీపీ కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. విభజన సమస్యలు, కేంద్రంపై పోరాటానికి మద్దతివ్వాలని కోరే పేరుతో ఈ సమావేశం నిర్వహించాలని చంద్రబాబు నిర్ణయించినట్లు సమాచారం. కలెక్టర్ల సమావేశం తర్వాత సోమవారం ఆయన సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, ముఖ్యనాయకులతో పలు అంశాలపై చర్చించారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ నిర్వహించే అఖిలపక్ష సమావేశానికి టీడీపీ తరపున మంత్రి నక్కా ఆనంద్‌బాబు, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌ను పంపుదామని చెప్పిన చంద్రబాబు.. స్వయంగా తాము కూడా అఖిలపక్ష సమావేశం పెడదామని చెప్పినట్లు తెలిసింది. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఢిల్లీలో దీక్ష చేసేందుకు సిద్ధమైన నేపథ్యంలో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే పేరుతో ఈ సమావేశం నిర్వహిద్దామని చెప్పినట్లు సమాచారం. మంగళవారం ఫోన్ల ద్వారా ఆయా పార్టీల నాయకులకు సమాచారం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. నాలుగేళ్ల అధికారాన్ని అనుభవించి రాజకీయ అవసరాల కోసం బయటకు వచ్చి పోరాటం చేస్తున్నామంటే ఎలా నమ్ముతామని.. ఇదివరకు రెండు మార్లు నిర్వహించిన అఖిలపక్ష సమావేశాలను ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ బహిష్కరించగా, వామపక్ష పార్టీలు కలిసి పని చేయలేమని తేల్చి చెప్పాయి. జనసేన కూడా హాజరు కాలేదు. చిన్నాచితకా పార్టీలతోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించినా ఎటువంటి ఫలితం తేలేకపోయారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మళ్లీ ఏదో ఒక హడావుడి చేసేందుకు అఖిలపక్షం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, అఖిలపక్ష సమావేశం నేపథ్యంలో 30న నిర్వహించాల్సిన మంత్రివర్గ సమావేశాన్ని 31కి వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కానిస్టేబుల్ అభ్యర్థులు స్టేజ్-2 అప్లికేషన్ పెట్టుకోండి

సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్, వార్డర్ పోస్టులకు ప్రిమినరీలో క్వాలిఫై అయిన 1,09,106 మంది అభ్యర్థులు స్టేజ్-2 ఆన్‌లైన్ అప్లికేషన్ చేసుకోవాలని ఏపీ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం (ఈ నెల 28) నుంచి ఫిబ్రవరి 4 వ తేదీ వరకు 'ఎస్ఎల్‌పిఆర్‌బి.ఎపి.జిఒవి.ఐఎన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పూర్తిచేసిన ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రింట్ తీసుకుని పీఈటీ పరీక్షకు హాజరు కావాలని, అది లేకుంటే అనుమతించబోమని బోర్డు స్పష్టం చేసింది.

బీఎస్సీ నర్సింగ్ ఫలితాలు విడుదల

విజయవాడ సిటీ: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నవంబరు/డిసెంబరులో నిర్వహించిన బీఎస్సీ నర్సింగ్ (నాలుగేళ్లు), పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ (రెండేళ్లు) కోర్సుల పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేసింది. విద్యార్థులు తమ మార్కుల రీటోటలింగ్‌కు ఫిబ్రవరి 4లోగా సబ్జెక్టుకు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి భీమేశ్వర్ తెలిపారు. ఫలితాలు వర్సిటీ http://ntruhs.ap.nic.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

ఏఆర్ ఏఎస్పీల సీనియారిటీ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆర్ముడు రిజర్వ్(ఏఆర్) విభాగంలో 22 మంది ఏఎస్పీల సీనియారిటీ జాబితాను ప్రభుత్వం సోమవారం ఖరారు చేసింది. సీనియారిటీ జాబితా ప్రకారం ఎస్.చిట్టియ్య(కృష్ణా), ఐ.వెంకటేష్(చిత్తూరు), ఎం.రాజశేఖర్(పశ్చిమగోదావరి),యు.రాంమోహన్‌రావు(కర్నూలు), ఎన్.చంద్రమౌళి(కడప), ఎంకే రాధాకృష్ణ(చిత్తూరు), కె.శ్రీనివాసరావు(కర్నూలు), ఇ.శ్రీనివాస్(తూర్పుగోదావరి), కేఎస్ భాస్కర్‌రెడ్డి(తూర్పుగోదావరి), టి.శివారెడ్డి(గుంటూరు), ఎస్.వీరభద్రుడు(కర్నూలు), ఎం.మహేష్‌కుమార్(చిత్తూరు), టి.ఆనందబాబు(గుంటూరు), వీఎస్ ప్రభాకర్‌రావు(విజయనగరం), బి.రామకృష్ణ(విశాఖపట్నం), కె.సుబ్రమణ్యం(చిత్తూరు), ఆర్.వృషికేశవరెడ్డి(చిత్తూరు), డి.రామచంద్రరాజు(విశాఖపట్నం), జి.నాగబాబు(గుంటూరు), ఎస్‌వీడీ ప్రసాద్ (పశ్చిమగోదావరి), బి.డెల్లి(చిత్తూరు), ఎ.జోషి(కృష్ణా) ఉన్నారు.

చంద్రబాబుని కొట్టబోయిన చెన్నారెడ్డి

- మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు వెల్లడి
- చంద్రబాబు కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు కమ్మ, రెడ్డి అంటూ ముఠాలు కట్టేవారు



అన్నవరం (ప్రత్తిపాడు): సీఎం చంద్రబాబు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కమ్మ, రెడ్డి అంటూ ముఠాలు కడుతున్నాడని ఆగ్రహించి అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి ఆయన చేతిలో ఉన్న స్టిక్‌తో చంద్రబాబుని కొట్టబోయారని మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో సోమవారం నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ నాటి ఉదంతాన్ని వివరించారు. చంద్రబాబుని అందరిలో చెన్నారెడ్డి కొట్టబోవడంతో ఏమి జరిగిందో ఎవరికీ అర్థం కాలేదన్నారు. ఆ తర్వాత తాను చెన్నారెడ్డి వద్దకు వెళ్లి ఎందుకు కొట్టబోయారని అడిగితే 'పార్టీలో ముఠాలు కడుతున్నాడు, చంద్రబాబుని ఎవరూ చేరదీయకండి' అని చెప్పారన్నారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో చంద్రబాబు దొంగతనం చేసినట్లు కేసు ఉందని 'యూట్యూబ్ ఇంటర్వ్యూలో మీరు చెప్పింది వాస్తవమేనా' అని ప్రశ్నించగా నిజమేనన్నారు. ఇటీవల కొన్ని టీవీ చానెల్స్‌లో ఎన్టీఆర్ గురించి తాను చెప్పిన విషయాలన్నీ వాస్తవాలేనని, వాటన్నింటికీ తాను కట్టుబడి ఉన్నానని నాదెండ్ల స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడిని తానేనని తేల్చిచెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకు తన మంత్రి పదవిని ఎన్టీఆర్ తీసేస్తే ఆయన సీఎం పదవిని తాను తీసేశానని తెలిపారు. ఈ విషయంలో తనపై 30 ఏళ్లుగా చెడుగా ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో అధికార మార్పిడి జరగాలని, లేకుంటే ప్రజలు ఇబ్బంది పడతారని చెప్పారు.

అమరావతిలో జర్నలిస్టులకు 30 ఎకరాలు

సాక్షి, అమరావతి: కొత్త రాజధాని అమరావతిలో జర్నలిస్టుల ఫ్లాట్‌ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం 30 ఎకరాలను కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి అక్రిడేటెడ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కు ఈ భూమిని కేటాయిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ ఉత్తర్వులిచ్చారు. జర్నలిస్టుల ఫ్లాట్‌లకు విధివిధానాలను పేర్కొన్నారు. ఎకరాకు రూ.25 లక్షల చొప్పున సొసైటీకి భూమిని కేటాయించారు. కేపిటల్ సిటీ(అమరావతి) పరిధిలో సొసైటీ సభ్యులకుగానీ, భార్యా, పిల్లలకు సొంతంగా ఇల్లు, స్థలంగానీ ఉండకూడదనే నిబంధన విధించారు. సభ్యులు అమరావతి పరిధిలో తనకు, కుటుంబీకులకు స్థలం, ఇల్లు లేదని అఫిడవిట్ ఇవ్వాలి. వాస్తవాలకు విరుద్ధంగా సభ్యులెవరైనా అఫిడవిట్ ఇస్తే, కేటాయించిన ఫ్లాట్‌ను రద్దుచేయడమే కాకుండా సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

బొల్లినేని అరెస్టుకు గ్రీన్‌సిగ్నల్

- మహారాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల్లో శ్రీనివాస, ఇతర కంపెనీల అక్రమాల నేపథ్యం
- అడ్డగోలుగా అంచనాలు పెంచేసి రూ.20 వేల కోట్లు దోచుకున్నారనే ఆరోపణలు
- గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కొట్టేసిన అక్కడి హైకోర్టు
- మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతితో అరెస్టుకు నాగపూర్ ఏసీబీ సిద్ధం
- ధ్రువీకరించిన నాగపూర్ ఏసీబీ డీఎస్పీ ఎంఎస్ టోత్రే
- ఉదయగిరి ఎమ్మెల్యేపై మహారాష్ట్రలో 8 కేసులు, ఉత్తరప్రదేశ్‌లో ఒక కేసు


సాక్షి, నెల్లూరు: మహారాష్ట్రలో ఎత్తిపోతల పథకాల ప్రాజెక్టుల అంచనాలు పెంచి రూ.20 వేల కోట్ల దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావును అరెస్టు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో నాగపూర్ ఏసీబీ అధికారులు పలు కేసులు నమోదు చేసి విచారణ జరిపిన విషయం తెలిసిందే. అయితే అక్కడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో అరెస్ట్ చేయకుండా ఆగిపోయారు. తాజాగా హైకోర్టు ఆ ఉత్తర్వులు కొట్టి వేయడంతో బొల్లినేని అరెస్టుకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ విషయమై నాగపూర్ ఏసీబీ డీఎస్పీ ఎంఎస్ టోత్రేను 'సాక్షి' ప్రతినిధి వివరణ కోరగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది వాస్తవమేనని త్వరలో అరెస్ట్ చేస్తామని చెప్పారు. మరోవైపు నాగపూర్ క్రైం బ్రాంచ్ పోలీసులు కూడా మరో కేసులో ఎమ్మెల్యేని అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

దోపిడీ ఇలా..

బొల్లినేనికి చెందిన శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కంపెనీ తన అనుబంధ పి.బలరామ్ కంపెనీతో కలసి విదర్భ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (వీఐడీసీ) పరిధిలో నెర్ల (పగోరా)ఎత్తిపోతల పథకం, గోద్రాజ్ బ్రాంచ్ కెనాల్ ఎర్త్‌వర్క్ -కవర్ వర్క్ పనులు తదితర మొత్తం 35 సాగునీటి ప్రాజెక్టులు చేపట్టింది. రూ.6,672 కోట్ల వ్యయంతో పూర్తి చేయాల్సిన ఈ పనులను స్థానిక అధికారుల సహకారంతో రూ.26,722 కోట్ల వరకు అంచనాలు పెంచినట్లు అక్కడి ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ భారీ కుంభకోణంలో ప్రధాన సూత్రధారులు బొల్లినేని రామారావు, శ్రీనివాసులురెడ్డిపై మహారాష్ట్రలో 8 కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. నాగపూర్ ఏసీబీ అధికారులు రెండేళ్ల క్రితమే రెండు కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నంబర్ 203/17తో సెక్షన్లు 420,415,120 బీ, 13/1సీ కింద నమోదు చేశారు. అప్పట్లో 15 బృందాలుగా ఏర్పడిన ఏసీబీ అధికారులు ఎమ్మెల్యే బొల్లినేనితో పాటు ఆయన బినామీ కంపెనీల్లో వారి నివాసాల్లో సోదాలు జరిపి కీలక ఫైళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎమ్మెల్యే బాధితులు చంద్రశేఖర్, ఎన్‌వీ రామారావుల ఫిర్యాదు మేరకు నాగపూర్ క్రైంబ్రాంచ్ పోలీసులు నమోదు చేసిన మరో రెండు కేసులతో కలిపి మొత్తం 8 కేసులు ఉన్నట్టు సమాచారం. అలాగే ఉత్తరప్రదేశ్‌లో యూనియన్ బ్యాంకును నకిలీ బ్యాంక్ గ్యారంటీలతో బురిడీ కొట్టించడంపై కూడా కేసు నమోదయింది. ఆ కేసులో ఎమ్మెల్యే బొల్లినేనితో పాటు ఆయన సతీమణి, కుమారుడు కూడా నిందితులుగా ఉన్నారు. మహారాష్ట్రలో నమోదైన కేసుల్లో మాత్రం అరెస్ట్ చేయకుండా హైకోర్టు నుంచి ముందస్తు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అరెస్టు నిలిచిపోయింది. తాజాగా హైకోర్టు ఆ ఉత్తర్వులు కొట్టివేయడంతో బొల్లినేని అరెస్టుకు నాగపూర్ ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు.

రూ.100 కోట్ల ఆదాయ పన్ను ఎగవేత

వీఐడీసీలో చోటు చేసుకున్న అవినీతిపై ప్రధాని నరేంద్రమోదీ కార్యాలయంతో పాటు ఆదాయ పన్నుశాఖ అధికారులకు బాధితులు గతేడాది ఫిర్యాదు చేశారు. ఆదాయ పన్నుకు సంబంధించి దాదాపు రూ.100 కోట్ల వరకు ఎగవేసినట్లు పలు ఆధారాలు సైతం ఆదాయపన్ను శాఖకు సమర్పించినట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రాజెక్టుల పేరిట తన కంపెనీల ద్వారా నాగపూర్‌లోని పలు బ్యాంకుల నుంచి దాదాపు రూ.450 కోట్లకుపైగా రుణాలు బొల్లినేని పొందినట్లు తెలుస్తోంది. ఆ రుణాలకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం చెల్లింపులు చేయకపోవడంతో ఆయా బ్యాంకర్లు కూడా త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం.



ఆదాయపు పన్ను శాఖకు ఫిర్యాదు చేసిన పత్రాలు

సబ్ కాంట్రాక్టర్లకు రూ.209 కోట్లు ఎగనామం

ఎమ్మెల్యే బొల్లినేని పలు ప్రాజెక్టుల్లో సబ్ కాంట్రాక్టులు ఇచ్చి ఆయా పనుల బిల్లులు పూర్తి స్థాయిలో తీసుకుని సబ్ కాంట్రాక్టర్లకు మాత్రం ఇవ్వకుండా ఎగనామం పెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఎన్‌వీ రామారావు, బెజవాడ గోవిందరెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరరావు, వైష్ణవి కన్‌స్ట్రక్షన్, బొల్లినేని శ్రీనివాసులు తదితర కాంట్రాక్టర్లకు దాదాపు రూ.200 కోట్ల బిల్లులు ఇవ్వలేదని తెలుస్తోంది.

అలాగే ఉదయగిరి నియోజకవర్గంలో 280 చెక్ డ్యామ్‌ల పనులకు సంబంధించి పనులు పూర్తయినా దాదాపు రూ.9 కోట్ల వరకు బిల్లులు నిలిపేసి బొక్కేయడంతో టీడీపీకే చెందిన వారితో పాటు దాదాపు 15 మంది సబ్ కాంట్రాక్టర్లు ఎమ్మెల్యే చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. టీడీపీ నేతలు ఇటీవల చంద్రబాబు వద్ద పంచాయితీ పెట్టారు. బిల్లులు వచ్చినా పలు కారణాలతో దాదాపు రూ.9 కోట్ల వరకు ఇవ్వకుండా తిప్పుకుంటున్న వైనంపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సాక్షి
మంగళవారం, జనవరి, 29

అమెరికా దుందుడుకుతనం

అధ్యక్ష ఎన్నికల్లో రష్యాతో చేతులు కలిపి అడ్డదారులు తొక్కారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ దాన్నుంచి దేశ ప్రజల దృష్టి మళ్లించడానికి వెనిజులాలో చిచ్చు రగిలిస్తున్నారు. నిరుడు మే నెలలో అక్కడ జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపాలైన విపక్షాన్ని ప్రోత్స హించి ఉద్యమాలతో ఆ దేశంలో అశాంతి సృష్టిస్తున్నారు. గత కొన్నిరోజులుగా వెనిజులా నిరసన లతో, సమ్మెలతో అట్టుడుకుతోంది. ప్రస్తుత దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను ఎలాగైనా గద్దె దించా లన్నది అమెరికా లక్ష్యం. దీనికి యూరప్ యూనియన్(ఈయూ)లోని ప్రధాన దేశాలైన బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లు వత్తాసు పలుకుతున్నాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న జువాన్ గైదో తనను తాను దేశాధ్యక్షుడిగా ప్రకటించుకోగా, ఆయన్ను గుర్తిస్తున్నట్టు ట్రంప్ ఆదరా బాదరాగా ప్రకటించారు. పైగా సైనిక దాడులకు దిగుతామని బెదిరిస్తున్నారు. అయితే ఈయూ దేశాలు మాత్రం తాము అమెరికా తోక పట్టుకుని పోవడం లేదని చెప్పడానికన్నట్టు వేరే పల్లవి అందుకున్నాయి. ఎనిమిది రోజుల్లో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించాలని మదురోకు షరతు విధిం చాయి. అందుకు సిద్ధపడకపోతే గైదోను దేశాధ్యక్షుడిగా తాము కూడా గుర్తిస్తామని హెచ్చరిం చాయి. అసలు వేరే దేశంలో ఎవరు అధ్యక్షుడిగా ఉండాలో, ఎవరు ఉండకూడదో చెప్పడానికి వీరె వరు? వెనిజులా ప్రజలు తమను ఎవరు పాలించాలో తేల్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారా? అక్కడ నియంతృత్వం రాజ్యమేలుతోందా? తాజా సంక్షోభంలో తాము మదురోకు అండగా నిలు స్తామని రష్యా, చైనా ప్రకటించాయి. మన దేశం కూడా వెనిజులా సమస్యల్ని అక్కడి ప్రజలే పరిష్క రించుకోవాలని సూచించింది. గైదోను గుర్తించేందుకు నిరాకరించింది.

వెనిజులాపై అమెరికా, పాశ్చాత్య దేశాల కడుపు మంట ఈనాటిది కాదు. అక్కడ అపారమైన చమురు, సహజవాయు నిక్షేపాలున్నాయి. అక్కడి భూగర్భంలో పసిడి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. అపురూపమైన వజ్రాలకు అది పెట్టింది పేరు. ఇంత సంపద ఉన్నప్పుడు ఎవరికైనా కన్నుకుట్టడం సహజం. పైగా ఆ దేశంలో వరసగా వచ్చిన ప్రభుత్వాలను గుప్పెట్లో పెట్టుకుని, అక్కడి సంపదను కొల్లగొట్టడం అలవాటు చేసుకున్న అగ్రరాజ్యాలకు 1999లో మొదటిసారి హ్యూగో చావెజ్ రూపంలో పెను సవాలు ఎదురైంది. ఆ దేశంలో రెండు ప్రధాన పార్టీలు ఎప్పుడూ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటూ... ఒకరి తర్వాత మరొకరు పీఠం ఎక్కుతూ సహజ వనరులను బహుళజాతి సంస్థలకు దోచిపెడుతున్న తరుణంలో చావెజ్ ఆ రెండు పార్టీలకూ వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించాడు. 19వ శతాబ్దిలో స్పెయిన్ వలస దేశాలను ఏకం చేసిన వెని జులా జాతీయ యోధుడు సైమన్ బొలివర్‌ను ఆదర్శంగా తీసుకుని కుమ్మక్కు రాజకీయాలపై కత్తి దూశాడు. 1999 అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించి మొదలుకొని 2013లో మరణించేవ రకూ అధికారంలో కొనసాగారు. కేన్సర్ వ్యాధితో అంతిమ దశలో ఉండగా తన వారసుడిగా మదు రోను ప్రకటించారు. అదే ఆయనకు బలంగా మారింది. పాలనా సామర్థ్యంలో చావెజ్‌తో సరి తూగ కపోయినా... అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గాక ఇబ్బందులు తలెత్తినా ఉన్నం తలో మదురో మెరుగైన పాలనే అందించారు. అందుకే 2015లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో సైతం ఆయనే విజయం సాధించారు. వాస్తవానికి తదుపరి ఎన్నికలు ఈ ఏడాది చివరిలో జరగాల్సి ఉంది. కానీ విపక్షాల డిమాండ్‌కు తలొగ్గి నిరుడు మే నెలలో... అంటే 19 నెలల ముందు అధ్యక్ష ఎన్నికలు జరి పారు. ఆ ఎన్నికల్లో 67.84 శాతం ఓట్లు సాధించారు. అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని వివిధ దేశాల నుంచి పరిశీలకులుగా వచ్చిన 150మంది సంతృప్తి వ్యక్తం చేశారు. అందులో 8 దేశా లకు చెందిన 14మంది ఎన్నికల అధికారులు, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. పైగా వెనిజులా ఎన్ని కల ప్రక్రియ అత్యంత పకడ్బందీగా ఉంటుంది. ఎన్నికలకు ముందు... అవి కొనసాగుతుండగా... పూర్తయ్యాక– ఇలా మూడు దఫాలుగా 18సార్లు ఈవీఎంలను తనిఖీ చేసే ప్రక్రియ తప్పనిసరి. ఇందులో యాదృచ్ఛికంగా ఎంపిక చేసే 53శాతం ఈవీఎంలను పరీక్షిస్తారు. ఈ ప్రక్రియనంతటినీ టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. దొంగ ఓట్లకు అక్కడ ఆస్కారం ఉండదు. ఓటరు వేలిముద్రే అతడి/ఆమె గుర్తింపు కార్డు. అన్నిటికన్నా ముఖ్యమేమంటే... మదురో ప్రత్యర్థులెవరూ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించలేదు. 2015 పార్లమెంటరీ ఎన్నికల్లో మదురో పార్టీ కాకుండా, విపక్షాలే అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్నాయి. నిజంగా అక్రమాలకు ఆస్కారం ఉంటే అది అసాధ్యమయ్యేది.


వెనిజులా ఒడిదుడుకుల్లో ఉన్నమాట వాస్తవమే. కానీ ఆ ఒడిదుడుకులన్నీ అమెరికా ప్రాప కంతో సాగుతున్న దిగ్బంధం పర్యవసానంగా, చమురు ధరల కుంగుబాటు కారణంగా ఏర్పడ్డాయి. ఒబామా హయాంలో మొదలైన ఆంక్షలు ట్రంప్ వచ్చాక మరింత పెరిగాయి. వీటి విలువ దాదాపు 600 కోట్ల డాలర్లు. ఇవిగాక వెనిజులాకు దక్కాల్సిన చమురు సంస్థ లాభాలు 100 కోట్లను బదిలీ కాకుండా అమెరికా అడ్డగించింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో వెనిజులాకు ఉన్న 120 కోట్ల డాలర్ల బంగారం నిల్వలు స్తంభింపజేసింది. దేశంలో నిత్యావసరాల కొరత, ఆకాశాన్నంటిన ద్రవ్యోల్బణం సరేసరి. నిజంగా వెనిజులా ప్రజల శ్రేయస్సుపై ఏ కాస్త ఆందోళన ఉన్నా అమెరికా ఇలాంటి దుర్మార్గ చర్యలకు పాల్పడదు. వారిని కష్టాలపాటు చేయదు. తాము సృష్టించి, పెంచుతున్న సంక్షో భానికి మదురోను బాధ్యుడిగా చేసి, ఆయన తప్పుకోవాలనటం అమెరికా వక్రబుద్ధికి తార్కాణం. ప్రజామోదంతో ఎన్నికైన ఒక దేశాధ్యక్షుణ్ణి బెదిరించడం, సైనికచర్యకు దిగుతాననడం దురహం కారం తప్ప మరేం కాదు. ఈ దురహంకారానికి ఇప్పటికే పలు దేశాలు బలయ్యాయి. వెనిజులాలో నెత్తురు పారకుండా, అరాచకం తాండవించకుండా, అస్థిరత దాన్ని చుట్టుముట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రపంచ పౌరులందరిదీ. ఈ విషయంలో మన దేశం వైఖరి హర్షించదగ్గది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి బ.నవమి రా.7.23 వరకు, తదుపరి దశమి నక్షత్రం విశాఖ రా.7.54 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం రా.11.56 నుంచి 1.34 వరకు, దుర్ముహూర్తం ఉ.8.51 నుంచి 11.20 వరకు, తదుపరి రా.10.56 నుంచి 11.47 వరకు అమృతఘడియలు... ప.11.03 నుంచి 12.39 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.50
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

ఇంతింతై.. నాయకుడంతై!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ఓటర్లను రకరకాలుగా బెదిరించి, ప్రత్యర్థి పార్టీలకు మద్దతుదార్లని భావించినవారి ఓట్లు తొలగించి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఇది ఆక్షేపణీయం. 2017–18లో వివిధ పార్టీలకు ముట్టిన నిధుల్లో సగం 'అజ్ఞాత వర్గాల' నుంచి వచ్చిందేనని ఏడీఆర్ నివేదిక చెప్పిందంటేనే మన దేశంలో ఎలాంటి పరిస్థితులు న్నాయో అర్థమవుతుంది. అవినీతిపరులైన రాజకీయవేత్తలు, నేరగాళ్లు, నిరంకుశాధికారవర్గాల అనుబంధం అందరికీ తెలిసిందే. ఆశ్చర్యకరమేమంటే రాజకీయనేతల ఆదాయపన్ను వివరాలు బయటికి పొక్కకుండా పాలకులు అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ స్థితిలో అవినీతి అంతకంతకు విస్తరించడంలో వింతేముంది?

''అవినీతిపరులైన రాజకీయవేత్తలు పదే పదే తిరిగి అధికారంలోకి వస్తూంటారు. గత 30 ఏళ్లుగా మన కళ్లెదుట ఆవిష్కరించుకుంటూ వస్తున్న దృశ్యం ఇదే. బయటకు తెలిసిన ఆదాయ వనరులకు మించిపో యిన సంపద పోగుపడినందుకు విచారణను ఎదుర్కొంటున్న ఎమ్మె ల్యేలు, ఎంపీలే ఎప్పుడూ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తు న్నారు. గత ఐదేళ్ల వ్యవధిలోనే ఒక అభ్యర్థి తన ఆదాయం 1000 శాతం పెరిగినట్టు చూపిన మరుక్షణమే విచారణ ప్రారంభించే యంత్రాంగం రంగంలోకి దిగాలి. దీనికి కారణం పసలేని విచారణ అయినా అయి ఉండాలి లేదా అలా స్వేచ్ఛగా వదిలేయడమైనా అయి ఉండాలి''

– జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఆదేశం *(11.09.2017)*

ఈ సందర్భంగా ఒక బౌద్ధయుగ సూక్తి గుర్తుకొస్తోంది. ఈనాడు 'ధర్మపోరాటం' పేరు చాటున అధర్మ ప్రచారాలకు పాల్పడే పాలకు లున్నట్టే బౌద్ధయుగంలో కూడా 'ధర్మధరుడ'నే పేరిట ఒక అబద్ధా లకోరు, వంచకుడు ఉండేవాడు. 'పేరు ధర్మరాజు, పెను వేపవిత్తయా' అన్నట్టు ఇంతకూ జ్ఞానం ప్రధానమా? వ్యక్తి నడవడిక శీలం ప్రధా నమా? అన్న చర్చ ముందుకు రావడంతో కాశీ రాజు సర్వసాధారణంగా జ్ఞానాన్ని గౌరవించేవాడే అయినా, ఈసారి ఆయన దృష్టి మనిషి శీలంపై పడింది. ధర్మధరుడ్ని అందరూ జ్ఞానిగా భావిస్తున్నందున, ముఖ్యంగా రాజుకు నచ్చిన వాడవడంవల్ల, ఊళ్లో ఉన్న వ్యాపారులు కూడా ధర్మధ రుడి జ్ఞానం మీదనే దృష్టి పెట్టి అతడి అబద్ధాల్ని నమ్మి, అతడి శీలాన్ని పరిగణనలోకి తీసుకోక భంగపడ్డారు. ధర్మధరుడు చివరికి పరుల ఆస్తిని దోచుకునే దొంగగా మారినట్టు వ్యాపారులే కనిపెట్టేశారు. ఈ గుట్టు తెలి యకముందు ధర్మధరుడిని జ్ఞానిగా భ్రమించిన ఒక వజ్రాల వ్యాపారి దుకాణానికే అతడు (ధర్మధరుడు) ఎసరుపెట్టాడు. కొట్టు యజమానితో మాట్లాడుతున్నట్టే నటిస్తూ ధర్మధరుడు నింపాదిగా ఓ వజ్రాన్ని కాస్తా కాజేసి ఉడాయించాడు. ఇలా వరసనే మూడురోజులు ధర్మధరుడు ఈ పనిలోనే ఉన్నాడు. దాంతో వ్యాపారి ఉండబట్టలేక 'జ్ఞాని'గా ఫోజులు పెడుతున్న ధర్మధరుడితో ''ఓరి దొంగ వెధవా, నీ జ్ఞానం తగలబడా ఇన్నాళ్లూ నిన్ను గౌరవించి తప్పు చేశాన''ని అన్నాడట. అతగాడికి నాలుగు తగిలించి మరీ పంపించేశాడట.

అలాగే, సుప్రీంకోర్టు మాజీ సీనియర్ న్యాయమూర్తి చలమేశ్వర్ ధర్మాసనం గడచిన రెండు జనరల్ ఎన్నికల మధ్య అయిదేసి ఏళ్ల వ్యవ ధిలోనే రాజకీయవేత్తల ఆస్తులు పాదరసంలా పాకి ఇంతింతై ఆకాశాన్ని అంటడానికి దారితీస్తున్న కారణాలను శోధించి విచారించవలసిన అవ సరం ఉందని భావించి దేశాన్ని హెచ్చరించి ఉంటుంది. రెండేళ్లనాడు ధర్మాసనం చేసిన ఈ హెచ్చరికకు దేశంలోని శాసనకర్తలు (ఆంధ్రప్రదేశ్ సహా) ఈ రెండేళ్లలోనూ ఎంత 'విలువ' ఇచ్చారో, ఇస్తున్నారో ఈ వంచ కుల్ని భరిస్తున్న దేశ ప్రజా బాహుళ్యానికి తెలుసు. ఇలాంటివారిని చూసే నీగ్రోల విమోచన ప్రదాత, అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ''దుర్దశ, ఇబ్బంది, ఆపద అనేవి దాదాపు మనుషులందరికీ వచ్చేవే. కానీ మనిషి వ్యక్తిత్వాన్ని గుణగణాలను పరీక్షించాలంటే అతడికి అధి కారం కట్టబెట్టి చూడండి, అతని అసలు సరుకేదో తెలిసిపోతుంది'' అన్నాడు. పాలకుడి ఆలోచనలోనే, దృక్పథంలోనే బలహీనత ఉంటే, అతడి వ్యక్తిత్వమూ (క్యారెక్టర్) అలాగే తయారవుతుందని ఐన్‌స్టీన్

రెండో మాట



స్పష్టం చేశాడు. ఈ వ్యక్తిత్వ వికాసం మన కేంద్ర, రాష్ట్ర పాలకుల్లో (పార్టీ బ్రాండ్ ఏదైనా) సొంత సంపదను మేట వేసుకోడానికి ఉపయోగపడినం తగా రిపబ్లిక్ రాజ్యాంగ నిర్దేశాలను అనుసరించడానికి తోడ్పడటం లేదు. సుప్రీం ధర్మాసనం చెప్పడమే కాదు, 1993లోనే కేంద్ర హోంశాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎన్. వోహ్రా అధ్యక్షతన ఏర్పడిన కమిటీ దేశంలో 'రాజకీయ వ్యవస్థ నేరమయమైపోయింది, రాజకీయవేత్తలు, నేరగాళ్లు (క్రిమినల్స్), అధికారగణాల (బ్యూరాక్రాట్) మధ్య పీటముడి ఏర్పడి పనిచేస్తోందని నిశితమైన వ్యాఖ్య చేసిందని మరచిపోరాదు. ఈ 'పీటముడి' బాగా బిగిసిపోయి ఉన్నందుననే రాజకీయుల ఆదాయపు పన్ను వివరాలను బహిరంగంగా తెలపరాదన్న నిబంధన వచ్చింది, చివరికి సమాచార హక్కు చట్టం కింద కూడా ఏ వివరాలూ వెల్ల డించరాదన్న నిబంధనను కేంద్రం విధించింది.

ప్రజా సేవకులమని విర్రవీగుతున్న వందలాదిమంది శాసనకర్తల వద్ద 'లెక్కకు అందకుండా మేట వేసుకుంటున్న సంపద వివరాల'ను ఎందుకు ప్రజా బాహుళ్యానికి తెలపకుండా దాచవలసి వస్తోందో ప్రజలు తెలుసుకోగోరుతున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయినా జవాబులేదు. పైగా తాజా నివేదికలో 'ప్రజాస్వామ్య సంస్కరణల అమ లుకు' ఉద్దేశించిన సంస్థ (ఏడీఆర్) 2017–18 ఆర్థిక సంవత్సరంలోనే జాతీయ పార్టీలకు అందిన నిధులలో 50 శాతం పైగా 'అజ్ఞాత వర్గాల' నుంచి ముట్టాయని ప్రకటించింది. ఇలా ప్రజలకు తెలియని వేలకోట్ల నిధులు అందుకున్నవాటిలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, టీఎంసీ, ఎన్సీపీ ఉన్నాయి. అధికార దుర్వినియోగం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను 'అప్పుల కుప్ప'గా మార్చి, దివాళా దశకు నెట్టిన 'తెలుగుదేశం' ఇలాంటి నిధులు పొందిన ప్రాంతీయ పార్టీలలో అగ్రస్థానంలో ఉంది. మరొక మాటలో చెప్పాలంటే, 200 ఏళ్ల పై చిలుకు చరిత్ర ఉన్న అమెరికాలో 450మంది బిలియనీర్‌లు ఉండగా, కేవలం 70 ఏళ్ల వయస్సుగల భారత గణతంత్ర రిపబ్లిక్‌లో 400 మంది పై చిలుకు బిలియనీర్లు, మరికొన్ని వేలమంది మిలియనీర్లు తలెత్తడం విశేషమో, విషాదమో విజ్ఞులకు తెలియాలి. ప్రపంచ ప్రసిద్ధ విశ్లేషణా సంస్థ 'ఆక్స్‌ఫామ్' జరిపిన తాజా సర్వే ప్రకారం భారతదేశ సంపదలో 50 శాతం కేవలం 9మంది చేతుల్లో పోగు బడి ఉండగా, 60 శాతం జనాభా వద్ద ఉన్న సంపద 5 శాతమేనని వెల్ల డైంది. మరో లెక్క ప్రకారం, ఇతర దేశాల్లో సంపదంతా జనాభాలో కేవలం ఒక్కశాతం మంది వద్దనే పోగుబడి ఉండగా, అదే 120 కోట్ల జనాభాగల మన దేశం (ఇండియా)లో కేవలం 10 మంది దగ్గరే సంప దలో మెట్టు భాగం కేంద్రీకరించి ఉంది. ఒకవైపున ప్రపంచంలోనే బల మైన ఆర్థిక శక్తి మన దేశమేనని చెప్పుకుంటున్న దశలో ఇంతటి వ్యత్యాస భారతాన్ని కూడా చూస్తున్నాం.

ప్రజలకు ఓటుమీద ప్రజాస్వామ్యంమీద విశ్వాసం లేనట్టుగా, 'ఓటుహక్కును ప్రతి పౌరుడూ వినియోగించాలి. ఈ ఎన్నికలు దేశ భవి ష్యత్తును తీర్చిదిద్దే ఎన్నికల'ని 'ఓటు హక్కు వినియోగం పవిత్ర ధర్మ మ'నీ రాష్ట్రపతి, ప్రధానమంత్రి దగ్గరనుంచి రాష్ట్రాల్లో చోటామోటా నాయకుల దాకా కొత్తగా ప్రజలకు రిపబ్లిక్ దినోత్సవంనాడు ఊదర దంచారు. కానీ ఓటు విలువ ప్రజలకు తెలియకకాదు, మంచివాళ్లను ఎన్నుకోవాలనేదే వారి లక్ష్యం. కానీ ఆ లక్ష్యాన్ని ఆచరణ సాధ్యం కాకుండా చేస్తున్నది అవినీతిపరులైన 'రాజకీయవేత్తలు–నేరగాళ్లు– నిరంకుశాధికార వర్గ పరస్పర అనుబంధమే'నని మరచిపోరాదు. బహుశా అందుకే శాస్త్రీయ సోషలిస్టు–కమ్యూనిస్టు సిద్ధాంత నిర్మాత అయిన కారల్‌మార్క్స్ 'ప్రతి అయిదేళ్లకొకసారి ప్రజల నెత్తిమీద ఎక్కి ఎలా తొక్కి దోచుకోవాలో నిర్ణయించుకునేందుకు సంపన్న వర్గాల రాజ కీయ పాలక శక్తులు ఈ ఎన్నికల్ని వినియోగించుకుంటుంటాయ'ని చెప్పిన మాటల్ని మరవరాదు. 'నన్ను గెలిపిస్తేనే మీకు భవిష్యత్తు', 'నేను వేయించిన రోడ్లపైనే మీరు నడుస్తున్నారని మరచిపోకండి', 'బడిపిల్ల లకు నన్ను గురించి పాఠాలు చెప్పాలి', 'యూనివర్సిటీలకు ఇచ్చిన గ్రాంట్లను నాకు వాపసు చేయండి' 'ఓటర్ల జాబితా నుంచి ప్రత్యర్థి పార్టీల ఓటర్ల పేర్లను తొలగించేందుకు సిద్ధంకండి'– ఇలాంటి చావు తెలివితేటలున్న చంద్రబాబులాంటి నేతల్ని అధికారంలోకి అనుమతించి నంతకాలం, డబ్బు సంచులతో దొంగ వ్యాపార ప్రకటనల ద్వారా పాల కులు ప్రోత్సహించే కిరాయి వార్తా పత్రికలున్నంతకాలం జరిగేవి ఎన్ని కలూ కావు, ప్రజలు వినియోగించేవి 'ఓట్లూ' కావని గుర్తించాలి.

ఆధునిక టెక్నాలజీని, జ్ఞాన తృష్ణను పెంచుకునే సాధనంగా కాకుండా ఓట్లను తారుమారుచేసి, ఓటర్లను ఆటపట్టించే మాధ్యమంగా, వారి తాలూకు వ్యక్తిగత విషయాలపై కూపీ లాగి, బెదిరింపులకు ఒక సాధనంగా వినియోగించి సుమారు 15 కోట్లమంది భారతీయుల కూపీ లాగి అమెరికా వద్ద నిక్షిప్తం చేసి బెదిరింపుల సాధనంగా మార్చిన జుకర్ బర్గ్ లాంటివాళ్లు మన దేశంలోని కొందరు ఆధునిక రాజకీయవేత్తలకు 'ఆదర్శమూర్తులు'! ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షం వైసీపీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు పార్లమెంట్ సభ్యులను కోట్లాది రూపాయలకు సంతలో పశువుల మాదిరిగా కొనుగోలు చేసి బొటాబొటిగా ఉన్న తన ముఖ్యమంత్రిత్వాన్ని నిలుపుకొన్న చంద్రబాబుది ఒక పాలనగా గానీ, అతనొక పాలకుడిగాగానీ, ప్రజా రాజకీయ శాస్త్రం ఒప్పుకోదు. ఈ దేశంలో కొందరు సభాపతుల ప్రవర్తనా అలాగే తయారైంది. ఆమాట కొస్తే అసలు రిపబ్లిక్ రాజ్యాంగాన్ని, దాని వ్యవస్థలనూ పాలకులు భ్రష్టు పట్టిస్తూ నామరూపాలు లేకుండా చేస్తున్నారు. దీనికితోడు పాలకుల తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి సుప్రీంకోర్టును 'సీల్డు కవర్' రాజ కీయం ద్వారా నోరు నొక్కాలని పాలకులు చూస్తున్నారు. అందుకే సుప్రీంకోర్టు ''ప్రజా ప్రతినిధులమని చెప్పుకునే చట్టసభల సభ్యుల అవినీతి ప్రవర్తనకు సంబంధించిన సమాచారం పొక్కకుండా ఎందుకు రక్షణ కల్పించాలి?'' అని పదే పదే ప్రశ్నించవలసి వస్తోంది.

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా


కనీస ఆదాయం



"దేశంలో లక్షలాదిగా ఉన్న సోదర సోదరీమణులంతా పేదరికంతో కొట్టుమిట్టాడు తుంటే మేము కొత్త భారత దేశాన్ని నిర్మించలేం. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే ప్రతి నిరుపేదకీ కనీస ఆదాయం కల్పిస్తాం. తద్వారా పేదరికాన్నీ, ఆకలినీ తరిమి వేయడానికి మా పార్టీ కృషి చేస్తుందని మాట ఇస్తున్నాను. ఇది మా విజన్, మా హామీ"

– రాహుల్ గాంధీ
కాంగ్రెస్ అధినేత

భద్రత



"కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలుసుకుని కొందరి ఖాతాల విషయంలో ట్విట్టర్ వివక్షా పూరి తంగా వ్యవహరించడంపై ఫిర్యాదు చేశా. ఇది జాతీయ భద్రతకు, ప్రజాస్వామ్యానికీ ముప్పు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత మైన ఎన్నికలు జరిపించడానికి సూచనలు కూడా చేశా"

– ఇష్కారణ్ సింగ్ భండారీ, లాయర్

బ్రూస్ లీ ఆత్మ



"రెండోసారి మణి కర్ణిక సినిమా చూశా. నిజం చెప్పా లంటే బ్రూస్ లీ ఆత్మ కంగనా రనౌత్‌లో ప్రవేశించిందేమోనని నాకు అనిపించింది. గురుత్వాకర్షణ శక్తి నిరాకరించే పోరాటాలు కూడా కంగనా ముఖంలోని తీవ్రమైన హావభావాల వలన నమ్మశక్యంగా అనిపించాయి"

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

సరిహద్దు



"టోర్ఖమ్ సరిహద్దు దగ్గర ఎగుమతులు, దిగుమతులు సవ్యంగా సాగ డానికి తగిన సదుపాయాలను కల్పించాలని సూచించా. దీంతో ద్వైపా క్షిక వాణిజ్యం మెరుగవ్వడంతోపాటు, సోదర దేశాల ప్రజల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి"

– ఇమ్రాన్ ఖాన్, పాక్ ప్రధాని

వ్యక్తిగతం



"కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి ఇలా దిగజారుడు ఆరోప ణలు చేయడం బాధా కరం. అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే వ్యక్తిగత, మతపరమైన అంశాలను లేవనెత్తుతూ తక్కువస్థాయి వ్యాఖ్యలు చేయడాన్ని నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి అనంత్ కుమార్ మానుకో వాలి. అది అతడి కుసంస్కారానికి నిద ర్శనం, మన హిందూ గ్రంథాల నుంచి అతడేమీ నేర్చుకోలేదని అర్థమవుతూ ఉంది. ఇప్పటికైనా మించి పోయిందేమీ లేదు, ప్రయత్నించి మంచి మనిషిగా మారొచ్చు"

– దినేష్ గుండూ రావు
కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు

వ్యవసాయాభివృద్ధితోనే గ్రామాల్లో వెలుగులు

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

గ్రామీణ సమాజంలో వెలుగులు పూయించాల ంటే వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి. వ్యవసా యదారులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల సంక్షే మమే వ్యవసాయాభివృద్ధికి కొలబద్ద. దీనిని పరిగణన లోకి తీసుకోకుండా.. అధికా రంలో ఉన్న వారు వ్యవసాయ అనుబంధ రంగాలైన చేపలు, ఆక్వారంగంలో అభివృద్ధిని వ్యవసాయరంగ ఆదాయంలో జోడించి వ్యవసాయరంగం రెండంకెల అభివృద్ధి సాధించిందని చెప్పుకోవడం రైతాంగాన్ని వంచించడమే. కారణం ఆక్వా ఆదాయం రాష్ట్రంలో కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం.

2011 గణాంకాల ప్రకారం దేశంలో 55.49% జనాభా వ్యవసాయంపై ఆధారపడగా అందులో 33.6% వ్యవసాయ కార్మికులు. మిగతావారు వ్యవ సాయదారులు, కౌలు రైతులు. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీ (సిఎస్‌డిఎస్) నివేదిక ప్రకారం 76% మంది రైతులు వ్యవసాయాన్ని మానుకుని ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్లోకి మరలాలని భావి స్తున్నారు. కానీ, ప్రత్యామ్నాయ మార్గాలు లేకనే.. నష్టాల్ని, కష్టాల్ని భరిస్తూ విధిలేక వ్యవసాయం చేస్తు న్నారనే నగ్నసత్యాన్ని పాలకులు మరవకూడదు.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రజ్ఞుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని కమిషన్ 2007లోనే ఓ సమగ్రమైన నివేదిక అప్పటి కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ఆ నివేదికలో విలువైన సూచనలు ఉన్నాయి. ఇదికాక, ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ప్లానింగ్ కమిషన్ స్థానంలో ఏర్పాటయిన నీతి ఆయోగ్ వ్యవసాయరంగంపై ఓ సమగ్ర విధాన పత్రాన్ని అందించింది. 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఓఇసిడి) తాజా గణాంకాల ప్రకారం గత 5 ఏళ్లల్లో వివిధ పంటలు చేతికొచ్చాక.. మార్కెట్‌కు చేరేలోపు జరిగిన నష్టం (పోస్ట్ హార్వెస్ట్ నష్టాలు) 4% నుంచి 16%కు పెరి గాయి. వీటిలో ఎక్కువగా పండ్లు, కూరగాయలు లాంటివి ప్రధానమైనవి.

రైతులకు హెక్టారుకు ఏడు వేల రూపాయలు సబ్సిడీ అందించి ఎరువులపై నియంత్రణ ఎత్తివే యాలని సలహా సంఘం సూచించినప్పటికీ దానిని కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. అలాగే, గోధుమ, వరి, బియ్యంలాంటి వాటిని ఎఫ్‌సీఐ ద్వారా సేకరించడం మానుకుని, ఆ బాధ్యతను రాష్ట్రాలకు వదిలి పెట్టాలన్న సూచన సత్ఫలితాలను సాధించకపోవడం. ముఖ్యంగా.. గత ఐదేళ్లల్లో విత్తనోత్పత్తిలో అధునాతన పద్ధతులేమీ పాటించక పోవడం వల్ల అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు అందుబాటులోకి రాలేదనే వాస్తవాన్ని నీతిఆయోగ్ ఎత్తిచూపింది.

తెలంగాణ ప్రభుత్వం గత ఏడాదికాలంగా ఎక రాకు రూ. 4,000 నగదు నేరుగా రైతు ఖాతాలో వేసే పథకాన్ని అమలు చేస్తున్నది. రెండవసారి అధికారం లోకి వచ్చాక ఎకరాకు రూ. 5,000 చొప్పున ఇవ్వను న్నట్లు ప్రకటించింది. ఈ పథకం కాకుండా పంట నష్టపోయే రైతులను ఆదుకోవడానికి సమగ్ర బీమా పథకం అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం వ్యవ సాయరంగంలో అమలు చేస్తున్న పథకాల పట్ల కేంద్రంతోపాటు పలు రాష్ట్రాలు ఆసక్తిగా గమనిస్తు న్నట్లు వార్తలు వస్తున్నాయి.

కాగా, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం నేతృత్వం లోని ప్రభుత్వం.. గత ఐదేళ్లుగా వ్యవసాయ రంగా నికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెడుతున్నప్పటికీ.. రైతు లకు కలిగిన ప్రయోజనం శూన్యమనే చెప్పాలి. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం అధినేత రైతాంగం సంక్షేమం కోసం రెండుసార్లు ఆమరణ నిరాహార దీక్షల పేరుతో హడావుడి చేశారు. ఇక, 2014 ఎన్నికలముందయితే.. అధికారంలోకి రాగానే బేషరతుగా రైతుల రుణాలను మాఫీ చేస్తామని నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చాక.. టీడీపీ ప్రభుత్వం రైతాంగాన్ని ఏవిధంగా వంచించిందో అందరూ గమనించారు. ఒక్కసారి కూడా చంద్ర బాబు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తేలేదు. కనీస మద్దతు ధరలు పెంచితే వినియోగదారుడిపై భారం పడుతుంది కనుక స్వామినాథన్ కమిషన్ సిఫార్సు లను అమలు చేయలేమని సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసినా.. బాబు పెదవి విప్పలేదు. ప్రధాన కారణం కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో మైత్రీ బంధం ఉంది గనుక. దక్షిణాదిన కేరళ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాలు ఇస్తున్నట్లు కనీసం బోనస్ కూడా ప్రకటించలేదు. ఇక, రైతు రుణమాఫీని ఓ ఫార్సుగా చేశారు. 2014 ఎన్నికల ముందు బాబు రైతుల రుణమాఫీ వాగ్దానం చేసే నాటికి రాష్ట్రంలో రైతుల అప్పులు రూ.87,612 కోట్లు. తరచూ రుణ మాఫీకి కటాఫ్ డేట్లు మార్చారు. కోటయ్య కమిటీ వేసి లక్షరూపాయల రుణం కంటే తక్కువ మొత్తా లకు మాత్రమే రుణమాఫీ అన్నారు. రుణభారం కేవలం రూ. 24,000 కోట్లుగా లెక్క తేల్చి... దానిని ఐదేళ్ల పాటు దఫాలవారీగా ఇస్తామని చెప్పి.. కేవలం 13,000 కోట్లు చెల్లించి, ఇప్పటికీ ఇంకా రూ. 11,000 కోట్లు చెల్లించలేదు. ప్రభుత్వం చేసిన రుణమాఫీ మొత్తం వడ్డీలకే సరిపోయిందని రైతులు గగ్గోలు పెట్టారు. ఆకర్షణీయమైన నినాదాలు తప్ప టీడీపీ రైతుల సంక్షేమానికి నిర్దిష్టంగా చేసిన మేలు మచ్చుకై నా కనపడదు. మరోపక్క.. అనంతపురం జిల్లాలో 'కరువే మనలను చూసి భయపడి పారిపోయేలా చేస్తాం' అంటూ ఆర్భాటంగా వందల కోట్లతో రెయిన్ గన్‌లు కొని.. నీళ్లు లేక వాటిని మూలన పెట్టే శారు. ఈ ఏడాది 30.55 లక్షల ఎకరాల్లో వరిసాగు జరగాల్సి ఉండగా.. వివిధ ఎత్తిపోతల పథకాల కింది ఆయకట్టుకు నీరు అందించలేకపోవడంతో కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే నీరివ్వాలనే ప్రభుత్వ నిర్ణయం రైతుల పాలిట శాపంగా పరి ణమించింది. నాలుగున్నరేళ్లల్లో సంభవించిన కరు వు, తుపాన్లతో భారీగా జరిగిన పంట నష్టానికి రైతులు కోలుకోలేని దైన్యస్థితిలో పడిపోయారు.

దేశవ్యాప్తంగా అన్నదాతల ఆందోళనలు మిన్నంటుతున్నాయి. ఢిల్లీని ఇటీవల 35,000 మంది రైతులు ముట్టడించి కేంద్రానికి చెమటలు పట్టిం చారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు.. ఇలా పలు రాష్ట్రాలకు చెందిన రైతులు రోడ్ల మీదకు వస్తు న్నారు. మోదీ గద్దె దిగాలని కొన్నిరాజకీయ పార్టీలు నినదిస్తున్నాయి. కానీ, అధికారంలోకి ఎవరొచ్చినా వ్యవసాయరంగ పరిస్థితిలో మార్పురావడంలేదు. అధిక ఆదాయం చేకూర్చే రంగంగా వ్యవసాయాన్ని తీర్చిదిద్దడం అసాధ్యమేమీ కాదు. గ్రామీణ ప్రాంతం లోని యువత శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోవా లి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడానికి.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల్ని మెరుగు పర్చాలి. విద్య, వైద్య సదుపాయాలు, మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థలను విస్తృతపర్చాలి. ఈ చర్యలు చేప డితే వ్యవసాయరంగంలో వెలుగులు పూయించడం సాధ్యపడుతుంది.

వ్యాసకర్త శాసన మండలి ప్రతిపక్ష నాయకులు, కేంద్ర మాజీ మంత్రి

నెల్లిమర్ల: పాతికేళ్ల విషాదం

సందర్భం



అట్టాడ అప్పల్నాయుడు

సరిగ్గా పాతికేళ్ల కిందట ఇదే రోజున విజయనగరం జిల్లా నెల్లిమర్లలో జూట్ మిల్లు కార్మికుల నెత్తురు ఒలికింది. దాదాపు 5,500 మంది కార్మికులు పనిచేసే జూట్ మిల్లు అకస్మాత్తుగా, అక్రమంగా లాకవుట్ చేసింది యాజమాన్యం. ఈ పాతికేళ్లలో పర్యావరణాన్ని ధ్వంసం చేసే పరిశ్రమల రాకతో అడవుల నుండి ఆదివాసీలు, తీరం నుండి మత్స్యకారులు, పల్లపు ప్రాంతాల నుండి బహుజన రైతాంగం నిర్వాసితులవుతున్నారు. పాతికేళ్ల కిందటి నెల్లిమర్ల కార్మికులు ఒలికించిన నెత్తుటి జ్ఞాపకాన్ని తడుముకుంటే రాజకీయపార్టీల ద్వంద్వ వైఖరి, కార్మికోద్యమాలకు నాయకత్వం వహించే వామపక్ష శక్తుల వైఫల్యం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది.

నెల్లిమర్ల జూట్‌మిల్లు లాకవుట్ ప్రకటించడంతో రోడ్డున పడ్డ కార్మికులు దాదాపు ఏడు నెలలు చట్ట బద్ధ పద్ధతుల్లో తమ ఆందోళనలు సాగించారు. ఫలితం లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు, రైతులూ, యువజనులూ, ప్రజాస్వామికవాదులూ, అధికారంలో లేని రాజకీయపార్టీలూ కలసి ఐక్యంగా నిరసన ప్రదర్శనలు జరిపాయి. ఖాళీ పళ్లాలూ, గ్లాసులూ పట్టుకొని స్త్రీలు, పిల్లలు, కార్మికులు వేలా దిగా ఊరేగింపు తీశారు. రోడ్ రోకో, బస్ రోకో, దండోరా దినం వంటి ఆందోళనలు చేపట్టారు. ఫలి తంగా ప్రభుత్వం జూట్‌మిల్లు యాజమాన్యం ప్రక టించిన లాకవుట్ చట్టవిరుద్ధమనీ తొలగించాలనీ ఉత్తర్వులిచ్చింది. కానీ యాజమాన్యం ప్రభుత్వ ఉత్త ర్వులను లెక్క చేయలేదు, లాకవుట్ ఎత్తివేయలేదు. కార్మికులు మరింత తీవ్రమైన పోరాట రూపాలను చేపట్టాల్సిన పరిస్థితికి నెట్టివేయబడ్డారు. ఈ మొత్తం కార్మిక ఉద్యమాన్ని ప్రత్యక్షంగా ఇఫ్టూ అనే వామపక్ష సంఘం నడిపింది. అప్పటికి అధికారంలో లేని టీడీపీ పరోక్షంగా సహకరించింది. అప్పుడు అధికా రంలో ఉన్న కాంగ్రెస్, ముఖ్యంగా మంత్రి సాంబశి వరాజు ఉద్యమాన్ని వ్యతిరేకించారు. నెల్లిమర్లలో, పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త సందర్భమది! ప్రభుత్వం లాకవుట్‌ను నిషేధించినా మిల్లు తెరవని యాజమాన్య దుర్మార్గానికి వ్యతిరేకంగా కార్మికుల పోరాటాలకు ప్రజల మద్దతు వస్తున్న నేపథ్యంలో 29.01.1994న దాదాపు ఇరవై వేలమంది కార్మికులు రైల్ రోకో చేపట్టారు.

శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందని కార్మి కులపై పోలీసులతో కాల్పులు జరిపించింది. ఐదు గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. నెత్తురులో నెల్లిమర్ల కార్మికోద్యమం మునిగిపోయింది. తర్వాత మిల్లు నడిచింది... మళ్లామళ్లా లాకవుట్లతో! కాంగ్రెస్ పార్టీ ఆ నియోజకవర్గంలో ఓడిపోయి తెలుగుదేశం పార్టీ తర్వాత ఎన్నికల్లో నెగ్గింది. మళ్లామళ్లా జరిగే లాకవుట్లను తెలుగుదేశం పార్టీ సమర్థించుకు వస్తోంది. మిల్లు ఇప్పుడు లాకవుట్లో ఉంది. అప్పుడు పనిచేసిన 5,500 మంది కార్మికుల స్థానంలో ప్రస్తుతం 1,100 మంది పర్మనెంటు కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారు. కార్మికసంఘం కూడా ఒక నాటిలా బలమైన స్థితిలో లేదు. కేవలం వర్ధంతులకు మాత్రమే పరిమితమైంది. పాలకపక్ష పార్టీలు నెల్లి మర్ల కార్మికుల ఓట్ల కోసం కొత్త ఎత్తుగడలు పన్నుతు న్నాయి. ఇదీ పాతికేళ్ల విషాదం!

వ్యాసకర్త ఉరకవే అధ్యక్షులు
మొబైల్ : 94400 31961

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ మంగళవారం
29-1-2019


● రానా ● సుధీర్ బాబు ● వరుణ్ తేజ్ ● నాని

చితకబాదుడే

**ఒక ఏటు ఏస్తే మనిషి పోయి జీపు మీద పడితే..
జీపు పోయి కారు మీద పడితే..
కారు పోయి బస్సు మీద పడితే..
బస్సు పోయి విలన్ దగ్గర ఆగుతుంది.
అదే టైమ్‌లో స్టంట్ మాస్టర్ కంప్రెషర్ పెట్టి విలన్ ముఖం
మీద జివ్వున గాలి వదులుతాడు.
సినిమాటోగ్రాఫర్ స్లో మోషన్‌లో విలన్ ముఖం
అంతా సాగిపోయినట్లు చూపిస్తాడు.
అవును.. అక్కడెక్కడో పంచ్ కొడితే
బస్సు వెనకాల దాక్కున్న విలన్ షేక్ అవుతాడు.
చితకబాదుడు మన హీరోలకు కొత్త కాదు.
కానీ ఈసారి హీరోలు, హీరోయిన్లు గేమ్స్ ఆడుతున్నారు.
దాంట్లో కూడా చితకబాదుడే.**


● దివ్యాన్ష కౌశిక్, నాగచైతన్య

యాక్షన్ సినిమాల్లో డిష్యుం డిష్యుం అంటూ ఫైట్స్ చేస్తారు మన హీరోలు. రొమాంటిక్ మూవీస్‌లో ప్రేమిస్తారు. కుటుంబకథా చిత్రాల్లో ఎమోషన్స్‌ను పండిస్తారు. స్టోరీ లైన్‌కి తగ్గట్టుగా అల్లుకుపోతారు. ఇప్పుడు ఆట ఆడడానికి రెడీ అయ్యారు. ఒకరు బ్యాటు పడితే...ఇంకొకరు బ్యాడ్మింటన్ రాకెట్ పట్టారు. ఒకరు కుస్తీకి సై అన్నారు. మరొకరు బాక్సింగ్‌లో తేల్చుకుందాం అంటున్నారు. ఇలా క్రీడాకారులుగా నటించబోయే 'స్టార్స్' గురించి తెలుసుకుందాం.

నేచురల్ బ్యాటింగ్

సినిమాల్లాంటి మ్యాచ్‌లలో టాలీవుడ్ గ్రౌండ్‌పై నాని మంచి స్కోర్లే కొట్టారు. అంపైర్స్‌లాంటి ఆడియన్స్ నానీని నేచురల్ బ్యాట్స్‌మెన్‌లా గుర్తించారు. మొన్నా మధ్య 'కృష్ణార్జున యుద్ధం' మ్యాచ్‌లో అవుటయ్యా (సినిమా రిజల్ట్) నని నానీనే స్వయంగా ఒప్పుకుని తనలోని నిజాయతీతో అంపైర్స్ మనసును మరింత గెల్చుకున్నారు. ఇలా కెరీర్లో ఇప్పటివరకు 22 మ్యాచ్‌లను కంప్లీట్ చేశారు నాని. ఇప్పుడు కొత్త మ్యాచ్ 'జెర్సీ' కోసం అర్జునుడిలా గ్రౌండ్లోకి దిగారు. ఆ మ్యాచ్‌లో 36 ఏళ్ల వయసు ఉన్న అర్జునుడన్నమాట నాని. 'మళ్ళీరావా' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి అర్జునుడికి డైరెక్షన్ ఇస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన అర్జున్ ఆహార్యం బాగానే ఉందని ఆడియన్స్ అన్నారు. ప్రస్తుతం నాని ఆడుతున్న ఈ మ్యాచ్ ఏప్రిల్‌లో వెండితెరపైకి వస్తుంది. దాదాపు తొమ్మిదేళ్ల క్రితం 'భీమిలి.. కబడ్డీ జట్టు' సినిమాలో కబడ్డీ ప్లేయర్‌గా కోర్టులో కూత పెట్టిన నాని ఇన్నేళ్ల తర్వాత స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీ చేస్తున్నారు. క్రికెటర్ అర్జున్‌గా 'జెర్సీ'లో నాని ఆడే ఆటను వేసవిలో చూద్దాం.

కోచింగ్ ఇస్తున్నారు

రావడంతోనే 'జోష్' గా వచ్చి మాస్ బ్యాట్స్‌మెన్ పేరు తెచ్చుకుందామని ట్రై చేశారు నాగచైతన్య. ఆ వెంటనే అక్కినేని ట్యాగ్‌కి తగ్గట్టుగా 'ఏ మాయ చేశావె' అంటూ లవ్‌స్టోరీ చేశారు. అంపైర్స్ శభాష్ అన్నారు. కొన్ని మంచి మ్యాచ్‌లలో క్లాస్ బ్యాట్స్‌మెన్‌లా నిరూపించుకున్న నాగచైతన్య మాస్ బ్యాట్స్‌మెన్ పేరు కోసం వీలున్నప్పుడల్లా ట్రై చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు 'మజిలీ' అనే ఎమోషనల్ మ్యాచ్ కోసం రెడీ అయ్యారు. ఈ మ్యాచ్‌లో కేవలం బ్యాట్స్‌మెన్‌లా మాత్రమే కాదు. బ్యాట్స్‌మెన్‌కు ట్రైనింగ్ ఇచ్చే కోచ్‌గా కూడా కనిపిస్తారు నాగచైతన్య. ఈ మ్యాచ్‌కి శివ నిర్వాణ డైరెక్షన్ ఇస్తున్నారు. ఏప్రిల్‌లో వెండితెరపై ఈ మ్యాచ్ ప్లే అవుతుంది.

బస్తీ మే సవాల్

మల్లయోధునిగా రానా బరిలోకి దిగితే ప్రత్యర్థులను ఇట్టే మట్టికరిపిస్తారు. అవును.. వెండితెరపై రానాను మల్లయోధునిగా చూసే అవకాశం ఉంది. ప్రముఖ మల్లయోధుడు కోడిరామ్మూర్తి బయోపిక్‌లో రానా నటించనున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో 'బస్తీ మే సవాల్' అంటూ రానా ఆడే కుస్తీని ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేయవచ్చు.

పంచ్ ఇస్తే...!

బాక్సింగ్ బరిలో దిగడానికి శిక్షణ కోసం అమెరికా వెళ్లడానికి వరుణ్ తేజ్ సిద్ధమవుతున్నారని తెలిసింది. 'ఫిదా, ఎఫ్ 2' చిత్రాల కలెక్షన్స్‌తో బాక్సాఫీస్‌కి బాగానే పంచ్‌లు ఇచ్చారు వరుణ్. న్యాయ నిర్ణేతలు లాంటి ప్రేక్షకులు వరుణ్‌కు మంచి స్కోరే వేశారు. వరుణ్ తేజ్‌కు కిరణ్ కొర్రపాటి అనే కొత్త వ్యక్తి డైరెక్షన్స్ ఇవ్వనున్నారు. సమ్మర్‌లో వరుణ్ బాక్సింగ్ రింగ్‌లోకి దూకే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రావడంతోనే 'ఆర్ఎక్స్ 100'తో బాక్సాఫీస్‌కి స్ట్రాంగ్ పంచ్ ఇచ్చారు కార్తికేయ. ఇప్పుడు ఆయన 'హిప్పీ' అనే సినిమాతో బాక్సర్‌గా రింగ్‌లోకి దిగారని సమాచారం.. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ఫొటోలలో కార్తికేయ చేతికి గ్లౌజ్‌లు వేసుకుని బాక్సర్‌గా కనిపించారు. దీంతో 'హిప్పీ' బాక్సర్ బ్యాక్‌డ్రాప్ మూవీ అనే టాక్ మొదలైంది. అలాగే తమిళ హీరో విజయ్ నెక్ట్స్ మూవీ ఫుట్‌బాల్ నేపథ్యంలో తెరకెక్కనుందని కోలీవుడ్ టాక్. ఈ చిత్రానికి అట్లీ దర్శకత్వం వహిస్తారు. దీపావళికి రిలీజ్ అవుతుందీ చిత్రం.

మళ్లీ కోర్టులో!

రాకెట్ పట్టి బ్యాడ్మింటన్ కోర్టులో ఎడాపెడా కాక్‌ను బాదటం సుధీర్ బాబు చిన్నప్పుడు నేర్చుకున్న విద్యే. కొత్తేమీ కాదు. ఆ మాటకొస్తే ఆయన స్కూలింగ్ టైమ్‌లోనే జూనియర్ బ్యాడ్మింటన్ వరల్డ్ కప్‌లో ఫైనల్ వరకూ వెళ్లొచ్చారు. ఆ తర్వాత ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ పుల్లెల గోపీచంద్‌తో కలిసి డబుల్స్ కూడా ఆడారు. ఇప్పుడు సుధీర్ బాబు మళ్లీ రాకెట్ పట్టారు. బ్యాడ్మింటన్ కెరీర్‌కు మళ్లీ శ్రీకారం చుట్టడానికి కాదు. వెండితెరపై పుల్లెల గోపీచంద్‌లా ఆడటానికి రెడీ అవుతున్నారు. సెట్‌లో త్వరలో ఆయన మ్యాచ్‌లు స్టార్ట్ కానున్నాయి. ప్రవీణ్ సత్తారు డైరెక్షన్‌లో సుధీర్‌బాబు ఆడతారు.

– ముసిమి


● రష్మికా మండన్నా

తెలుగు గ్రౌండ్‌లోకి అడుగు పెట్టిన కన్నడ తార రష్మికా మండన్నాకు ప్రస్తుతం తిరుగులేదని తెలుగు అంపైర్స్ నిర్ణయించేశారు. మరి.. రష్మిక ఆడిన మ్యాచ్ తాలూకు బాక్సాఫీస్ రికార్డులు అలాంటివి. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక 'డియర్ కామ్రేడ్' అనే మ్యాచ్ ఆడుతున్నారు. ఇందులోనే బ్యాట్ పట్టుకుని గ్రౌండ్‌లోకి దిగారామె. ఆల్రెడీ వీరిద్దరూ జంటగా వచ్చిన 'గీతగోవిందం' మ్యాచ్ బాక్సాఫీస్ వద్ద సెంచరీ కొట్టింది. దీంతో ఈ 'డియర్ కామ్రేడ్' కూడా బాక్సాఫీస్ వద్ద మంచి స్కోర్ కొట్టాలని కోరుకుంటున్నారు రష్మిక అండ్ ఫ్యాన్స్. ఈ సినిమాలో రష్మిక బ్యాట్ పట్టుకుని గ్రౌండ్‌లోకి దిగారు. భరత్ కమ్మ అనే కొత్త వ్యక్తి డైరెక్షన్ ఇస్తున్నారు. ఇలా వరస హిట్ మ్యాచ్‌లతో ప్రస్తుతానికి సూపర్ ట్రాక్ రికార్డ్‌తో ముందుకు వెళ్తున్నారు రష్మిక.


● మహేశ్‌బాబు

టాలీవుడ్ బాక్సాఫీస్ స్కోర్ బోర్డ్‌పై మహేశ్‌బాబు స్కోర్ల డిజిట్స్ చాలా పెద్దవి. 'మహర్షి' మూవీ కోసం మహేశ్‌బాబు బ్యాట్ పట్టి గ్రౌండ్‌లోకి దిగారు. అయితే ఇందులో పార్ట్‌టైమ్ ప్లేయర్‌గానే కనిపిస్తారు మహేశ్. 'మహర్షి'లో ఆయన స్టూడెంట్‌గా ఉన్నప్పుడు హైదరాబాద్ గ్రౌండ్‌లో మహేశ్‌బాబు క్రికెట్ ఆడారని సమాచారం. ఏప్రిల్ 25న మహేశ్ ఆట వెండితెరపై ప్రత్యక్షం అవుతుంది. దాదాపు పదిహేనేళ్ల క్రితం 'ఒక్కడు'లో మహేశ్ కబడ్డీ ప్లేయర్‌గా కనిపించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. క్రీడానేపథ్యంలో సినిమా అంతా సాగకపోయినప్పటికీ 'అర్జున్ రెడ్డి'లో విజయ్ దేవరకొండ ఫుట్‌బాల్ గోల్ కీపర్‌లా, 'పడిపడి లేచె మనసు' సినిమాలో శర్వానంద్ ఫుట్‌బాల్ టీమ్ కెప్టెన్‌లా కనిపించారన్న విషయం తెలిసిందే.

రీప్లే!


● రితికా సింగ్, వెంకటేశ్


● నితిన్

గడచిన పాతికేళ్లలో తెలుగు తెరపై వచ్చిన క్రీడా నేపథ్య సినిమాలను రీ ప్లే చేస్తే... టైక్వాండో నేపథ్యంలో శ్రీహరి 'భద్రాచలం', బాక్సింగ్ నేపథ్యంలో వెంకటేశ్ కోచ్‌గా 'గురు', బాక్సర్‌గా పవన్‌కల్యాణ్ 'తమ్ముడు', రవితేజ 'అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి' సినిమాలు బాగానే సక్సెస్ సాధించాయి. 'సై' అంటూ వెండితెరపై నితిన్ ఆడిన రగ్బీ గేమ్ ఆడియన్స్‌కు బాగానే నచ్చింది. 'గోల్కొండ హైస్కూల్' సినిమాలో క్రికెటర్ కమ్ క్రికెట్ కోచ్‌గా సుమంత్ ఫామ్‌ను పర్లేదనే అన్నారు ఆడియన్స్. ఇలా స్పోర్ట్స్ నేపథ్యం ఉన్న సినిమాలన్నింటికీ ఓకే చెప్పారు ఆడియన్స్. సో.. రాబోయే ఆటలను కూడా ఆదరిస్తారని ఊహించవచ్చు. అయినా ఆటలో కిక్కు ఉంటే డౌటేముంది? బాక్సాఫీస్ స్కోర్ పీక్స్‌లో ఉంటుంది.

ఫామ్‌లోకి వచ్చేందుకు!

తిరిగి ఫామ్‌లోకి వచ్చేందుకు బాగానే ప్రయత్నిస్తున్నారు సందీప్ కిషన్. అందుకే కొత్త ట్రాక్ ఎంచుకున్నారు. ఇప్పటికే ఆయన 'నిను వీడని నీడను నేనే' అంటూ తొలిసారి హారర్ నేపథ్యంలో ఉన్న సినిమాలో నటిస్తున్నారు. ఇప్పుడు ఓ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సంతోష్ జాగర్లమూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారు. మరి.. ఈ సినిమా ఏ స్పోర్ట్ ఆధారంగా తెరకెక్కనుందన్న విషయంపై ఇంకా క్లారిటీ రాలేదు.


● సందీప్ కిషన్


● శ్రద్ధాకపూర్

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'సైనా'. సైనాగా శ్రద్ధాకపూర్ నటిస్తున్నారు. కోర్టులో రాకెట్‌ని ఝుళిపించడం కోసం శ్రద్ధా శిక్షణ తీసుకున్నారు. అమోల్ గుప్తా ఈ చిత్రానికి దర్శకుడు.

నార్త్ గ్రౌండ్‌లో...!


● దుల్కర్ సల్మాన్

మాలీవుడ్ బ్యాట్స్‌మెన్ దుల్కర్ సల్మాన్ నార్త్ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టారు. ఆల్రెడీ ఆయన నార్త్‌లో ఆడిన తొలి మ్యాచ్ 'కర్వాన్'కు అక్కడి అంపైర్లు మంచి మార్కులే వేశారు. ఇప్పుడు అక్కడ ఆడుతున్న రెండో మ్యాచ్ 'జోయా ఫ్యాక్టర్'తో మంచి స్కోర్ కొట్టాలని ఆయన డిసైడ్ అయ్యారు. అందుకోసం బాగానే నెట్ ప్రాక్టీస్ చేశారాయన. మరి క్రికెటర్‌లా కనిపించి, బాలీవుడ్ స్కోర్ బోర్డ్‌పై నటుడిగా దుల్కర్ ఎంత స్కోర్ చేస్తారో చూడాలి. అలాగే తమిళ హీరో జీవా.. అదేనండీ 'రంగం' ఫేమ్ గుర్తుండే ఉంటారు. ఇప్పుడు ఆయన కూడా నార్త్ గ్రౌండ్‌పై అడుగుపెట్టనున్నారని తెలుస్తోంది. ప్రముఖ క్రికెటర్, భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ జీవితం ఆధారంగా రణ్‌వీర్‌సింగ్ కెప్టెన్‌గా చేస్తున్న చిత్రం '1983'. ఈ సినిమాలో జీవా బంతి పట్టుకుని కీలక బౌలర్‌గా గ్రౌండ్‌లోకి దిగుతారని తెలిసింది.

అతి అభిమానం

దొంగల పాలు

చైన్ స్నాచర్ల గురించి విన్నాం గానీ పాల క్యాన్ల స్నాచర్ల గురించి విన్నామా? తమిళనాడులో పాలక్యాన్ల దొంగలు ఇటీవల పెరిగిపోయారని అక్కడి పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు చెన్నై పోలీస్ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీని వెనుక మన తెలుగువారి పాత్ర కూడా ఉందని తెలిస్తే అంతగా కంగారు పడాల్సిన పని లేదు.


● రజనీకాంత్‌కు పాలాభిషేకం చేస్తున్న ఫ్యాన్స్ (ఫైల్); ఇన్‌సెట్‌లో శింబు

తెలుగులో పెద్ద విజయం సాధించిన 'అత్తారింటికి దారేది' సినిమా తమిళంలో సింబు హీరోగా సి.సుందర్ (కుష్బూ భర్త) దర్శకత్వంలో 'వందా రాజావతన్ వరువన్'గా రీమేక్ అయ్యింది. ఫిబ్రవరి 1న విడుదల. ఈ సందర్భంగా హీరో సింబు ఒక వీడియో విడుదల చేస్తూ 'బాగా ఆర్భాటం చేయండి. పాలతో నా కటౌట్లు అభిషేకం చేయండి' అని అభిమానులకు పిలుపు ఇచ్చాడు. దానిపై ట్రోలింగ్ జరిగింది. 'సింబుకు అంత సీన్ లేదు. అంత పాలుబోసేంత ఫ్యాన్లు లేరు' అని వేరే హీరోల అభిమానులు కామెంట్ చేశారు. దాంతో సింబు మరో వీడియో విడుదల చేసి 'రెచ్చిపోండి... భారీ క్యాన్లతో నా కటౌట్లకు పాలాభిషేకం చేయండి' అని పిలుపు ఇచ్చాడు. ఇది అభిమానులను తప్పుదారి పట్టించేలా ఉందని కొందరు మండిపడ్డారు. ఈలోపు ఈ తతంగం కోసమే అన్నట్టు తమిళనాడులో పాలతో వస్తున్న వాహనాలలోని క్యాన్లు మాయం కావడం మొదలెట్టాయి. వ్యవహారం ముదిరిపోయేసరికి సింబు నాలుకా పెదాలు రెండూ కరుచుకుని 'నేను చెప్పింది పాలాభిషేకం చేయమని కాదు. అక్కర ఉన్న పిల్లలకు పాలు పంచమని' అని కొత్త వీడియో రిలీజ్ చేసి తప్పు నుంచి తప్పించుకున్నాడు.

అయితే ఈ సందర్భంగా ఈ శ్రుతి మించిన అభిమానం గురించి సర్వత్రా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా తమిళనాడులో పాలాభిషేకానికి తెర తీసిన రజనీకాంత్ అభిమానులు ఈ ట్రెండ్‌ను పెంచి పోషించారని ఆలోచనాపరులు విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో వేలకొద్ది పసిపిల్లలు తగినన్ని పాలులేక బాధ పడుతుంటే కటౌట్ల మీద పాలు బోసి వృథా చేయడం అన్యాయమని అంటున్నారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల, పెరుగుతున్న వేడి వల్ల, నీటివసతి, గడ్డి వసతి కరువై సరైన ఆహారం లేక పశువులు ఇచ్చే పాల శాతం రాను రాను తగ్గుతూ పాల ధర పెరుగుతోందని ఒక పరిశీలన. మరోవైపు మనదేశంలో పిల్లల కోసం ఉపయోగించే పాల కన్నా క్రతువుల్లో వాడే పాలు అధికం. దానికితోడు వెర్రి అభిమానం వల్ల కూడా పాలు వృథా అవుతున్నాయి.

సినిమా రిలీజ్ అవుతుందంటే ఇళ్ల ముందరి పాల ప్యాకెట్లు మాయమవుతున్నాయంటే మన కుర్రకారు ఏ స్థాయిలో ఉన్నట్టు?

కష్టారెంట్

రుచించని పేరు

మంచి ఉద్దేశంతోనే ఆమె తన హోటల్‌కి ఆ పేరు పెట్టుకున్నారు. అయితే హోటల్‌లోని పదార్థాలను ఇష్టపడినంతగా ఆ హోటల్ పేరును స్థానికులు ఆస్వాదించలేకపోయారు.



● 'బాటర్డ్ వైఫ్' రెస్టారెంట్
● రెస్టారెంట్ స్పెషల్ ఫిష్ అండ్ చిప్స్

కరెలీన్ కెర్‌కు కష్టకాలం మొదలైంది! పాపం ఆవిడ, చక్కగా నడుస్తున్న తన రెస్టారెంట్‌ను విధిలేని పరిస్థితుల్లో వచ్చేవారం మూసి వేయవలసి వస్తోంది. గత రెండేళ్లుగా ఆమె తన రెస్టారెంట్‌లో చక్కగా వేయించిన రుచికరమైన చేపముక్కల్ని, కరకరలాడే బంగాళా దుంపల చిప్స్‌ని కస్టమర్స్‌కి సర్వ్ చేస్తూ, పేరుతోపాటు డబ్బునూ గడించారు. ఇప్పుడిక బోర్డు తిప్పేయడం తప్ప వేరే మార్గం లేకుండా పోయింది. మహిళా హక్కుల సంఘాల వారు కరెలీన్ ఆ రెస్టారెంట్‌ను పెట్టినప్పటి నుంచి, మరీ ముఖ్యంగా గత మూడు నెలల నుంచి ఆ రెస్టారెంట్ పేరుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. చివరికి వారి పోరాటం ఫలించి, వెంటనే బోర్డును తొలగించి, వేరే పేరు పెట్టుకోవాలని కోర్టు ఆమెను ఆదేశించింది. దాంతో ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌లో ఉన్న ఆ రెస్టారెంట్ ప్రపంచవ్యాప్తం విశేషం అయింది. కరెలీన్ రెస్టారెంట్ పేరు 'బ్యాటర్డ్ వైఫ్'. 'తన్నులు తింటుండే భార్య' అని ఈ మాటకు అర్థం. రోజూ ఇంట్లో చావుదెబ్బలు తినే ఆడవాళ్లను ఈ బోర్డు పరిహసించేలా ఉందని హక్కుల సంఘాల వాదన. అయితే, ''భర్తల్లో ఆలోచన రేకెత్తించి, వారిలో పరివర్తన తెచ్చేందుకే ఈ పేరు పెట్టాను తప్ప వేరే ఉద్దేశం లేదని'' కరెలీన్ చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గృహ హింసపై మూడు నెలల క్రితం విడుదలైన ఒక నివేదిక మహిళా కార్యకర్తల వాదనకు బలం చేకూర్చింది. ఆస్ట్రేలియాలోని ప్రతి ఆరుగురు మహిళల్లో ఒకరు గృహ హింసకు గురవుతున్నారని నివేదిక సారాంశం. ఇంత జరుగుతుంటే ఒక హోటల్‌కు ఇలాంటి పేరేమిటని మహిళా హక్కుల ఉద్యమకారులతో పాటు, వారి వల్ల ప్రభావితం అయిన నాయకులూ కరెలీన్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపారు. చివరికి అనుకున్నది సాధించారు. వారం లోపు రెస్టారెంట్ పేరు మార్చాలని స్థానిక కోర్టు ఒకటి జారీ చేసిన ఉత్తర్వులు కరెలీన్‌కు గత మంగళవారం అందాయి. ''నేనెంత దుఃఖంలో ఉన్నానో చెప్పలేను. నా రెస్టారెంట్ పేరును వెంటనే మార్చడం కుదరదు కనుక రెస్టారెంట్‌నే మూసి వేస్తున్నాను. ఇందుకు నన్ను నా కస్టమర్‌లు క్షమించాలి'' అని కరెలీన్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ కూడా పెట్టారు. మన ఉద్దేశం మంచిదే అయి ఉండొచ్చు. ఆ ఉద్దేశానికి విరుద్ధమైన అర్థం వస్తుంటే కనుక తప్పు మనదే అవుతుంది.

చెట్టు నీడ

తగిన యుక్తి

ఇశ్రాయేలీయులను పరిపాలించిన కనాను రాజు సేనాధిపతి సీసెర చాలా క్రూరుడు. ఇశ్రాయేలీయులను బహుగా హింసించేవాడు. ఒకసారి యుద్ధం జరిగినప్పుడు ఈ సీసెర ఇనుప రథాలతో ఇశ్రాయేలీయులను, వారి పక్షంగా యుద్ధం చేసే బారాకుని చంపాలని బయలుదేరాడు. అయితే ఎంతటి సేనాధిపతి అయినా అవతలి వ్యక్తి బలాన్ని తక్కువ అంచనా వేస్తే ఓడిపోక తప్పదు కదా. సీసెర విషయంలో కూడా ఇదే జరిగింది. తన సైన్యాన్నంతా కోల్పోయి తన రథాలను విడిచి బారాకు తరుముతున్నప్పుడు కాలినడకన అక్కడినుండి పారిపోవడం మొదలు పెట్టాడు. అలా వెళ్లిన సీసేరాకు ఒక స్త్రీ కనిపించింది. స్త్రీనే కదా, తనకు ఇక ప్రాణహాని ఉండదు.. నిశ్చింతగా ఉండొచ్చు అనుకుని దాహం ఇమ్మని ఆ స్త్రీని ఆజ్ఞాపించాడు. అప్పుడు ఆ స్త్రీ నీళ్లకు బదులుగా పాలిచ్చి అతడిని నమ్మించింది. ఇక ఈ స్త్రీ వల్ల తనకు హాని లేదని అనుకుని ఆ స్త్రీని గుడారానికి కాపలాగా ఉంచి ''ద్వారంలో నిలిచి ఎవరైనా వచ్చి అడిగితే ఎవరూ లేరని చెప్పు'' అని ఆదేశించి, తాను లోపల పడుకున్నాడు. ఇశ్రాయేలీయులను హింసిస్తున్న సీసెర మీద కోపంతో ఉన్న ఈ స్త్రీ ఈ అవకాశాన్ని వదులుకోవాలని అనుకోలేదు. పాలు తాగి గాఢ నిద్రలో ఉన్న సీసెరాని గుడారపు మేకుతో సుత్తి చేత పట్టుకుని పొడిచి చంపేసింది. సీసెరా పీడ నుండి ఇశ్రాయేలీయులను విడిపించింది. ఎంతో గర్వంగా ప్రవర్తించిన ఒక రాజ్య సేనాధిపతి దారుణంగా చనిపోయాడు.

ఇక్కడ ఈ స్త్రీ గొప్పతనాన్ని గురించి మనం చెప్పుకోవాలి. అవకాశం దొరకగానే చాలా తెలివిగా ప్రవర్తించి నీళ్లడిగితే పాలిచ్చి అతడిని గాఢ నిద్రలోనికి జారుకునేటట్లు చేసింది. అతడి బలాన్ని చూసి భయపడకుండా అతడు పడుకోగానే ఎవరికైనా చెబుదామని వెళ్లలేదు. తాను వెళితే అతడు లేస్తే మళ్లీ బలం తెచ్చుకుంటాడేమోనని ఆలోచించింది. తన ప్రాణానికి తెగించి అతడిని మట్టుబెట్టింది, చాలా యుక్తిగా, తెలివిగా ప్రవర్తించి తన జాతిని ఆ క్రూరుడి నుండి రక్షించింది. ఇలాంటి స్త్రీలు చరిత్రలో ఎంతో మంది ఉన్నారు.

– రవికాంత్ బెల్లంకొండ

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి: మొదలయ్యే హృదయం సవ్వడి
గర్భాన తొలిగా
గర్భాల ఆటే ఆడి ఆగేనే తుదిగా
గగనాలే గర్జించేను తలబడితే మేఘాలే
సంద్రాలే హోరెత్తేను కలబడితే అలలే
దేహం ప్రాణం ఆడే క్షణం
ఈ విశ్వం తాళమయం
సర్వం సర్వం తాళమయం
ఈ విశ్వం తాళమయం–తాళం లేక ఏది జగం

మొలిచేటి రెక్కల్లో పిలిచేనీ తాళం
జర జర జర జారే కొండల ధ్వనిలోని చలనం
గలగలగల పారే నదుల ధ్వనిలోని గమనం
కు కు కు కూసే కోయిల ధ్వనిలోని మధురం
కిల కిల కిల ఊగే కొమ్మల ధ్వనిలోని తన్మయం
దేహం ప్రాణం ఆడే క్షణం
ఈ విశ్వం తాళమయం
సర్వం సర్వం తాళమయం
ఈ విశ్వం తాళమయం–తాళం లేక ఏది జయం

పిపీలకం సరాల నడకే
వింటే స్వర తాళం కదా
మొగ్గే తుంచే తేనే జుర్రేసే
భ్రమరాల సడి తాళం వెయ్యదా

నేలా మేఘాన మోగించే వాన
నాట్యం చేసే చిటపట చినుకే
నీలో నిప్పు చప్పుళ్లే అవీ
నువ్వు నేనూ కాలాన్నీ తాళం
జన్మించాం కలిసిన లయలో
జీవించాం కళలల లయలో
తై తై తై దిత్తై లయలో – తై తై తై తకధోం

ఈ విశ్వం తాళమయం
సర్వం సర్వం తాళమయం
ఈ విశ్వం తాళమయం
తాళం లేక ఏది జయం

॥ మొదలయ్యే ॥

చిత్రం : సర్వం తాళమయం
రచన : రాకేందు మౌళి
గానం : హరిచరణ్
సంగీతం : ఏఆర్ రెహమాన్

కట్‌చేయ్...దాచేయ్...

కాసుకో సుడోకు

		4	1					
		9	4				2	
		2	6			3		8
	6		8	4	3		9	
2	8	5				4	3	1
4	9		2	1	5		8	
3		6			9	5		
	2				1	9		
					4	8		

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	5	7	9	3	1	8	4	2
2	9	3	6	4	8	7	5	1
4	8	1	7	2	5	6	9	3
9	4	5	2	6	7	3	1	8
1	7	2	4	8	3	5	6	9
8	3	6	5	1	9	2	7	4
5	1	4	3	7	2	9	8	6
3	6	9	8	5	4	1	2	7
7	2	8	1	9	6	4	3	5

సకల కళలు

తనిష్క్ రెడ్డి, మేఘ్లా ముక్తా జంటగా శివగణేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సకల కళా వల్లభుడు'. 'సుబ్రమణ్యపురం' నిర్మాత బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో సింహా ఫిలింస్, దీపాల ఆర్ట్స్ పతాకాలపై అనిల్, త్రినాథ్, కిషోర్, శ్రీకాంత్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రనిర్మాతలు మాట్లాడుతూ– ''అవుట్ అండ్ అవుట్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రమిది. హీరో నటన, కథ, కథనాలు హైలెట్‌గా నిలుస్తాయి. ఇంటర్వెల్ సీన్ ఉత్కంఠ రేకెత్తిస్తుంది. నేపథ్యసంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ'' అన్నారు. ''ఒక హిట్ చిత్రానికి కావాల్సిన ఎలిమెంట్స్ అన్నీ మా సినిమాకి కుదిరాయి. పృథ్వీ, జీవాల కామెడీ సన్నివేశాలు ఓ ఆకర్షణ. పాటలు మాస్ ఆడియన్స్‌ని అలరిస్తాయి'' అన్నారు శివ గణేష్. ఈ చిత్రానికి కెమెరా: సాయి చరణ్, సంగీతం: అజయ్ పట్నాయక్.



● తనిష్క్ రెడ్డి, మేఘ్లా

నాన్ నన్‌చాకు తిప్పితే..!



● రజనీకాంత్

● రజనీతో పీటర్

రజనీకాంత్... సింపుల్‌గా సింగిల్ టేక్‌లో బబుల్‌గమ్‌ని చేతిలోకి విసిరి నోట్లో వేసుకోగలరు. రూపాయి బిళ్లను గాల్లో విసిరి జేబులో పడేయగలరు. సిగిరెట్‌ను ఎగరేసి అవలీలగా నోటితో క్యాచ్ చేయగలరు. ఇదంతా ఆన్ స్క్రీన్ మీద మనకు కనిపించేది. కానీ ఆఫ్ స్క్రీన్ ఎన్నో రోజుల ప్రాక్టీస్ ఉంటుందట. అలాంటి ఓ విషయాన్నే పంచుకున్నారు ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్. రజనీకాంత్ నటించిన 'పేట్టా' (తెలుగులో 'పేట') ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఇంటర్వెల్ ముందొచ్చే ఫైట్‌లో రజనీకాంత్ 'నాన్ (నేను) 'నన్‌చాకు' (కరాటే స్టిక్స్)ని తిప్పితే అనే డైలాగ్ చెప్పలేదు కానీ.. తిప్పుతూ విలన్స్‌ను రఫ్ ఆడిస్తారు. ఆ సన్నివేశాలకు థియేటర్లు విజిల్స్‌తో దద్దరిల్లిపోయాయని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ సీన్ ఇంత బాగా రావడానికి సుమారు 50 రోజుల కష్టం ఉందట. 50 రోజులపాటు నన్‌చాకు తిప్పడం ప్రాక్టీస్ చేశారట రజనీకాంత్. ఈ ఫైట్ గురించి పీటర్ హెయిన్ మాట్లాడుతూ – ''పేట్టాలో ఒక ఫైట్ సన్నివేశానికి ఏదైనా స్పెషల్‌గా, రజనీకాంత్ గారు ఇంతకు ముందు ఎప్పుడూ చేయనిది చేయాలని ప్లాన్ చేశాం. కొన్నిరోజులు ఆలోచించాక నన్‌చాకుతో ఫైట్ ప్లాన్ చేశాను. ఈ ఐడియా చిత్రదర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్‌కు చాలా నచ్చింది. షూటింగ్‌కు రెండు నెలల ముందు రజనీసార్‌తో చెప్పాను. సుమారు 50 రోజుల పాటు తీవ్రంగా ప్రాక్టీస్ చేశారాయన. స్క్రీన్ మీద చాలా ఈజీగా కనిపిస్తున్నా చాలా ప్రాక్టీస్ దాగి ఉంది అందులో. ప్రస్తుతం ఆ ఫైట్‌కు ఫ్యాన్సంతా విజిల్ కొడుతున్నారు, సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారాయన.

నువ్విక్కడుంటే బాగుండు



● శ్రుతీహాసన్

'యు ఆర్ బ్యూటిఫుల్ ఇన్‌సైడ్' అంటూ ఓ సినిమాలో హీరో శ్రుతీహాసన్‌ను పొగుడుతాడు. వెంటనే ఇద్దరూ ఓ డ్యూయెట్ పాడుకుంటారు. అది తెరమీద ఎవరో రాసిన డైలాగ్. కానీ శ్రుతీహాసన్ పుట్టిన రోజున అదే డైలాగ్‌ను కొట్టారు మైఖేల్ కోర్సలే. శ్రుతీహాసన్ బాయ్‌ఫ్రెండే మైఖేల్ అని చెప్పక్కర్లేదు. పుట్టినరోజు శుభాకాంక్షల్లో ప్రేమను వొలకబోయడమే కాదు, 'గాళ్‌ఫ్రెండ్' అని సంబోధించారు కూడా. వీళ్లిద్దరూ గతేడాది నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ప్రేమను పంచుకుంటున్నారే తప్ప ప్రేమికులమని ప్రకటించలేదు. ప్రేయసి బర్త్‌డే రోజున ''పుట్టినరోజు శుభాకాంక్షలు డార్లింగ్. యు ఆర్ బ్యూటిఫుల్ ఇన్‌సైడ్ అండ్ అవుట్‌సైడ్. నీలాంటి గాళ్‌ఫ్రెండ్ ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. లవ్ యు బేబి. ఈ రోజుని అద్భుతంగా గడుపుతావని అనుకుంటున్నాను'' అని లండన్ నుంచి శుభాకాంక్షలు పంపారు మైఖేల్. దానికి సమాధానంగా శ్రుతీ ''లవ్ యు టూ డార్లింగ్. నువ్విక్కడుంటే బావుణ్ణు'' అని స్పందించారు. కెరీర్ పరంగా శ్రుతీహాసన్ కొత్త సినిమాలేవీ సైన్ చేయలేదు. ఇటీవలే లండన్‌లో సొంతంగా ఓ మ్యూజికల్ షో నిర్వహించారు. దానికి విశేషమైన స్పందన లభించింది. కొన్ని రోజులు యాక్టింగ్‌కు బ్రేక్ ఇచ్చి మ్యూజిక్ వైపు శ్రద్ధ చూపాలనుకుంటున్నారని టాక్.



● సముద్రఖని

ఆలస్యం చేయకుండా అంగీకరించా!

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ప్యాన్ ఇండియా లుక్ తీసుకొచ్చే ప్లాన్‌లో కనిపిస్తున్నారు రాజమౌళి. అందులో భాగంగానే ప్రతి ఇండస్ట్రీ నుంచి ఒక్కో యాక్టర్‌ను ప్రాజెక్ట్‌లో భాగం చేస్తున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా డీవీవీ దానయ్య నిర్మిస్తున్న చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' (వర్కింగ్ టైటిల్). రాజమౌళి దర్శకుడు. 'ఆర్‌ఆర్‌ఆర్'లో తమిళ దర్శకుడు, నటుడు సముద్రఖని ముఖ్యపాత్రలో కనిపిస్తారన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడం గురించి సముద్రఖని మాట్లాడుతూ – ''నా తమిళ చిత్రం 'నాడోడిగళ్' చూసిన తర్వాత నన్ను ప్రశంసిస్తూ రాజమౌళిగారు నాకో పెద్ద మెసేజ్ పంపారు. అప్పటి నుంచి మేం టచ్‌లోనే ఉన్నాం. ఇటీవల రాజమౌళిగారు నన్ను వాళ్లింటికి ఆహ్వానించి వాళ్ల కుటుంబ సభ్యులందరికీ పరిచయం చేశారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో ఓ కీలక పాత్ర ఉంది.. చేస్తారా అని అడిగారు. వెంటనే అంగీకరించాను'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో ఓ హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ పరిణితీ చోప్రాను తీసుకున్నట్లు సమాచారం. 2020లో ఈ సినిమా రిలీజ్ కానుంది.

ఇస్మార్ట్ గర్ల్



● నిధీ అగర్వాల్

'ఇస్మార్ట్ శంకర్'కి జోడీగా నటించే గర్ల్ ఎవరు? అంటూ గత కొన్ని రోజులుగా వస్తున్న వార్తలకి ఫుల్‌స్టాప్ పడింది. ఈ సినిమా స్టార్ట్ అయినప్పటి నుంచి హీరో రామ్ సరసన పలువురి కథానాయికల పేర్లు హల్‌చల్ చేశాయి. ఫైనల్లీ ఇస్మార్ట్ శంకర్‌తో జోడీ కట్టే చాన్స్ అందుకుని ఇస్మార్ట్ గర్ల్ అనిపించుకున్నారు నిధీ అగర్వాల్. అన్న నాగచైతన్య 'సవ్యసాచి' సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమకి ఎంట్రీ ఇచ్చిన నిధీ అగర్వాల్ తాజాగా తమ్ముడు అఖిల్‌తో 'మిస్టర్ మజ్ను' అంటూ ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఇప్పుడు 'ఇస్మార్ట్ శంకర్' అవకాశం దక్కించుకున్నారు. హిందీ చిత్రం 'మున్నా మైఖేల్'తో కథానాయికగా పరిచయమైన నిధి ఆ తర్వాత తెలుగుకి వచ్చారు. ఇప్పుడు హిందీలో 'ఇక్కా' అనే చిత్రం అంగీకరించారట. ఇక 'ఇస్మార్ట్ శంకర్' విషయానికొస్తే.. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ బ్యానర్స్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే మొదలైంది. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: లావణ్య, సంగీతం: మణిశర్మ, కెమెరా: రాజ్ తోట.

సిమ్రాన్‌కి జరిగిందే మణికర్ణికకూ జరిగింది

– అపూర్వ



● క్రిష్



● అపూర్వ

''దర్శకుడు క్రిష్ 'మణికర్ణిక'ను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోవడంతో దర్శకత్వ బాధ్యతలను చేపట్టాల్సి వచ్చింది'' అని ఆ చిత్రం రిలీజ్ ముందు కంగనా రనౌత్ పేర్కొన్నారు. అయితే ఇటీవల బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మణికర్ణిక' సినిమాకు సంబంధించిన పలు విషయాలు పేర్కొన్నారు క్రిష్. ''మణికర్ణిక' సినిమాను జూన్‌లోనే పూర్తి చేశాను. అన్ని పాత్రలు డబ్బింగ్ కూడా చెప్పేసుకున్నారు. అప్పుడు 'మెంటల్ హై క్యా' షూటింగ్ నిమిత్తం లండన్‌లో ఉన్నారు కంగనా. ఇండియా వచ్చిన తర్వాత నేను చిత్రీకరించిన విధానం నచ్చలేదని నిర్మాణ సంస్థను నమ్మించారు. భోజ్‌పూరి సినిమాలా ఉందని వాళ్లతో పేర్కొన్నారు. సినిమా మొత్తం తన చుట్టూనే తిరగాలన్నట్టు కంగనా ప్రవర్తన ఉండేది. సోనూసూద్ పాత్ర సుమారు 100 నిమిషాలు ఉండేది. దాన్ని 60 నిమిషాలకు కుదించేయడంతో ఆయన తప్పుకున్నారు తప్పితే లేడీ డైరెక్టర్‌తో యాక్ట్ చేయను అనే కారణం కాదు. ఫస్ట్ హాఫ్‌లో ఓ 25 శాతం సెకండ్ హాఫ్‌లో 15 శాతం మాత్రమే కంగనా రనౌత్ డైరెక్ట్ చేశారు'' అంటూ తెర వెనుక జరిగిన అసలు విషయాన్ని పంచుకున్నారు. క్రిష్ పేర్కొన్న విషయాలకు బాలీవుడ్ దర్శకుడు, స్క్రీన్ రైటర్ అపూర్వ అశ్రాని మద్దతు తెలిపారు. ''నేను 'సిమ్రాన్' అనే సినిమాను ఎంతో ప్రేమతో రాశాను. అయితే కంగనా రనౌత్ మాత్రం మిగతా పాత్రల డైలాగ్స్, సీన్స్‌ను తగ్గించేశారు. 'మణికర్ణిక'కు ఏం జరిగిందని క్రిష్ చెబుతున్నారో 'సిమ్రాన్' విషయంలోనూ అలానే జరిగింది. స్క్రిప్ట్ చాలా బావుందని చెప్పి, తర్వాత తన ఇష్టమొచ్చినట్టు మార్చేసిందామె. క్రిష్ ధైర్యానికి, నిజాయితీకి సెల్యూట్ చేస్తున్నాను'' అని పేర్కొన్నారు అపూర్వ. కంగనా రనౌత్ పై క్రిష్ చేస్తున్న ఆరోపణలకు కంగనా చెల్లెలు రంగోలి స్పందించారు. ''క్రిష్‌గారు.. సినిమా మొత్తం మీరే డైరెక్ట్ చేశారు. కొంచెం కామ్‌గా ఉండండి. సినిమాకు హీరోయిన్ కంగనే కదా. ప్రస్తుతం తన సక్సెస్‌ను ఎంజాయ్ చేయనివ్వండి'' అని పేర్కొన్నారు. ఈ కామెంట్స్ గురించి కంగనా ఎలా స్పందిస్తారో చూడాలి



● సెల్వరాఘవన్, రకుల్

చెన్నై టు ముంబై

ఒక సినిమా సెట్ నుంచి మరో సినిమా సెట్స్‌కు పరుగులు తీయడం హీరోయిన్స్ రొటీన్‌లో భాగం. ప్రస్తుతం రకుల్ ప్రీత్‌కు చెన్నై వీడ్కోలు చెప్పగానే ముంబై వెల్కమ్ చెప్పింది. సూర్య హీరోగా సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యన్‌జీకే'. ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేశారు రకుల్. ''జీనియస్ సెల్వరాఘవన్ సార్‌తో పని చేయడం అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్. మీ అందరికీ సినిమా ఎప్పుడు చూపించాలా అని ఎదురు చూస్తున్నాను. హిందీ సినిమా 'మర్జావా' షూటింగ్‌కు కోసం ముంబై పిలిచింది'' అని పేర్కొన్నారు రకుల్. చెన్నైకు టాటా చెప్పగానే ముంబై రకుల్‌కు వెల్కమ్ చెప్పిందన్నమాట.




● శ్రద్ధా శ్రీనాథ్

ఆ వార్తలు నిజమే

''అజిత్ కొత్త సినిమాలో నేను హీరోయిన్‌గా చేస్తున్నట్లు ఈ మధ్య వార్తలు వచ్చాయి. ఆ వార్తలు నిజం అని చెప్పడానికి సంతోషిస్తున్నా'' అని హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు. బాలీవుడ్ హిట్ చిత్రం 'పింక్' తమిళంలో అజిత్ హీరోగా రీమేక్ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎంపికైనట్టు పేర్కొన్నారు శ్రద్ధా. ''ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడం కోసం ఇన్ని రోజులు మౌనంగా ఉండటం కష్టంగా అనిపించింది. అజిత్ సార్‌తో నటించడం సంతోషంగా ఉంది. నా కెరీర్‌లో చాలెంజింగ్ రోల్ ఇది. హెచ్.వినోద్ దర్శకత్వంలో బోనీ కపూర్‌గారు నిర్మిస్తారు. ప్రస్తుత సమాజానికి చెప్పాల్సిన కథ ఇది. హిందీలో తాప్సీ పోషించినపాత్రలో కనిపిస్తాను'' అన్నారు శ్రద్ధా. ఈ చిత్రం మే 1న రిలీజ్ కానుంది.

నా బయోపిక్‌కి తనే కరెక్ట్



● ఆమిర్ ఖాన్

ప్రస్తుతం సౌత్ నుంచి నార్త్ వరకూ అన్ని ఇండస్ట్రీల్లో బయోపిక్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు దర్శక–నిర్మాతలు. కొందరు ఆర్టిస్టులు కూడా తమ బయోపిక్ వెండితెరకు వస్తే బాగానే ఉంటుందనుకుంటున్నారు. ఆ లిస్ట్‌లో ఆమిర్ ఖాన్ ఉన్నారు. ప్రస్తుతం ఆయన 'రుబారు రోషిని' అనే డాక్యుమెంటరీ నిర్మించారు. ఈ చిత్రం ప్రమోషన్‌లో తన బయోపిక్ ప్రస్తావనను తీసుకొచ్చారు. ''ఈ డాక్యుమెంటరీకు దర్శకత్వం వహించింది స్వాతి చక్రవర్తి బత్కల్. ఆమె నా చిన్ననాటి స్నేహితుడి భార్య. వీళ్లిద్దరే నా పెళ్లికి సాక్షులు. నా పెళ్లి చాలా తక్కువ బడ్జెట్‌లోనే ముగించాం. కేవలం 10 రూపాయలు కూడా అవ్వలేదు. అది కూడా మా ఇంట్లో తెలియనివ్వకుండా చేసుకున్నాం'' అని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు ఆమిర్. ఇంట్లో చెప్పకుండా పెళ్లి చేసుకునే అంత ధైర్యం ఎలా వచ్చింది? ఆ సంఘటనలు వివరిస్తారా? అని బాలీవుడ్ మీడియా అడగ్గా– 'నేను చెప్పదలచుకోలేదు. ఒకవేళ నా బయోపిక్ తీస్తే అప్పుడు ఈ సంఘటనలు ఆ దర్శక–నిర్మాతలతో పంచుకుంటాను'' అన్నారాయన. వెంటనే మీ బయోపిక్‌లో నటించడానికి ఎవరైతే బావుంటారు? అని ప్రశ్నించగా ''మా అబ్బాయి జునైద్ అయితే బావుంటాడు అనుకుంటున్నాను. జునైద్ బాలీవుడ్ ఎంట్రీ కోసం ప్రస్తుతం స్క్రిప్ట్స్ వింటున్నాం. యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం థియేటర్ ఆర్టిస్ట్‌గా చేస్తున్నాడు'' అని పేర్కొన్నారు ఆమిర్.

చక్కనమ్మ చిక్కింది



● నిత్యామీనన్

చక్కనమ్మ చిక్కినా అందమే అన్నది నానుడి. మరీ ముఖ్యంగా హీరోయిన్లు బొద్దుగా ఉన్నా సరే.. జీరో సైజ్ అంటూ చిక్కినా సరే.. ప్రేక్షకులు మాత్రం అభిమానించకుండా ఉండలేరు. కెరీర్ తొలినాళ్లలో సన్నగా ఉన్న మలయాళ బ్యూటీ నిత్యామీనన్ ఆ తర్వాత బొద్దుగా తయారయ్యారు. 'మనం బొద్దుగా ఉన్నామా? సన్నగా ఉన్నామా? అన్నది ముఖ్యం కాదు. నటన ముఖ్యం. మన పాత్రలకి న్యాయం చేస్తున్నామా? లేదా? అన్నదే చూడాలి' అంటూ నిత్యామీనన్ ఆ మధ్య పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. ఈ మలయాళ బ్యూటీకి తెలుగులో ఆఫర్లేవీ లేకున్నా తమిళ్, హిందీ చిత్రాలతో బిజీగానే ఉన్నారు. తాజాగా ఓ కొత్త సినిమా అంగీకరించినట్లు ఉన్నారు. 'హైవే పై షూట్.. కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలు త్వరలో చెబుతాను' అంటూ నిత్యామీనన్ సోమవారం సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఆ ఫొటో చూసి బొద్దుగా ఉన్న నిత్య సన్నబడి మునుపటిలా నాజూకుగా ఉన్నారంటున్నారు ఆమె అభిమానులు.


పెద్దోళ్లు కుదరదన్నారు



● ఆది పినిశెట్టి, చంద్రశేఖర్, రవిచంద్ర

రవిచంద్ర, సుమయ హీరో, హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'ఈ 2 మనసులు'. ఆది పినిశెట్టి దర్శకత్వంలో శేఖర్ మూవీస్ పతాకంపై చంద్రశేఖర్ ఎస్. నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్, ఓ పాటను హైదరాబాద్‌లో విడుదల చేశారు. చంద్రశేఖర్ ఎస్. మాట్లాడుతూ– ''లవ్ అండ్ ఫ్యామిలీ సెంటిమెంట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రకథని చాలామంది పెద్ద హీరోల వద్దకు తీసుకెళితే ఎవ్వరూ డేట్స్ ఇవ్వలేదు. బ్యానర్ ఏంటి? సినిమా వస్తుందా? లేదా? అని అడిగేవారు. దీంతో అందరూ కొత్త వాళ్లనే తీసుకున్నాం. ఎప్పటికైనా మాది చాలా పెద్ద బ్యానర్ అవుతుందని ఆశిస్తున్నా. ఇందులోని నటీనటులు, టెక్నీషియన్లు అందరూ కొత్తవాళ్లు అయినా సినిమా చాలా బాగా వస్తోంది. ఇప్పటి వరకూ 70 శాతం షూటింగ్ పూర్తయింది'' అన్నారు. ''ఇదొక ప్రేమకథ. నా తమ్ముడు సత్య ఈ చిత్రం స్క్రిప్ట్ విషయంలో నాకు చాలా సపోర్ట్ చేశాడు. మమ్మల్ని నమ్మి ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతగారికి ఎప్పటికీ రుణపడి ఉంటాం'' అన్నారు ఆది పినిశెట్టి. ''ఈ మధ్య వచ్చిన ప్రేమ కథలకి చాలా భిన్నంగా మా సినిమా ఉంటుంది'' అని రవిచంద్ర అన్నారు. రంగి, మహేశ్, కాదంబరి కిరణ్, తిరుపతి, జావెద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నందన్‌కృష్ణ, సంగీతం: జి.వి.ఎం.గౌతమ్.

సాక్షి సాగుబడి
విజయవాడ
మంగళవారం 29-1-2019



బలమైన సంకల్పంతో ముందుకు సాగుతూ ఉంటే మీ విజయానికి ప్రకృతి కూడా ఉరకలు వేస్తుంది!
- పాలో కోయిలో, ప్రసిద్ధ నవలా రచయిత, బ్రెజిల్

శ్రవణ కార్తె - ఫిబ్రవరి 5 వరకు ; ధనిష్ఠ కార్తె: ఫిబ్రవరి 6 నుంచి

నేలతల్లి ముద్దుబిడ్డల శిగలో పద్మశ్రీలు!

వ్యవసాయానికి మహిళల శ్రమే పట్టుగొమ్మ. అయినా, ఈ రంగం నుంచి పద్మశ్రీ అవార్డును అందుకోవడం అరుదనే చెప్పాలి. ఈ ఏడాది వ్యవసాయ రంగం నుంచి పద్మశ్రీ అవార్డు పొందిన పది మందిలో ఇద్దరు మహిళా రైతులు ఉండటం విశేషం. ఒడిశాకు చెందిన గిరిజన సేంద్రియ మహిళా రైతు కమలా పూజారి ఒకరైతే, బిహార్‌కు చెందిన మహిళా రైతు రాజ్‌కుమార్ దేవి మరొకరు! విశేషమేమిటంటే.. కొద్ది నెలల క్రితమే ఈ ఇద్దరి గొప్పదనం గురించి 'సాక్షి' ప్రచురించింది. వీరిని పద్మశ్రీ పురస్కారం వెదుక్కుంటూ వచ్చిన శుభసందర్భంలో ఈ అద్భుత మహిళా రైతులకు జేజేలు పలుకుదాం..



రైతు పెద్దమ్మ రాజ్‌కుమార్ దేవి!



● పద్మశ్రీకి ఎంపికైన రాజ్‌కుమార్ దేవి

బలమైన సంకల్పం ఉంటే రైతు కుటుంబంలోని సాధారణ గృహిణి కూడా ఇతరులకూ వెలుగుబాట చూపగలిగేంత ఎత్తుకు ఎదగగలరనడానికి రాజ్‌కుమార్ దేవి జీవితమే నిలువుటద్దం. తాజాగా ఆమె పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. బిహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలోని కుగ్రామం ఆనంద్‌పూర్ వాస్తవ్యురాలు. వ్యవసాయం గురించి ఏ కాలేజీలోనూ ఆమె చదువుకోలేదు. తన అత్తింటి వారికి ఉన్న ఎకరం పొలంలో 1980లలో ఒక రోజు స్వయంగా పారను చేతబట్టి స్వేదాన్ని చిందించే క్రమంలోనే ఆ నేల స్వభావాన్ని, ఏయే పంటలు సాగు చేస్తే బతుకులు బాగుపడతాయో అధ్యయనం చేశారు.

30 ఏళ్ల క్రితం తొలిసారి ఆమె పొలంలో కాలు మోపే నాటికి వరి, గోధుమ, నాటు పొగాకు తప్ప వేరే పంటలు ఆ ప్రాంతీయులకు తెలియవు. పండించిన నాటు పొగాకును ఊరూరా తిరిగి అమ్మడానికి భర్త బయలుదేరడంతో ఆమె వ్యవసాయంపై దృష్టి పెట్టడం ప్రారంభించింది. పొగాకు ఒక్కటే పండించడం ఎందుకు? కూరగాయలు, పండ్లు తదితర అనేక పంటలు కలిపి ఎందుకు పండించకూడదని ప్రశ్నించుకుంది. తమ ఎకరం పొలాన్ని మడులుగా విభజించి.. ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు.. వేర్వేరు పంటలు సాగు చేయడం ప్రారంభించింది. కొన్నాళ్లు గడిచే సరికి రాజ్‌కుమార్ దేవి ఒకటికి నాలుగు పంటలు పండించడంలో ప్రయోజనాలను ఆ ఊళ్లో మహిళా రైతులంతా గమనించారు. ఒకరి వెనుక మరొకరు ఆమెను అనుసరించారు.

వ్యవసాయోత్పత్తులకు విలువను జోడించి పట్టణాలకు పంపడంపై ఆమె దృష్టి పెట్టింది. ఇందు కోసం పదేసి మంది మహిళలతో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసింది. వారు తయారు చేసిన ఉత్పత్తులను సేకరించి పట్టణాలకు తరలించి విక్రయించేందుకు తానే ఒక సంస్థను ప్రారంభించింది. ఇంటిపట్టున ఉండి నెలకు రూ. 3 వేల వరకు మహిళలు సంపాయించుకునే దారి చూపింది. తమ గ్రామంతోపాటు ఇరుగుపొరుగు గ్రామాలకు కూడా సైకిల్‌పైనే వెళ్లి మహిళా రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రాజ్‌కుమార్ దేవిని 'రైతు పెద్దమ్మ' అని ఆప్యాయంగా పిలుచుకుంటున్నారు.

సేంద్రియ సేనాని కమలా పూజారి!



● పద్మశ్రీకి ఎంపికైన కమలా పూజారి

కమలా పూజారి వయసు 67 ఏళ్లు. గిరిజన మహిళా రైతు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పత్రాపుట్ గ్రామం ఆమె స్వస్థలం. భుమియ గిరిజన తెగలో పుట్టిన కమలకు దేశీ వరి వంగడాలన్నా, సేంద్రియ వ్యవసాయమన్నా పంచప్రాణాలు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంతో ఆమెకు పేరు ఇప్పుడు దేశమంతటికీ తెలిసింది. అయితే, కొద్ది నెలల క్రితం కూడా ఆమె పేరు ఒడిశాలో మారుమోగింది. అందుకో బలమైన కారణమే ఉంది మరి. ఒడిశా రాష్ట్ర ప్రణాళికా మండలి సభ్యురాలిగా అప్పట్లో కమల నియమితులయ్యారు. అంతేకాదు, ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం మహిళా హాస్టల్ భవనానికి కమల పేరు పెట్టి ఆమెపై గౌరవాన్ని చాటుకుంది రాష్ట్ర ప్రభుత్వం.

కమల నియామక ప్రకటన అందర్నీ ఆశ్చర్యపరచినప్పటికీ.. ఈ పదవి ఆమెకు అంత అయాచితంగా ఏమీ రాలేదు. సుసంపన్నమైన వ్యవసాయ జీవవైవిధ్యానికి.. ముఖ్యంగా అపురూపమైన దేశీ వరి వంగడాలకు ఒడిశాలోని జేపూర్ పెట్టింది పేరు. జేపూర్ బ్లాక్‌లోనే ఉంది కమల స్వగ్రామం పత్రాపుట్. వేలాది ఏళ్లుగా తమవైన విరాజిల్లుతున్న వందలాది దేశీ వరి వంగడాలు అంతరించిపోతుండటం ఆమెను కలవరపరచింది. రసాయనిక వ్యవసాయం పుణ్యమా అని అందుబాటులోకి వచ్చిన కొత్త వంగడాల వల్ల దేశీ వంగడాలు కాలగర్భంలో కలసిపోతుండటం ఆమెకు సుతరామూ నచ్చలేదు. దేశీ వరి వంగడాలు అతివృష్టిని, కరువు కాటకాలను తట్టుకొని నిలబడి.. ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. అంత విలువైన వంగడాల పరిరక్షణ సజావుగా సాగాలంటే సేంద్రియ వ్యవసాయం వ్యాప్తిలోకి తేవాలని కమలా పూజారి దశాబ్దాల క్రితమే గ్రహించారు. ఎమ్మెస్ స్వామినాథన్ ఫౌండేషన్ నేర్పిన మెలకువలు ఆమె తన లక్ష్యంపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించేందుకు తోడ్పడ్డాయి.

లక్ష్య సాధనకు రైతుగా తాను పాటుపడటంతో పాటు తమ గ్రామంలో గడపగడపకు, ఆ ప్రాంతంలోని గ్రామ గ్రామానికీ వెళ్లి ఇదే విషయాన్ని కమల ప్రచారం చేశారు. అవాంతరాలు ఎదురైనా దీక్షతో కదిలారు. ఫలితంగా పత్రాపుట్, ఆ పరిసర గ్రామాల్లో రైతులు రసాయనిక ఎరువుల వాడకం పూర్తిగా నిలిపివేశారు.

ఆమె కృషికి గుర్తింపుగా 2004లో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మహిళా రైతు పురస్కారంతో సత్కరించింది. జోహన్నెస్‌బెర్గ్(దక్షిణాఫ్రికా)లో 2002లో జరిగిన అంతర్జాతీయ సమావేశంలోనూ ఆమె తన గళం వినిపించారు.

ప్రకృతి పంట సరే, ప్రత్యేక మార్కెట్లేవి?



● అల్లిపూడిలో ప్రకృతి వ్యవసాయ వరి పొలంలో రైతు కొండబాబు



ఘన జీవామృతం తయారుచేస్తున్న రైతు



● కొత్తకొట్టాంలో సేంద్రియ కూరగాయలతో రైతు చిటికెల బాపన్నదొర

సామాజిక మాధ్యమాల ప్రభావంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ రానురాను పెరుగుతోంది. రసాయనాలు లేని ఆహార ధాన్యాలను కొనుగోలు చేయడానికి వినియోగదారులు కూడా ముందుకొస్తున్నారు. ఆరోగ్యం ముఖ్యమని భావించేవారు ధర కొంచెం ఎక్కువైనా పర్వాలేదంటూ ప్రకృతి వ్యవసాయోత్పత్తుల పట్ల ఆసక్తి చూపుతున్నారు. అయితే, ప్రత్యేక మార్కెటింగ్ వ్యవస్థ లోపించడం వల్ల రైతులు ఈ ఉత్పత్తులను ఎవరికి వారు రిటైల్‌గా ఏడాది పొడవునా అమ్ముకోవాల్సి వస్తోంది. అప్పులు తెచ్చి వ్యవసాయం చేసే చిన్న రైతులకు, ముఖ్యంగా కౌలు రైతులకు ఈ పరిస్థితి ఇబ్బందిగా మారింది.

'ఒక్క ఆవుతో 30 ఎకరాల సాగు' పేరుతో 'సాక్షి' దిన పత్రికలో వెలువడిన కథనంతో స్ఫూర్తి పొంది తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన ఔత్సాహిక రైతులు కొందరు 2012లో తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రకృతి వ్యవసాయ ప్రచారకర్త సుభాష్ పాలేకర్ నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరయ్యారు. పంట పొలాల్లో ఆహార ధాన్యాలతో పాటు ఇంటి పెరట్లో కూడా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు తింటే ఆరోగ్యంగా ఉంటామని పాలేకర్ చెప్పిన మాటలకు ఆకర్షితులై కొంత మంది రైతులు ప్రయోగాత్మకంగా అప్పట్లోనే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించారు. అలా ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయం దినదినాభివృద్ధి చెంది రైతులు ఈ సాగు ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. కోటనందూరు మండలం అల్లిపూడి, కొత్తకొట్టాం గ్రామాల్లో 30 మంది రైతులు సుమారు 100 ఎకరాల్లో గత ఏడేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. అల్లిపూడి గ్రామంలో రుత్తల నాగన్నదొర, చింతకాయల దేవుళ్ళు మాస్టారు, చింతకాయల కొండబాబు తదితర రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి, అపరాలు, కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. కొత్తకొట్టానికి చెందిన చిటికెల బాపన్నదొర అనే రైతు ఎంతో ఆసక్తితో తన కున్న ఆరున్నర ఎకరాల పొలంలో వరి, పత్తి, పామాయల్, కూరగాయలు, బొప్పాయి పంటలను పండిస్తున్నారు. ఈ రైతులంతా ఎటువంటి పరిస్థితుల్లో కూడా రసాయనిక ఎరువులు వాడకుండా పూర్తి స్థాయిలో దేశీ ఆవు పేడ, మూత్రాలతో మాత్రమే వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



● పురుగు మందులుగా వాడే ఎమినోయాసిడ్, అగ్నాస్త్రం



● నాటు ఆవుతో రైతు

నేల మెతకదనం, రంగు, వాసన మారింది

ఆరేడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలంలో భూసారం క్రమంగా పెరుగుతోందని.. ఈ పొలంలో నేల మెతకదనం, రంగు, వాసన మారిందని చింతకాయల దేవుళ్లు మాస్టారు అన్నారు. ఈ భూమిలో గతంలో వేసిన పిండి(రసాయనిక ఎరువులు), పురుగుమందుల అవశేషాలు పోయేసరికి నేల మారిందని కూలీలే చెబుతున్నారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతం పెద్దగా వేయకపోయినా ఈ పొలంలో పంట పండుతుంది. వచ్చే ఏడాది జీవామృతం వేయకపోయినా పంట పండుతుందనుకుంటున్నానని దేవుళ్లు మాస్టారు తెలిపారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ, ఆసక్తి ఉంటే, ఆచరణలో కొద్దిపాటి కష్టమైనప్పటికీ, ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ఈ రైతులు చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయోత్పత్తులు తింటే మనుషుల శరీరంలోని అనేక రుగ్మతలు దూరమవుతాయని చెబుతున్నారు. అయితే, ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడమే ప్రకృతి వ్యవసాయ వ్యాప్తికి అవరోధంగా నిలుస్తోందంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రభుత్వం నానా హడావుడి చేస్తుందే తప్ప తమకు ఏ విధమైన ప్రోత్సాహం అందించడం లేదని రైతులు చెబుతున్నారు. ఆత్మ, వ్యవసాయ శాఖ సిబ్బందికి అవసరమైనప్పుడు కేవలం ఫొటోలకు పరిమితమౌతున్నారు తప్ప వారితో ప్రకృతి వ్యవసాయదారులకు ఒనగూరిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో నిజమైన రైతులకు అవి చేరడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆసక్తి ఉన్నా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించడం లేదంటున్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు ఇతోధికంగా రుణాలివ్వడం, ప్రత్యేక మార్కెటింగ్ సదుపాయాలను కల్పించడం ద్వారా సహకరిస్తే ఈ వ్యవసాయం మరింత అభివృద్ధి చెందుతుందంటున్నారు.

– రెడ్డి చిట్టిబాబు, తుని టౌన్/ ఆలంక కుక్కుటేశ్వరరావు, కోటనందూరు, తూ.గో. జిల్లా

ఎవరికి వాళ్లమే అమ్ముకుంటున్నాం..



నాకు తాండవ కాలువ కింద రెండెకరాల పొలం ఉంది. ఏడేళ్ల క్రితం తిరుపతి మహతి ఆడిటోరియంలో పాలేకర్ శిక్షణ గురించి 'సాక్షి'లో చదివి అక్కడికి వెళ్లి శిక్షణ పొందాం. అప్పటి నుంచి వరి, అపరాలను పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే సాగు చేస్తున్నా. ఈ ఏడాది 5 సార్లు జీవామృతం పారించాను. ఎకరానికి 38 బస్తాల ధాన్యం పండింది. మినుము, పెసర వేశాం. మా వూళ్లో 30 ఎకరాల వరకు 18 మంది రైతులు సాగు చేస్తున్నాం. మమ్మల్ని చూసి కొత్తకొట్టాం గ్రామంలో రైతులూ ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. మార్కెటింగ్ సదుపాయం లేదు. కొందరు ఉద్యోగులు మంచి ధర ఇచ్చి కొంటున్నారు. వ్యాపారస్తులు బాగా తక్కువకు అడుగుతున్నారు. ఇవ్వటం ఇష్టం లేక ఒక్కో బస్తా ఏడాది పొడవునా బ్యాంకులు, ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రుల దగ్గర బియ్యాన్ని ఎవరికి వాళ్లమే అమ్ముకుంటున్నాం. రైతులతో సహకార సంఘం పెడదామని ప్రయత్నించా. రైతులు కలిసి రావటం లేదు. మొత్తంగా ఒకసారి అమ్మితేనే రైతు అవసరాలు తీరతాయి. ప్రభుత్వమే కొనాలి లేదా మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. కొనుక్కునే వాళ్లను చూపించినా సరే. వ్యవసాయశాఖ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తే ఎక్కువ మంది రైతులు ఈ సాగు విధానంలోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం సొంత ఆసక్తితోనే రైతులు వ్యవసాయం చేస్తున్నారు.

– రుత్తల నాగన్నదొర (62812 87367), ప్రకృతి వ్యవసాయదారుడు, అల్లిపూడి, కోటనందూరు మం., తూ.గో. జిల్లా

ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ప్రభుత్వమే కొనాలి



ఐదేళ్లుగా 3 ఎకరాల కౌలు పొలంలో వరి, అపరాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్నా. మొదట్లో వరి దిగుబడి ఎకరానికి 20 బస్తాలకు తగ్గింది. ఏటా రెండేసి బస్తాల చొప్పున పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాది 35 వరకు రావచ్చు. ఇది చాలా హెల్దీ ఫుడ్. ఈ ఆహారం విలువ తెలిసిన ఉద్యోగులు 25 కిలోల సన్నబియ్యం రూ. 1,300కు కొనుక్కెళ్తున్నారు. అయితే, ఒక్కో బస్తా అమ్ముకోవాల్సి వస్తున్నది. ప్రకృతి వ్యవసాయానికి పెట్టుబడి తక్కువే గానీ యాతన ఎక్కువ. తొలిదశలో దిగుబడి తగ్గి, క్రమంగా పెరుగుతుంది. అప్పుడు రైతు నిలబడాలంటే ప్రభుత్వం మండలం లేదా డివిజన్ స్థాయిలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలి. ప్రకృతి వ్యవసాయదారులకు ప్రభుత్వం రుణాలు ఇస్తే ఎక్కువ మంది రైతులు ఈ వ్యవసాయంపై మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పంట భూమిని సారవంతం చేసుకునే వీలుంటుంది. హరిత విప్లవం పూర్వ పద్ధతులను కాపాడుకుంటూ, మనలను మనం సంరక్షించుకునే సదవకాశం ప్రకృతి వ్యవసాయం కల్పిస్తుంది.

– చింతకాయల దేవుళ్ళు మాస్టారు (94412 10809), ప్రకృతి వ్యవసాయదారుడు, అల్లిపూడి, కోటనందూరు మం., తూ.గో. జిల్లా

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఎంతో నిష్ఠగా కష్టపడి పండించిన పంటకు సరైన గిట్టుబాటుధర లభించడం లేదు. రైతులకు అందుబాటులో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. దిగుబడి వచ్చిన వెంటనే అమ్ముకునే పరిస్థితి లేక ఏడాదంతా ఇంటిలో ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

– చిటికెల బాపన్నదొర (78932 03656), ప్రకృతి వ్యవసాయదారుడు, కొత్తకొట్టాం, కోటనందూరు మం., తూ.గో. జిల్లా

3న పద్మారంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

గ్రామభారతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 (ఆదివారం)న రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం పద్మారంలో పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సీనియర్ రైతు మనోహరాచారి తన వ్యవసాయ క్షేత్రంలో రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉ. 10 గం.– సా. 4 గం. వరకు శిక్షణ ఉంటుంది. ప్రవేశ రుసుము : రూ. వంద. వివరాలకు.. 97057 34202.

3న కొర్నెపాడులో పండ్లు, కూరగాయల సాగుపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడి గుంట దగ్గరలోని కొర్నెపాడులో ఫిబ్రవరి 3 (ఆదివారం)న ప్రకృతి వ్యవసాయ విధానంలో పండ్ల తోటలు, కూరగాయల సాగుపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉద్యాన సహాయ సంచాలకులు రాజా కృష్ణారెడ్డి, డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ రైతులకు శిక్షణ ఇస్తారు. ఉద్యాన శాఖ రాయితీలనూ తెలియజేస్తారు. ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు శిక్షణ ఉంటుంది. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 97053 83666, 0863–2286255.

16 నుంచి పర్మాకల్చర్ డిజైన్ కోర్సు



అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్స్ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ శాశ్వత వ్యయసాయ (పర్మాకల్చర్) నిపుణులు కొప్పుల నరసన్న ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు పర్మాకల్చర్‌పై శిక్షణా శిబిరం(పర్మాకల్చర్ డిజైన్ కోర్సు) జరగనుంది. జహీరాబాద్ సమీపంలోని బిడకన్నె గ్రామంలో అరణ్య సంస్థ ఏర్పాటు చేసిన సుసంపన్న శాశ్వత వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ ఉంటుంది. నరసన్న, పద్మతోపాటు పలువురు నిపుణులు అనేక అంశాలపై శిక్షణ ఇస్తారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. 79817 55785, 040 – 24142295.

మార్చిలో హైదరాబాద్‌లో సేంద్రియ ఉత్పత్తుల మేళా

అమృతాహారాన్ని పండిద్దాం, ఆరోగ్య తెలంగాణను సాధిద్దాం అన్న నినాదంతో మార్చి 1,2,3 తేదీల్లో హైదరాబాద్(హైటెక్ సిటీ) శిల్పారామం నైట్ బజార్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి సేంద్రియ మేళా నిర్వహించనున్నట్లు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం తెలంగాణ అధ్యక్షులు డా. ఎ. వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం రాజు (76598 55588) తెలిపారు. సేంద్రియ రైతుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలతోపాటు ప్రముఖ స్వతంత్ర శాస్త్రవేత్త, అటవీ కృషి నిపుణులు డా. ఖాదర్ వలి తదితరులతో మూడు రోజులూ అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. అటవీ చైతన్య ద్రావణం పంపిణీ చేస్తారు. స్టాల్స్, ఇతర వివరాలకు.. 76598 55588, 91001 02229.

● నివాళి

ఎక్స్‌గ్రేషియా కోసం మూడేళ్ల వేదన



కుమార్తెతో వరలక్ష్మి



సుబ్రమణ్యం (ఫైల్)

వ్యవసాయ జూదంలో ఓడి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న యువ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం విస్మరించడంతో ఆ కుటుంబం మూడేళ్లుగా దుర్భర జీవితం గడుపుతోంది. ప్రభుత్వ సాయం అందక, పూట గడవని స్థితిలో ఆ కుటుంబం సమస్యలతో సహజీవనం చేస్తోంది. కర్నూలు జిల్లా కోవెలకుంట్ల మండలం రేవనూరు గ్రామానికి చెందిన వరకుటి సుబ్రమణ్యం అప్పుల బాధ తాళలేక 2015 ఫిబ్రవరి 2న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎకరాకు రూ. 10 వేలు కౌలు చెల్లించి ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని జొన్న పంట సాగు చేశాడు. రసాయనిక ఎరువులు, విత్తనాలు, కౌలు, తదితర పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 2 లక్షలు అప్పు చేశాడు. వర్షాభావంతోపాటు వాతావరణం అనుకూలించక పంట ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. పైరు బొందుపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుబ్రమణ్యంకు రెండేళ్ల కుమార్తె సుస్మితతోపాటు భార్య వరలక్ష్మి ఉన్నారు. భర్త చనిపోయే నాటికి గర్భవతిగా ఉన్న ఆమె ఆరు నెలలకు ఆమె మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అభం, శుభం తెలియని వయస్సులో ముక్కుపచ్చలారని చిన్నారులకు తండ్రి దూరం కాగా భర్త మరణంతో కుటుంబ పోషణ ఆ ఇల్లాలిపైనే పడింది. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో ప్రభుత్వం ఆదుకుంటుందని భావించింది. అధికారులు రెండు, మూడుసార్లు ఇంటి వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారే తప్ప ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థికసాయం చేయకపోవడంతో మూడేళ్లుగా ఆ కుటుంబం అష్టకష్టాలు పడుతోంది. తల దాచుకునేందుకు ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో వ్యవసాయ కూలి పనులకు వెళుతూ వరలక్ష్మి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. చిన్న కుమార్తె రేవతి పుట్టిన ఏడాదికే అనారోగ్యం బారిన పడి చనిపోయింది. పెద్ద కుమార్తెను, వృద్ధుడైన మామ వెంకటసుబ్బయ్యను కాయకష్టంతో పోషించుకుంటూ రేవతి కాలం వెళ్లదీస్తోంది. ప్రభుత్వం కరుణించి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేస్తున్నారు.

– కె. మౌలాలి, సాక్షి, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లా

టవర్ గార్డెన్ భేష్!


తక్కువ స్థలంలో ఎక్కువ ఆకుకూరలు, కూరగాయలనే కాదు కషాయాల కోసం అనేక రకాల ఔషధ మొక్కలను సైతం పెంచుకోవడానికి వీలు కల్పించే ఉపాయం 'టవర్ గార్డెన్'. దీన్నే వర్టికల్ గార్డెన్, వర్టికల్ టవర్ అని కూడా పిలుచుకోవచ్చు. 2 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ టవర్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి చుట్టూతా 60 ప్యాకెట్లు ఉంటాయి. వాటిల్లో 60 మొక్కలు పెంచుకోవచ్చు. బాల్కనీలలో, మేడ పైన, ఇంటి ముందు, ఇంటి వెనుక కొద్దిపాటి ఖాళీ ఉన్నా టవర్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, ఇందులో మొక్కలు చక్కగా పెరిగి దిగుబడినివ్వాలంటే కనీసం 3 గంటలు ఎండ తగిలే చోటులో దీన్ని పెట్టుకోవాలి. టవర్ గార్డెన్లను పెట్టుకున్న ఇద్దరు హైదరాబాద్ వాసుల అనుభవాలు ఈ వారం 'ఇంటిపంట' పాఠకులకు ప్రత్యేకం..

ఒక్కో టవర్ చుట్టూ 60 మొక్కలు

మా మిద్దె తోటలో టవర్ గార్డెన్‌లో ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంచుకుంటున్నాం. ఆకుకూరలను తినడంతోపాటు ఔషధ మొక్కలతో కషాయాలను తాగడం వల్ల కుటుంబం అంతా ప్రయోజనం పొందగలుగుతున్నాం. మా మిద్దె తోటలో ఆరు టవర్ గార్డెన్లు ఉన్నాయి. ఒక్కో టవర్‌కు చుట్టూతా, పైన కలిపి 60 మొక్కలు పెట్టుకోవచ్చు. ఇంటిల్లిపాదికీ ఆకుకూరలు, కషాయాల కోసం గ్రీన్స్, మెడిసినల్ ప్లాంట్స్‌కు కొరత ఉండకుండా ఇవి ఉపయోగపడుతున్నాయి.

సదాపాకు కషాయం, గోంగూర కషాయం, పుదీనా కషాయం, మెంతికూర, కొత్తిమీర, పునర్నవ (గలిజేరు), తమలపాకు, తిప్పతీగ, గోధుమ ఆకులు, నల్లేరు, 5 రకాల తులసి (రామ తులసి, జింజిర్ తులసి, లవంగ తులసి, కర్పూర తులసి, మింట్ తులసి), కరివేపాకు, ఉత్తరేణితో పాటు జామ, మామిడి, వేప, రావి, గానుగ, పారిజాతం మొక్కలను కూడా పెంచుకొని వంటల్లోనూ, కషాయాలలోనూ వాడుకుంటూ ఆరోగ్యకరమైన జీవనం సాగిస్తున్నాం. వీటితో పాటు ఖాదర్ గారు చెప్పిన ఐదు రకాల సిరిధాన్యాలను తింటున్నాం. తిన్న అందరిలోనూ మార్పు స్పష్టంగా కనపడుతున్నది. స్థలాభావం ఉన్న ఆరోగ్య ప్రియులందరూ మిద్దె మీద టవర్ గార్డెన్‌లో ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంచుకునే అవకాశం ఉంది.

– బి. రవిచంద్రకుమార్ (95812 42255), బ్యాంకు కాలనీ, హైదరాబాద్






వర్టికల్ టవర్‌లో రవిచంద్ర



వర్టికల్ టవర్

వర్టికల్ టవర్‌లో పుష్కలంగా ఆకుకూరలు



నోరి శైలజ

నాలుగు నెలల క్రితం మా మేడ మీద ఒకటి, ఇంటి వెనుక ఖాళీలో మరొకటి వర్టికల్ టవర్స్ పెట్టాం. టవర్ చుట్టూ 10 ప్యాకెట్లలో తెల్లగలిజేరు, కొన్ని ఎర్ర గలిజేరు మొక్కలు పెట్టాను. తోటకూర, గోంగూర, పాలకూర, చెన్నంగి, పొన్నగంటి, మెంతికూరలు కొన్ని ప్యాకెట్లలో విత్తుకున్నాను. తెల్లగలిజేరు 2 నెలల పాటు వరుసగా పప్పులో వేసుకోవడానికి కొరత లేకుండా వచ్చింది. డా. ఖాదర్ గారు చెప్పినది విన్న తర్వాత గలిజేరు కషాయం కూడా కొన్నాళ్లు తాగాం. నాటు తోటకూర రెండే మొక్కలు ఉన్నా.. వారానికోసారి కూరకు సరిపడా వస్తున్నాయి. విత్తిన పది రోజుల్లోనే మెంతికూర వచ్చింది. 20 రోజులకు పాలకూర రావడం ప్రారంభమైంది, ఇప్పటికీ వారానికోసారి పుష్కలంగా వస్తోంది. వర్టికల్ టవర్ పైభాగాన 3 వంగ మొక్కలు పెట్టాను. వారానికో కిలో చొప్పున కాయలు వచ్చాయి.



తెల్ల గలిజేరు

ఈ వర్టికల్ టవర్ మధ్యలో నిలువుగా ఉన్న గొట్టంలో వంటింటి వ్యర్థాలను వేస్తూ వర్మీ కంపోస్టును తయారు చేసుకుంటున్నాను. రెండు నెలలకు ఒక కిలో కంపోస్టు వచ్చింది కూడా. వంటింటి వ్యర్థాలను నేరుగా ఇందులో వేయకూడదు. తడి చెత్త, పొడి చెత్తను కలిపి వేస్తే మంచిది. లేదంటే.. కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తొక్కలను వేరే పాత్రలో వేస్తూ 20 రోజుల తర్వాత సగం కుళ్లిన వ్యర్థాలను తీసి ఈ టవర్‌లో వేసి, కొన్ని వానపాములను వేస్తే చాలు.

– నోరి శైలజ (99483 36508), సన్‌సిటీ, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, లంగర్‌హౌజ్, హైదరాబాద్

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

మంగళవారం
29-1-2019

ఉద్యోగాలు

భెల్-చెన్నైలో 38 ఖాళీలు

చెన్నైలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) పవర్ సెక్టార్-సదరన్ రీజియన్ ఫిక్స్‌డ్ టెన్యూర్ పద్ధతిలో 38 సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **రీజియన్ల వారీ ఖాళీలు:** పవర్ సెక్టార్-సదరన్ రీజియన్-29, పవర్ సెక్టార్-ఈస్టర్న్ రీజియన్- 3, పవర్ సెక్టార్-వెస్టర్న్ రీజియన్-6.
- **అర్హత:** సంబంధిత బ్రాంచీల్లో బీఈ/బీటెక్, కనీసం ఏడాది డిప్లొమా (ఇండస్ట్రియల్ సేఫ్టీ)తో పాటు కనీసం రెండేళ్ల పోస్ట్-క్వాలిఫికేషన్ అనుభవం ఉండాలి.
- **వయసు:** జనవరి 23, 2019 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు హార్డ్‌కాపీలను ప్రింట్ తీసుకుని, దానికి ఇతర ధ్రువీకరణ పత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 11, 2019.
- **హార్డ్‌కాపీలు పంపడానికి చివరితేదీ:** ఫిబ్రవరి 25, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.bhelpssr.co.in

ఏపీలో 91 హోంగార్డ్ పోస్టులు





ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ 91 హోంగార్డ్ (బీ-కేటగిరీ) పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** హోంగార్డ్ (ఫైర్‌మ్యాన్)-73, హోంగార్డ్ (డ్రైవర్ ఆపరేటర్)-18.
- **అర్హత:** ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఫైర్ ఫైటింగ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లలో ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. అభ్యర్థుల ఎత్తు 160 సెం.మీ. ఉండాలి.
- **వయసు:** జనవరి 1, 2019 నాటికి 18-50 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జనవరి 28, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 18, 2019.
- **బేసిక్ స్కిల్ టెస్ట్ తేదీ:** మార్చి 1, 2019.
- **డ్రైవింగ్ టెస్ట్ తేదీ:** మార్చి 6, 2019.
- **పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని కేంద్రాలు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://fireservices.ap.gov.in

బిట్‌శాట్-2019

బేసిక్స్‌పై పట్టు.. విజయానికి తొలిమెట్టు!





- బిట్స్ క్యాంపస్‌ల్లో ప్రవేశ పరీక్షకు వెలువడిన నోటిఫికేషన్
- దరఖాస్తులకు చివరి తేదీ మార్చి 20, 2019
- మే 16 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు

దేశంలో మూడు క్యాంపస్‌లు.. పిలానీ, గోవా, హైదరాబాద్; దుబాయ్‌లో ఒక క్యాంపస్ ద్వారా అకడమిక్ కోర్సులు అందిస్తున్న బిట్స్.. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో బెస్ట్ ఇన్‌స్టిట్యూట్‌గా నిలిచింది. తాజాగా ఎంహెచ్‌ఆర్‌డీ నుంచి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా సైతం సొంతం చేసుకుంది. అందుకే బిట్స్‌లో సీటు కోసం ప్రతిభావంతులు పోటీపడుతుంటారు. జేఈఈ, ఎంసెట్ వంటి పరీక్షలకు పోటీపడే విద్యార్థుల్లో అధికశాతం మంది బిట్‌శాట్‌కు కూడా సన్నద్ధమవుతుంటారు.

ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ

బిట్స్ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ (బిట్‌శాట్)ను ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పేరుతో నిర్వహిస్తున్నారు. ఇందులో విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఉమ్మడి కౌన్సెలింగ్ విధానంలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశం లభిస్తుంది.

బిట్స్ క్యాంపస్‌లు.. బ్రాంచ్‌లు

- **పిలానీ క్యాంపస్:** కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్ బ్రాంచ్‌లు.
- **గోవా క్యాంపస్:** కెమికల్, సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ బ్రాంచ్‌లు.
- **హైదరాబాద్ క్యాంపస్:** కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ బ్రాంచ్‌లు.
- వీటితోపాటు బీ-ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షే.. బిట్‌శాట్.

బిట్‌శాట్ తీరుతెన్నులు

బిట్‌శాట్‌ను మొత్తం నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి..

పార్ట్	ప్రశ్నల సంఖ్య
పార్ట్-1: ఫిజిక్స్	40
పార్ట్-2: కెమిస్ట్రీ	40
పార్ట్-3: ఎ) ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ	15
బి) లాజికల్ రీజనింగ్	10
పార్ట్-4: మ్యాథమెటిక్స్/బయాలజీ	45
మొత్తం ప్రశ్నలు	**150**

- పార్ట్-4లో పేర్కొన్న మ్యాథమెటిక్స్ లేదా బయాలజీ సబ్జెక్టుల్లో బీఫార్మసీ ఔత్సాహిక విద్యార్థులు ఏదో ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు. బీఈ కోర్సుల అభ్యర్థులు మాత్రం తప్పనిసరిగా మ్యాథమెటిక్స్ సబ్జెక్టుతోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 150 ప్రశ్నలతో 450 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నెగెటివ్ మార్కింగ్ విధానం కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు.

అదనంగా 12 ప్రశ్నలు

బిట్‌శాట్ ఆన్‌లైన్ టెస్ట్‌లో మరో ప్రత్యేకత.. పరీక్షకు కేటాయించిన మూడు గంటల వ్యవధిలోపే 150 ప్రశ్నలను పూర్తిచేసిన అభ్యర్థులకు.. అదనంగా మరో 12 ప్రశ్నలకు సమాధానం ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ లేదా బయాలజీ నుంచి నాలుగు ప్రశ్నలు చొప్పున ఇస్తారు.

ఆన్‌లైన్ టెస్ట్.. స్లాట్

ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా బిట్‌శాట్-2019ను మొత్తం 11 రోజుల వ్యవధిలో రోజుకు రెండు స్లాట్లతో నిర్వహించనున్నారు.

నిర్దిష్ట వ్యవధిలో అభ్యర్థులు తమకు నచ్చిన తేదీ, స్లాట్‌లో పరీక్షకు హాజరయ్యే వెసులుబాటు ఉంటుంది. ఇందుకోసం.. తాము ఎంపిక చేసుకున్న టెస్ట్ సెంటర్‌లో తమకు అనుకూలమైన స్లాట్‌ను రిజర్వ్ చేసుకునేందుకు వీలైనంత త్వరగా ఉపక్రమించాలి.

బోర్డ్ టాపర్స్.. డెరెక్ట్ అడ్మిషన్స్

బిట్స్ ప్రవేశాల పరంగా మరో విశిష్టత.. ఆయా రాష్ట్రాల బోర్డ్‌ల పరిధిలో స్టేట్ టాపర్స్‌గా నిలిచిన అభ్యర్థులకు బిట్‌శాట్‌కు హాజరు నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ బోర్డ్ టాపర్స్ నేరుగా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంది. ఈ విధానానికి కూడా విద్యార్థుల నుంచి ఎంతో ఆదరణ లభిస్తోంది.

గత ఆరేళ్లలో ఆయా బోర్డ్‌లలో టాపర్స్‌గా నిలిచిన దాదాపు 50 మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడమే ఇందుకు నిదర్శనం.

సీటు లభిస్తే

బిట్‌శాట్ తుది మెరిట్ జాబితాలో నిలిచి బిట్స్ క్యాంపస్‌లలో సీటు సొంతం చేసుకున్న అభ్యర్థులకు కోర్సు వ్యవధిలో విస్తృత నైపుణ్యాలు సొంతమవడం ఖాయం. కారణం.. ఆయా కోర్సులకు సంబంధించి బిట్స్ ప్రత్యేక కరిక్యులంను రూపొందించడమే. విద్యార్థుల్లో ప్రాక్టికల్ అప్రోచ్ పెరిగే విధంగా దీన్ని రూపొందించారు. బీఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు.. కోర్సు వ్యవధిలో రెండుసార్లు ప్రాక్టీస్ స్కూల్-1, ప్రాక్టీస్ స్కూల్-2 పేరుతో.. పరిశ్రమల్లో రీసెర్చ్ కార్యకలాపాల్లో పాల్గొనాల్సి ఉంటుంది.

మైనర్ ప్రోగ్రామ్స్

విద్యార్థులకు.. కోర్ సబ్జెక్ట్‌లే కాకుండా ఇతర అంశాల్లోనూ అవగాహన కల్పించే విధంగా మైనర్ ప్రోగ్రామ్స్ విధానాన్ని బిట్స్ అమలు చేస్తోంది. ఫైనాన్స్, అకౌంటింగ్, లిటరేచర్, హ్యుమానిటీస్ వంటి పలు సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ ఇవ్వడం మరో విశేషం.

పెరుగుతున్న పోటీ

బిట్‌శాట్ ద్వారా దేశంలోని మూడు క్యాంపస్‌లలో మూడు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశం పొందడానికి ఏటా పోటీ పెరుగుతోంది. మొత్తం 450 మార్కులకు నిర్వహించే పరీక్షలో 400కుపైగా స్కోర్ సాధిస్తేనే సీటు సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. గత మూడేళ్లలో క్యాంపస్‌ల వారీగా నమోదైన ఫైనల్ కటాఫ్‌లే ఇందుకు నిదర్శనం.

మరికొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు

బిట్‌శాట్ స్కోర్ ఆధారంగా ఇప్పుడు పలు ప్రైవేటు యూనివర్సిటీలు బీటెక్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఇప్పటికే ఎన్‌ఐఐటీ యూనివర్సిటీ, బిట్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది కాకుండా దాదాపు వంద వరకు ప్రముఖ ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లు తమ ప్రవేశ ప్రక్రియకు బిట్‌శాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

బిట్‌శాట్‌లో విజయానికి..

బేసిక్స్‌పై పట్టు

బిట్‌శాట్‌లో అడుగుతున్న ప్రశ్నలు వాటి తీరును గమనిస్తే.. జేఈఈ తరహాలోనే క్లిష్టత స్థాయి ఉంటోంది. ప్రశ్నలన్నీ దాదాపుగా అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో సమాధానం ఇవ్వాల్సిన విధంగా ఉంటున్నాయి. దీంతో అభ్యర్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌లలో బేసిక్స్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలి. జేఈఈ ప్రిపరేషన్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవడం వల్ల ఒకే సమయంలో రెండు పరీక్షలకు ప్రిపరేషన్ సాగించొచ్చు.

పార్ట్-3.. ప్రత్యేకం

ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్‌లతో బేరీజు వేస్తే.. బిట్‌శాట్ ప్రత్యేకం పార్ట్-3 అని చెప్పొచ్చు. ఈ విభాగంలో ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి. కేవలం అభ్యర్థుల్లోని సబ్జెక్ట్ నైపుణ్యాలను పరీక్షించడమే కాకుండా.. లాంగ్వేజ్, తులనాత్మక పరిశీలన సామర్థ్యాన్ని పరీక్షించేలా ఈ విభాగాన్ని పొందుపర్చారు. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీపై పట్టుంటే 25 ప్రశ్నలకు సులువుగా సమాధానం ఇవ్వొచ్చు.

మరికొన్ని చిట్కాలు

- బేసిక్స్‌పై పట్టు సాధించడంతోపాటు విద్యార్థులు నిర్దిష్టంగా కొన్ని వ్యూహాలు అనుసరిస్తే బిట్‌శాట్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచే అవకాశముంది.
- ప్రతి సబ్జెక్ట్‌లోనూ ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లకు షార్ట్ కట్ మెథడ్స్‌తో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఎంతో అనుకూలంగా ఉంటుంది.
- కెమిస్ట్రీలో ముఖ్యంగా ఆర్గానిక్ కెమిస్ట్రీలో కెమికల్ రియాక్షన్స్‌ను ఒక జాబితాగా రూపొందించుకోవాలి.
- ఫిజిక్స్‌లో.. వర్క్ అండ్ ఎనర్జీ, న్యూటన్స్ లా, కరెంట్ ఎలక్ట్రిసిటీ, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మ్యాగ్నటిజం అండ్ మ్యాగ్నటిక్ ఎఫెక్ట్ ఆఫ్ కరెంట్, ఎలక్ట్రిక్ కరెంట్ యూనిట్లలో ముఖ్య అంశాలతో నోట్స్ రూపొందించుకోవాలి.
- మ్యాథమెటిక్స్‌లో హైపర్‌బోలా, పారాబోలా, రెక్టాంగులర్ పారాబోలా, ట్రిగ్నోమెట్రీ, వెక్టార్స్, 3-డి, ఇంటెగ్రల్ కాలిక్యులస్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

బిట్‌శాట్ లక్ష్యంగా

కేవలం బిట్‌శాట్‌నే లక్ష్యంగా ఎంచుకున్న అభ్యర్థులు.. ప్రత్యేక వ్యూహాలు అనుసరించాలి. ప్రతి రోజు, ప్రతి విభాగానికి కచ్చితంగా నిర్దిష్ట సమయం కేటాయించుకుని ప్రిపరేషన్ సాగించాలి. ప్రతి సబ్జెక్ట్‌కు రోజుకు కనీసం రెండు గంటలు చొప్పున కేటాయించేలా వ్యవహరించాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోని సిలబస్‌ను అనుసరిస్తూ వాటిని బిట్‌శాట్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ చదివితే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

బిట్‌శాట్-2019 సమాచారం

- **అర్హత:** 10+2/ఇంటర్మీడియెట్ ఎంపీసీ/బైపీసీ (బి.ఫార్మ్).. గ్రూప్ సబ్జెక్టులలో ఒక్కో సబ్జెక్ట్‌లో 60 శాతం మార్కులతో.. మొత్తం గ్రూప్ సబ్జెక్ట్‌లలో కలిసి సగటున 75 శాతం మార్కులు సాధించాలి.
- 10+2/ఇంటర్మీడియెట్ 2018లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు, 2019లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులే బిట్‌శాట్‌కు అర్హులు.
- **దరఖాస్తు విధానం:** www.bitsadmission.com వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకుని ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించాలి. క్యాంపస్, బ్రాంచ్ ప్రాథమ్యం ఎంపిక విషయంలో స్పష్టత ఏర్పరచుకోవాలి. ఎందుకంటే.. తుదిదశకు చేరిన అభ్యర్థులకు వారు ఎంచుకున్న ప్రాథమ్యం ఆధారంగానే ప్రవేశం కల్పిస్తారు.

బిట్‌శాట్-2019 ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20, 2019.
- **అప్లికేషన్‌లో లోపాల సవరణ అవకాశం:** మార్చి 22-25, 2019.
- **టెస్ట్ సెంటర్ కేటాయింపు వివరాలు:** మార్చి 27, 2019.
- **టెస్ట్ తేదీ, స్లాట్ బుకింగ్ సదుపాయం:** మార్చి 28 - ఏప్రిల్ 8, 2019.
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు:** మే 16, 2019 నుంచి మే 26, 2019 వరకు.
- **అడ్మిషన్ జాబితా ప్రకటన:** జూన్ 20, 2019.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.bitsadmission.com

అవకాశాల అప్రెంటీస్!

- కొత్త సంవత్సరంలో అప్రెంటీస్‌లకు పెరగనున్న కొలువులు
- శిక్షణ పొందితే ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఉద్యోగాలు
- ఎన్‌ఏపీఎస్, ఎన్‌టీఎస్‌ల ద్వారా అప్రెంటీస్‌షిప్‌కు మార్గం



స్కిల్ డెవలప్‌మెంట్


ఇటీవల కాలంలో తరచూ వినిపిస్తున్న మాట.. అప్రెంటీస్! అప్రెంటీస్ శిక్షణ పూర్తిచేసుకుంటే... ప్రయోజనం ఏమిటి? ముఖ్యంగా ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ వంటి కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు వాస్తవ పరిస్థితుల్లో స్వల్పకాల వ్యవధిలో శిక్షణ అందించే విధానమే.. అప్రెంటీస్‌షిప్. దీనిద్వారా పరిశ్రమ వాతావరణం, వాస్తవ సమస్యల పట్ల అవగాహన లభిస్తుంది. తద్వారా అభ్యర్థుల్లో పరిశ్రమలు ఆశించే నైపుణ్యాలు మెరుగవుతాయి. అప్రెంటీస్‌లకు 2019లో పరిస్థితి ఆశాజనకంగా ఉండనుందా! అంటే.. ఓ తాజా సర్వే అవుననే అంటోంది! ఏయే రంగాల్లో అవకాశాలు లభించనున్నాయి.. అప్రెంటీస్‌షిప్‌కు మార్గాలు, ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

పెరగనున్న అవకాశాలు

అప్రెంటీస్‌లకు కొత్త సంవత్సరంలో 25 శాతం మేర అవకాశాలు పెరగనున్నట్లు నేషనల్ ఎంప్లాయబిలిటీ త్రూ అప్రెంటీస్ ప్రోగ్రామ్(ఎన్‌ఈటీఏపీ) ఇటీవల పేర్కొంది. గతేడాది అవకాశాల పరంగా.. అగ్రికల్చర్, ఫార్మా రంగాలు ముందువరుసలో నిలిచాయి. 2019లో ఆటోమొబైల్, ఫార్మా, అగ్రికల్చర్, ఐటీ/ఐటీఈఎస్, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో అవకాశాలు లభించనున్నాయని అంచనా. ముఖ్యంగా టైర్ 2, టైర్ 3 పట్టణాల్లో.. అగ్రికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్, ఫార్మా రంగంలో ప్రొడక్ట్ లైన్‌మేనేజర్, రీసెర్చ్ అసెస్‌మెంట్ అప్రెంటీస్‌లకు డిమాండ్ నెలకొంది.

ఎన్‌ఈటీఏపీ

అప్రెంటీస్‌షిప్ కింద 2018లో దేశవ్యాప్తంగా దాదాపు 550 కంపెనీలు 1,30,000 మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాయి. 2019లో రిటైల్, మాన్యుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్, బీఎఫ్‌ఎస్‌ఐ, ఎఫ్‌ఎంసీజీ రంగాల్లో అప్రెంటీస్‌షిప్‌కు ప్రాధాన్యం దక్కనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్‌ఈటీఏపీ(నేషనల్ ఎంప్లాయబిలిటీ త్రూ అప్రెంటీస్ ప్రోగ్రామ్) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలతో కలసి నైపుణ్యాల పెంపుపై దృష్టిపెట్టింది. అప్రెంటీస్‌షిప్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఎన్‌ఈటీఏపీ తాజాగా హైదరాబాద్‌లో తయారీరంగదారులు, ట్రేడ్ అసోషియేషన్లు, ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఇందులో మానవ వనరుల నిర్వహణ, నైపుణ్య సృష్టి, రెండు రాష్ట్రాల్లో అప్రెంటీస్‌షిప్‌ను పెంపొందించడంపై చర్చించారు.



అప్రెంటీస్ యాక్ట్ 1961

పరిశ్రమల్లో అప్రెంటీస్ ప్రోగ్రామ్‌లను చట్టబద్ధం చేస్తూ కేంద్రం అప్రెంటీస్ యాక్ట్ 1961 తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2014లో అప్రెంటీస్ యాక్ట్‌లో కీలక సవరణలు చేసింది. ఇందులో భాగంగా అప్రెంటీస్‌షిప్‌పై ట్రేడ్, యూనిట్‌ల వారీగా ఉన్న నియంత్రణలను తొలగించింది. కంపెనీ లేదా పరిశ్రమలో మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 2.5 శాతం నుంచి 10 శాతానికి సమాన స్థాయిలో అప్రెంటీస్‌లు ఉండాలని నిర్దేశించింది. దీంతోపాటు అప్షనల్ ట్రేడ్లను ప్రవేశపెట్టింది.

ఎన్‌ఏపీఎస్

నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(ఎన్‌ఏపీఎస్) కింద 2018-19లో 15 లక్షల మందికి... 2019-20లో 20 లక్షల మందికి అప్రెంటీస్ శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

- అభ్యర్థులు రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్(ఆర్‌డీఏటీ) వెబ్‌సైట్‌కు లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవాలి.
- ఆర్‌డీఏటీ అభ్యర్థుల దరఖాస్తులను పరిశ్రమలకు పంపిస్తుంది.
- పరిశ్రమలు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల అప్రెంటీస్‌షిప్‌ను ఆమోదిస్తూ.. రిసీట్ పంపిస్తాయి.
- ఆన్‌లైన్‌లోనే.. అంప్రెటీస్‌షిప్ వ్యవధి, స్టైపెండ్, శిక్షణ తీరు తదితర అంశాలకు సంబంధించిన ప్రక్రియ పూర్తవుతుంది.
- ఐటీఐ/ఐటీఐ డ్యూయల్ లెర్నింగ్ మోడ్, పీఎంకేవీవై/ఎంఈఎస్-ఎస్‌డీఐ కోర్సులు, గ్రాడ్యుయేట్లు/డిప్లొమా హోల్డర్లు లేదా 10+2 వొకేషనల్ సర్టిఫికెట్ హోల్డర్లు దరఖాస్తుకు అర్హులు.

కాల వ్యవధి

అప్రెంటీస్‌షిప్‌లో బేసిక్ ట్రైనింగ్, జాబ్/ప్రాక్టికల్ ట్రైనింగ్ అని రెండు రకాల శిక్షణ ఉంటుంది. బేసిక్ ట్రైనింగ్ ఫ్రెషర్స్‌కు మాత్రమే ఉంటుంది. ఆయా ప్రోగ్రామ్‌లు, కోర్సులను పూర్తిచేసిన వారికి నిర్దిష్ట కాల వ్యవధిలో శిక్షణ ఉంటుంది. 6 నెలల నుంచి ఏడాది వరకూ అప్రెంటీస్ ఉంటుంది.

నేషనల్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్

ఈ స్కీమ్ కింద డిజిగ్నేటెడ్, ఆప్షనల్ ట్రేడ్‌లలో అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రామ్‌లు అందిస్తున్నారు. ప్రభుత్వం గుర్తించిన వృత్తి లేదా ట్రేడ్‌ను డిజిగ్నేటెడ్ ట్రేడ్ అంటారు. పరిశ్రమలు లేదా కంపెనీలు అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రామ్ అందించడానికి నిర్ణయించుకున్న ట్రేడ్, వృత్తులను ఆప్షనల్ ట్రేడ్‌లుగా పిలుస్తారు.

కేటగిరీలు

- ట్రేడ్ అప్రెంటీస్
- గ్రాడ్యుయేట్ అప్రెంటీస్
- టెక్నీషియన్ అప్రెంటీస్
- టెక్నీషియన్ (ఒకేషనల్) అప్రెంటీస్
- ఆప్షనల్ ట్రేడ్ అప్రెంటీస్

సర్టిఫికేషన్‌లు

నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) ఏటా రెండుసార్లు ఆలిండియా ట్రేడ్ టెస్టు(ఏఐటీటీ) నిర్వహిస్తుంది. ఏఐటీటీ అక్టోబర్/నవంబర్, ఏప్రిల్/మే నెలల్లో జరుగుతుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి నేషనల్ అప్రెంటీస్‌షిప్ సర్టిఫికేట్స్ (ఎన్‌ఏసీ) ప్రదానం చేస్తారు. ప్రభుత్వ, ప్రభుత్వ భాగస్వామ్య సంస్థలు కంపెనీల్లోని ఉద్యోగాల భర్తీలో ఎన్‌ఏసీ సర్టిఫికెట్‌ను పరిగణలోకి తీసుకుంటాయి.

ఆప్షనల్ ట్రేడ్స్

అకౌంటెంట్, బ్యాంకింగ్ ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ అండ్ టెలీకాలర్, లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ అప్రెంటీస్, రిటైల్ సేల్స్ అసోసియేట్, ఎగ్జిక్యూటివ్ (హ్యూమన్‌రిసోర్స్, మార్కెటింగ్, ఫైనాన్స్), రిటైల్ అసిస్టెంట్, లాబొరేటరీ అసిస్టెంట్ (ప్రొడక్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్). ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) స్కీమ్ కింద ఉన్న కోర్సులు/మాడ్యులర్ ఎంప్లాయబుల్ స్కిల్ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు పొందిన ఇతర కోర్సులను ఆప్షనల్ ట్రేడ్స్‌గా గుర్తిస్తారు.

- **వివరాలకు:** www.rdathyderabad.gov.in

డిజిగ్నేటెడ్ ట్రేడ్‌లు

ప్రభుత్వం 261 ట్రేడ్‌లను గుర్తించింది. వాటిలో కొన్ని ముఖ్యమైనవి..

- టెక్నీషియన్(ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరింగ్).
- పెయింటర్ జనరల్, మెరైన్.
- లెథర్ గూడ్స్ మేకర్. ✦ సిరామిక్ డెకరేటర్.
- ఎలక్ట్రీషియన్ ఎయిర్‌క్రాఫ్ట్.
- మెకానిక్ రేడియో అండ్ రేడార్ ఎయిర్‌క్రాఫ్ట్.
- ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్.
- ఫుడ్ ప్రొడక్షన్ ✦ హార్టీకల్చర్ అసిస్టెంట్.
- మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్.
- టూరిస్ట్ గైడ్ ✦ ఇన్సూరెన్స్ ఏజెంట్.
- హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్.



సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
29-1-2019



అంబటి రాయుడు బౌలింగ్‌పై ఐసీసీ నిషేధం

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు బౌలింగ్ చేయకుండా ఐసీసీ నిషేధం విధించింది. ఆస్ట్రేలియాతో ఈ నెల 12న జరిగిన తొలి వన్డేలో అతని బౌలింగ్ శైలి సందేహాస్పదంగా ఉందంటూ అంపైర్లు నివేదిక ఇచ్చారు. ఐసీసీ నిబంధనల ప్రకారం రెండు వారాల్లోగా అతను తన బౌలింగ్ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. రాయుడు దీనిపై ఆసక్తి చూపించకపోవడంతో నిషేధం వెంటనే అమల్లోకి వస్తున్నట్లు ఐసీసీ ప్రకటించింది. అయితే ప్రధానంగా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అయిన రాయుడు నిషేధం ప్రభావం భారత జట్టుపై ఏ మాత్రం ఉండదు. తన 50 వన్డేల కెరీర్‌లో అతను 9సార్లు మాత్రమే బౌలింగ్‌కు దిగి ఓవరాల్‌గా 20.1 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. పార్ట్‌టైమర్‌గా కూడా అతడిని ఎక్కువగా వాడింది లేదు. రాయుడు యాక్షన్‌ను తప్పు పట్టిన సిడ్నీ వన్డేలో కూడా అతను 2 ఓవర్లు మాత్రమే వేశాడు.

మన ఖాతాలో మరొకటి

టీమిండియా గెలిచేసింది! కీలక సమయంలో వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని నిలువరించడం ఎలాగో చూపుతూ... అనంతరం ఛేదనను ఎలా ముగించాలో చాటుతూ... వన్డేను ఎలా ఆడాలో ఒక పాఠంలా చెబుతూ మరో మ్యాచ్‌ను గెలిచేసింది!

న్యూజిలాండ్ ప్రతిఘటించేలా కనిపించినా... పిచ్‌పై పరుగులు సాధించడం ఒకింత కష్టమైనా... కోహ్లి సేన ఆల్‌రౌండ్ ప్రదర్శనకు, అప్రతిహత ప్రస్థానానికి అవేమీ అడ్డంకిగా మారలేకపోయాయి. ఫలితంగా రెండు మ్యాచ్‌లు ఉండగానే భారత్ సిరీస్‌నూ గెలిచేసింది!

మధ్య ఓవర్ల డ్రామా లేదు... చివరి ఓవర్ల ముగింపులు అవసరం రాలేదు... ముందుగా బ్యాటింగ్ చేసినా, బౌలింగ్‌కు దిగినా అంతా సంపూర్ణ ఆధిపత్యమే! కివీస్ గడ్డపై 2014 నాటి 4–0 పరాభవాన్ని తుడిచేస్తూ పదేళ్ల క్రితం నాటి సిరీస్ విజయాన్ని గుర్తుచేస్తూ మన జట్టు గెలిచేసింది!

న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్ నెగ్గిన భారత్

మూడో వన్డేలోనూ మనదే జయం

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కోహ్లి దళం

గురువారం హామిల్టన్‌లో నాలుగో వన్డే







మౌంట్ మాంగనీ: గత ఏడాదిగా దక్షిణాఫ్రికాను దులిపేసి... ఇంగ్లండ్‌కు దీటుగా పోటీనిచ్చి... ఆస్ట్రేలియా మెడలు వంచిన భారత్... ఇప్పుడు న్యూజిలాండ్‌నూ దాని సొంతగడ్డపైనే మట్టి కరిపించింది. రెండు జట్ల మధ్య సోమవారం ఇక్కడ జరిగిన మూడో వన్డేలో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన టీమిండియా 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్ 49 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టు ఇన్నింగ్స్‌ను నిలబెట్టిన మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ రాస్ టేలర్ (106 బంతుల్లో 93; 9 ఫోర్లు) సెంచరీ చేజార్చుకోగా, లాథమ్ (64 బంతుల్లో 51; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. మరోసారి పదునైన బౌలింగ్‌తో చెలరేగిన షమీ (3/41)కి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. భువనేశ్వర్, హార్దిక్ పాండ్యా, చహల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ (77 బంతుల్లో 62; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ విరాట్ కోహ్లి (74 బంతుల్లో 60; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలకు తోడు అంబటి రాయుడు (42 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ (38 బంతుల్లో 38 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో భారత్ 43 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. నాలుగో వన్డే గురువారం హామిల్టన్‌లో జరుగనుంది.

వారిద్దరూ నిలిచారు కానీ...

ఓపెనర్లు గప్టిల్ (13), మున్రో (7) మరోసారి విఫలమవడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ పేలవంగా ప్రారంభమైంది. మున్రోను ముప్పుతిప్పలు పెట్టిన షమీ అతడిని స్లిప్‌లో రోహిత్ క్యాచ్ ద్వారా వెనక్కు పంపాడు. భువీ స్వింగింగ్ డెలివరీకి గప్టిల్ ఔటయ్యాడు. సౌకర్యంగానే కనిపించిన కెప్టెన్ విలియమ్సన్ (28).. చహల్ బంతిని ముందుకొచ్చి ఆడబోయి మిడ్ వికెట్‌లో ఎడమవైపు ఒరుగుతూ పాండ్యా పట్టిన అద్భుత క్యాచ్‌కు పెవిలియన్ చేరాడు. 59/3తో నిలిచిన జట్టును టేలర్, లాథమ్ ఆదుకున్నారు. ఈ జోడీ భారత స్పిన్నర్లకు ఎదురునిలిచింది. చక్కటి కట్ షాట్లతో పరుగులు రాబట్టిన టేలర్ 71 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్నాడు. 126 బంతుల్లో 119 పరుగులు జోడించిన వీరు జట్టుకు మంచి స్కోరు అందించేలా కనిపించారు. అయితే, హాఫ్ సెంచరీ (62 బంతుల్లో) పూర్తి చేసుకున్న లాథమ్ ఆ వెంటనే భారీ షాట్ ఆడబోయి డీప్ మిడ్ వికెట్‌లో రాయుడుకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. నికోల్స్ (6), సాన్‌ట్నర్ (3)లను వెంటవెంటనే ఔట్ చేసిన పాండ్యా కివీస్‌ను కోలుకోకుండా చేశాడు. ఆఫ్ స్టంప్‌పై షమీ వేసిన కచ్చితమైన లెంగ్త్ బాల్‌ను ఆడబోయి టేలర్ వికెట్ ఇచ్చాడు. దీనిపై అతడు రివ్యూ కోరినా ఫలితం వ్యతిరేకంగానే వచ్చింది. స్కోరు 222 వద్ద అతడు ఏడో వికెట్‌గా ఔటయ్యాక 21 పరుగుల వ్యవధిలో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆ జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ 50 ఓవర్లు ఆడలేకపోవడం గమనార్హం.

ఆడుతూ...కొడుతూ

మోస్తరు లక్ష్య ఛేదనలో రోహిత్ కుదురుకునేందుకు చూస్తుండగా మరో ఓపెనర్ ధావన్ (27 బంతుల్లో 28; 6 ఫోర్లు) చకచకా బౌండరీలు బాది భారత్‌కు శుభారంభం ఇచ్చాడు. అయితే, ఆఫ్ స్టంప్‌కు దూరంగా వెళ్తున్న బౌల్ట్ బంతిని ఆడబోయి ఔటయ్యాడు. రోహిత్, కోహ్లిలను కివీస్ బౌలర్లు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. ఆడుతూ... కొడుతూ అన్నట్లు వీరు బ్యాటింగ్ చేశారు. 63 బంతుల్లో రోహిత్, 59 బంతుల్లో కోహ్లి అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. రెండో వికెట్‌కు 127 బంతుల్లో 113 పరుగులు జోడించాక రోహిత్ భారీ షాట్‌కు యత్నించి స్టంపౌటయ్యాడు. కాసేపటికే కోహ్లి ఔటైనా... అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్ దూకుడుగా ఆడుతూ నాలుగో వికెట్‌కు అజేయంగా 77 పరుగులు జోడించి భారత విజయ లాంఛనాన్ని పూర్తి చేశారు.



షమీకి సహచరుల అభినందన

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: గప్టిల్ (సి) దినేశ్ కార్తీక్ (బి) భువనేశ్వర్ 13; మున్రో (సి) రోహిత్ (బి) షమీ 7; విలియమ్సన్ (సి) పాండ్యా (బి) చహల్ 28; రాస్ టేలర్ (సి) దినేశ్ కార్తీక్ (బి) షమీ 93; లాథమ్ (సి) రాయుడు (బి) చహల్ 51; నికోల్స్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హార్దిక్ పాండ్యా 6; సాన్‌ట్నర్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హార్దిక్ పాండ్యా 3; బ్రేస్‌వెల్ (రనౌట్) 15; సోధి (సి) కోహ్లి (బి) షమీ 12; బౌల్ట్ (సి) షమీ (బి) భువనేశ్వర్ 2; ఫెర్గూసన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం: (49 ఓవర్లలో ఆలౌట్) 243.**
వికెట్ల పతనం: 1–10, 2–26, 3–59, 4–178, 5–191, 6–198, 7–222, 8–239, 9–239, 10–243.
బౌలింగ్: భువనేశ్వర్ 10–1–46–2; షమీ 9–0–41–3; చహల్ 9–0–51–2; పాండ్యా 10–0–45–2; కుల్దీప్ యాదవ్ 8–0–39–0; కేదార్ జాదవ్ 3–0–17–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (స్టంప్డ్) లాథమ్ (బి) సాన్‌ట్నర్ 62; ధావన్ (సి) రాస్ టేలర్ (బి) బౌల్ట్ 28; కోహ్లి (సి) నికోల్స్ (బి) బౌల్ట్ 60; రాయుడు (నాటౌట్) 40; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం: (43 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) 245.**
వికెట్ల పతనం: 1–39, 2–152, 3–168.
బౌలింగ్: బౌల్ట్ 10–1–40–2; బ్రేస్‌వెల్ 6–0–49–0; ఫెర్గూసన్ 10–1–57–0; సాన్‌ట్నర్ 10–0–45–1; సోధి 7–0–53–0.

6 విరాట్ కోహ్లి నాయకత్వంలో విదేశీ గడ్డపై భారత్ నెగ్గిన ఆరో వన్డే సిరీస్ ఇది. న్యూజిలాండ్‌కంటే ముందు కోహ్లి కెప్టెన్సీలో జింబాబ్వే, వెస్టిండీస్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలో భారత్ వన్డే సిరీస్‌లు గెలిచింది.

7 ఏడేళ్ల తర్వాత న్యూజిలాండ్ జట్టు స్వదేశంలో వన్డే సిరీస్‌లోని తొలి మూడు వన్డేల్లో ఓడిపోయింది. చివరిసారి 2012లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో కివీస్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురైంది.

2 ఇప్పటివరకు 199 వన్డేలు ఆడిన రోహిత్ శర్మ స్టంపౌట్ కావడం ఇది రెండోసారి మాత్రమే. ఈ మ్యాచ్ కంటే ముందు రోహిత్ 2010లో దంబుల్లాలో శ్రీలంకతో జరిగిన వన్డేలో స్టంపౌట్ అయ్యాడు.

1 వన్డేల్లో భారత జట్టు తరఫున అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాట్స్‌మన్ జాబితాలో ధోని (215) సరసన రోహిత్ శర్మ (215) చేరాడు. ధోని వన్డే కెరీర్‌లో మొత్తం 222 సిక్స్‌లు కొట్టగా... ఇందులో ఏడు ఆసియా జట్టుకు ఆడినపుడు వచ్చాయి.

16 వన్డేల్లో రోహిత్ శర్మ–విరాట్ కోహ్లి జోడీ నమోదు చేసిన సెంచరీ భాగస్వామ్యాలు. ఈ జాబితాలో 26 సెంచరీ భాగస్వామ్యాలతో సచిన్–గంగూలీ జంట టాప్ ర్యాంక్‌లో ఉంది. తిలకరత్నే దిల్షాన్–సంగక్కర (శ్రీలంక–20) రెండో స్థానంలో, గిల్‌క్రిస్ట్–హేడెన్ (ఆస్ట్రేలియా–16) జోడీ మూడో స్థానంలో ఉన్నాయి.

3 మూడేళ్ల తర్వాత న్యూజిలాండ్ జట్టు వన్డే సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఆలౌట్ కావడం ఇదే తొలిసారి. 2016లో ఆస్ట్రేలియాతో ఆస్ట్రేలియాలో జరిగిన సిరీస్ లో కివీస్‌కు ఇలా జరిగింది.

పాండ్యా... ఇక హాయిగా



ఆసియా కప్‌లో అయిన గాయంతో కొన్నాళ్లు ఆటకు దూరమై... వివాదాస్పద వ్యాఖ్యలతో ఏకంగా ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో సస్పెన్షన్‌కు గురై... ప్రపంచ కప్ ముందు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన హార్దిక్ పాండ్యా ఇప్పుడిక ఊరట పొందొచ్చు. న్యూజిలాండ్‌తో మూడో వన్డేలో అవసరమైన సమయంలో అతడి ప్రదర్శనే ఇందుకు కారణం. విలియమ్సన్ వంటి ఆటగాడి క్యాచ్‌ను అద్భుతం అనదగ్గ రీతిలో అందుకుని తొలుత ఫీల్డింగ్‌లో మెరిసిన పాండ్యా... బౌలింగ్‌లోనూ తన విలువ చాటాడు. ఓ వైపు పరుగులు నిరోధిస్తూనే, ఇన్నింగ్స్ కీలక దశలో నికోల్స్ వికెట్ పడగొట్టి కివీస్ స్కోరు మరీ పెరగకుండా చూశాడు. ఆ వెంటనే సాన్‌ట్నర్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను ఓ విధంగా మలుపుతిప్పాడు. ఓ ఎండ్‌లో పాండ్యా ఇలా పరోక్షంగా ఒత్తిడి తేవడంతో... రాస్ టేలర్ ఆత్మరక్షణలో పడ్డాడు. మ్యాచ్ అనంతరం కోహ్లి సైతం ఈ ప్రదర్శనను పొగడటం కచ్చితంగా పాండ్యాను స్థిమిత పరిచి ఉంటుంది.

సిరీస్ వేటలో మహిళలు

నేడు న్యూజిలాండ్‌తో భారత్ రెండో వన్డే

ఉదయం గం.6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



మౌంట్ మాంగనీ: న్యూజిలాండ్ గడ్డపై భారత పురుషుల జట్టు తమ హవా కొనసాగించి వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఇదే సమయంలో అక్కడే ఉన్న మహిళల జట్టు కూడా సిరీస్ విజయంపై కన్నేసింది. నేపియర్‌లో జరిగిన తొలి మ్యాచ్‌ను సునాయాసంగా గెలుచుకున్న మిథాలీ సేన నేడు కివీస్‌తో రెండో వన్డేకు సన్నద్ధమైంది. గత మ్యాచ్‌లో మన అమ్మాయిలు ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం కనబర్చారు. ఇదే జోరును కొనసాగిస్తే మరో విజయం ఖాయమవుతుంది. స్మృతి మంధాన అద్భుత సెంచరీకి తోడు జెమీమా రోడ్రిగ్స్ చెలరేగడంతో విజయం కోసం మరో బ్యాట్స్‌మన్ అవసరమే రాలేదు. మిథాలీ రాజ్, హర్మన్ ప్రీత్ కౌర్ కూడా జత కలిస్తే భారత్ భారీ స్కోరు చేసేందుకు అవకాశం ఉంటుంది. బౌలింగ్‌లో మన ముగ్గురు స్పిన్నర్లు ఏక్తా బిష్త్, పూనమ్ యాదవ్, దీప్తి శర్మ కివీస్‌ను పూర్తిగా కట్టి పడేశారు. వీరి నుంచి మరోసారి అదే తరహా ప్రదర్శనను ఆశించవచ్చు. ఆల్‌రౌండర్లు హేమలత, శిఖా పాండేలతో పాటు వికెట్ కీపర్ తాన్యా భాటియా కూడా కీలకం కానుంది. అటు అగ్రశ్రేణి జట్టయిన న్యూజిలాండ్‌కు తొలి మ్యాచ్‌లో ఓటమి షాక్‌కు గురి చేసింది. ఆ మ్యాచ్‌లో జట్టు టాప్ ప్లేయర్ సుజీ బేట్స్, కెప్టెన్ సాటర్‌వెయిట్ మాత్రమే కొద్దిగా పోరాడగలిగారు. దీని నుంచి తొందరగా కోలుకొని సిరీస్ చేజారిపోకుండా చూడాలని న్యూజిలాండ్ భావిస్తోంది. సోఫీ డెవిన్, అమేలియా కెర్ ప్రదర్శనపై కూడా జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఐసీసీ ఉమెన్ చాంపియన్‌షిప్ (2017–21)లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్‌లో గెలిచే ప్రతీ మ్యాచ్ భారత్ ఖాతాలో పాయింట్లు చేరుస్తుంది. ఫలితంగా 2021 వన్డే వరల్డ్ కప్‌కు నేరుగా అర్హత పొందే అవకాశాలు మరింత మెరుగవుతాయి. కాబట్టి సిరీస్ కోణంలోనే కాకుండా భారత్‌కు ప్రతీ గెలుపు కీలకం కానుంది.

ఎదురుదెబ్బలతో పాండ్యా రాటుదేలుతాడు

"భారత క్రికెట్‌లో అత్యున్నత ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారు. ఇప్పటికే పృథ్వీ షాను చూశాం. నెట్స్‌లో యువ శుబ్‌మన్ గిల్ బ్యాటింగ్‌ను పరిశీలించా. నాకు 19 ఏళ్ల వయసున్నప్పుడు గిల్ (ప్రస్తుత వయసు 19) ఇప్పుడు ఆడుతున్న ఆటలో 10 శాతం కూడా ఆడలేదు. అతడో అద్భుతం. మా క్రికెట్ ప్రమాణాలు పెంచే ఈ పరిణామాలు శుభసూచికం. అవకాశాలు ఇచ్చివారు ఎదిగేలా చూడటం మాకు సంతోషాన్నిస్తుంది. జీవితంలో ఎదురుదెబ్బలు ఐతేగీతే పాతాళానికి తీసుకెళ్తాయి... లేదంటే పాఠాలు నేర్పి రాటు దేలుస్తాయి. క్రికెటర్లకు ఆట కంటే సన్నిహితులు ఎవరూ ఉండరు. దానిని నువ్వు గౌరవిస్తే అది నీకు గౌరవాన్నిస్తుంది. పాండ్యా పరిణతి చెందేందుకు ఇలాంటి ఎదురుదెబ్బలు ఓ పాఠం. మూడు విభాగాల్లోనూ అతడు జట్టుకు సమతూకం తెస్తాడు. ప్రపంచంలో ప్రతి జట్టు అతలాంటి ఆటగాడిని కోరుకుంటుంది. 4వ స్థానంలో రాయుడి ఆట చూశాక మాకు మరింత నమ్మకం కలిగింది. దినేశ్ ఎప్పుడైనా రంగంలోకి దిగగలడు. ధోని టచ్‌లోకి వచ్చాడు. కావాలంటే ఇప్పటికిప్పుడే (ఆటో మోడ్) ప్రపంచ కప్ ఆడేంతగా మేం సంసిద్ధంగా ఉన్నాం. సిరీస్ గెలిచాక విశ్రాంతి తీసుకోనుండటం నాకు కొంత ఊరట. ఐనా ఇప్పుడు ఎవరున్నా లేకున్నా అంతా నడిచిపోయేలా ఉంది."

–విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

స్పెయిన్, భారత్ మహిళల హాకీ మ్యాచ్ డ్రా

ముర్సియా (స్పెయిన్): భారత మహిళల హాకీ జట్టు మరోసారి ఆకట్టుకుంది. స్పెయిన్‌తో తొలి మ్యాచ్‌లో తుదికంటా పోరాడిఓడిన భారత్... రెండో మ్యాచ్‌ను 1–1తో డ్రా చేసుకుంది. తొలి, రెండు క్వార్టర్లు గోల్ లేకుండానే ముగియగా... మూడో క్వార్టర్‌లో టీమిండియా తరఫున డ్రాగ్‌ఫ్లికర్ గుర్జీత్ కౌర్ 43వ నిమిషంలో గోల్ సాధించింది. జట్టు 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే 49వ నిమిషంలో స్పెయిన్ అమ్మాయి మరియా టోస్ట్ (49వ ని.) గోల్ చేసి స్కోరును సమం చేసింది.

ఆరేళ్ల తర్వాత...

గాయంతో వన్డే మ్యాచ్‌కు దూరమైన ధోని



మౌంట్ మాంగనీ: భారత మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ ధోని గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో బరిలోకి దిగలేదు. సోమవారం తొడ కండరాల గాయంతో అతను ఆటకు దూరంగా ఉన్నాడు. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ వచ్చిన ధోని ఇప్పటి వరకు గాయంతో కేవలం ఐదు మ్యాచ్‌ల్లోనే గైర్హాజరీ అయ్యాడు. వెస్టిండీస్‌లో ఆరేళ్ల క్రితం (2013) చివరిసారిగా ఇలా గాయంతో ఆటకు దూరమయ్యాడు. అప్పుడు మూడు వన్డేలు ఆడలేకపోయాడు. అంతకుముందు 2007లో వైరల్ జ్వరం వల్ల ఐర్లాండ్, దక్షిణాఫ్రికాలతో జరిగిన మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో మూడు అర్ధ సెంచరీలతో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అందుకున్న ఈ భారత మాజీ కెప్టెన్... కివీస్ పర్యటనలోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. రెండో వన్డేలో 33 బంతుల్లో 48 పరుగులు చేసి భారత్ భారీ స్కోరులో భాగమయ్యాడు.

కివీస్ జట్టులో రెండు మార్పులు

భారత్‌తో సిరీస్ కోల్పోయిన కివీస్ చివరి రెండు వన్డేలకు జట్టులో రెండు మార్పులు చేసింది. ఆల్‌రౌండర్ నీషమ్, లెగ్ స్పిన్నర్ టాడ్ ఆస్టల్‌లను జట్టులోకి తీసుకుంది. బ్రేస్‌వెల్ స్థానంలో నీషమ్, స్పిన్నర్ ఇష్ సోధి స్థానంలో ఆస్టల్ వచ్చారు.

నయోమి... నయా నంబర్‌వన్



పారిస్: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ర్యాంకింగ్స్‌లో జపాన్ ప్లేయర్ నయోమి ఒసాకా అధికారికంగా నంబర్‌వన్ ర్యాంక్‌ను అధిరోహించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్స్ గెల్చుకోవడంతో ఒసాకా మూడు స్థానాలు ఎగబాకి టాప్ ర్యాంక్‌కు చేరుకుంది. అటు పురుషుల సింగిల్స్‌లోగాని, ఇటు మహిళల సింగిల్స్‌లోగాని ఆసియా నుంచి నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్న తొలి ప్లేయర్‌గా ఒసాకా గుర్తింపు పొందింది. 1975లో అధికారికంగా కంప్యూటర్ ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టాక నంబర్‌వన్ స్థానానికి చేరిన 26వ మహిళా క్రీడాకారిణిగా ఒసాకా నిలిచింది.

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల ర్యాంకింగ్స్‌లో నొవాక్ జొకోవిచ్ 10,955 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించిన స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ మూడు స్థానాలు దిగజారి ఆరో స్థానానికి చేరాడు. రాఫెల్ నాదల్ (స్పెయిన్) రెండో స్థానంలో ఉండగా... అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) ఒక స్థానం మెరుగుపర్చుకొని మూడో ర్యాంక్‌కు చేరాడు.

రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర



బెంగళూరు: పుజారా (131 నాటౌట్; 17 ఫోర్లు) అజేయ పోరాటంతో సౌరాష్ట్రను రంజీ ట్రోఫీలో ఫైనల్‌కు చేర్చాడు. ఈ దేశవాళీ చాంపియన్‌షిప్‌లో సౌరాష్ట్ర టైటిల్ పోరుకు అర్హత సాధించడం ఇది మూడోసారి. సోమవారం ముగిసిన సెమీఫైనల్లో సౌరాష్ట్ర 5 వికెట్ల తేడాతో కర్ణాటకపై విజయం సాధించింది. ఆఖరి రోజు మిగతా 55 పరుగుల లాంఛనాన్ని మరో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు 224/3 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆట కొనసాగించిన సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసి గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ షెల్డన్ జాక్సన్ (100; 15 ఫోర్లు) సెంచరీ చేసిన వెంటనే నిష్క్రమించాడు. తర్వాత వచ్చిన అర్పిత్ (12) త్వరగానే ఔట్ కావడంతో... ప్రేరక్ మన్కడ్ (4 నాటౌట్)తో కలిసి జాగ్రత్తగా ఆడిన పుజారా సౌరాష్ట్రను గెలుపు తీరానికి చేర్చాడు. వినయ్ కుమార్‌కు 3 వికెట్లు దక్కాయి. వచ్చే నెల 3 నుంచి 7 వరకు జైపూర్‌లో జరిగే ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో తలపడుతుంది.

కెరీర్ ఉత్తమ ర్యాంక్‌కు ప్రజ్నేశ



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఏటీపీ పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఏడు స్థానాలు మెరుగు పర్చుకున్నాడు. ఫలితంగా తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ 102కు చేరుకున్నాడు. ప్రజ్నేశ్ ఇటీవలే ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిసారి మెయిన్ 'డ్రా'లో ఆడాడు. పురుషుల విభాగంలో రామ్‌కుమార్ రామనాథన్ 133వ స్థానంలో నిలవగా, 13 స్థానాలు దిగజారిన యూకీ బాంబ్రీ 151వ ర్యాంక్‌లో నిలిచాడు. టాప్–200లో భారత్ తరఫు నుంచి ఈ ముగ్గురు ఉన్నారు. డబుల్స్ విభాగంలో మూడేసి స్థానాలు దిగజారి రోహన్ బోపన్న (37), దివిజ్ శరణ్ (40), జీవన్ నెడుంజెళియన్ (76)వ ర్యాంకుల్లో నిలవగా... లియాండర్ పేస్‌ 78వ స్థానానికి పడిపోయాడు.

అంకిత కెరీర్ బెస్ట్...

సింగపూర్‌లో జరిగిన ఐటీఎఫ్ టోర్నీలో విజేతగా నిలిచిన అంకిత రైనా డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో భారీ పురోగతి సాధించింది. ఏకంగా 35 స్థానాలు మెరుగుపర్చుకున్న అంకిత 168వ స్థానంలో నిలిచింది. ఆమె తర్వాత భారత్ నుంచి కర్మన్ కౌర్ తాండి (210)దే అత్యుత్తమ ర్యాంక్ కాగా... హైదరాబాద్ అమ్మాయి ప్రాంజల యడ్లపల్లి (290) టాప్–300లో నిలిచింది.

గజేంద్ర విలాపం!

శ్రీకాకుళం జిల్లాలో ఏనుగులకు ప్రాణగండం

- నాలుగు నెలలుగా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- నాగావళి నదిలో మునిగి చనిపోయిన ఏనుగు
- తమ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతంలోకి రానివ్వని ఒడిశా సర్కార్
- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రేక్షక పాత్రలో అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం : అడవులను కొల్లగొట్టేస్తున్నారు.. అడవి జంతువులకు నిలువ నీడలేకుండా చేస్తున్నారు.. ఫలితంగా మూగజీవాలు ఆవాసాలు కోల్పోయి జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. అక్కడ మనుగడ సాగించలేక మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలో కొన్ని నెలలుగా తిరుగుతున్న ఎనిమిది ఏనుగుల్లో ఒక్కొక్కటిగా మృత్యువాత పడుతున్నాయి. కొద్దిరోజుల క్రితం విద్యుత్ షాక్‌తో ఓ గజరాజు చనిపోతే.. తాజాగా విషాహారం తిని, నదిలో మునిగి మరో ఏనుగు మరణించింది. అడవుల్లోకి గజరాజులను తరలించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవ్వడంవల్లే ఈ దుస్థితి ఏర్పడింది. మిగిలిన ఆరు ఏనుగులను కూడా అడవిలోకి పంపే ప్రయత్నాలు కనిపించడంలేదు. మరోవైపు.. తమ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతంలోకి తరలించడానికి ఒడిశా సర్కార్ అంగీకరించడంలేదు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం సైతం దీనిపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుండడంతో అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు.

ఏనుగు ఎలా చనిపోయిందంటే..

సాధారణంగా ఏనుగులు గుంపుగా జీవించడానికే ఇష్టపడతాయి. ఆ గుంపులో ఏదైనా తప్పిపోతే మిగతావి తల్లడిల్లిపోతాయి. అలాగే, అవి ప్రయాణించే ప్రాంతాన్ని క్షణ్ణంగా అధ్యయనం చేస్తుంటాయి. తిరిగి అదే మార్గంలో వచ్చేందుకు మలమూత్రాలనే ఆధారాలుగా విడిచిపెడుతుంటాయి. అయినప్పటికీ ఏనుగుల గుంపులో నుంచి రెండు రోజుల క్రితం ఓ ఏనుగు తప్పిపోయింది. మొక్కజొన్న పంటకు వాడే గుళికలను తిన్న ఆ గజరాజు వెంటనే అపస్మారక స్థితికి చేరుకుంది. అనంతరం స్పృహలోకి వచ్చి మిగిలిన గుంపును కలుసుకునేందుకు రెండ్రోజులపాటు అది ఎంత తిరిగినా ఫలించలేదు. అప్పటికే అవి నాగావళి నదిని దాటేశాయి. కానీ, మూడు కిలోమీటర్లలోపు ఉన్న తమ సహచరులను ఏనుగులు పసిగట్టగలవు. అలా కూడా గుర్తించలేకపోవడంతో తప్పిపోయిన ఏనుగు ఆ ప్రాంతంలోనే ఉండిపోయింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి దాని ఆచూకీ లేకుండాపోయింది. దీంతో అటవీ శాఖ సిబ్బంది దానిని వెతకడం ప్రారంభించారు. గుంపులో కలపాలని ప్రయత్నించారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. నాగావళి నదిలో సోమవారం ఉదయం తేలింది. ఏనుగు మరణించిన విధానాన్ని బట్టి చూస్తే ఊబిలో చిక్కుకుని గట్టుపైకి రాలేక మరణించినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన ప్రదేశానికి చేరుకుని ఏనుగును బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు జరిపించారు.

ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

కాగా, శ్రీకాకుళం జిల్లా సీతంపేట అడవుల నుంచి జిల్లాలోకి గతేడాది సెప్టెంబర్‌లో ప్రవేశించిన ఏనుగులు పలు ప్రాంతాల్లో ఇప్పటికీ సంచరిస్తున్నాయి. కొమరాడ మండలం కెమిశిల పంచాయతీ నాయుడువలసకు చెందిన గిరిజన రైతు నిమ్మక పకీరుని ఈ నెల 12న తొండంతో విసిరికొట్టడంతో అతని తలకు బలమైన గాయమై, చికిత్స పొందుతూ కన్నుమూశాడు. నాలుగు నెలల్లో ముగ్గురిని గాయపరిచాయి. 2007లో కూడా ఏనుగులు ఈ జిల్లాలో ఇదే విధంగా నష్టం చేకూర్చాయి. అప్పట్లో జియ్యమ్మవలస మండలానికి చెందిన ముగ్గురిని పొట్టన పెట్టుకున్నాయి. అయితే, ఇప్పుడు రకరకాల కారణాలతో అవే మృత్యువాత పడుతున్నాయి.


చనిపోయిన ఏనుగును జేసీబీ సాయంతో తరలిస్తున్న దృశ్యం


మరణించిన గజేంద్రునికి అంతిమ సంస్కారాలు

ఒక్కటైనా మిగిలేలా లేదు

ఇప్పుడు ఒడిశాలోని అటవీ ప్రాంతంలోకి మళ్లీ ఈ ఏనుగులను విడిచిపెట్టడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేదు. ఏనుగులు వాటికవే వెళ్లినా అక్కడి గిరిజనులు నాటు పద్ధతుల్లో వాటిని హింసించి భయపెడుతున్నారు. దీంతో అవి అటు వెళ్లడమే మానేశాయి. ఇక ఇప్పుడు వీటిని శ్రీకాకుళం జిల్లా అడవులకు తరలించడమే ఏకైక మార్గం. కానీ, అవి ఇప్పుడున్న కొమరాడ మండలం నుంచి శ్రీకాకుళం అడవులకు తరలించడానికి అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయడంలేదు. వాటంతట అవి అడవుల్లోకి వెళ్లాల్సిందే. కానీ, అవి అడవుల్లోకి వెళ్లేలోగా సర్కారు నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి దుర్ఘటనలతో ఏ ఒక్క ఏనుగూ ప్రాణాలతో మిగిలే పరిస్థితి కనిపించడంలేదు.

పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

ఇదిలా ఉంటే.. ఏనుగులు జిల్లాలో ప్రవేశించి నాలుగు నెలలవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇటీవల ఓ వ్యక్తిపై అవి దాడిచేసి చంపేసిన తర్వాత విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు ఒడిశా అధికారులు విజయనగరంలో సమావేశమయ్యారు. కానీ, వాటిని తరలించలేమనే నిర్ధారణకు వచ్చినట్లు ప్రకటించారు. అయితే, గతంలో ఏనుగులు విరుచుకుపడినప్పుడు ఆపరేషన్ జయంతి పేరున చిత్తూరు జిల్లా నుంచి తర్ఫీదు పొందిన రెండు ఏనుగులను రప్పించారు. ఆ ఆపరేషన్‌ను జియ్యమ్మవలస మండలంలోని సీమలవానివలసలో నిర్వహించారు. మత్తు ఇంజక్షన్ ఇచ్చి నాలుగు ఏనుగులను లారీలపై ఎక్కించి ఒడిశా రాష్ట్రంలోని లఖేరీ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అప్పట్లో కూడా అందులో ఒక ఏనుగు మరణించింది.

వేరే ప్రాంతానికి వెళ్లడంలేదు



గతేడాది సెప్టెంబరు 5న జిల్లాకు వచ్చిన ఏనుగుల గుంపు ఈ ప్రాంతాల్లోని పంటలను నాశనం చేస్తూ తిరుగుతున్నాయి. ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లడంలేదు. ఎవరికీ ప్రమాదం వాటిల్లకుండా మేం కాపలా కాస్తున్నాం.

– డి.ఆనంద్‌రావు, హెడ్ కానిస్టేబుల్, కొమరాడ పోలీసుస్టేషన్

పేలుళ్లకూ లొంగడం లేదు



ఏనుగులను అడవుల్లోకి తరిమేయడానికి బాణాసంచా పేలుస్తున్నాం. కానీ, అవి భయపడట్లేదు. వాటికి నచ్చినట్లుగా తిరుగుతున్నాయే తప్ప వెళ్లడం లేదు.

– గాడి శివ, ట్రాకర్ డ్రైవర్


ఇరు రాష్ట్రాలూ సమన్వయం చేసుకోవాలి



ఏనుగుల గుంపు వచ్చినప్పటి నుండి అటవీశాఖ అధికారులెవ్వరికీ కంటి మీద కునుకులేకపోయింది. ఇరు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే ఏనుగుల గుంపును తరలించవచ్చు.

– జి.జనార్దన్, ఫారెస్టు గార్డ్, కొమరాడ

పంటలు నష్టపోతున్నాం



ఏనుగుల గుంపు ఈ ప్రాంతానికి వచ్చిన నాటి నుండీ కంటిమీద కునుకులేదు. పంటలను విపరీతంగా నష్టపోతున్నాం. మాది 1.50 ఎకరాల జొన్న పంటను ధ్వంసం చేశాయి. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో భయాందోళనల్లో ఉన్నాం.

– ఎస్. వప్పారినాయుడు, రైతు

ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం



ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వరప్రసాద్

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర 4వ మహాసభలు సోమవారం తిరుపతిలో ప్రారంభమయ్యాయి. మహాసభలను రాష్ట్ర మంత్రి ఎన్.అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చంద్రన్న బీమా, ప్రమాద బీమాను జర్నలిస్టులకు వర్తింపజేయాలని కోరారని, పాత్రికేయుల సమస్యలన్నింటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. గృహ నిర్మాణ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే పాలసీని అమలు చేయాలని కోరారు. తిరుపతి మాజీ ఎంపీ వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడగలిగిన ఏకైక శక్తి జర్నలిస్టులకు మాత్రమే ఉందన్నారు. నిష్పక్షపాతంగా సమాజాన్ని చూసేవారే నిజమైన జర్నలిస్టులన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరమేశ్వరరావు, ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా చైర్మన్ నరసింహయాదవ్, డాక్టర్ సుధారాణి ప్రసంగించారు. అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్ (నాజ్) అధ్యక్షుడు ఎస్‌కే పాండే, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కార్యదర్శి చంద్రకాంత్, తెలంగాణ జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బసవపున్నయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రామానాయుడు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలపై చంద్రబాబుది కపట ప్రేమ'

సాక్షి, తిరుపతి: బీసీల ఓట్ల కోసం సీఎం చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు వడ్లతంగాల్ బాలాజి ప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు బీసీలకు ఉపయోగపడే ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రవేశపెట్టకుండా ఎన్నికలు సమీపిస్తుండటంతో బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. జయహో బీసీ అనే అధికారం చంద్రబాబుకు లేదని చెప్పారు. బీసీలకు జరిగిన అన్యాయాలపై జస్టిస్ ఈశ్వరయ్య చేసిన ఆరోపణలకు చంద్రబాబు ఎందుకు సమాధానం చెప్పలేకపోయారని నిలదీశారు.

పర్యాటక బోట్‌లో మంటలు

- బోట్‌లో పర్యాటకులెవరూ లేకపోవడంతో తప్పిన పెనుప్రమాదం
- మంటలను అదుపుచేసిన బోట్ సిబ్బంది, అగ్నిమాపక దళం
- అనుమతులు లేకుండా బోటును తిప్పుతున్న ప్రైవేటు సంస్థ
- విజయవాడ ప్రకాశం బ్యారేజ్ సమీపంలో సంఘటన


కాలిపోతున్న తన్వి బోటు

తాడేపల్లి రూరల్ (మంగళగిరి): కృష్ణా నదిలో విజయవాడ ప్రకాశం బ్యారేజ్ సమీపంలో ప్రైవేటు పర్యాటక బోటులో సోమవారం ఉన్నట్టుండి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఈ సమయంలో బోట్‌లో సిబ్బంది తప్ప పర్యాటకులెవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకెళ్తే.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరం ఎగువన కృష్ణవేణి మోటల్‌ను లీజుకు తీసుకుని చాంపియన్ యాచ్ క్లబ్ పేరుతో ఒక ప్రైవేట్ సంస్థ తన్వి పేరుతో భారీ బోటును తిప్పుతోంది. ఈ బోటుకు అనుమతులు కూడా లేవు. అయినా ఏపీ టూరిజం బోట్లు నిలిపే స్థలాన్ని ఆక్రమించుకుని బోటులో భారీ స్థాయిలో పార్టీలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటోంది. అనధికారికంగా రాత్రి, పగలు తేడా లేకుండా ఈ బోటులో పార్టీలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో సోమవారం బోటులో రెండో అంతస్తు సీలింగ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి లోపలి భాగంలోకి వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపు చేశారు. జిల్లా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు కూడా ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఈ విషయం తెలుసుకున్న తాడేపల్లి తహసీల్దార్ పద్మనాభుడు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోటుకు సంబంధించిన అన్ని పేపర్లను తన కార్యాలయానికి తీసుకురావాలని బోట్ మేనేజర్‌ను ఆదేశించారు.

మంటలను అదుపు చేసే సిలిండర్లలో లోపాలు



కాలం చెల్లిన కార్బన్ డైయాక్సైడ్ సిలిండర్

మంటలను అదుపు చేసేందుకు వాడే కార్బన్ డైయాక్సైడ్ సిలిండర్లు 15 వరకు బోటులో ఉన్నాయి. అయితే వాటిలో మంటలను ఆర్పేందుకు అవసరమైన పౌడర్ లేనట్లు అగ్నిమాపక సిబ్బంది గుర్తించారు. వాటన్నింటిని 2014, 2016లో తీసుకున్నవిగా నిర్ధారించారు. నిబంధనల ప్రకారం.. బోట్‌లో కార్బన్ డైయాక్సైడ్ సిలిండర్లు లేవని, జరిగిన సంఘటనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కేసు నమోదు చేయనున్నట్లు విజయవాడ వన్‌టౌన్ సహాయ అగ్నిమాపక అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

సమర శంఖారావం సభకు స్థల పరిశీలన


సభా స్థలాన్ని పరిశీలిస్తున్న పెద్దిరెడ్డి, తలసిల రఘురాం, చెవిరెడ్డి తదితరులు

రేణిగుంట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చేనెల 6వ తేదీన నిర్వహించనున్న సమర శంఖారావం సభకు సంబంధించిన స్థలాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు పరిశీలించారు. చిత్తూరు జిల్లా రేణిగుంట సమీపంలోని యోగానంద ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఈ సభ నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసిల రఘురాం, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి శ్రీనివాసులు సభ నిర్వహించేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఈ మేరకు ఏర్పాట్లపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ తొలి సమర శంఖారావం సభకు పార్టీ బూత్ కమిటీల కన్వీనర్లు, సభ్యులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు విరుపాక్షి జయచంద్రారెడ్డి, తిరుమలరెడ్డి, నగరం భాస్కర్‌బాబు, గంగయ్య, రమేష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

దయ కలిగి జీవించడమే నిజమైన క్రైస్తవ్యం

బైబిల్ మిషన్ కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్


మహోత్సవాలకు హాజరైన క్రైస్తవులు

పెదకాకాని (పొన్నూరు): ఎదుటి వారి పట్ల దయ కలిగి జీవించడమే నిజమైన క్రైస్తవ్యం అని బైబిల్ మిషన్ కన్వీనర్ రెవరెండ్ డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని స్వస్థిశాలలో సోమవారం రెండో రోజు బైబిల్ మిషన్ మహోత్సవాలు జరిగాయి. సభల కన్వీనర్ శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ.. ప్రేమస్వరూపుడు చూపిన జాలి, దయ, ప్రేమ, కృప, కనికరం వంటి లక్షణాలు కలిగి ఉండి ఏసుక్రీస్తు మాదిరి జీవితాన్ని కొనసాగించాలన్నారు. సభలకు బైబిల్‌మిషన్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎన్ సత్యానందం అధ్యక్షత వహించారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు వాలంటీర్లు ఆహారం సరఫరా చేశారు. మంగళవారం అధికారులు, రెవరెండ్ల వాక్యోపదేశం, ఆశీర్వాదాలతో బైబిల్ మిషన్ మహోత్సవాలు ముగుస్తాయని శామ్యూల్ కిరణ్ తెలిపారు.

గుండెపోటుతో పశుసంవర్ధక డైరెక్టర్ వెంకటేశ్వర్లు మృతి

యూనివర్సిటీ క్యాంపస్ (తిరుపతి): సెమినార్‌లో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు (57) గుండెపోటుతో చనిపోయారు. ఆయన సోమవారం దేవుని దర్శనార్థం తిరుమల కొండపైకి వెళ్లారు. అక్కడ గుండెపోటు రావడంతో ఆయన్ను హుటాహుటిన స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా, వైద్యం చేస్తుండగానే చనిపోయినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు 2013 నుంచి డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతి విషయం తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు తిరుపతి వెళ్లారు. ఈ నెల 26న రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా కార్యాలయానికి వచ్చి జెండా ఎగుర వేశారని, అకస్మాత్తుగా ఆయనకు గుండె పోటు వచ్చి చనిపోవడం బాధాకరమని అదనపు డైరెక్టర్ రామచందర్ రావు తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

'బీసీలను మరోసారి మోసగించే యత్నం'


విలేకర్లతో మాట్లాడుతున్న ఉల్లిపాయల శంకరయ్య

నెల్లూరు రూరల్: బీసీలను మరోసారి మోసగించేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరయ్య మండిపడ్డారు. నెల్లూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన 'జయహో బీసీ' సభలో చంద్రబాబు బీసీ బిల్లు గురించి ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. గత ఎన్నికల్లో బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో బీసీలకు ఇచ్చిన హామీలనే చంద్రబాబు కాపీ కొట్టారని ఎద్దేవా చేశారు. అయితే చంద్రబాబును ప్రజలు మళ్లీ నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. చంద్రబాబుకు బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు లీలాకృష్ణ యదవ్, దుర్గంపాటి పద్మజ, రాజేశ్వరి, జయరామరాజు, విజయకుమార్, గణేష్, రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'3,720 కోట్లు ఇస్తేనే ఆర్టీసీకి మనుగడ'


మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు

నరసరావుపేట: ఏపీఎస్ ఆర్టీసీకి ఉన్న అప్పులు, నష్టాల నుంచి బయట పడాలంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ. 3,720 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. 22 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాల సవరణను శ్రమకు తగ్గ వేతనాలుగా పరిగణించి 50% ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఫిబ్రవరి 6వ తేదీ నుంచి చేపట్టే సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమ్మె సన్నాహక పోరాటంలో భాగంగా ఈ నెల 30న ఆర్‌ఎం కార్యాలయాల వద్ద నిర్వహించే మహాధర్నాలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. సమ్మె సన్నాహక పిలుపు మేరకు సోమవారం గుంటూరు జిల్లా నరసరావుపేట డిపో వద్ద ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన దామోదరరావు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆర్టీసీకి వస్తున్న నష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు.

మార్చిలో గుంటూరులో గిరిజన కురుక్షేత్ర సభ

జీపీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్



కొరిటెపాడు (గుంటూరు): మార్చి మొదటి వారంలో గుంటూరులో 'గిరిజనుల కురుక్షేత్ర' భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. సోమవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనులను చైతన్య పరిచి వచ్చే ఎన్నికల నాటికి వారిని ఐక్యం చేసేందుకు ఈ కురుక్షేత్ర సభను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర జనాభాలో 10 శాతం ఉన్న గిరిజనులకు ప్రతి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని అన్ని పార్టీలు వచ్చే ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల జాబితాలో ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని శంకర్‌నాయక్ కోరారు. సమావేశంలో జీపీఎస్ నాయకులు డాక్టర్ ఎన్.ఎల్.ఎన్.మూర్తి, బి.వెంకటేశ్వర్లునాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటెయ్యకపోతే ఊరుకోవద్దు

మంత్రి అచ్చెన్నాయుడు బూతు పురాణం

టెక్కలి: 'ఏంరా..వంద యూనిట్లు ఫ్రీగా తీసుకుని..మీ ఆవిడ పదివేలు దొబ్బింది ..రుణమాఫీ వస్తే దొబ్బాం..ఇవన్నీ దొబ్బి .. మనకు ఓట్లు వేయకపోతే నిలదీయండి' అంటూ మంత్రి అచ్చెన్నాయుడు తమ అనుచరుల వద్ద విప్పిన బూతు పురాణం ప్రజలను అవాక్కయ్యేలా చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రజల పట్ల ఎంతో గౌరవంగా మాట్లాడాల్సిన మంత్రి ఈ విధంగా అవహేళన చేయడంపై అంతా విస్తుపోయారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండల పర్యటనలో భాగంగా సంతమైదానంలో మంత్రి బూతు పురాణం విన్న వారిలో కొంత మంది పగలబడి నవ్వగా.. మంత్రి తన సొంత ఇంట్లోని డబ్బులు ఏమైనా ఇచ్చారా.. ఇలా అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారంటూ మరికొంతమంది విసుక్కున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఈ విధంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది.

చీర వెనుక దాక్కోవడం ఆపేయండి!


తబస్సుమ్

బెంగళూరు/న్యూఢిల్లీ: కేంద్రమంత్రి అనంత్‌కుమార్ హెగ్డే అనుచిత వ్యాఖ్యల ప్రహసనం కొనసాగుతోంది. హిందూ మహిళలపై చేయి వేసిన వారి చేతులు నరికేయాలంటూ ఆదివారం వివాదాస్పద వ్యాఖ్య చేసిన హెగ్డే.. సోమవారం కర్ణాటక కాంగ్రెస్ చీఫ్ దినేశ్ గుండూ రావుపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఒక ముస్లిం మహిళ వెనుక పరిగెత్తిన వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు. ముస్లిం యువతిని దినేశ్ గుండూరావు వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై గుండూరావు భార్య తబస్సుమ్ స్పందిస్తూ.. తాను రాజకీయాల్లో లేని ఒక సాధారణ మహిళనని, ఒక వివాహిత మహిళ చీర వెనుక దాక్కొని రాజకీయాలు చేయడం ఆపేయాలని హెగ్డేకు సూచించారు. వ్యక్తిగత అంశాలను తెరపైకి తెచ్చే స్థాయికి దిగజారారంటూ హెగ్డేను గుండూరావు విమర్శించారు. మరోవైపు హెగ్డే ఆదివారం చేసిన వ్యాఖ్యలకు స్పందనగా.. హిందువు అయిన తన భార్యపై చేతులేసి దిగిన ఒక ఫోటోను మహారాష్ట్ర బీజేపీ నేత తెహసీన్ పూనావాలా ట్వీట్ చేశారు. 'హిందూ మహిళపై చేయి వేసాను.. ఏం చేస్తావో చేసుకో' అంటూ హెగ్డేకు సవాలు విసిరారు.

సావర్కర్‌కు భారతరత్న ఎందుకివ్వలేదు?


సావర్కర్

ముంబై: స్వాతంత్ర్య పోరాట యోధుడు వీరసావర్క ర్‌ను మోదీ ప్రభుత్వం 'భారతరత్న'తో గౌరవించకుండా విస్మరించిందని శివసేన విమర్శించింది. 'సావర్కర్ త్యాగాలను దీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ విస్మరించింది. సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉండగా బీజేపీ డిమాండ్ చేసింది. అధికారంలోకి వచ్చాక ఏం చేసింది? సావర్కర్‌ను భారతరత్నతో గౌరవించలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దివంగత భూపేన్ హజారికాకు భారతరత్న ఇవ్వడం పొరపాటు' అని ఆ పార్టీ అధికార పత్రిక సామ్నా సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. కాగా, మహారాష్ట్రలోని బీజేపీ అధికార కూటమిలో తమదే ఎప్పుడూ పెద్దన్న పాత్ర అని శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ సమావేశం అనంతరం చీఫ్ విప్ సంజయ్ రౌత్ అన్నారు.కాగా, శివసేనతో పొత్తు తమకు తప్పనిసరేం కాదని సీఎం ఫడ్నవిస్ స్పష్టంచేశారు.

కుప్పకూలిన ఐఏఎఫ్ విమానం



గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని కుశీనగర్‌లో వైమానిక దళానికి చెందిన జాగ్వార్ విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. రోజువారీ శిక్షణలో భాగంగా సోమవారం మధ్యాహ్నం గోరఖ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే విమానం కుప్పకూలింది. ప్రమాదాన్ని పసిగట్టిన పైలట్ విమానాన్ని జనమమ్మర్దం లేని ప్రాంతం వైపు మళ్లించి, దూకేశాడని జిల్లా కలెక్టర్ అనిల్ కుమార్ సింగ్ తెలిపారు. హాతేంపూర్ అనే ప్రాంతంలో విమానం కూలింది. ప్రమాదంపై వైమానిక దళం విచారణకు ఆదేశించింది.

సీఐఎస్‌ఎఫ్‌కు ఉత్తమ శకటం పురస్కారం

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవాల్లో ప్రదర్శించిన వాటిలో ఉత్తమ శకటం పురస్కారం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్‌ఎఫ్)కు లభించింది. ట్రోఫీని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ సీఐఎస్‌ఎఫ్ ఉన్నతాధికారులకు అందజేశారు. మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్‌కు, జమ్మూ కశ్మీర్‌లోని క్రిష్ణగంగ జలవిద్యుత్కేంద్రానికి, ఎర్ర కోటకు, అంతరిక్ష సంస్థలకు, విమానాశ్రయాలకు సీఐఎస్‌ఎఫ్ భద్రత అందిస్తున్న దృశ్యాలను ఈ శకటంలో ప్రదర్శించారు. చేతులు చాచిన మహిళ ప్రతిమను కూడా శకటంలో ఉంచారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అన్ని సాయుధబలగాల్లోకెల్లా సీఐఎస్‌ఎఫ్‌లోనే అత్యధికంగా ఉద్యోగినులు ఉన్నారన్న విషయాన్ని చాటేందుకు ఈ ఏర్పాటు చేశారు. 11 ఏళ్ల తర్వాత సీఐఎస్‌ఎఫ్ శకటం గణతంత్ర దినోత్సవాలకు రాగా, అదే ఉత్తమమైనదిగా ఎంపికవడం గమనార్హం.

అత్యంత రద్దీ ఎయిర్‌పోర్ట్‌గా దుబాయ్



దుబాయ్: ప్రపంచంలోనే అత్యంత రద్దీయైన ఎయిర్‌పోర్ట్‌గా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం వరుసగా ఐదో ఏడాది ఘనత వహించింది. 2018 ఏడాదిలో 8.91 కోట్ల మంది తమ విమానాశ్రయం ద్వారా రాకపోకలు సాగించారని దుబాయ్ ఎయిర్‌పోర్ట్ అధికారులు ప్రకటించారు. ఈ ప్రయాణికుల్లో ఎక్కువమంది (1.22 కోట్ల మంది) భారతీయులే ఉన్నారనీ, అందులోనూ ముంబై, ఢిల్లీ, కొచ్చి నగరాల ఉంచి వచ్చినవారు లేదా ఆయా నగరాలకు వెళ్లినవారే ఎక్కువగా ఉన్నారని దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సీఈవో పాల్ గ్రిఫ్ఫిత్స్ తెలిపారు. 2014 నుంచి ప్రతి ఏడాదీ ప్రపంచలో అత్యంత రద్దీయైన విమానాశ్రయంగా దుబాయ్ ఎయిర్‌పోర్ట్ రికార్డులకెక్కుతోంది.

ఎన్నికల బదిలీలు ప్రారంభించండి

న్యూఢిల్లీ: సొంత జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారినీ, గత మూడేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వారిని బదిలీ చేయాలని ఎన్నికల సంఘం(ఈసీ) రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మరికొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలతోపాటు నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మేరకు అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు, చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు సర్క్యులర్లు జారీ చేసింది. 16వ లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా అసెంబ్లీల గడువు జూన్‌తోనూ సిక్కిం అసెంబ్లీ గడువు మే 27వ తేదీతోనూ ముగియనుంది. క్రిమినల్ కేసులున్న వారిని, గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొన్న వారినీ ఎన్నికల విధులకు కేటాయించవద్దని ఆ ఉత్తర్వుల్లో సూచించింది. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియతో నేరుగా సంబంధం లేని అధికారుల బదిలీలపై ఎటువంటి ఆంక్షలు లేవని స్పష్టం చేసింది. ఎన్నికల విధుల్లో పెద్ద సంఖ్యలో అధికారులను వినియోగిస్తున్నందున భారీగా స్థాన చలనాల అవసరం లేదని భావిస్తున్నట్లు పేర్కొంది.

వాటి తరలింపుకు విమాన రాయితీ

న్యూఢిల్లీ: గల్ఫ్ దేశాల్లో మరణించిన భారతీయుల మృతదేహాల తరలింపునకు ప్రయాణ చార్జీలో 40 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిర్ ఇండియా నిర్ణయించింది. భారతీయ కార్మికులు ఎక్కువగా ఉన్న యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, ఒమన్, కువైట్ దేశాలకు ఈ సదుపాయం వర్తిస్తుందని తెలిపింది. అవసరమైతే భవిష్యత్తులో ఈ సేవల్ని భారతీయుల జనాభా అధికంగా ఉండే ఇతర దేశాలకు కూడా విస్తరిస్తామని వెల్లడించింది. విదేశాంగ శాఖతో చర్చలు జరిపిన తరువాత..బాధిత కుటుంబాలకు ఖర్చును తగ్గించాలనే ఈ రాయితీ కల్పించనున్నట్లు ఎయిర్ ఇండియా సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

మెకింతోష్ @ 35



ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ విడుదల చేసిన తొలి తరం మెకింతోష్ కంప్యూటర్‌కు ఇటీవల 35 ఏళ్లు పూర్తయ్యాయి. లీసా కంప్యూటర్ విఫలం కావడంతో దాని స్థానంలో దీనిని తీసుకొచ్చారు. మోటొరోలా 68000 సీపీయూతో, 8 మెగాహెర్జ్ ఫ్రీక్వెన్సీ, కేవలం 128 కేబీ ర్యామ్‌తో ఈ కంప్యూటర్ పనిచేసింది. గరిష్టంగా 400 కేబీ స్టోరేజ్ సామర్థ్యం ఉన్న ఫ్లాపీ డిస్క్ బిల్టిన్‌గా ఇందులో ఉంది.



అల్విదా.. అపార్చునిటీ!

- ఆ రోవర్ గతించినట్లు నాసా అంచనా
- బ్యాటరీల చార్జింగ్‌కు అడ్డంకిగా మారిన ధూళి తుపాను
- అంగారకుడిపై 15 ఏళ్ల పాటు సేవలు

వాషింగ్టన్: అంగారక గ్రహానికి సంబంధించిన ఫొటోలు, సమాచారాన్ని మనకు పంపిస్తూ వచ్చిన రోవర్ అపార్చునిటీ గతించినట్లు భావిస్తున్నామని నాసా ప్రకటించింది. ఇది గత 15 ఏళ్లుగా సేవలందిస్తోంది. అపార్చునిటీ ఉన్న పర్‌సెవరెన్స్ లోయ దక్షిణ భాగంలో ఏడు నెలల క్రితం సంభవించిన భారీ తుపానులో అది దెబ్బతిని ఉంటుందని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. ఈ తుపాను నుంచి వెలువడిన ధూళి, దుమ్ము ఆ ప్రాంతాన్ని కప్పేసిందని, అప్పటి నుంచి దాని సౌర పలకలు సౌరశక్తిని గ్రహించడం కష్టంగా మారడంతో బ్యాటరీల చార్జింగ్ ఆగిపోయిందని వెల్లడించారు. అయితే క్రమంగా తుపాను ఉధృతి తగ్గిన తరువాత రోవర్‌తో సంబంధాల పునరుద్ధరణకు మిషన్ బృందం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అపార్చునిటీ నుంచి చివరిసారిగా గతేడాది జూన్ 10న భూమికి సంకేతాలు చేరాయి. ఆ తరువాత రోవర్‌కు సుమారు 600 కమాండ్లు పంపామని నాసా తెలిపింది. డీప్ స్పేస్ నెట్‌వర్క్(డీఎస్ఎన్) రేడియో సైన్స్ సాయంతో వేర్వేరు పౌనఃపున్యాలు, పోలరైజేషన్‌లలో అపార్చునిటీ గురించి పరిశోధకులు అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నారు. ఇక చివరి ప్రయత్నంగా రాబోయే వారాల్లో మరిన్ని కమాండ్‌లు పంపాలని కాలిఫోర్నియాలోని జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ పరిశోధకులు సమాయత్తమవుతున్నారు. అపార్చునిటీతో తిరిగి సంబంధాలు పొందేందుకు అందుబాటులో ఉన్న అన్ని సాంకేతిక మార్గాల్ని పరిశీలిస్తామని వారు చెప్పారు.

లక్ష్యం 90 రోజులు..కొనసాగింది 5 వేల రోజులు

గోల్ఫ్ కారు పరిమాణంలో, ఆరు చక్రాలతో కూడిన అపార్చునిటీ 2004, జనవరి 24న అంగారకుడి ఉపరితలంపై కాలుమోపింది. దీనితో పాటు స్పిరిట్ అనే మరో రోవర్‌ను కూడా పంపారు. అరుణ గ్రహం నుంచి భూమికి సంకేతాలు పంపిన తొలి రోవర్‌గా అపార్చునిటీ గుర్తింపు పొందింది. అంగారకుడిపై 1,006 మీటర్లు ప్రయాణించి, 90 రోజులు సేవలందించేలా దీన్ని రూపొందించారు. కానీ గత ఏడాది ఫిబ్రవరి నాటికే 45 కిలోమీటర్లు ప్రయాణించి 5000వ రోజును పూర్తి చేసుకుంది. సహచర స్పిరిట్ మిషన్ 2011లోనే ముగిసింది. అపార్చునిటీకి కాలం చెల్లినా దాని పనితీరు సంతోషకరంగా సాగిందని ఈ ప్రయోగ ప్రధాన అధ్యయనకర్త స్టీవెన్ డబ్ల్యూ స్క్వైర్స్ చెప్పారు.

పేదలకు కనీస ఆదాయ భద్రత

- త్వరలో దేశవ్యాప్త పథకం ప్రకటిస్తాం
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వెల్లడి
- గోవా ఆడియో టేపులు నిజమైనవేనని పునరుద్ఘాటన


రాయ్‌పూర్ సభలో రాహుల్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బగేల్

న్యూఢిల్లీ/పణజీ/రాయ్‌పూర్: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి తమ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలోని పేదలందరికీ కనీస ఆదాయ భద్రత కల్పించి పేదరికాన్ని రూపుమాపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రకటించారు. దీంతో 'పేదరికాన్ని తొలగించండి'(గరీబీ హఠావో) అంటూ 1971 లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఇచ్చిన నినాదాన్ని మళ్లీ రాహుల్ అందుకున్నట్టైంది. ప్రధాని మోదీ ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టడానికి సరిగ్గా 4రోజుల ముందు కాంగ్రెస్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో రైతుల ర్యాలీలో సోమవారం రాహుల్ మాట్లాడారు. 'చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ప్రజలందరికీ కనీస ఆదాయ భద్రతను కాంగ్రెస్ కల్పించబోతోంది. దీంతో దేశంలో ఆకలి, పేదరికం అనేదే ఉండదు' అని రాహుల్ అన్నారు. చెప్పింది చేస్తానని, పథకాన్ని దేశమంతటా అమలు చేస్తానన్నారు. ర్యాలీలో బీజేపీపై రాహుల్ పలు విమర్శలు చేశారు. 15 మంది బడా పారిశ్రామికవేత్తలు తీసుకున్న రూ.3.5కోట్ల రుణాలను కేంద్రం మాఫీ చేసిందనీ, రైతులకు రుణమాఫీ చేయలేదని అన్నారు. మోదీ ప్రభుత్వం రెండు భారత దేశాలను సృష్టించాలని ప్రయత్నిస్తోందనీ, వాటిలో ఒకటి రఫేల్ కుంభకోణం, అనీల్ అంబానీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా, మెహుల్ చోక్సీ తదితరులు ఉండే దేశం కాగా, ఇంకొకటి పేద రైతులు ఉండే దేశమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి భారీ మెజారిటీతో అధికారం కట్టబెట్టిన రైతులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ ర్యాలీని కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. కనీస ఆదాయ భద్రత హామీపై బీజేపీ స్పందించింది. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన వందలకొద్దీ అబద్ధపు హామీల్లో ఇదొకటనీ, వాటిని అమలు చేయడం ఆ పార్టీకి కుదరని పని అని కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ అన్నారు.

ఆ టేపులు నిజమైనవే

రఫేల్ ఒప్పందానికి సంబంధించిన వ్యాఖ్యలున్న గోవా ఆడియో టేపులు నిజమైనవేనని రాహుల్ ఆరోపించారు. గోవా ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ రక్షణ మంత్రి మనోహర్ పరీకర్ వద్ద రఫేల్ ఒప్పందం గురించిన భారీ రహస్యాలు ఉన్నాయనీ, వాటి వల్లనే ప్రధాని నరేంద్ర మోదీపై అధికారం చెలాయించే అవకాశం పరీకర్‌కు దక్కిందని రాహుల్ అన్నారు. రఫేల్ ఒప్పందానికి సంబంధించిన రహస్య పత్రాలు పరీకర్ వద్ద ఉన్నాయి కాబట్టే ఆయన పదవిలో ఉన్నాడంటూ గోవా మంత్రి విశ్వజిత్ రాణే ఒక గుర్తు తెలియని వ్యక్తికి చెబుతున్న ఆడియో టేపులు ఈ నెల మొదట్లో బయటపడటం తెలిసిందే. రాహుల్ మాట్లాడుతూ '30 రోజులవుతున్నా వీటిపై విచారణేదీ లేదు. ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదు. మంత్రిపై ఏ చర్యలూ లేవు. ఈ ఆడియోటేపులు నిజమైనవేనని తెలుస్తోంది. రఫేల్ రహస్య పత్రాలు పరీకర్ దగ్గర ఉన్నాయి' అని అన్నారు. రఫేల్ డీల్‌కు చెందిన ఆధారాలు తన పడకగదిలో ఉన్నాయంటూ పరీకర్ వ్యాఖ్యానించినట్లుగా గతంలో వచ్చిన వార్తలపై కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటలయుద్ధం జరిగింది. ఆ ఆడియో టేపులు నకిలీవనీ, నిజాలను దాచి అబద్ధాలను వ్యాప్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని పరీకర్ అప్పట్లో చెప్పారు. బీజేపీ నేత అనంత కుమార్ హెగ్డే కేంద్ర మంత్రి పదవిలో ఉండేందుకు అనర్హుడనీ, ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని రాహుల్ అన్నారు. అంతకుముందు కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు దినేశ్ గుండూరావ్ భార్యను ఉద్దేశించి హెగ్డే అనుచిత వ్యాఖ్యలు చేశారు.

గోవాలో రాహుల్, సోనియా

రాహుల్ తన తల్లి, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాతో కలిసి శని, ఆదివారాల్లో గోవాలో వ్యక్తిగతంగా పర్యటించారు. పార్టీ నేతలతో సమావేశాలు అక్కడ ఏర్పాటు చేయలేదు. ఆదివారం వారు ఓ బీచ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. కాగా, గోవాలో మండోవి నదిపై తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 5.1 కిలో మీటర్ల పొడవైన తాళ్ల వంతెనను రాహుల్ సందర్శించి, దేశాన్ని బీజేపీ ఎలా మారుస్తుందో చూడాలని రాహుల్‌ను ట్విట్టర్‌లో బీజేపీ కోరింది. మాజీ ప్రధాని వాజ్‌పేయి పేరు మీదుగా ఈ వంతెనకు అటల్ సేతు అని పేరు పెట్టారు.

మహిళపై సిద్దరామయ్య ఫైర్

ఆమె నుంచి మైక్ లాక్కునే క్రమంలో చున్నీ లాగిన వైనం



మైసూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య మహిళా కార్యకర్తతో అనుచితంగా ప్రవర్తించిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. ఆ కార్యకర్తపై సిద్ధరామయ్య గట్టిగా కేకలు వేయడం, మైక్‌ను లాగినపుడు ఆమె చేతిలోని మైక్‌తోపాటు దుపటా ఆయనచేతిలోకి రావడం వివాదమైంది. మైసూరులోని గర్గేశ్వర గ్రామంలో సిద్ధరామయ్య అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో సిద్ధరామయ్య కొడుకు, స్థానిక ఎమ్మెల్యే యతీంద్రతోపాటు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాలూకా పంచాయతీ ఉపాధ్యక్షురాలు జమలాల్ లేచి.. తమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే యతీంద్ర గెలిచాక మళ్లీ రానేలేదని చెప్పారు. 'యతీంద్రను ఎన్నికల తర్వాత మళ్లీ ఈ రోజే చూస్తున్నా' అని అన్నారు. దీంతో సిద్దరామయ్య ఆగ్రహంతో ఊగిపోయారు. నియోజకవర్గానికి యతీంద్ర వస్తూనే ఉన్నారని సిద్ధరామయ్య చెప్పినా జమలాల్ బల్లగుద్ది మరీ వాదించారు.. దీంతో సిద్దరామయ్య 'నా ముందే టేబుల్‌పై కొట్టి మాట్లాడతావా? ముందు ఇక్కడి నుంచి వెళ్లిపో, లేదా నోరు మూసుకుని కూర్చో'అని పరుషంగా ఆదేశించారు. అయినా సరే జమలాల్ మరోసారి బల్ల గుద్ది మాట్లాడారు. దీంతో సిద్ధరామయ్య అరుస్తూ ఆమె చేతిలో ఉన్న మైకును లాగేసుకున్నారు. ఈ క్రమంలో ఆమె ధరించిన దుపట్టా జారింది. ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ ఘటనను సుమోటొగా నమోదు చేస్తున్నట్లు జాతీయ మహిళా హక్కుల కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖా శర్మ తెలిపారు. మహిళా కార్యకర్తతో సిద్దరామయ్య అనుచిత ప్రవర్తనపై విచారణ జరిపి, చర్య తీసుకోవాలని కర్ణాటక పోలీసులను కోరనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కౌరవుల ప్రభుత్వం నడుస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు యడ్యూరప్ప వ్యాఖ్యానించారు.

మా కూటమికి కాంగ్రెస్ మద్దతివ్వాలి

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని కాంగ్రెస్‌కు పట్టుదలే ఉంటే ఆ పార్టీ తమ (ఎస్పీ–బీఎస్పీ) కూటమితో కలిసి రావాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. 'అబద్ధాలు వ్యాపింపజేస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాడదలుచుకుంటే కాంగ్రెస్ పార్టీ మా ఎస్పీ–బీఎస్పీ కూటమికి మద్దతివ్వాలి. ఆ పార్టీకి రాయ్‌బరేలీ, అమేథీ స్థానాలను వదిలివేశాం కూడా. ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ ప్రవేశాన్ని స్వాగతిస్తున్నా' అని అన్నారు. అయోధ్యలో రామాలయం వివాదంపై కోర్టులు త్వరగా తుది నిర్ణయం తీసుకోకుంటే తమ ప్రభుత్వం ఆ అంశాన్ని 24 గంటల్లోనే పరిష్కరిస్తుందన్న సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలపై అఖిలేశ్ స్పందించారు. దీనికంటే ముందుగా సీఎం రాష్ట్ర రైతుల సమస్యలను 90 రోజుల్లోగా పరిష్కరించాలని హితవుపలికారు. బీజేపీ ప్రభుత్వం బీసీల వివరాలను గోప్యంగా ఉంచుతోందని ఆయన అన్నారు. ఈ వివరాలు లేకుంటే అభివృద్ధి పథకాల అమలు సరిగ్గా జరగదని వివరించారు.

రాజీనామాకు నేను సిద్ధమే

- కాంగ్రెస్ వేధింపులు దారుణం
- సీఎం కుమారస్వామి



సాక్షి, బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆదివారం బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.సోమశేఖర మాట్లాడుతూ..'రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదు. అదే సిద్దరామయ్య హయాంలో అయితే, కెంపెగౌడ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు వంటి భారీ పనులు చేశారు' అని వ్యాఖ్యానించారు. దీనిపై సీఎం కుమారస్వామి స్పందించారు. 'కాంగ్రెస్ ఎమ్మెల్యేల మాటలను ఆ పార్టీ నేతలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ పెద్దలే తమ ఎమ్మెల్యేలను అదుపులో పెట్టుకోవాలి. లేదా వారు ఇలాగే మాట్లాడతామంటే పదవికి రాజీనామా చేయడానికి నేను సిద్ధం. సీఎం కుర్చీపై నాకు మోజు లేదు' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి అనేక అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంకీర్ణ ధర్మం పాటించడంలో కాంగ్రెస్ విఫలం అవుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రకటనపై కేపీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావ్ స్పందిస్తూ..ఎమ్మెల్యే సోమశేఖర తన పరిధిని అతిక్రమించి మాట్లాడారు. తన వ్యాఖ్యలపై కుమారస్వామికి సోమశేఖర క్షమాపణలు చెప్పారని దినేశ్ పేర్కొన్నారు. సిద్ధరామయ్య మాట్లాడుతూ కుమారస్వామితో చర్చించి విభేదాలను పరిష్కరించుకుంటామని తెలిపారు. సిద్ధరామయ్య గొప్ప సీఎం అని, ఎమ్మెల్యేలు అలా అనడంలో తప్పు లేదని డిప్యూటీ సీఎం పరమేశ్వర్ వెనకేసుకొచ్చారు. సీఎం పదవికి కుమారస్వామి రాజీనామా చేసినా వచ్చే నష్టంలేదని బీజేపీ నేత, మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ అన్నారు. కుమారస్వామికి సిగ్గుంటే పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నేత ఈశ్వరప్ప ఎద్దేవా చేశారు.

ప్రజాస్వామ్యంపై దాడి

అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ఉన్న కమలా హ్యారిస్


ఓక్లాండ్‌లో కమలా హ్యారిస్ సభకు భారీగా వచ్చిన మద్దతుదారులు

వాషింగ్టన్: అమెరికాలో గతంలోలేనంతగా ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో నిలిచిన భారత సంతతి మహిళ కమలా హ్యారిస్ అన్నారు. ఎన్నికల ప్రచారాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ట్రంప్ విధానాలపై ధ్వజమెత్తారు. దేశ ప్రజాస్వామ్యంపై తీవ్ర దాడి అనంతరం ఇప్పుడు మళ్లీ అమెరికా మార్పు ముంగిట్లోకి వెళ్తోందనీ, ఆ మార్పును ప్రజలు స్వాగతించాలని విజ్ఞప్తి చేశారు. 'స్వేచ్ఛా పాత్రికేయంపై దాడి, ఎగతాళి చేసే నాయకులు మనకు ఉన్నప్పుడు, మన ప్రజాస్వామ్య వ్యవస్థలను వారు నీరుగారుస్తున్నప్పుడు.. అది మన అమెరికా కాదు' అంటూ ట్రంప్‌నుద్దేశించి అన్నారు.

హిందువుననే విమర్శలు

తులసీ గబార్డ్

హిందువునైనందునే తనపై విమర్శలు చేస్తూ తన చిత్తశుద్ధిని శంకిస్తున్నారని అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ బరిలో నిలిచిన మహిళ తులసీ గబార్డ్ ఆవేదన వ్యక్తం చేశారు.' ప్రధాని మోదీతో నా భేటీని రుజువుగా చూపి నేను హిందూ జాతీయవాదినంటూ విమర్శలు చేస్తున్నారు. మోదీతో అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు ఒబామా, మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీసహా ఎందరో భేటీ అయ్యారు. వారినెవ్వరూ ఏమీ అనరు. ఎందుకంటే వాళ్లు హిందువులు కారు. ఇలా చేయడం ద్వంద్వ ప్రమాణాలను పాటించడమే. మత దురభిమానాన్ని ప్రదర్శించడమే' అని ఓ పత్రికకు రాసిన వ్యాసంలో తులసీ వ్యాఖ్యానించారు.

ఓన్లీ రాహుల్, ఓన్లీ ప్రియాంక

ఓఆర్‌ఓపీకి కాంగ్రెస్ అర్థం ఇదే: అమిత్



షిమ్లా: వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ)పై నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా 'ఓన్లీ రాహుల్ ఓన్లీ ప్రియాంక 'అని వ్యంగ్యంగా అర్థం చెప్పగా, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా 'దేశం ప్రస్తుతం ఓడొమోస్ (ఓవర్ డోస్ ఆఫ్ ఓన్లీ మోదీ ఓన్లీ షా)తో ఇక్కట్లు పడుతోంది'అని అన్నారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ)కి కాంగ్రెస్ అర్థం మార్చేసిందని, ఓఆర్‌ఓపీ అంటే వారి దృష్టిలో 'ఓన్లీ రాహుల్, ఓన్లీ ప్రియాంక' అని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వ్యంగ్యంగా అన్నారు. 70 ఏళ్లుగా ఏ ప్రభుత్వం కూడా సైనికులను పట్టించుకోలేదని, మోదీ ప్రభుత్వం వచ్చాకనే మాజీ సైనికులకు నిజాయితీగా వన్ ర్యాంక్ వన్ పెన్షన్ స్కీమ్ అమలు చేసిందని ఆయన తెలిపారు. 'దశాబ్దాలుగా అధికారంలో ఉండి మీరప్పుడు పేదరికం గురించి ఎందుకు పట్టించుకోలేదు. బీజేపీ తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలు, పథకాల ద్వారానే దేశంలో పేదరికం తగ్గుతోంది'అని షా వ్యాఖ్యానించారు.

రాహుల్ జోకరేగా: ప్రియాంక గాంధీని ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ ట్రంప్ కార్డుగా వ్యవహరిస్తున్నారని, మరి ఇన్నిరోజులు జోకర్‌గా రాహుల్ వ్యవహరించారా అని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సరోజ్ పాండే అన్నారు. తూర్పు ఉత్తరప్రదేశ్ కు ప్రియాంకా గాంధీని పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై కాంగ్రెస్ నేత ఆజాద్ ప్రియాంకను కాంగ్రెస్ ట్రంప్ కార్డుగా వ్యవహరించిన విషయం విదితమే.

దేశ రక్షణలో రాజీ లేదు!

- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రక్షణ ప్రాజెక్టులకు మోక్షం
- రఫేల్ వివాదంపై స్పందించిన ప్రధాని మోదీ


ఎన్‌సీసీ ర్యాలీలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: భారత్ శాంతికాముక దేశమే అయినా.. దేశ రక్షణ విషయంలో రాజీ పడబోదని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. యుద్ధ విమానాలు, సాయుధ దళాల ఆధునీకరణలకు సంబంధించి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రక్షణ రంగ ప్రాజెక్టులకు తాము అధికారంలోకి వచ్చాకే మోక్షం వచ్చిందని మోదీ గుర్తు చేశారు. దేశీయంగా క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, హెలికాప్టర్లను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందానికి సంబంధించి మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఆరోపణల నేపథ్యంలో మోదీ స్పందించారు. తాను స్వప్నిస్తున్న 'నవ భారత్'లో అవినీతికి చోటు లేదన్న మోదీ.. అవినీతికి పాల్పడిన వారిని ఎంతవారైనా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఎన్‌సీసీ క్యాడెట్లను ఉద్దేశించి సోమవారం ఆయన ప్రసంగించారు. 'మీ భవిష్యత్తును నిర్దేశించేవి మీ కుటుంబం, మీ ఆర్థిక నేపథ్యం కాదు.. మీ పట్టుదల, మీ నైపుణ్యం, మీ ఆత్మవిశ్వాసమే బంగారు భవితకు బాటలు వేస్తుంది' అని అన్నారు. వీఐపీ సంస్కృతి స్థానంలో తన ప్రభుత్వం ఈపీఐ(ఎవ్రీ పర్సన్ ఈజ్ ఇంపార్టెంట్– ప్రతీ వ్యక్తి ప్రముఖుడే) సంస్కృతిని చేర్చిందన్నారు. గ్రామాల నుంచి వచ్చి ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్న వారిని ప్రధాని ఈ సందర్భంగా అభినందించారు. తమ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా రక్షణ శాఖలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ భవిష్యత్‌లో దేశ భద్రతకు తోడ్పడతాయని ధీమా వ్యక్తం చేశారు. అప్పటివరకు దేశ ప్రజలు తమపై భరోసా ఉంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని.. రాబోయే ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఓటు వేసేలా యువతను ప్రోత్సహించాలని వారికి సూచించారు. ఇక తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమానికి యువత భారీగా మద్దతు ఇస్తున్నట్లు ప్రధాని తెలిపారు. లింగ వివక్షకు తావీయకుండా స్త్రీ, పురుషులిద్దరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ ఉద్ఘాటించారు. మహిళలను యుద్ధ విమానాలకు పైలట్‌లుగా నియమించామని, నేవీలోని మహిళా దళాలు ప్రపంచాన్ని చుట్టివచ్చాయని తెలిపారు. మిలటరీ సహా పలు కీలక విభాగాల్లో మహిళలను భాగస్వామ్యం చేసేలా తమ ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

బెంగాల్‌లో ప్రధాని ర్యాలీ ప్రాంతం మార్పు

పశ్చిమ బెంగాల్‌లో ఫిబ్రవరి 2న ప్రధాని మోదీ పాల్గొననున్న బహిరంగ సభ స్థలాన్ని మార్చినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ వెల్లడించారు. ముందుగా అనుకున్నట్లు నార్త్ 24 పరగణా జిల్లాలోని థాకూర్‌నగర్‌లో కాకుండా దానికి సమీపంలోని మరో స్థలంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ఉత్తరభారత్‌లో స్ట్రాటెజిక్ హెచ్‌ఆర్ కోర్సు

ఛండీగఢ్: సొసైటీ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్(ఎస్‌హెచ్‌ఆర్ఎం), ఛండీగఢ్ యూనివర్సిటీలు సంయుక్తంగా రెండేళ్ల కాల వ్యవధి కలిగిన స్ట్రాటెజిక్ హెచ్‌ఆర్ కోర్సును ప్రారంభించాయి. ఉత్తరభారత్‌లో ఎంబీఏలో ఇలాంటి ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడం ఇదే తొలి సారి. ఛండీగఢ్‌లోని సీఐఐ ప్రధానకార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఛండీగడ్ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డా.ఆర్.ఎస్. బవా, ఎస్‌హెచ్‌ఆర్ఎం సీఈఓ అచల్ ఖన్నా ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా 'కాలానుగుణంగా మారుతున్న ప్రపంచంలో హెచ్‌ఆర్ పాత్రలో వస్తున్న మార్పు' అనే అంశంపై జరిగిన చర్చలో పలువురు హెచ్‌ఆర్ నిపుణులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్

మంగళవారం
29-1-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
369 ▼	119 ▼
35,657	10,662

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,036	▼ 128
డోజోన్స్	24,363	▼ 374
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,747	▼ 62
డాక్స్	11,210	▼ 71
షాంఘై	2,597	▼ 5
నికాయ్	20,649	▼ 125

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	70.40	72.15
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	92.80	95.30
€	యూరో	థామస్‌కుక్	80.35	82.60
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	63.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	50.35	52.55
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	51.00	54.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.60	20.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	21.00
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.50	11.20

మార్కెట్లోకి సరికొత్త బాలెనో

ధర రూ. 5.4 లక్షల నుంచి రూ. 8.77 లక్షలు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ కంపెనీ బాలెనో మోడల్‌లో కొత్త వేరియంట్‌ను సోమవారం మార్కెట్లోకి తెచ్చింది. ఈ కొత్త వేరియంట్ ధరలు రూ.5.4 లక్షల నుంచి రూ.8.77 లక్షల రేంజ్‌లో ఉంటాయని మారుతీ తెలిపింది. కొత్త బాలెనోలో రియర్ పార్కింగ్ కెమెరాతో కొత్త ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, టూ టోన్ 16 అంగుళాల అలాయ్ వీల్స్, కారు డ్రైవింగ్ మరింత సౌకర్యవంతంగా ఉండేలా నావిగేషన్ విత్ లైవ్ ట్రాఫిక్, వెహికల్ ఇన్ఫర్మేషన్, స్క్రీన్‌పై ఎప్పటికప్పుడు అలర్ట్స్ అందటం వంటి ప్రత్యేకతలున్నాయని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) ఆర్.ఎస్.కల్సి చెప్పారు. డ్యుయల్ ఎయిర్‌బ్యాగ్స్, ఈబీడీతో కూడిన యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్, బ్రేక్ అసిస్ట్, ఐసోఫిక్స్ చైల్డ్ రిస్ట్రెయింట్ సిస్టమ్, స్పీడ్ అలర్ట్ సిస్టమ్ వంటి భద్రత ఫీచర్లు ఉన్నాయని వివరించారు. 1.2 లీటర్ పెట్రోల్ వేరియంట్ (మాన్యువల్ ట్రాన్స్‌మిషన్) ధరలు రూ.5.4–7.45 లక్షల రేంజ్‌లో, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ధరలు రూ.7.48–8.77 లక్షల రేంజ్‌లో ఉన్నాయని తెలిపారు. 1.3 లీటర్ డీజిల్ వేరియంట్‌లో మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మోడల్ మాత్రమే లభిస్తుందని, దీని ధరలు రూ.6.6–8.6 లక్షల రేంజ్‌లో ఉన్నాయని వివరించారు. బాలెనో మోడల్ మైలేజీ ఒక్కో లీటర్‌కు పెట్రోల్ వేరియంట్‌కు 21.4 కి.మీ. డీజిల్ వేరియంట్ 27.4 కి.మీ. వస్తుందని అంచనా.

'గెలాక్సీ ఎమ్' స్మార్ట్‌ఫోన్లు

- గెలాక్సీ ఎమ్20 ధరలు రూ.10,990–12,990
- గెలాక్సీ ఎమ్10 ధరలు రూ.7,990–8,990

న్యూఢిల్లీ: శామ్‌సంగ్ ఇండియా కంపెనీ గెలాక్సీ ఎమ్20, ఎమ్10 స్మార్ట్‌ఫోన్లను భారత్‌లో అందుబాటులోకి తెస్తోంది. షావోమి బడ్జెట్ ఫోన్, రెడ్‌మీకి పోటీగా ఈ ఫోన్లను శామ్‌సంగ్ మార్కెట్లోకి తెచ్చింది. ఈ ఫోన్లను అమెజాన్‌లో వచ్చే నెల 5 నుంచి కొనుగోలు చేయవచ్చని శామ్‌సంగ్ ఇండియా తెలిపింది. గెలాక్సీ ఎమ్20లో 3జీబీ, 32 జీబీ వేరియంట్ ధర రూ.10,990 అని, 4జీబీ, 64 జీబీ వేరియంట్ ధర రూ.12,990 అని శామ్‌సంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆసిమ్ వార్సి తెలిపారు. అలాగే గెలాక్సీ ఎమ్10లో 3జీబీ, 32 జీబీ వేరియంట్ ధర రూ.8,990 అని, 2జీబీ, 16 జీబీ వేరియంట్ ధర రూ.7,990 అని పేర్కొన్నారు. గెలాక్సీ ఎమ్20లో 6.3 అంగుళాల ఎఫ్ హెచ్‌డీ ప్లస్ ఇనిఫినిటీ –వీ డిస్‌ప్లే, 5,000 ఎమ్ఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లు ఉండగా, గెలాక్సీ ఎమ్10లో హెచ్‌డీ 6.2 అంగుళాల హెచ్‌డీ ప్లస్ స్క్రీన్ ఉందని పేర్కొన్నారు. ఇక రెండు ఫోన్లలో ఆల్ట్రావైడ్ ఫీచర్‌తో కూడిన డ్యుయల్ రియర్ కెమెరాలు ఉన్నాయని తెలిపారు.



టాప్-100 బ్రాండ్స్‌లో టాటా

బ్రాండ్ ఫైనాన్స్ ప్రపంచ జాబితాలో ఏకైక భారత కంపెనీ



ముంబై: అంతర్జాతీయ అగ్రశ్రేణి వంద బ్రాండ్లలో టాటాలకు చోటు దక్కింది. లండన్‌కు చెందిన బ్రాండ్ ఫైనాన్స్ రూపొందించిన గ్లోబల్ టాప్–100లో టాటా బ్రాండ్ 86వ స్థానంలో నిలిచింది. టాటా బ్రాండ్ విలువ ఈ ఏడాది 37 శాతం పెరిగి 1,950 కోట్ల డాలర్లకు ఎగియడంతో టాటా బ్రాండ్ ఈ ఘనతను సాధించిందని బ్రాండ్ ఫైనాన్స్ సంస్థ పేర్కొంది. గత ఏడాది 104వ స్థానంలో ఉన్న టాటా బ్రాండ్ ఈ సారి వంద లోపు జాబితాలోకి వచ్చిందని, భారత్ నుంచి ఈ జాబితాలో చోటు సాధించిన ఏకైక కంపెనీ కూడా ఇదేనని వివరించింది. టీసీఎస్ మెరుగైన పనితీరుతో టాటా బ్రాండ్ విలువ భారీగా పెరిగిందని పేర్కొంది. కాగా ఈ గుర్తింపు తమకు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు.

కొత్త డిస్కవరీ స్పోర్ట్ ల్యాండ్‌మార్క్

- ధర రూ.53.77 లక్షలు



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ లగ్జరీ కార్ల విభాగం, జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) కంపెనీ ల్యాండ్ రోవర్ డిస్కవరీ స్పోర్ట్ ల్యాండ్‌మార్క్ ఎడిషన్‌లో కొత్త వేరియంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కారును 2–లీటర్ల ఇంజినీయమ్ డీజిల్ ఇంజిన్‌తో రూపొందించామని, ధర రూ.53.77 లక్షలని (ఎక్స్ షోరూమ్) అని జేఎల్ఆర్ తెలిపింది. ఈ కారులో స్పోర్టీ బంపర్, కార్పాథియన్ గ్రే కాంట్రాస్ట్ రూఫ్ వంటి కొత్త ఫీచర్లు ఉన్నాయని జేఎల్ఆర్ ఇండియా ప్రెసిడెంట్, ఎమ్‌డీ, రోహిత్ సూరి తెలిపారు.

వి-స్ట్రోమ్ 650 ఎక్స్‌టీ ఏబీఎస్

మార్కెట్లోకి సుజుకీ కొత్త వేరియంట్ ● ధర రూ.7.46 లక్షలు



న్యూఢిల్లీ: సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తన ప్రీమియమ్ బైక్ మోడల్ వి–స్ట్రోమ్ 650 ఎక్స్‌టీలో కొత్త వేరియంట్‌ను మార్కెట్లోకి తెచ్చింది. వి–స్ట్రోమ్ 650 ఎక్స్‌టీ ఏబీఎస్ పేరుతో అందిస్తున్న ఈ బైక్ ధరను రూ.7.46 లక్షలుగా (ఎక్స్ షోరూమ్, న్యూఢిల్లీ) నిర్ణయించామని సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా తెలిపింది. కొత్త గ్రాఫిక్స్‌తో రూపొందిన ఈ బైక్‌లో 4 స్ట్రోక్ 645 సీసీ ఇంజిన్, సైడ్ రెఫ్లెక్టర్లు, హజార్డ్స్ లైట్స్ వంటి ప్రత్యేకతలున్నాయని కంపెనీ ఎమ్‌డీ సంతోషి ఉచిద తెలిపారు. బ్రిడ్జిస్టోన్ బాటలాక్స్ అడ్వెంచర్ ఏ40 ట్యూబ్‌లెస్ టైర్లు, ముందువైపు టెలిస్కోపిక్ ఫోర్క్, ఆరు గేర్లు, త్రీ–స్టేజ్ ట్రాక్షన్ కంట్రోల్, మూడు రకాలుగా అడ్జస్ట్ చేసుకునే వీలున్న విండ్ స్క్రీన్, తదితర ఫీచర్లున్నాయని పేర్కొన్నారు.

గత ఏడాదే ఈ బైక్‌ను మార్కెట్లోకి తెచ్చామని, మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఈ కొత్త బైక్‌ను ఫ్యూయల్ ఇంజెక్షన్ టెక్నాలజీతో రూపొందించామని, పనితీరు మరింతగా మెరుగుపడగలదని వివరించారు. ఈ బైక్ కవాసకి వెర్సిస్ 650, ఎస్‌డబ్ల్యూఎమ్ సూపర్‌డ్యూయల్ టీ బైక్‌లకు గట్టిపోటీనివ్వగలదని పరిశ్రమ వర్గాల అంచనా.

కెనరా బ్యాంక్ లాభం రెండు రెట్లు అప్...

రూ. 318 కోట్లు ● తగ్గిన ప్రొవిజనింగ్



న్యూఢిల్లీ: మొండిబాకీలకు కేటాయింపులు తగ్గడంతో ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రెండు రెట్లు ఎగిసి రూ.318 కోట్లకు చేరింది. 2017 అక్టోబర్–డిసెంబర్ కాలంలో బ్యాంక్ లాభం రూ.126 కోట్లు. మరోవైపు, తాజా క్యూ3లో కెనరా బ్యాంక్ ఆదాయం రూ. 12,341 కోట్ల నుంచి రూ. 13,513 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 10.38 శాతం నుంచి 10.25%కి, నికర ఎన్‌పీఏలు 6.78% నుంచి 6.37%కి తగ్గాయి. అటు మొండిబాకీలకు కేటాయింపులు రూ. 2,674 కోట్ల నుంచి రూ. 1,977 కోట్లకు తగ్గాయి. జనవరి 21న ప్రారంభించిన ఎంప్లాయీ స్టాక్ పర్చేజ్ స్కీమ్(ఈఎస్‌పీఎస్) 25తో ముగిసిందని, 134% ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యిందని బ్యాంకు పేర్కొంది. ఈ స్కీమ్ కింద తొలి విడతలో రూ. 557 కోట్లు సమీకరిస్తున్నట్లు వివరించింది. సోమవారం కెనరా బ్యాంక్ షేరు 5 శాతం క్షీణించి రూ. 240.30 వద్ద క్లోజయ్యింది.

రిలయన్స్ 'జియో' రైల్ యాప్



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో కంపెనీ జియో రైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌తో జియోఫోన్, జియోఫోన్2 యూజర్లు రైల్వే టికెట్లు బుక్ చేసుకోవచ్చని, క్యాన్సిల్ చేసుకోవచ్చని, పీఎన్ఆర్ స్టేటస్ తెలుసుకోవచ్చని రిలయన్స్ జియో తెలిపింది. డెబిట్, క్రెడిట్ కార్డులు, ఈ వాలెట్లు ఉపయోగించి టికెట్లు కొనుగోలు చేయవచ్చని, రైలు సమాచారం, రైలు వేళలు, రూట్లు, సీట్ల లభ్యత తదితర సమాచారాన్ని పొందవచ్చని పేర్కొంది. తత్కాల్ బుకింగ్స్ కూడా చేసుకోవచ్చని వివరించింది.

జీ పై జియో కన్ను!!

- వాటా కొనుగోలు రేసులోకి వెళ్లే యోచన
- ఇప్పటికే బరిలో అమెజాన్, యాపిల్ తదితర దిగ్గజాలు
- తమ వాటాల్లో 50 శాతం విక్రయించనున్న ప్రమోటర్లు



న్యూఢిల్లీ: ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్‌పై (జీల్) టెలికం దిగ్గజం రిలయన్స్ జియో కన్నేసింది. చౌక చార్జీలతో టెలికం రంగాన్ని కుదిపేసిన జియో... తాజాగా మీడియా కంటెంట్ విషయంలోనూ ఆధిపత్యం సాధించేందుకు వ్యూహాలు రచిస్తోంది. దీన్లో భాగంగా జీల్‌లో వాటాలు దక్కించుకోవడంపై దృష్టి సారిస్తోంది. ప్రమోటర్ సుభాష్ చంద్ర వాటాల్లో సగ భాగాన్ని కొనుగోలు చేసేందుకు బరిలోకి దిగాలని జియో యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటిదాకా అంతర్జాతీయ సంస్థలతోనే జట్టు కడతామంటూ వచ్చిన జీల్ ప్రమోటర్లు... తాజాగా దేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకునే అవకాశాలూ పరిశీలిస్తామని చెప్పడంతో జియో బరిలోకి దిగాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే అమెజాన్, యాపిల్, టెన్సెంట్, ఆలీబాబా వంటి ఓవర్ ది టాప్ (ఓటీటీ) అంతర్జాతీయ దిగ్గజాలు రేసులో ఉన్నాయి. వీటితో పాటు ఏటీఅండ్‌టీ, సింగ్‌టెల్, కామ్‌కాస్ట్, సోనీ పిక్చర్స్ పేర్లు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

దేశీ ఇన్వెస్టరుకు విక్రయించే యోచన..

దీర్ఘకాలికంగా జీల్‌కు మరింత విలువ తెచ్చిపెట్టేలా కంపెనీని తీర్చిదిద్దగలిగే సామర్థ్యమున్న అంతర్జాతీయ సంస్థలకు సగం వాటా దాకా విక్రయించేందుకు సిద్ధమని 2018 నవంబర్‌లో సుభాష్ చంద్ర ప్రకటించారు. కాకపోతే, దేశీ ఇన్వెస్టర్లను కూడా పరిగణనలోకి తీసుకుంటామని ఇటీవల జీల్ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ గోయెంకా చెప్పారు. ఈ దిశగా ఇప్పటికే కొన్ని సంస్థలతో చర్చలు కూడా మొదలెట్టామని, మరికొద్ది వారాల్లో డీల్ ప్రకటించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. దీంతో రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన జియో వంటి దేశీ దిగ్గజాలు కూడా జీల్‌పై దృష్టి సారిస్తున్నాయి.

మీడియాలో రిలయన్స్ హవా..

రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ ఇప్పటికే పలు మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. నెట్‌వర్క్18లో 75 శాతం వాటాలు కొనుగోలు చేశారు. న్యూస్‌కి సంబంధించి సీఎన్ఎన్–న్యూస్18, సీఎన్‌బీసీ–టీవీ18, ఎంటర్‌టైన్‌మెంట్‌కి సంబంధించి వయాకామ్ 18తో పాటు సినిమాల నిర్మాణ సంస్థ వయాకామ్18 మోషన్ పిక్చర్స్ వంటివి ఇందులో భాగమే. వీటితో పాటు హిందీ, ఇంగ్లీష్ సహా పలు భారతీయ భాషల్లో డిజిటల్, పబ్లిషింగ్ సంస్థలూ ఇందులో ఉన్నాయి. రామోజీరావుకు చెందిన ఈటీవీ వివిధ భాషల్లో ఆరంభించిన న్యూస్ ఛానెళ్లు కూడా ప్రస్తుతం నెట్‌వర్క్–18 చేతిలోనే ఉన్నాయి. 2017 జూలైలో కంటెంట్ ప్రొడక్షన్ సంస్థ బాలాజీ టెలీఫిలిమ్స్‌లో రిలయన్స్ 24.9 శాతం వాటాలు కొనుగోలు చేసింది. ఈ సంస్థకి ఆల్ట్‌బాలాజీ పేరుతో ఓవర్–ది–టాప్ (ఓటీటీ) యాప్ కూడా ఉంది. ఇక ఇప్పుడు జీల్‌లో కూడా వాటాలు కొనుగోలు చేస్తే ఓటీటీ, బ్రాడ్‌కాస్టింగ్ విభాగంలో రిలయన్స్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునే అవకాశాలు ఉన్నాయని, దేశీయ నెట్‌ఫ్లిక్స్‌గా ఎదిగేందుకు రిలయన్స్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత దన్ను లభిస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

సుభాష్ చంద్రకు దక్కేదెంత..

ప్రస్తుతం జీల్‌లో సుభాష్ చంద్ర, ఆయన కుటుంబానికి 41 శాతం వాటాలుండగా.. ఇందులో 20 శాతం వాటాలను విక్రయించాలని భావిస్తున్నారు. వాటాల విక్రయ వార్తలతో డిసెంబర్‌లో జీల్ షేరు రూ.500 స్థాయికి ఎగియడంతో వీటి విలువ రూ.10,000 కోట్లకు ఎగిసింది. అయితే, శుక్రవారం ప్రతికూల వార్తలతో జీల్ షేరు ఏకంగా 26 శాతం పతనం కావడంతో ఆ రోజు లెక్కల ప్రకారం 20 శాతం వాటాలకు గాను సుభాష్ చంద్రకు రూ. 7,000 కోట్లు మాత్రమే దక్కే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇది డిసెంబర్ నాటి విలువతో పోలిస్తే 30 శాతం తక్కువ. అయితే, సోమవారం షేరు కోలుకోవడంతో విలువ మళ్లీ కొంత మేర పెరిగిందని, రూ.8వేల కోట్ల దరిదాపుల్లో ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఓటీటీ రంగం.. రూ.35 వేల కోట్లకు!



ఇంటర్నెట్ ద్వారా జరిగే మీడియా కంటెంట్ ప్రసారాన్ని ఓటీటీగా వ్యవహరిస్తారు. 2018లో దేశీ ఓటీటీ మార్కెట్ రూ.3,500 కోట్లుగా ఉండగా.. 2023 నాటికి ఇది పది రెట్ల వృద్ధితో రూ. 35,000 కోట్ల స్థాయికి చేరుతుందనే అంచనాలున్నాయి. ప్రస్తుతం ఓటీటీ మార్కెట్లో 40 శాతం వాటాతో హాట్‌స్టార్ అగ్రస్థానంలో ఉండగా, జియో టీవీ 18% వాటాతో రెండో స్థానంలో ఉంది. జీ గ్రూప్‌నకు చెందిన జీ5కి 15%, వూట్ (వయాకామ్18)కి 12 శాతం, అమెజాన్ ప్రైమ్ వీడియోకి 1.43 శాతం, నెట్‌ఫ్లిక్స్‌కు 2 శాతం మార్కెట్ వాటా ఉంది.

ఎస్సెల్‌కు బ్యాంకర్ల భరోసా.. షేరు 17 శాతం జూమ్..

రుణాల చెల్లింపు అంశానికి సంబంధించి జీల్ మాతృసంస్థ ఎస్సెల్ గ్రూప్, బ్యాంకర్లకు మధ్య ఒప్పందం కుదరడంతో సోమవారం సంస్థ షేరు ఎగిసింది. ఒప్పందం ప్రకారం.. తనఖాలోని ప్రమోటర్ల షేర్లను మూడు నెలల దాకా విక్రయించబోమని, ధర తగ్గినా దీనికి కట్టుబడి ఉంటామని బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్స్, నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు భరోసా ఇచ్చాయి. ఈలోగా జీల్‌లో వాటాలతో పాటు ఇన్‌ఫ్రా అసెట్స్ మొదలైన వాటిని విక్రయించడం ద్వారా ఎస్సెల్ గ్రూప్ దశలవారీగా రుణాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. శుక్రవారం నాటి గణాంకాల ప్రకారం.. జీల్ మార్కెట్ విలువ రూ. 30,673 కోట్లుగా ఉండగా.. రూ.7,580 కోట్ల విలువ చేసే షేర్లు తనఖాలో ఉన్నాయి. మరోవైపు, డీమోనిటైజేషన్ అనంతరం గ్రూప్ సంస్థల సందేహాస్పద డిపాజిట్లపై విచారణ జరుగుతోందన్న వార్తలను కంపెనీ ఖండించింది. ఈ సానుకూల అంశాలతో సోమవారం జీల్ షేరు ఏకంగా 17 శాతం ఎగిసి రూ. 372.50 వద్ద క్లోజయ్యింది. ఇంట్రాడేలో ఒక దశలో 19 శాతం కూడా పెరిగి రూ. 380.80 స్థాయిని తాకింది. ప్రతికూల వార్తల మధ్య జీల్ షేరు శుక్రవారం ఏకంగా 26 శాతం పతనమైన సంగతి తెలిసిందే.


సుభాష్ చంద్ర

కాలం చెల్లిన వాహనాల మార్పిడిపై రాయితీ!

- కార్లపై రెండుకు మించి పన్ను రేట్లు వద్దు
- ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక పన్ను రేటు
- ఈ సారైనా బడ్జెట్‌లో వీటికి చోటివ్వాలి
- ఆటోమొబైల్ పరిశ్రమ డిమాండ్లు

ఆటోమొబైల్ రంగం



న్యూఢిల్లీ: దేశంలో పెరిగిపోతున్న వాహన కాలుష్యం నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఉండగా... ఈ దిశగా ఆటోమొబైల్ పరిశ్రమ పలు కీలక సూచనలు చేసింది. రానున్న మధ్యంతర బడ్జెట్లో వీటికి చోటు కల్పించాలని డిమాండ్ చేసింది. ముఖ్యంగా 2000 సంవత్సరానికి ముందు నాటి పాత వాహనాలను వినియోగం నుంచి తప్పించేందుకు ముఖ్య సూచన చేసింది. పాతవాటిని కొత్త వాహనంతో మార్పిడి చేసుకోవడంపై ఒక్కసారి ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అలాగే, కార్లపై రెండుకు మించి పన్ను రేట్లు లేకుండా చూడాలని కోరింది. బడ్జెట్‌కు ముందు భారీ పరిశ్రమల శాఖతో జరిగిన సమావేశంలో ఆటోమొబైల్ తయారీ సంఘాలు సియామ్, ఎస్ఎంఈవీ తమ ప్రతిపాదనలను తెలియజేశాయి.

పరిశ్రమ ప్రతిపాదనలు ఇవీ...

- 15 సంవత్సరాలకు పైబడి వయసున్న వాహనాలతోనే 80 శాతం కాలుష్యం, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వాహనాలను మార్చుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలతో ముందుకు రావాలి. ఇందుకోసం 2000కు ముందు రిజిస్ట్రేషన్ అయిన వాహనాల మార్పిడిపై ఒక్కసారి రాయితీలు కల్పించాలి. జీఎస్టీ, రోడ్డు పన్ను రాయితీ, సబ్సిడీతో కూడిన రుణాల (ఢిల్లీలో మాదిరి) రూపంలో ప్రోత్సాహకాలు ఉండాలి.
- కాలుష్య నియంత్రణకు గాను బలమైన నియంత్రణ, వాహన తనిఖీల విధానం అవసరం.
- ప్రస్తుతం కార్లపై ఉన్న బహుళ పన్నుల రేట్ల స్థానంలో రెండు రేట్లకు మించకుండా చూడాలి. ఎలక్ట్రిక్ కార్లకు ప్రత్యేక పన్ను రేటును అమలు చేయాలి. 2011–12 నాటికి ఆటోమొబైల్ వాహనాలపై 10 శాతంగా ఉన్న పన్ను రేటు 2015–16 నాటికి 22–30 శాతానికి చేరింది. ప్రస్తుతం జీఎస్టీలో ఆటోమొబైల్ వాహనాలకు 28 శాతం పన్ను రేటుతోపాటు, వాహనం సౌకర్యాలు, ఇంజన్ సామర్థ్యాన్ని బట్టి అదనంగా 1–15 శాతం మధ్యలో సెస్సు ఉన్న విషయాన్ని పరిశ్రమ గుర్తు చేసింది. దీర్ఘకాలంలో పన్నుల క్రమబద్ధీకరణ జరగాల్సిన అవసరాన్ని తెలియజేసింది.
- దిగుమతి చేసుకుంటున్న పూర్తి స్థాయి వాణిజ్య వాహనాలపై కస్టమ్స్ డ్యూటీని ప్రస్తుతమున్న 25 శాతం నుంచి 40 శాతానికి పెంచాలి. డబ్ల్యూటీవోలో భారత్ కట్టుబడి ఉన్న రేటు ఇది. సీకేడీ యూనిట్లు, ఎస్‌కేడీ యూనిట్లకు (విడిభాగాలు దిగుమతి చేసుకుని దేశీయంగా అసెంబుల్ చేయడం) పన్ను రేటు పెంపు అవసరం లేదు. ప్రస్తుతం వీటిపై సుంకాల రేటు 15–30 శాతం మధ్య ఉంది.
- దిగుమతి అయ్యే కార్లు, ద్విచక్ర వాహనాలపైనా కస్టమ్స్ డ్యూటీని మార్చకుండా ప్రస్తుతమున్నట్టుగానే కొనసాగించాలి. ప్రస్తుతం వీటిపై కస్టమ్స్ సుంకం 50–100 శాతం మధ్య ఉంది.
- పరిశోధన, అభివృద్ధి వ్యయాలపై 200 శాతం మినహాయింపును తిరిగి ప్రవేశపెట్టాలి.



ఈవీలకు మరింత ప్రోత్సాహం

- దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ)ను పెద్ద ఎత్తున పెంచేందుకు రానున్న రెండేళ్ల కాలంలో రూ.20,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలి. నిధుల సమీకరణ కోసం సంప్రదాయ వాహనాల(ఇంటర్నల్ కంబస్టన్ ఇంజిన్ కలిగినవి)పై నోషనల్ గ్రీన్ సెస్సు విధించాలి.
- హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, వినియోగాన్ని వేగంగా పెంచేందుకు ఉద్దేశించిన ఫేమ్ పథకం రెండో దశను ఆరేళ్ల కాల వ్యవధి, నిర్దిష్ట అమలు ప్రణాళికతో ప్రకటించాలి. 2030 నాటికి 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాల లక్ష్యాన్ని చేరుకోవాలంటే స్థిరమైన, దీర్ఘకాలిక విధానపరమైన ప్రోత్సాహం, రాయితీలు, ప్రచారం అవసరం.
- అన్ని ఈవీలకు, బ్యాటరీలపై జీఎస్టీలో పన్ను 5 శాతం మించకూడదు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సదుపాయం కూడా ఉండాలి.

జావా బుకింగ్స్... టాప్-5లో హైదరాబాద్

మార్చి నుంచి బైక్‌ల డెలివరీ ● భాగ్యనగరంలో మూడు షోరూంలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జావా మోటార్‌సైకిళ్ల బుకింగ్స్‌లో హైదరాబాద్ టాప్–5లో నిలిచింది. దేశంలో దక్షిణాది నుంచే అత్యధిక బుకింగ్‌లు వచ్చినట్లు జావాను ప్రమోట్ చేస్తున్న క్లాసిక్ లెజెండ్స్ కో–ఫౌండర్ అనుపమ్ థరేజా వెల్లడించారు. హైదరాబాద్‌లో మూడు షోరూంలను ప్రారంభించిన సందర్భంగా సోమవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆన్‌లైన్ బుకింగ్స్ క్లోజ్ చేశాం. ఊహించిన దాని కంటే ఎక్కువ బుకింగ్స్ నమోదయ్యాయి. బ్రాండ్ న్యూ ఇంజిన్‌తో మోడళ్లకు రూపకల్పన చేశాం. బీఎస్–6 ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయి. లైఫ్‌స్టైల్, క్లాసిక్ బైక్‌లు ఇవి. ఎవరైనా సులువుగా రైడ్ చేయవచ్చు. బైక్‌ల తయారీకై 700 మంది వెండార్ల నుంచి విడిభాగాలను కొనుగోలు చేస్తున్నాం. వీరంతా కొత్త ప్లాంట్లు, యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. అందుకే డెలివరీలు ఆలస్యం అవుతున్నాయి. తెలంగాణలో 9, ఏపీలో 16 ఔట్‌లెట్లు రానున్నాయి. మొత్తం 86 నగరాల్లో మార్చికల్లా 105 షోరూంలు తెరుచుకుంటాయి. ఇవి ప్రారంభం అయిన తర్వాతే డెలివరీలు ప్రారంభిస్తాం' అన్నారు.



హెచ్‌బీఐఎస్ గ్రూపుతో టాటా స్టీల్ కీలక ఒప్పందం

- ఆగ్నేయ ఆసియా వ్యాపారాల్లో 70 శాతం వాటా అమ్మకం
- డీల్ విలువ రూ.3,408 కోట్లు



న్యూఢిల్లీ: టాటా స్టీల్ ఆగ్నేయ ఆసియాలోని తన వ్యాపారాల్లో మెజారిటీ వాటాను చైనాకు చెందిన హెచ్‌బీఐఎస్ గ్రూపునకు విక్రయించనుంది. ఇందుకు సంబంధించి హెచ్‌బీఐఎస్ గ్రూపు కంపెనీతో టాటా స్టీల్ అనుబంధ కంపెనీ టీఎస్ గ్లోబల్ హోల్డింగ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా సింగపూర్‌లోని నాట్‌స్టీల్ హోల్డింగ్స్ పీటీఈ లిమిటెడ్, టాటా స్టీల్ (థాయ్‌లాండ్) పబ్లిక్ కంపెనీ లిమిటెడ్‌లో 70% వాటాలను హెచ్‌బీఐఎస్ గ్రూపు కంపెనీకి 480 మిలియన్ డాలర్ల(రూ.3,408 కోట్లు) మొత్తానికి విక్రయించనుంది. ఇందులో టాటా స్టీల్‌కు 327 మిలియన్ డాలర్ల మేర నగదును హెచ్‌బీఐఎస్ గ్రూపు కంపెనీ చెల్లిస్తుంది. మరో 150 మిలియన్ డాలర్ల మేర రుణభారాన్ని తనకిందకు తీసుకుంటుంది. దేశీయ మార్కెట్‌పై ప్రధానంగా దృష్టి సారించాలన్న టాటా స్టీల్ వ్యూహంలో భాగమే ఈ విక్రయ ఒప్పందం. ఈ ఒప్పందం తర్వాత కూడా సదరు రెండు కంపెనీల్లో టాటా స్టీల్‌కు 30% వాటా ఉంటుంది. ఓ ప్రత్యేక కంపెనీకి ముందుగా టాటా స్టీల్ తన కంపెనీల్లోని 100% వాటాలను బదలాయిస్తుంది. ఆ కంపెనీలో టాటా స్టీల్‌కు 30%, హెచ్‌బీఐఎస్ గ్రూపు కంపెనీకి 70 శాతం వాటా ఉంటుంది.

మార్కెట్లకు బడ్జెట్ ఫీవర్..



- ప్రజాకర్షక పథకాలపై ఇన్వెస్టర్లకు భయాలు
- ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ తప్పుతుందేమోనన్న ఆందోళన
- సెన్సెక్స్ 368 పాయింట్లు, నిఫ్టీ 119 పాయింట్లు నష్టం
- బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల వెల్లువ

అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాదాలు, కేంద్రం మరో మూడు రోజుల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలతో ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పుతుందేమోనన్న భయాలు దేశీ మార్కెట్లను వెన్నాడుతున్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు కూడా దీనికి తోడు కావడంతో సోమవారం అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 368 పాయింట్లు క్షీణించి 35,657 పాయింట్ల వద్ద, నిఫ్టీ 119 పాయింట్లు క్షీణించి 10,662 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. బ్యాంకింగ్, ఆటోమొబైల్, కన్జూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్‌లో భారీగా అమ్మకాలు జరిగాయి. బీఎస్ఈలో ఈ రంగాల షేర్లు దాదాపు 5.46 శాతం దాకా క్షీణించాయి. ఆటోమొబైల్ సంస్థల ఆర్థిక ఫలితాలు అంతంతమాత్రంగా ఉండటం, ఇటు బ్యాంకుల స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. దేశీ అంశాలతో పాటు అమెరికా–చైనా మధ్య వాణిజ్య వివాదాలపై కూడా ఇన్వెస్టర్లలో భయాలు కొనసాగుతున్నాయని మార్కెట్‌వర్గాలు తెలిపాయి. శుక్రవారం 169 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ తాజాగా రెండు సెషన్లలో మొత్తం 537 పాయింట్లు క్షీణించింది. రైతాంగాన్ని ప్రసన్నం చేసుకునేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రతిపాదనలకు కేంద్రం సత్వరం ఆమోదించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇలాంటి జనాకర్షక పథకాలతో ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పే అవకాశం ఉందన్నది విశ్లేషణ.

యస్ బ్యాంక్ 5 శాతం డౌన్..

సెన్సెక్స్ ఇంట్రా డేలో 36,124–35,565 పాయింట్ల మధ్య తిరుగాడగా, నిఫ్టీ 10,804–10630 శ్రేణిలో తిరిగింది. సెన్సెక్స్ షేర్లలో యస్ బ్యాంక్ అత్యధికంగా 5.46 శాతం క్షీణించగా, బజాజ్ ఫైనాన్స్ 5.4 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 3.82 శాతం, ఇండస్ ఇండ్ బ్యాంక్ 3.10 శాతం, హీరో మోటో కార్ప్ 2.55 శాతం పడ్డాయి. కోల్ ఇండియా, లార్సన్ అండ్ టూబ్రో, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్, ఎన్‌టీపీసీ మొదలైనవి 1.51 శాతం దాకా పెరిగాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,206
ఎన్ఎస్ఈ	35,283
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	8,98,683
ఎఫ్ఐఐ	223
డీఐఐ	92

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ZEEL	368.5	15.73
MARUTI	6,510.50	-0.04
YESBANK	208	-5.28
ICICIBANK	344.75	-3.49
RELIANCE	1,230.50	-1.24
LT	1,302.00	1.29
HDFCBANK	2,087.00	-0.43
BAJFINANCE	2,458.00	-5.45
INFY	731	0.09
TCS	1,960.00	2.04

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	327	-12.53
IBULHSGFIN	696	-6.51
BAJFINANCE	2,458.00	-5.45
YESBANK	208	-5.28
BAJAJFINSV	6,050.00	-4.3
ULTRACEMCO	3,375.00	-3.87
ICICIBANK	344.75	-3.49
GRASIM	735	-3.24
CIPLA	491.9	-3.1
BPCL	347.6	-2.76

వ్యవసాయం, చిన్న పరిశ్రమల వృద్ధి ఎలా?

బ్యాంకింగ్ చీఫ్‌లతో ఆర్థికమంత్రి సమావేశం



న్యూఢిల్లీ: వ్యవసాయం, లఘు చిన్న మధ్య తరహా పరిశ్రమల పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై ఆర్థికమంత్రి పియుష్ గోయెల్ దృష్టి సారించారు. ఈ అంశంపై ఆయన ప్రభుత్వ రంగ బ్యాంకుల చీఫ్‌లతో సమావేశమయ్యారు. ఆయా రంగాలకు రుణాల లభ్యత మెరుగుపడేందుకు చర్యలు అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన మద్దతుసహా అవసరమైన సహకారాన్ని అందించడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. మున్ముందు రోజుల్లో ప్రభుత్వ బ్యాంకులు మరింత క్రియాశీలంగా, లాభదాయకంగా రూపొందుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వ్యవసాయం, లఘు చిన్న మధ్య తరహా పరిశ్రమలతో పాటు గృహ రుణాలపై కూడా చర్చ జరిగినట్లు సమావేశం అనంతరం మంత్రి విలేకరులకు తెలిపారు.

హైదరాబాద్ నుంచి అహ్మదాబాద్‌కు అలయన్స్ ఎయిర్ సర్వీస్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్.. హైదరాబాద్ నుంచి నాసిక్ మీదుగా అహ్మదాబాద్‌కు సర్వీసు నడపనుంది. ఫిబ్రవరి 1 నుంచి ఇది ప్రారంభమవుతుంది. ఉడాన్ స్కీమ్‌లో భాగంగా కొత్త సర్వీసు మొదలు పెడుతున్నట్టు కంపెనీ తెలిపింది. గంట ప్రయాణానికి రూ.2,500 చార్జీ ఉంటుందని వివరించింది. 70 సీట్ల ఏటీఆర్–72 రకం విమానం ఇందుకు కేటాయించారు. హైదరాబాద్ నుంచి నాసిక్ వరకు ప్రతి రోజు, నాసిక్–అహ్మదాబాద్ రూట్లో సోమవారం నుంచి శనివారం వరకు సర్వీసు నడుస్తుంది.

ఐటీఐ ఎఫ్‌పీఓకు సెబీ ఆమోదం

మరో 2 కంపెనీల ఐపీఓలకూ సెబీ ఓకే

ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ ఐటీఐ ఫాలో ఆన్ ఆఫర్‌కు (ఎఫ్‌పీఓ) మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఎఫ్‌పీఓతో పాటు రెండు కంపెనీల ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు కూడా సెబీ ఆమోదం తెలిపింది. వంటగది ఉపకరణాలు తయారు చేసే స్టోవ్ క్రాఫ్ట్ కంపెనీ ఐపీఓకు, వైర్లు, కేబుళ్లు తయారుచేసే పాలీక్యాబ్ ఐపీఓకు కూడా సెబీ పచ్చజెండా ఊపింది.



స్టోవ్ క్రాఫ్ట్ ఐపీఓ...

స్టోవ్ క్రాఫ్ట్ కంపెనీ రూ.145 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తుంది. వీటితో పాటు ఆఫర్ ఫర్‌సేల్ కింద 71.63 లక్షల షేర్లను విక్రయించనున్నది. ఈ ఐపీఓకు ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, జేఎమ్ ఫైనాన్షియల్ కంపెనీలు లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి.

పాలీక్యాబ్.. రూ.500 కోట్ల తాజా షేర్లు

ఇక పాలీక్యాబ్ కంపెనీ రూ.500 కోట్ల విలువైన తాజా షేర్లను ఆఫర్ చేయనున్నది. అదనంగా ఆఫర్ ఫర్ సేల్ కింద 2.48 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తుంది. ఈ ఐపీఓకు కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, యాక్సిస్ క్యాపిటల్, సిటిగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్, యెస్ సెక్యూరిటీస్ వ్యవహరిస్తాయి.

బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రొవిజనింగ్ సెగ

క్యూ3లో రూ. 4,738 కోట్లకు ఎగిసిన నష్టాలు



ముంబై: మొండిబాకీలకు కేటాయింపులు రెట్టింపు కావడంతో ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) నష్టాలు మూడో త్రైమాసికంలో ఏకంగా రూ. 4,738 కోట్లకు ఎగిశాయి. 40 భారీ మొండి పద్దులపై దివాలా చట్టం కింద విచారణ జరుగుతుండటం, కొత్తగా ఐఎల్అండ్ఎఫ్ఎస్ సంక్షోభం రూపంలో మొండిబాకీలు మరింతగా పెరగడం ఇందుకు కారణం. భారీ మొండిబాకీల కారణంగా ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ నిర్దేశిత సత్వర దిద్దుబాటు చర్యల (పీసీఏ)పరమైన ఆంక్షలు ఎదుర్కొంటున్న బీవోఐ.. 2017 డిసెంబర్ క్వార్టర్‌లో రూ. 2,341 కోట్ల నష్టాలు నమోదు చేసింది. తాజాగా ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్‌నకు ఇచ్చిన రూ. 3,400 కోట్ల మేర రుణాలు మొండిబాకీల కింద వర్గీకరించాల్సి వచ్చింది. ముందుజాగ్రత్తగా కొన్ని మొండిపద్దులకు పూర్తి స్థాయిలో ప్రొవిజనింగ్ చేయడంతో కేటాయింపులు రూ. 4,373 కోట్ల నుంచి రూ. 9,179 కోట్లకు ఎగిశాయని బీవోఐ ఎండీ దీనబంధు మహాపాత్ర తెలిపారు. మరోవైపు, క్యూ3లో వడ్డీ ఆదాయం 33.23 శాతం పెరిగి రూ. 3,332 కోట్లకు చేరిందని చెప్పారు. స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) పరిమాణం 16.93 శాతం నుంచి 16.31 శాతానికి, నికర ఎన్‌పీఏలు 10.29 శాతం నుంచి 5.87 శాతానికి తగ్గాయి. సోమవారం బీఎస్ఈలో బ్యాంక్ షేరు 4 శాతం క్షీణించి రూ. 90.60 వద్ద క్లోజయ్యింది.

పిరమాల్ లాభం 23 శాతం అప్..



ముంబై: ఆర్థిక సేవలు, ఫార్మా వ్యాపార విభాగాల ఊతంతో అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్ (పీఈఎల్) నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 23 శాతం ఎగిసి రూ. 603 కోట్లకు చేరింది. 2017–18 మూడో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ. 490 కోట్లు. తాజాగా ఆదాయం రూ. 2,858 కోట్ల నుంచి రూ. 3,489 కోట్లకు పెరిగింది. విభాగాల వారీగా చూస్తే ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం ఆదాయం రూ. 1,316 కోట్ల నుంచి రూ. 1,841 కోట్లకు, ఫార్మా విభాగం ఆదాయం రూ. 1,022 కోట్ల నుంచి రూ. 1,156 కోట్లకు పెరిగింది. గడిచిన 14 క్వార్టర్లుగా వరుసగా 20 శాతం పైగా ఆదాయ, లాభాల వృద్ధి నమోదు చేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. మరోవైపు, వ్యవస్థ బలహీనంగా ఉన్న నేపథ్యంలో ఐఎల్అండ్ఎఫ్ఎస్ తరహా సంక్షోభాలు మరిన్ని వెలుగుచూడొచ్చని పీఈఎల్ చైర్మన్ అజయ్ పిరమాల్ హెచ్చరించారు.

మరికొన్ని కంపెనీల ఫలితాలు క్లుప్తంగా... (రూ. కోట్లలో)

	నికర లాభం			మొత్తం ఆదాయం		
కంపెనీ	2018–19	2017–18	వృ/క్షీ(%)	2018–19	2017–18	వృ/క్షీ(%)
ఎస్కార్ట్స్	140	100	52	1,679	1,213	38
పర్సిస్టెంట్	91.71	91.67	--	864	792	9
సియట్	52	82	-36	1,718	1,581	9
సెంచరీ టెక్స్‌టైల్స్	88	43	105	957	1,033	8
మహీంద్రా లైఫ్‌స్పేస్	21	26	-21	186	137	36
వోకార్ట్	(71)	(40)	---	1,046	1,005	4
టీటీకే ప్రెస్టీజ్	85	63	34	559	462	21
టాటా పవర్	205	628	-67	7,722	6,451	20
ఎస్‌టీఎఫ్‌సీ	635	542	17	3,993	3,378	18
గోద్రెజ్ ప్రాపర్టీస్	42	(55)	--	431	308	40

నేటి బోర్డు సమావేశాలు

హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, మహానగర్ గ్యాస్, టాటా కాఫీ, టాటా స్టీల్ బీఎస్ఎల్, భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, హాకిన్స్ కుకర్, ఇన్ఫోఎడ్జ్, కన్సాయ్ నెరోలాక్, కేఈసీ ఇంటర్నేషనల్, పోక్కర్ణ, రామ్‌కో ఇండస్ట్రీస్, రామ్‌కో సిమెంట్, స్ట్రైడ్స్ ఫార్మా, బ్లిస్ జీవీఎస్ ఫార్మా, సెరా శానిటరీవేర్, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్, డీసీఎమ్ శ్రీరామ్ లిమిటెడ్, గ్రాన్యూల్స్ ఇండియా, లాయిడ్ స్టీల్


గ్రూప్‌ఎమ్‌లో భారీ పునర్వ్యవస్థీకరణ



ప్రశాంత్ కుమార్ | తుషార్ వ్యాస్ | పార్థసారథి మాండ్యం | అమిన్ లఖానీ

హైదరాబాద్: డేటా సెంట్రిక్, డిజిటల్ మార్కెటింగ్ సర్వీసుల దిగ్గజ సంస్థ, గ్రూప్‌ఎమ్‌లో ఉన్నత స్థాయిలో భారీ పునర్వ్యవస్థీకరణ చోటు చేసుకుంది. గ్రూప్ ఎమ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సౌత్ ఏషియా) ప్రశాంత్ కుమార్ నియమితులయ్యారు. ప్రెసిడెంట్ గ్రోత్ అండ్ ట్రాన్స్‌ఫార్మేషన్‌గా (సౌత్ ఏషియా) తుషార్ వ్యాస్ నియమితులయ్యారు. అలాగే గ్రూప్‌ఎమ్ కంపెనీలో ఒక విభాగమైన మైండ్‌షేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సౌత్ ఏషియా) పార్థసారథి మాండ్యం, మైండ్ షేర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా (సౌత్ ఏషియా) అమిన్ లఖానీ నియమితులయ్యారని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కొత్త పునర్వ్యవస్థీకరణ తమ క్లయింట్ల విజయానికి మరింతగా దోహదపడగలదన్న ధీమాను గ్రూప్‌ఎమ్ వ్యక్తం చేసింది. సవాళ్లతో కూడిన వాతావరణంలో ప్రశాంత్ కుమార్, తుషార్ వ్యాస్‌లు విజయవంతమైన ఫలితాలు అందించారని గ్రూప్‌ఎమ్ సౌత్ ఏషియా సీఈఓ శామ్ సింగ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

పీఎస్‌యూ బ్యాంకుల చీఫ్‌లతో ఆర్‌బీఐ గవర్నర్ భేటీ



న్యూఢిల్లీ: వచ్చే నెల మొదట్లో జరగున్న తదుపరి మానిటరీ పాలసీ సమీక్షకు ముందు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం ప్రభుత్వరంగ బ్యాంకులతో సమావేశమయ్యారు. బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్‌బీఐ ఏమి కోరుకుంటుందన్నది వారికి ఆయన తెలియజేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ తన చివరి ద్వైమాసిక పాలసీ సమీక్షను ఫిబ్రవరి 7న ప్రకటించనుంది. ''బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్‌బీఐ ఏమి ఆశిస్తుందో వారికి తెలియజేయడం, బ్యాంకింగ్ రంగ పరిస్థితులపై వారి అవగాహనను తెలుసుకోవడం, అలాగే, భవిష్యత్తుపై అవగాహన కోసమే భేటీ జరిగింది'' అని పీఎస్‌యూ బ్యాంకుల సీఈవోలతో భేటీ తర్వాత శక్తికాంత దాస్ మీడియాకు తెలిపారు. రానున్న ఎంపీసీ భేటీలో కీలక రేట్లను తగ్గించొచ్చన్న అంచనాలు భారీగా ఉన్న విషయం తెలిసిందే.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెటు)	33,310
బంగారం (22 క్యారెటు)	31,720
వెండి (కిలో)	43,200
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	32,830
బంగారం (22 క్యారెట్లు)	31,270
వెండి (కిలో)	43,200
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	32,830
బంగారం (22 క్యారెట్లు)	31,270
వెండి (కిలో)	43,200
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	33,450
బంగారం (22 క్యారెట్లు)	30,930
వెండి (కిలో)	40,900
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	33,640
బంగారం (22 క్యారెట్లు)	31,290
వెండి (కిలో)	40,000
విజయవాడ	
బంగారం(24 క్యారెట్లు)	33,750
బంగారం (22 క్యారెట్లు)	31,000
వెండి (కిలో)	40,900
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	33,800
బంగారం (22 క్యారెట్లు)	31,270
వెండి (కిలో)	40,900

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	51.64 రాత్రి 11.30కు	$53.69 శుక్రవారం ముగింపు
బ్రెంట్	59.70 రాత్రి 11.30కు	$61.59 శుక్రవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 29-01-2019

విశాఖ	410-00
చిత్తూరు	423-00
వరంగల్	397-00
చెన్నై	430-00
ముంబై	450-00
విజయవాడ	408-00
నమక్కల్	420-00
గోదావరి	408-00
28-01-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.55
బెంగళూరు	425-00
కోల్‌కత్త	440-00
ఢిల్లీ	425-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	326.1	373.85
ASIAN PAINT	1379.5	1372.15
AXIS BANK L	656.3	669.75
BAJAJ AUTO	2565.55	2626.35
BAJAJ FINSE	6050.9	6321.55
BAJAJ FINAN	2458.5	2599.55
BHARTI AIRT	305.15	307.5
BHARAT PETR	348.7	357.45
CIPLA LTD	492.15	507.65
COAL INDIA	225.2	220.95
EICHER MOTO	19987.4	20049.95
GAIL (INDIA	333.2	334.9
GRASIM INDU	732.8	759.6
HCL TECHNOL	977.8	969.4
HDFC LTD	1946.9	1977.8
HDFC BANK L	2084.15	2096
HERO MOTOCO	2598.6	2670.15
HINDALCO I	200	204.45
HINDUSTAN Pet	239.2	241.8
HINDUSTAN uni	1743	1756.8
INDIABULLS	699.3	744.5
ICICI BANK	343.55	357.2
INDUSIND BA	1443.7	1484.9
BHARTI INFR	287.3	279.75
INFOSYS LIM	727.95	730.35
INDIAN OIL	138.05	137.75
ITC LTD	274.75	279.2
JSW STEEL L	267.75	274.65
KOTAK MAHIN	1260.45	1266.15
LARSEN & TO	1300.45	1285.45
MAHINDRA &	673.05	683.5
MARUTI SUZU	6511.05	6513.4
NTPC LTD	138.6	138.3
OIL AND NAT	141.65	142
POWER GRID	187.8	185.85
RELIANCE IN	1229.55	1246
STATE BANK	281.6	285.4
SUN PHARMAC	411.75	422.4
TATA MOTORS	172.3	173.25
TATA STEEL	445.7	452.9
TATA CONSUL	1955	1920.8
TECH MAHIND	735.15	729.05
TITAN COMPA	958.65	978
ULTRATECH C	3374.45	3510.8
UPL LIMITED	760.05	753.1
VEDANTA LIM	191.5	194.7
WIPRO LTD	355.15	353.45
YES BANK LI	207.5	219.6
ZEE ENTERTA	373.3	318.4

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1235.15	1254.6
ADITYA BIRL	83.85	87.2
ACC LIMITED	1357.25	1375
AMBUJA CEME	199.75	202.35
ASHOK LEYLA	83	82.6
BANDHAN BAN	417.7	424.45
BANK OF BAR	109.15	110.2
BHARAT ELEC	79.7	80.35
BHEL	63.75	66.4
BIOCON LIMI	649.05	664.7
BOSCH LIMIT	18262.4	18526.25
BRITANNIA I	3203.45	3206.65
CADILA HEAL	334.35	343.7
COLGATE PAL	1264.1	1288.3
CONTAINER C	642.95	660.4
DABUR INDIA	427.4	430
DLF LIMITED	164.05	158
AVENUE SUPE	1372.75	1365.7
GENERAL INS	244.2	245.3
GODREJ CONS	759.25	780.3
HAVELLS IND	698.7	708.15
HDFC STAND	367.3	359.4
HINDUSTAN Zinc	251.1	250.4
ICICI LOMBA	817.85	855.45
ICICI PRU L	291.35	299.4
VODAFONE ID	31.05	32.85
INTERGLOBE	1171.3	1161.75
L&T FINANCE	128.45	134.65
LIC HOUSING	446.7	453.05
LUPIN LIMIT	865.25	865.05
MARICO LIMI	365.15	369.9
UNITED SPIR	544.1	554.85
MOTHERSON S	145.3	150.8
MRF LTD	62559.95	63920.95
NHPC LTD	24.55	25
THE NEW IND	174.05	174.8
NMDC LTD.	91.2	90.5
ORACLE FIN	3727.15	3708
OIL INDIA L	171.7	171.85
PIRAMAL ENT	2170.5	2299.2
PETRONET LN	219	227.05
P&G HYGIENE	9908.8	9928.85
PIDILITE IN	1102	1129.8
STEEL AUTHO	46.15	47.25
SBI LIFE IN	599.25	619.6
SHREE CEMEN	15052.4	15723.2
SIEMENS LTD	991.45	1029.75
SHRIRAM TRA	1055.7	1120.15
SUN TV NETW	532.35	505.85

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	5.4	5.41
Alphageo	468	465.2
Alu Flouride	91.95	102.15
Amar Raja Bat	741.6	764.65
And Bank	26.3	26.65
And Cemen	4.65	4.87
And Paper	409.2	421.4
And Petro	57	58.7
Anjani Portl	112.8	115.55
Aries Agro Ltd	88.9	90
Aurobindo Ph	759.9	783.4
Avantel Soft	212.95	222.1
Avanti Feeds	330	349.4
BKV Industrs	2.74	2.74
BN Rathi Sec	24	24.75
Bakelite	15.65	16.45
Balaji Amin	455	461.45
Bambino Agro	178	178.85
Bartronics	6.36	6.61
Bhagira Chem	420	431.35
Bhagya Nag	32.3	34.25
Bhagya Wood	18.55	19.5
Bhaskar Agro	31.9	32.55
Brilliant Sec	0.94	0.96
Cont Coffee	270.85	269.55
CoroFert	433.25	440.05
Country Club	6.7	6.97
Cubex Tub	13.49	14.2
Cybermate	1.79	1.88
DR Reddy	2622.35	2668.9
Danlaw Tec	86.15	90.65
DecCement	372.05	391
Divi's Lab	1467.4	1493
Divya Granit	94	98.7
Dredgin Corp	391.2	406.75
Empee Sugars	1.33	1.4
Everest Org	135.25	146.3
Fortune Info	36.8	37.55
Four Soft	36.8	38
Fourth Gen	2.36	2.36
GMR Infra	15.4	15.65
GVK Power	6.68	6.91
Gati Corpn	71.35	75.4
Gayatri Bio	2.33	2.44
Gayatri Proj	165	167.25
Gayatri Sugrs	2.78	2.92
Gennex Lab	2.99	3.25
GodavDru	23	21.35
Goldstn Tele	222	222.8
Goldstone Tech	12.6	13.25
Granules (I)	89.25	95.1
HBL Nife Pow	24.85	25.95
HYDIndus	1800.5	1917.75
Heritage Food	484	504.4
Hifco Marwel	65.9	67.2
HindFlurocarb	15.95	16
IDL Industrs	241	251.8
IQMS Soft	8.74	8.71
IVRCL Infras	0.92	0.94
Infotech En	590	597.35
Invinex Lab	47	45.35
JSTL	31	34.9
KCP LTD	83.6	86.2
KNR Constructio	205.75	210.45
Kabsons Indu	5.78	5.78
KakatiCem	182.35	186.85
Kallam Spg	17.85	17.35
Kernex Micro	24.5	25.6
Krebs Bio	114.05	117.45
LGS Global	2.88	2.96
LancoIndus	183.9	181
Lokesh Mach	42.75	44.05
Lotus Choc	23.05	22.85
MIC Elec	0.87	0.88
Madhucon Proje	6.13	6.29
Maytas Infra	12.25	12.55
Medinova Dia	17.95	18.85
Mold-tek	46.95	48.6
Moldtek Plastic	237.7	253.45
Moschip Semi	20.6	21.55
NCCBlue Wat	7.04	7.03
NCLInd	118.55	124.35
NETTLINX	45	45.2
NMDC Ltd	91	90.4
NagarAgrich	27.25	27.25
NagarConst	79.3	81.6
Natco Pharma	668.05	678.55
Nava Bh Ventur	108.8	110.8
Neha Inter	4.32	4.12
Neocure Ther	2.25	2.37
Neuland Lab	497.05	493.45
Nile	343.6	343.35
Northgate Tech	0.62	0.65
Oil Country	13.4	13.6
Ortin Labs	15.55	14.70
Padmalaya Tele	2.2	2.12
Panyam Cemen	10.4	11.59
PennInd	36.35	36
Phytochem I	42.4	43.1
Pitti Lamin	52.55	55.65
Pokarna	165	164.45
Prajay Engs	8.25	8.18
PremiExpl	254.15	255.15
Prism Cement	74.8	76.25
Raasi Refrac	19.02	18.12
Rain Industries	110.1	114.65
Raj Packagin	27.8	26.5
Ram Informat	40.2	43.15
RavilGr	13.7	13.05
Reg.Ceramic	4.2	4.04
Restile Cer	3.95	4.2
Roopa Indus	10.07	10.6
Sagar Cem	596.1	612.1
Sai Wires(I)	1.07	1.07
Samkrg Pist	181	186.65
SangInd	57	57.8
Satvah. Ispat	10.39	9.02
Saven Techno	28	28
Sibar Auto	29	29
South Bio Tech	1.94	1.91
SrRayAlk	33.8	35.15
Srinivasa Ship	39.95	40
Starchik Sp	26	25.95
Sujana Metal	0.38	0.37
Sujana Univers	0.3	0.3
Surana Strip	1.42	1.36
Surana Tele	4.3	4.19
Suryachakra Pow	0.28	0.27
Suryalata Sp	127.5	130
Suryava Spin	4.92	5.17
Suven Pharma	186.1	193.4
TCI Finance	14.45	15
Taj Gvk Hotel	173.75	179.55
Tanla Solutions	33.95	31.7
Trans Biotek	5.59	5.7
Transport Co	280	289.45
Trendy Knit	0.21	0.22
V&K Soft	4.1	4
VBC Ferro	38	39.55
VST Indus	3199.95	3201.3
Vamshi Rubb	29	29.35
Viceroy Hotels	3.64	3.83
VijayTextil	37.7	39
Vimta Labs	253.25	257.9
Virat Crane	27.35	31
Virinchi Con	69.9	73.05
VisakaInd	370	375.15
Vista Pharma	25.15	26.45
Vivimed Labs	22.95	23.2
Vjil Consult	36.45	38.35
ZenoTech Lab	29.7	30.2

శాంతి లేదు.. భద్రత కానరాదు

ఇన్‌డెప్త్

- రాష్ట్రంలో హడలెత్తిస్తున్న హత్యలు, అత్యాచారాలు, ఇతర నేరాలు
- శాంతిభద్రతలను కాపాడటంలో సర్కారు ఘోర వైఫల్యం
- విపక్ష సభ్యులపై కేసులు.. ప్రజాందోళనలపై ఉక్కుపాదం
- టీడీపీ సర్కారు సొంత ఎజెండాను మోస్తున్న పోలీసులు
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నంలో కుట్ర కోణంపై దృష్టిపెట్టని వైనం

శాంతిభద్రతల పరిరక్షణలో కీలక భూమిక పోషించే పోలీసులు తమ భుజాలపై అధికార పార్టీ సొంత అజెండా మోయాల్సి వస్తోంది. ప్రభుత్వ సేవల్లో మునిగితేలిన ఫలితంగా విధి నిర్వహణలో తీవ్రవైఫల్యాలు వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో శాంతి లేదు.. భద్రత కానరాదు అంటూ ప్రజలు ఆవేదన చెందే పరిస్థితి దాపురించింది. శాంతిభద్రతలు అడుగంటడంతో ఆంధ్రప్రదేశ్ అభద్రత.. ఆందోళన.. ఆవేదనకు చిరునామాగా మారిపోయింది. సర్కారు ఘోర వైఫల్యాలతో పోలీసుల ప్రతిష్ట మసకబారుతోంది. గత నాలుగేళ్లలో రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు, వేధింపులు, ఇతర నేరాలు పెరిగిపోయాయి. మహిళలపై లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు రెట్టింపయ్యాయి. మైనర్ బాలికలపైన అత్యాచారాలు పెచ్చరిల్లాయి. టీడీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను మట్టుపెట్టడం, వారిపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం పరిపాటిగా మారింది. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఉన్న నారాయణరెడ్డిని 2017 మేలో పెళ్లికి వెళ్లి వస్తుండగా ప్రత్యర్థులు దారుణంగా హత్య చేయడం దీనికి పరాకాష్ట.

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును నీరుగార్చారన్న అపఖ్యాతిని పోలీసులు మూటగట్టుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో గతేడాది అక్టోబర్ 25న కత్తితో హత్యాయత్నం చేసిన ఘటనలో పోలీసులు, ప్రభుత్వం స్పందించిన తీరు ప్రజల్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఘటన జరిగిన గంటకే డీజీపీ ఠాకూర్ స్పందించిన తీరు కేసు దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉందని న్యాయ నిపుణులు సైతం తీవ్రంగా తప్పుపట్టడం గమనార్హం. సీఎం చంద్రబాబు మీడియా సమావేశంలో చేసిన వెకిలి వ్యాఖ్యలు సైతం కేసు దర్యాప్తుపై ప్రభావితం చూపాయి. ఈ కేసులో సిట్ కుట్ర కోణం వైపు దృష్టి పెట్టకుండా నిందితుడు శ్రీనివాసరావు చుట్టూనే దర్యాప్తును పరిమితం చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థకు కేసును అప్పగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోర్టును ఆశ్రయించడంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఈ కేసును విచారిస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎన్ఐఏకు సహకరించడం లేదు.

రెచ్చిపోతున్న 'పచ్చ' నేతలు

- విశాఖపట్నం, గన్నవరం విమానాశ్రయాల్లో టీడీపీ ఎంపీ జేసీ దివాకర రెడ్డి అక్కడి సిబ్బందిపై వీరంగం సృష్టించిన తీరు విమర్శలకు తావిచ్చింది. ఆయన తమ్ముడు, ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి గతంలో తమ దివాకర్ ట్రావెల్స్ బస్సును ఆపారన్న ఉక్రోశంతో హైదరాబాద్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారిని కొట్టడం పెనుదుమారం సృష్టించింది. తాజాగా అనంతపురం జిల్లాలోని ప్రబోధానంద ఆశ్రమంపై జేసీ అనుచరుల దాడి ఉద్రిక్తతకు దారితీసింది.
- నిజాయతీగా విధులు నిర్వర్తించిన మహిళా తహసీల్దార్ వనజాక్షిపై టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన అనుచరులతో దాడిచేసినప్పటికీ ఆమెకు న్యాయం చేయడంలో ప్రభుత్వం పక్షపాతం చూపించింది. సీఎం చంద్రబాబు పట్టించుకోకపోవడంతో మరింత రెచ్చిపోతున్న చింతమనేని అధికారులు, పోలీసులు, కార్మికులు, విలేకరులు, రాజకీయ నాయకులపై దాడులపర్వాన్ని కొనసాగిస్తున్నారు.
- విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలు సీనియర్ ఐపీఎస్ అధికారి బాలసుబ్రమణ్యం విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడటంతో పాటు ఆయన గన్‌మెన్‌పై దౌర్జన్యం చేసినా ఎలాంటి కేసులు, క్రమశిక్షణా చర్యలూ లేవు.
- పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం ఎస్ఐ శ్రీనివాస్, రైటర్‌ను నిర్బంధించి దుర్భాషలాడిన టీడీపీ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మరో ఎనిమిది మందిపై తప్పనిసరి పరిస్థితిలో కేసు నమోదు చేసినా చట్టపరమైన చర్యలు లేవు.
- నెల్లూరులో సీఐని తాట తీస్తానంటూ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుర్భాషలాడినా ఎలాంటి చర్యలూ లేవు.
- పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రులో టీడీపీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు జనచైతన్య యాత్ర సమయంలో ఫుడ్‌పార్కు విషయంలో నిరసన తెలిపిన మహిళలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా కొట్టారు.
- స్పీకర్ కోడెల శివప్రసాద్ తనయుడు శివరాం తన అనుచరులతో నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే కాంట్రాక్టర్ పర్సంటేజీ(మామూళ్లు) ఇవ్వలేదనే కారణంతో దాడి చేసి వర్క్‌షాపు షెడ్డును కూల్చేసి, సామాగ్రిని ధ్వంసం చేసి ఎదురుకేసులు పెట్టిన ఘటన విమర్శలకు తావిచ్చింది.
- అనంతపురం జిల్లా కూడేరు మండలం జల్లిపల్లిలో సుధమ్మ అనే మహిళపై టీడీపీ గ్రామ సర్పంచ్ నాగరాజు, జన్మభూమి గ్రామ కమిటీ సభ్యుడు చంద్ర మూకుమ్మడిగా దాడి చేసి దారుణంగా కొట్టిన ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది.



విమానాశ్రయంలోనూ నిర్బంధం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటూ 2017, జనవరి 26న విశాఖలో తలపెట్టిన కొవ్వొత్తుల నిరసనకు సంఘీభావంగా వెళ్లిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ని విమానాశ్రయం రన్‌వేపైనే అడ్డుకున్న పోలీసుల తీరును ప్రజలు తప్పుబట్టారు. అమరావతిలో 2017 ఫిబ్రవరి 11న నిర్వహించిన జాతీయ మహిళా పార్లమెంట్‌కు హాజరయ్యేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజాను గన్నవరం విమానాశ్రయంలో దౌర్జన్యంగా అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలో రకరకాల ప్రాంతాల్లో తిప్పి హైదరాబాద్‌లో వదిలిపెట్టడం వివాదాస్పదమైంది. కాపు రిజర్వేషన్ల కోసం ఉద్యమించిన మాజీ మంత్రి ముద్రగడను ఇంటి నుంచి బయటకు రాకుండా అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డితోపాటు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణలను పలుమార్లు అరెస్టులు చేసిన తీరు విమర్శలకు తావిచ్చింది.

ఎర్రచందనం స్మగ్లింగ్.. గంజాయి సాగు

అటు శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్, ఇటు ఏవోబీలో గంజాయి సాగు పోలీసులకు సవాలుగా మారాయి. ఎర్ర చందనం స్మగ్లింగ్ నిరోధానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసినప్పటికీ అడ్డుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. మరోవైపు విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో సాగవుతున్న గంజాయిని అరికట్టడంలోనూ ఇదే కథ. గంజాయి తోటలను ధ్వంసం చేస్తామంటూ మూడేళ్లుగా కార్యాచరణ ప్రకటిస్తున్న పోలీసులు మిగిలిన శాఖలను సమన్వయం చేసుకోవడంలో ఫలితం సాధించలేకపోతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి అమరావతికి, హైదరాబాద్‌కు, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్ లకు గంజాయి స్మగ్లింగ్ అవుతున్నా చెక్‌పోస్టులోని సిబ్బంది, ప్రత్యేక బృందాలు గంజాయి స్మగ్లింగ్‌ను చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.

రాష్ట్రమంతా టెర్రర్..

రాజధాని అమరావతిలో తమ అడుగులకు మడుగులొత్తకపోతే బెదిరింపులు, అక్రమ కేసులతో ప్రభుత్వం టెర్రర్ పుట్టిస్తోంది. భూసమీకరణకు భూములు ఇవ్వని రైతులపై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు జాతీయ మానవ హక్కుల సంఘాన్ని సైతం విస్మయానికి గురిచేశాయి. తమ మాట వినని రైతుల అరటి తోటలు, ఇతర పంట పొలాలు తగలబెట్టించిన టీడీపీ నేతలు భయాందోళనలు సృష్టించారు. తమ సమస్యలను పరిష్కరించాలని న్యాయపోరాటాలు చేసిన వివిధ వర్గాల ప్రజలను, ఉద్యోగులను ప్రభుత్వం పోలీసులతో అణచివేసింది. సర్కారు ఆదేశాలతో పోలీసులు సమస్యలపై నినదించిన ప్రజల గొంతు నొక్కేశారు. శాంతియుత నిరసనలు తెలిపినవారిపై లాఠీలు విరుచుకుపడ్డాయి. డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కిన పాపానికి అక్రమ కేసులు బనాయించారు. సీఆర్‌పీసీ 144, 151లతోపాటు పోలీస్ యాక్ట్ 30లను విచ్చలవిడిగా ప్రయోగించి అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేశారు. మూడేళ్లుగా పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రు పోలీసుల హడావుడితో ఉలిక్కిపడుతోంది. కాలుష్య కారక ఆక్వా ఫుడ్‌పార్కు వద్దని ప్రజలు నిర్వహిస్తున్న ఉద్యమాన్ని అణచివేస్తున్న పోలీసులు కేసులతో భయపెడుతున్నారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు 11 ఏళ్లనాటి ప్యాకేజీనే ఇస్తామంటూ పోలీసులను ప్రయోగించి భయాందోళనలు సృష్టిస్తోంది. పోలవరం ప్రాజెక్టు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వని ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి పరిహాసం చేస్తోంది.

ఖాకీ వనంలో కీచకులు..

త్యాగాలకు మారుపేరైన ఖాకీవనంలో కొందరు కలుపుమొక్కలుగా మారి చేస్తున్న అసాంఘిక కార్యకలాపాలు మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు తెస్తున్నాయి. కొందరు పోలీసులే దందాలు, మాఫియాలను నడపడంతోపాటు హత్యలు చేయించడం, వివాహేతర సంబంధాలు పెట్టుకోవడంతో పోలీస్ శాఖ పరువుపోయింది. విశాఖ డీఎస్పీ రవిబాబు గతంలో చేయించిన ఒక హత్యను కప్పిపుచ్చుకునేందుకు మరో హత్య చేయించి దొరికిపోవడం పోలీస్ శాఖను జనంలో పలుచన చేసింది. భార్యాభర్తల వివాదం పరిష్కారంలో కృష్ణా జిల్లా కూచిపూడి ఎస్ఐగా పని చేసిన గుడివాడ అనిల్ అతి వల్ల మొవ్వ మండలం కోసూరు శివారు తురకపాలెం గ్రామానికి చెందిన వీరంకి శ్రీహరి అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సాయం కోసం పోలీస్టేషన్‌కు వచ్చిన వివాహిత ఫోన్ నెంబర్‌ను తీసుకున్న నూజివీడుకు చెందిన ఎస్ఐ వెంకటకుమార్ తన కోరిక తీర్చకుంటే వివాహిత భర్తను కేసులో ఇరికిస్తానంటూ నీచంగా ప్రవర్తించిన వైనం ప్రతి ఒక్కరినీ విస్మయపరిచింది. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ ఎస్ఐ విజయకుమార్ నూజివీడుకు చెందిన ఒక బ్యూటీపార్లర్ నిర్వాహకురాలితో వివాహేతర సంబంధం నెరపడంతో ఆ ఫొటోలు, వీడియోను ఆమె భర్త సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో ఆ ఎస్ఐ సస్పెండ్ అయ్యాడు. మచిలీపట్నం సహోద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఫిర్యాదు చేసిన పోస్టల్ ఉద్యోగిని నుంచి రూ.25 వేలు లంచం తీసుకున్న ఎస్ఐ అశ్వక్‌పై క్రమశిక్షణ వేటు పడింది. తిరుపతిలో కుటుంబ వివాదాలపై ఫిర్యాదు చేసిన వివాహితతో ఫోన్‌లో తరచూ మాట్లాడుతూ తన రూమ్‌కు రావాలని కోరిన సీఐపై ఆమె అధికారులకు ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన మహిళతో వివాహేతర సంబంధం, క్రమశిక్షణా రాహిత్యం కారణంగా ఏపీఎస్‌పీ బెటాలియన్ (మంగళగిరి) అసిస్టెంట్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్ సస్పెండ్ అయ్యాడు. విజయవాడ బస్టాండులో అమ్మాయిలపై అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఏపీఎస్‌పీ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది.



ఎన్‌కౌంటర్ల కలకలం..

రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్లు పోలీసులపై కౌంటర్లు వేసేలా మారాయి. చిత్తూరు జిల్లా శేషాచలం అడవుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 2015, ఏప్రిల్‌లో 20 మంది ఎర్రచందనం స్మగ్లర్లను కాల్చి చంపారు. వారిని పోలీసులే పట్టుకుని హత్య చేశారంటూ పౌరహక్కుల నేతలు ఆరోపణలు చేశారు. 2018, జూలై 25న పోలీసులు, ఎర్రచందనం స్మగ్లర్ల నడుమ మరోమారు కాల్పుల్లో ఒక స్మగ్లర్ మృతి చెందాడు. ఆంధ్రా–ఒడిశా బోర్డర్ (ఏవోబీ)లో మల్కన్‌గిరి లో 2016, అక్టోబర్ 24 నుంచి నాలుగు రోజులపాటు పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృత్యువాత పడ్డారు. వారిలో 11 మందికి పైగా గిరిజనులు ఉండటం విమర్శలకు తావిచ్చింది. తాజాగా గతేడాది సెప్టెంబర్ 23న విశాఖ మన్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను మావోయిస్టులు హత్య చేయడంతో భద్రతా వైఫల్యం, నిఘా నీరుగారిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కేసును కేంద్ర దర్యాప్తు బృందం చేపట్టింది.

కత్తులు దూస్తున్న రౌడీయిజం

రాష్ట్రంలో రౌడీయిజం కత్తులు దూస్తోంది. రాష్ట్రంలో రౌడీ, కేడీ, డెకాయిట్, సస్పెక్ట్ (హిస్టరీ) షీట్లు ఏకంగా 28,381 మందిపై ఉండటం కలవరపాటుకు గురిచేస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే అత్యధిక హిస్టరీ షీట్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కృష్ణా జిల్లాలో 4,236 మందిపైన, గుంటూరు జిల్లాలో 3,984 మందిపైన హిస్టరీ షీట్లు ఉన్నాయి. దశాబ్ద క్రితం సద్దుమణిగిన రౌడీయిజం మళ్లీ కోరలు చాస్తోంది. వ్యాపారుల నుంచి బలవంతపు వసూళ్లు, భూసెటిల్‌మెంట్లు, రాజకీయ ప్రత్యర్థుల హత్యలే లక్ష్యంగా వెర్రితలలు వేస్తోంది. పోలీసులు అటువైపు కన్నెత్తి చూడట్లేదు. కొన్ని సంఘటనలను పరిశీలిస్తే.. గుంటూరులో మాజీ రౌడీషీటర్ బసవల వాసు (38) దారుణ హత్యకు గురైన తీరు సంచలనం సృష్టించింది. పోలీస్‌స్టేషన్‌కు దగ్గరలోనే రెస్టారెంట్‌లో భోజనం చేసి బయటకు వచ్చిన వాసును స్కార్పియోలో వచ్చిన ప్రత్యర్థులు రెప్పపాటులోనే విచక్షణారహితంగా నరికేశారు. విజయవాడ సింగ్‌నగర్‌లో ఒక బార్ వద్ద రౌడీషీటర్ కట్లా వేణుగోపాలరావు అలియాస్ కల్యాయక్ కత్తులతో దాడి చేసి గంధసిరి వెంకటేశ్వరరావును హతమార్చాడు. రౌడీషీటర్ కల్యాయక్‌పై 20 ఏళ్లలో 16 కేసులు ఉండటంతో పోలీసులు నగర బహిష్కరణ విధించినప్పటికీ అతను నిర్భయంగా వచ్చి హత్య చేయడం గమనార్హం. కర్నూలు జిల్లా నంద్యాలలోని నడిరోడ్డుపై పట్టపగలే రౌడీషీటర్ రాఘవేంద్రను మరో రౌడీషీటర్ గుమ్మపాలెం బద్రి హత్య చేశాడు. విశాఖ మద్దిలపాలెంలోని సింగర్ బార్ వద్ద రౌడీషీటర్ మళ్ళ వెంకటరమణను తోటి రౌడీషీటర్ హతమార్చాడు.

ప్రభుత్వ లెక్కల ప్రకారం నేరాల చిట్టా..

నేరం	2014	2015	2016	2017	2018 (నవంబర్ వరకు)
హత్యలు	1,067	1,071	1,043	950	824
డబ్బు కోసం హత్యలు	83	59	51	62	38
భారీ దోపిడీలు	75	54	62	56	44
దోపిడీలు	4,622	4,544	4,322	4,338	3,068
దొంగతనాలు	413	368	308	355	235
చిన్నపాటి చోరీలు	15,057	13,511	13,412	12,818	9,821
అల్లర్లు	979	652	576	493	381
కిడ్నాపులు	803	677	687	743	661
దాడి, వేధింపులు	18,048	16,081	16,632	15,809	14,192

మహిళలను అగౌరపరచడంలో టాప్

రాష్ట్రంలో మహిళలను కించపరచడం, వేధించడం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, కిడ్నాప్ కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. జాతీయ నేర నమోదు సంస్థ నివేదిక ప్రకారం.. మహిళలపై రాష్ట్రంలో 2016లో 16,362 నేరాలు జరగ్గా 2015లో 15,967 నేరాలు జరిగాయి. మహిళలపై నేరాల్లో ఏపీ దేశంలోనే 8వ స్థానంలో ఉండటం గమనార్హం. మహిళల అక్రమ రవాణాలోనూ రాష్ట్రం ఏడో స్థానంలో ఉంది. ఎస్సీలపై జరిగిన నేరాల్లో ఐదు, ఎస్టీలపై నేరాల్లో నాలుగు, ఆర్థిక నేరాల్లో పది, సైబర్ నేరాల్లో ఆరో స్థానంలో ఉంది. మొత్తం నేరాలన్నింటిలో కలిపి ఏపీ 13వ స్థానంలో ఉంది.

రైల్వే నేరాల్లో ఆరో స్థానంలో ఆంధ్రప్రదేశ్

రైల్వే నేరాల్లో దేశంలో ఏపీ ఆరో స్థానంలో నిలిచింది. ఇటీవల జాతీయ నేర నమోదు విభాగం(ఎన్సీఆర్బీ) నివేదిక వెల్లడించిన నేరాల చిట్టా చూస్తే విస్తుపోవాల్సిందే. 2016లో జరిగిన రైల్వే నేరాలను గమనిస్తే.. ఏపీలో రైళ్లలో హత్యలు, దొంగతనాలు, దోపిడీలు, స్మగ్లింగ్ హడలెత్తిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) పరిధిలో 2014లో 1,786 కేసులు, 2015లో 1,809 కేసులు, 2016లో 1,893 కేసులు నమోదయ్యాయి. ఏపీలోని రైళ్లలో గంజాయి, బంగారం, సుంకం చెల్లించని విలువైన సామాగ్రి స్మగ్లింగ్ జరుగుతున్న తీరు పోలీసులకు సవాలుగా మారింది.

బెట్టింగ్‌లకు బ్రేక్ పడలేదు..

రాష్ట్రంలో పెద్దఎత్తున సాగుతున్న బెట్టింగ్ మాఫియాకు బ్రేక్ పడటంలేదు. క్రికెట్ బెట్టింగ్ మాఫియాకు అధికార పార్టీ అండదండలు ఉండటంతో పోలీసులు కన్నెత్తి చూడటంలేదు. బెట్టింగ్‌లు వేలాది కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. చంద్రబాబు గత పాలనలో హైదరాబాద్‌లో మొదలైన క్రికెట్ బెట్టింగ్‌లు క్రమంగా రాష్ట్రమంతా విస్తరించాయి. పల్లెల నుంచి పట్టణాల వరకు బెట్టింగ్‌ల కోసం ప్రత్యేకంగా బుకీలున్నారు. చిన్నపాటి పాన్‌షాపుల నుంచి ఫైవ్‌స్టార్ హోటళ్ల వరకు బుకీలకు నిలయాలుగా మారిపోయాయి. రాజకీయ, ఆర్థిక పలుకుబడి కలిగిన పలువురి అతిథిగృహాలు క్రికెట్ సీజన్‌లో బుకీలకు విందు, మందు, పొందుతో ఆతిథ్యమిచ్చే షెల్టర్‌జోన్‌లుగా మారిపోతున్నాయి. చివరకు ముంబైలోని అండర్‌వరల్డ్ డాన్‌ల వరకు అండదండలు ఉండటంతో బెదిరింపులు, కిడ్నాప్‌లకు బెట్టింగ్‌లు దారి తీస్తున్నాయి. పేకాట శిబిరాలకు కూడా టీడీపీ నేతలే నిర్వాహకులుగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

గ్రామ పంచాయతీ నిధులు ఫైబర్ గ్రిడ్‌కు...

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా స్థానిక సంస్థల ప్రభుత్వాలకు ఇచ్చే ఆర్థిక సహాయంలో రూ.30 కోట్లు ఫైబర్ గ్రిడ్‌కు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు ఈ ఏడాది రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.135 కోట్లు కేటాయిస్తూ.. ఆ నిధులను ఫైబర్ గ్రిడ్(ఏపీఎస్ఎఫ్ఎల్)కు రూ.30 కోట్లు, ప్రిస్ సర్వేలో గ్రామాల్లో ఇళ్ల సర్వే చేసిన ఐటీ సంస్థకు రూ.7.50 కోట్లు, విద్యుత్ స్థంబాలు సర్వే చేసిన ఐటీ సంస్థకు రూ.కోటి, కంప్యూటర్ల కొనుగోలుకు క్వారీ సంస్థకు రూ.7.72 కోట్లు, డీపీఆర్‌సీల బలోపేతానికి రూ.5 కోట్లు, ఎల్ఈడీ బల్బుల పథకానికి రూ.64 కోట్లు, డిజిటల్ పంచాయతీ కార్యక్రమాలకు రూ.20 కోట్లు ఖర్చు పెట్టేందుకు పరిపాలన పరమైన అనుమతులు ఇస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొంది.

వచ్చే ఎన్నికల్లో జనసేనతో కలిసి వామపక్షాలు పోటీ: మధు

మచిలీపట్నం: వచ్చే ఎన్నికల్లో జనసేనతో కలిసి సీపీఎం, సీపీఐ పోటీ చేస్తాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు వెల్లడించారు. సోమవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మధు మీడియాతో మాట్లాడుతూ.. ఎవరికి ఎన్ని సీట్లు, ఎక్కడ పోటీ చేయాలనే దానిపై త్వరలోనే నిర్ణయిస్తామన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలనపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మరోసారి ప్రజలను వంచించడానికే ఎన్నికల ముందు చంద్రబాబు ఆకర్షణీయ పథకాలను ప్రకటిస్తున్నారని ఎద్దేవా చేశారు. జయహో బీసీ అంటూ మరోసారి బీసీలను నిలువునా మోసం చేసేందుకు చంద్రబాబు గిమ్మిక్కులు చేస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా, వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా చంద్రబాబు హడావిడి చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని తాయిలాలు ప్రకటించినా వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఓటమి తథ్యమని స్పష్టం చేశారు.

కియా వెండర్లకు మెగా రాయితీలు

సాక్షి, అమరావతి: కియా కార్ల పరిశ్రమకు విడి భాగాలు అందించే వెండర్లకు మెగా రాయితీలను ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురంలో ఏర్పాటైన కియా మోటార్స్‌కు ఎయిర్ కాన్‌లు అందించే డూన్ క్లైమేట్ కంట్రోల్ ఇండియా, రబ్బర్, ఇంజెక్షన్ భాగాలు అందించే డాంగ్–ఏ హాసంగ్ సంస్థలకు 20 ఏళ్ల పాటు రాయితీలు లభించనున్నాయి. ఎకరం రూ.6 లక్షల చొప్పున 8.7 ఎకరాలు డూన్ క్లైమేట్‌కు, 5 ఎకరాలు డాంగ్–ఏ హాసంగ్‌కు ఇవ్వనున్నారు. అంతేకాకుండా ఎస్‌జీఎస్‌టీ తిరిగి చెల్లించడం, యూనిట్ రూ.3కే విద్యుత్ అందించడం, నీరు, 25 ఏళ్లపాటు క్యాపిటల్ సబ్సిడీ, శిక్షణ సబ్సిడీతో పాటు కియా కోసం అభివృద్ధి చేసిన ఇతర మౌలిక సదుపాయాలను కూడా వినియోగించుకోవడానికి అనుమతించారు. అభివృద్ధి చేస్తున్న కొరియా సిటీకి సమీపంలో భూములు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఏపీఐఐసీకి పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి సాల్మన్ అరోఖ్యరాజ్ ఆదేశాలు జారీ చేశారు.

నేడే ప్రయోగాత్మక ఉత్పత్తి : అనంతపురం జిల్లాలో ఏర్పాటైన దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ ప్రయోగాత్మక ఉత్పత్తిని మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. యాన్సిలరీ యూనిట్లతో కలిపి సుమారుగా రూ.12,900 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 4 లక్షల కార్ల తయారీ సామర్థ్యంతో కియా మోటార్స్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ట్రయిల్ ప్రొడక్షన్‌కి ఇండియాలో కొరియా రాయబారి హెచ్‌ఈ షిన్ బాంకిల్ హాజరవుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు సోమవారం వెల్లడించాయి.

అంతర్జాతీయ ఫొటో అవార్డు పోటీలకు ఆహ్వానం

కొరుక్కుపేట(చెన్నై): తమిళనాడు రాష్ట్రంలో ఉన్న కూడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి టెక్నికల్ కన్సల్టెంట్ రష్యన్ ప్రభుత్వ 'రోసాటోమ్ స్టేట్ అటామిక్ ఎనర్జీ కార్పొరేషన్' ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫొటో అవార్డు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో భారతీయ ఫొటో గ్రాఫర్లు పాల్గొనాలని 'రోసాటోమ్ కార్పొరేషన్' సోమవారం ఆహ్వానించింది. రోసాటోమ్ ఇంజనీరింగ్ డివిజన్ ఏఎస్ఈ నేతృత్వంలో ఏఎస్ఈ ఇంటర్నేషనల్ ఫొటో అవార్డులను అందజేయనున్నట్టు పేర్కొంది. ఈ సందర్భంగా ఏఎస్ఈ సౌత్ ఇండియా ప్రాజెక్టు వైస్ ప్రెసిడెంట్ ఆండ్రీ లెబెదేవ్ మాట్లాడుతూ.. ఈ ఫొటో కాంపిటీషన్‌కు అగ్రదేశాల నుంచి ఫొటో గ్రాఫర్లను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దేశంలో హిమాలయాలు, పశ్చిమ కనుమలు, అంతులేని సముద్రాలు, అద్భుత నదులు ఉన్నాయని, పర్యాటక స్వర్గధామం కేరళ, సంస్కృతి, భాష, చారిత్రక ఆలయాలకు తమిళనాడు ప్రసిద్ధి అని చెప్పారు. భారతదేశంలో ఆసక్తి గల ఫొటో గ్రాఫర్లు కూడా తమ ప్రత్యేకతను సాక్షాత్కరించేలా ఫిబ్రవరి 10వ తేదీలోగా ఫొటోలను పంపాలని కోరారు. ఈ ఫొటోలను fotoecase@gmail.comకు పంపించాలని ఆండ్రీ లెబెదేవ్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోంది

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజం

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు ఇష్టానుసారంగా దోచుకుంటున్నా, అదుపు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. సోమవారం తిరుపతిలో రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు తన అనుచరగణానికి రూ. కోట్లు కూడబెట్టేందుకు నిత్యం కష్టపడుతున్నారు తప్ప సామాన్య ప్రజానీకాన్ని పట్టించుకోవట్లేదని విమర్శించారు. త్వరలో ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో సభలు పెట్టి తాయిలాలు ప్రకటించడం శోచనీయమన్నారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి రూ. 94 వేల కోట్లు అప్పులుంటే ప్రస్తుతం రూ. 2.40 లక్షల కోట్లు అప్పులు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో నరేంద్ర మోదీ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఫిబ్రవరి 1న జరిగే రాష్ట్ర బంద్‌లో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా నేతలు రామానాయుడు, చిన్నం పెంచలయ్య, నాగరాజన్, మురళి పాల్గొన్నారు.

దళితుల నిధులపై శ్వేతపత్రంవిడుదల చేయాలి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దళితులకు కేటాయించిన, విడుదల చేసిన, ఖర్చు చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈమేరకు కేవీపీఎస్ ప్రతినిధి బృందం తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను ప్రక్కదారి పట్టిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.